# క్రీస్తు కొరకు జీవించుట

రచన : డేల్ గ్రిసం

తర్జుమా : జి.బి. సింగ్

# Living for Christ
## క్రీస్తు కొరకు జీవించుట

First Printing in Telugu in India, 2004 - 5,000 Copies

© Copy right 2004 by
**G.B. SINGH**
Evangelist

*Translated into Telugu with the Permission of*

**Bro. Dale Grissom**

Evangelist, U.S.A.

*Copies can be obtained from*

**G.B. Singh**
Evangelist
Church of Christ,
Agraharam, Pithapuram - 533 450, S. India

---

*Printed by :*
Blessy Graphics, Kakinada-1. Ph : 0884-2352477

# About the Author

Dale Grissom has dedicated his life to evangelism through the medium of effective personal work. He has served as Personal Work Evangelist at the Dexter Missouri Church of Christ for the past 19 years. He has written numerous articles which have appeared in many church bulletins as well as in many Christian magazines. He is the author of the book **"Abiding in the Doctrine of Christ"** translated into Telugu by Bro. G.B. Singh.

At the age of 73, he still teaches two Bible classes every week and conducts seminars in personal evangelism as well as maintaining a full-time personal work ministry. Leading a happy married life for 54 years with Mrs. Eulah Richey, Dale Grissom is the father of five, grandfather of ten and great-grandfather of one, continuing as a great servant of God in Christ's ministry.

# పరిచయం

11 సంవత్సరాలు ఒకే చోట సేవచేయడంలో నేను ధన్యుడనయ్యాను. సహోదరుడు డేల్ గ్రిసంతో కలసి, ఆయన పెద్దరిక పర్యవేక్షణలో సేవచేయడం నా అదృష్టం. నేనూ, సహోదరుడు డేల్‌గ్రిసం కలసి ముస్సోరీలోని క్రీస్తు సంఘంలో సేవచేసాము. నేనక్కడున్న 11సంవత్సరాల కాలంలో ఎక్కువ సమయం అక్కడున్న చక్కని సంఘంలో డేల్‌గ్రిసం సంఘపెద్దగా సేవచేసారు.

ఆ 11సంవత్సరాలు, వారి కుటుంబికులు తప్ప మిగిలిన వారందరి కన్న నేనే సహోదరుడు డేల్‌గ్రిసంతో సన్నిహిత సంబంధాన్ని కలిగియున్నాను. మేము కలసి ప్రార్థించాం, కలసి దైవవాక్యాన్ని అధ్యయనం చేసాం, కలసి నవ్వాము, కలసి దుఃఖించాము, ఒక జట్టుగా కలసి అనేకపనులుచేసాము. రెండు సందర్భాలు నాజీవితంలో మరువలేనివి. అవి కేవలం మేము "కలసినడచిన" సందర్భాలు. నేను ఆయనను ఒక ప్రత్యేకమైన తనదైన శైలిలో వ్యక్తిగత సువార్త సేవచేయడాన్ని గమనించాను.

ఆ సందర్భాలలో ఒక నిజమైన గొప్పదైవసేవకుని హృదయంలోనికి చూడగలిగాను. ఒక వ్యక్తిని పాపం అధిగమిస్తున్నప్పుడు, సహోదరులు సహోదరీలు ఒక కుటుంబంలా కంటె విరోధులుగా ప్రవర్తిస్తునప్పుడు, పరితపించిన హృదయాన్ని ఆయనలో నేను చూడగలిగాను. ఆ సందర్భాలలో ఒక తీర్పుతీర్చే ప్రతికూల ప్రవర్తనను ఆయనలో నేను చూడలేదు. ఆ వ్యక్తిగాని ఆ గుంపుగాని ప్రభువుకు దగ్గరవ్వడానికి ఆయన ఖర్చుచేయడానికి, తానుగా

ఖర్చువ్వడానికి సంసిద్ధతను చూపిని వ్యక్తిత్వాన్ని గమనించాను.

ఒక ప్రసస్తమైన ఆత్మ క్రీస్తుకొరకు సంపాదించబడినప్పుడు, పొంగి పొరలిన ఆనందభరితమైన హృదయాన్ని ఆయనలో చూసేవాడిని. ఒక వ్యక్తి క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుట, లేక అతడు ఒకనాడు అనుభవించిన తీయని సహవాసంలోనికి తిరిగివచ్చుటగాని, ఆయన దృష్టిలో ఒకే విధంగా పరిగణింపబడుతుంది. ఒకడు యవనస్థుడా లేక ముసలివాడా అని గాని, ధనికుడు పేదవాడని గాని, తెల్లవాడు నల్లవాడనిగాని ఏ వ్యత్యాసము ఆయనలో కనిపించదు. ప్రతి ఆత్మ ఆయనకు ప్రశస్తమైనది.

స్నేహితుడు, సహ పనివాడైన సహోదరుని గూర్చి తలంచునపుడు నామనస్సుకు వచ్చేమాటలలో "కాపరి, "పరిచారకుడు", "సేవకుడు" మరియు "సువార్తికుడు" అనునవి కొన్ని మాత్రమే. సహోదరుడు డేల్‌గ్రిసం యొక్క త్యాగపూరితమైన, అలసట ఎరుగని సేవా ఫలితంగా ఒక గొప్ప సమూహము పరలోకంలో ఉంటారని నేను చాలామందితో అన్నాను.

ఆయనలోని కొన్ని ఆలోచనలు కాగితముపై భద్రపరచబడినందుకు ఉప్పొంగి ఆనందిస్తున్నాను. నావలె డేల్‌గ్రిసం సహోదరుడ్ని వ్యక్తిగతంగా ఎరుగని అనేకులు మేలు పొందగలగాలని నా ప్రార్థన.

ఈ గొప్ప వ్యక్తిని, ఆయనపనిని, విలువైన ఈ దైవసేవకుని మాటల్ని గురించి శ్లాఘించడం నాకివ్వబడిన ఘనతగా భావిస్తున్నాను.

**జిమ్ ఫాగన్**

**JIM FAUGHN**

# విషయసూచిక


| వ.నెం. | విషయం | పేజీ నెం. |
|---|---|---|
| 1. | విశ్వాసిగా జీవించుము | 1 |
| 2. | ప్రతివాడును ఒకనినొకడు తనకంటే యోగ్యుడని.... | 2 |
| 3. | ప్రభువునందు బలవంతులై యుండుడి | 3 |
| 4. | ప్రతివాని జీవితంలో ఒక వర్షం కురవాలి | 5 |
| 5. | మనం అందరి ఆత్మలయెడల ప్రేమకలిగియున్నామా? | 6 |
| 6. | దారితప్పిన సహోదరులను వెనుకకు తీసుకు వద్దాం | 8 |
| 7. | ప్రాంతీయ సొవార్తీకరణ | 11 |
| 8. | మాట్లాడవలసినది మాట్లాడి, నడువవలసినట్లు.... | 13 |
| 9. | దేవుని కృపలో ఎదుగుచూ జీవించుదము | 14 |
| 10. | ఆత్మ గౌరవము - సమతూకాన్ని పాటించుట | 15 |
| 11. | మానవుని యెడల సహనముతో కూడిన దేవుని ప్రేమ | 17 |
| 12. | కొద్దిమంది మంచి మనుష్యులు | 19 |
| 13. | పాపమును గూర్చి పట్టింపు లేకుండుట | 20 |
| 14. | విడాకులు : లేఖనములేమి బోధించుచున్నవి? | 21 |
| 15. | స్వదేశ చట్టములు | 23 |
| 16. | యవ్వనస్తులు - పవిత్రత | 24 |
| 17. | మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి | 26 |
| 18. | క్షమాపణ | 27 |
| 19. | ఒకనినొకడు సహించుట | 29 |
| 20. | దేవుడు విశ్వాసులకు చేసిన వాగ్దానము | 30 |
| 21. | సువార్త ప్రకటించు లేక మరణించు | 31 |
| 22. | ప్రేమ నిర్వచించబడినది | 33 |
| 23. | పునరుత్థానము | 35 |
| 24. | మన హృదయములు | 36 |
| 25. | వ్యక్తిగత బాధ్యత | 37 |
| 26. | ప్రేమ | 39 |
| 27. | వెలుపల సువార్త ప్రకటన | 40 |
| 28. | పరలోకమందు ధనమును కూర్చుకొనుట | 41 |
| 29. | ఆత్మీయ విధానంలో విభేదములను... | 42 |
| 30. | క్రీస్తునందు గల సంతోషము | 44 |
| 31. | నీవు నిత్యత్వమును ఎచ్చట గడపగోరుదువు? | 46 |
| 32. | సంకటములలోనున్న ప్రపంచమునకు నిరీక్షణ | 48 |
| 33. | తల్లిదండ్రుల గంభీరమైన బాధ్యత | 49 |
| 34. | పెద్దలు | 51 |
| 35. | ఉత్తమమైనదానిని ఎంచుట | 52 |

| వ.నెం. | విషయం | పేజీ నెం. |
|---|---|---|
| 36. | మంచి వివాహము చేసుకొనుము | 54 |
| 37. | సంఘాన్ని గూర్చి సామాన్యంగా అడిగే ప్రశ్నలు | 56 |
| 38. | వేసవి సెలవులు విహారయాత్రకు సిద్ధపడుట | 57 |
| 39. | మీరు క్షమించని యెడల | 59 |
| 40. | ఐక్యత | 60 |
| 41. | ప్రభువా మాకు నీవు కావలయును | 62 |
| 42. | శోధనలను జయించుట | 63 |
| 43. | ప్రభువు కుటుంబముగా ఎదుగుట | 64 |
| 44. | ఉపదేశము | 66 |
| 45. | విశ్వాస్యత | 67 |
| 46. | నాలుకను ఆధీనంలో ఉంచుకో | 69 |
| 47. | దైవత్వములోని ముగ్గురు వ్యక్తులు | 70 |
| 48. | దేవునికి దగ్గరగా రండి | 71 |
| 49. | అపరాధము సత్యమైనదా లేక అసత్యమైనదా | 73 |
| 50. | శోధనలను జయించుట | 74 |
| 51. | మనం దేవుని మోసగించలేము | 76 |
| 52. | ప్రభువు సంఘము | 77 |
| 53. | జీవ కిరీటము | 79 |
| 54. | సామర్థ్యతలు | 80 |
| 55. | జీవితంతో జూదమాడకు | 82 |
| 56. | మనపై అధికారం గలవారికి విధేయులైయుండుడి | 83 |
| 57. | విడిచిపెట్టకు | 84 |
| 58. | పైనుండి వచ్చిన జ్ఞానము | 86 |
| 59. | అపోస్తులులవలె నుండకుము | 87 |
| 60. | మాట్లాడుటకు ముందు ఆలోచించు | 88 |
| 61. | ప్రేమ శాశ్వతమైనది | 88 |
| 62. | దేవుని ఆరాధించు | 89 |
| 63. | నీ చిత్తమే సిద్ధించునుగాక | 90 |
| 64. | అనుకూలమైన తలంపులను కలిగియుండుము | 91 |
| 65. | వెల ఎంతో లెక్కించవా | 92 |
| 66. | సేవకులు | 93 |
| 67. | మనలను మనం తగ్గించుకొనవలెను | 94 |
| 68. | సొవార్థీకరణ ఒక జీవిత విధానం | 95 |
| 69. | నేను పరీక్షించుకో : క్రీస్తుపై కేంద్రీకరించు | 97 |
| 70. | పలుకుబడి | 98 |
| 71. | ఎదుగుచున్న క్రైస్తవుడు | 99 |

| వ.నెం. | విషయం | పేజీ నెం. |
|---|---|---|
| 72. | విడాకులను గూర్చి ఏమి? | 100 |
| 73. | క్రైస్తవ ప్రేమ (అగపె) | 102 |
| 74. | భూమిపై కలసి జీవిస్తూ, నిత్యత్వంలో కలసి జీవించుదము | 103 |
| 75. | నేను వెళ్లేది ఖాళీ చేతులతోనా | 105 |
| 76. | వైఖరి | 106 |
| 77. | ప్రభువుయొక్క ఇహలోక కుటుంబము | 108 |
| 78. | ఆత్మీయ ఫలములను ఫలించుము | 109 |
| 79. | యోసేపు ఒక మంచి మాదిరి | 111 |
| 80. | వింత పదార్థము | 112 |
| 81. | విభజన ఖండించబడినది | 113 |
| 82. | క్రీస్తువంటి లక్షణములు | 115 |
| 83. | క్రైస్తవుల కొరకైన ఆశీర్వాదములు | 116 |
| 84. | ప్రాముఖ్యమైన విషయాలు | 117 |
| 85. | సమాజముగా కూడుకొనుటను మానుట | 118 |
| 86. | ఒక జీవిత కాలం ఒక బహుమానం | 120 |
| 87. | ఐక్యత | 121 |
| 88. | మానవత్వము - లైంగిక వైపరీత్యము | 123 |
| 89. | భయాన్ని జయించుట | 125 |
| 90. | బైబిలు అధ్యయనం | 127 |
| 91. | భాషలతో మాట్లాడుట | 128 |
| 92. | గర్జించు సింహము | 129 |
| 93. | రోడ్డు ప్రమాదాలు | 131 |
| 94. | సహోదరుల మధ్య జగడములు పుట్టించుట | 132 |
| 95. | స్వలింగ సంపర్కము | 133 |
| 96. | ఇరుకు మార్గము | 135 |
| 97. | ఒక విపరీతమైన విపత్తు | 137 |
| 98. | ధనాపేక్ష | 138 |
| 99. | ఏకమనస్కులైయుండుడి | 140 |
| 100. | పరిపూర్ణతవైపు పయనించుదము | 141 |
| 101. | ప్రభువును సేవించుటలోనే ఆనందము | 142 |
| 102 | అన్నిటిలోను విశ్వాసులుగానుండుట | 144 |
| 103 | దాతృత్వము పరిపూర్ణతకు అనుబంధము | 145 |
| 104. | అందరూ ఆత్మలను సంపాదించువారు కావలయును | 146 |
| 105. | పరలోకము | 148 |
| 106. | మనం భయపడుతున్నామా | 149 |
| 107. | వ్యత్యాసములు | 150 |

| వ.నెం. | విషయం | పేజీ నెం. |
|---|---|---|
| 108. | క్రమశిక్షణ | 152 |
| 109. | పెద్దలను ప్రేమతో మిక్కిలి ఘనముగా ఎంచవలయును | 153 |
| 110. | మన జీవనాధారమైన గ్రంథము | 155 |
| 111. | దేవున్ని వెంబడించు | 156 |
| 112. | ఆయన మరణములోనికి | 157 |
| 113. | మనయెడల క్రీస్తు ప్రేమ | 159 |
| 114. | మనుష్యుని అంతర్యములోని ఆలోచనే అతని...... | 161 |
| 115. | క్రీస్తే సమాధానం | 162 |
| 116. | ఏ తలుపునైనను తట్టుడి | 163 |
| 117. | సువార్తను ఉపదేశించుము | 164 |
| 118. | మరణకరమైన పాపము | 165 |
| 119. | సంఘము యొక్క కర్తవ్యము | 166 |
| 120. | అదుపు తప్పట | 168 |
| 121. | మన హృదయాలు | 169 |
| 122. | క్రీస్తు రక్తము | 170 |
| 123. | సంతోషము, సమాధానము | 171 |
| 124. | మన కృపా సింహాసనము | 172 |
| 125. | దేవుని సేవకులు | 173 |
| 126. | గృహము | 174 |
| 127. | మన వీరుడు | 175 |
| 128. | మూడు యుగములు | 176 |
| 129. | పాపము | 178 |
| 130. | మనం చేసే నిర్ణయాలు | 179 |
| 131. | నీ తమ్ముని కావలివాడు | 180 |
| 132. | అధ్యయనము | 181 |
| 133. | స్వాధీనము | 183 |
| 134. | అపవిత్రమైనది | 184 |
| 135. | దేవునితో నడచుట | 185 |
| 136. | వర్షించు దినములు | 187 |
| 137. | సిద్ధపాటు లేకుండుట | 188 |
| 138. | ప్రభువును ప్రేమించు | 189 |
| 139. | దేవుని వాగ్దానములు | 190 |
| 140. | మనము చేయగలిగినదంతయు చేయుదము | 191 |

# 1
# విశ్వాసిగా జీవించుము

"భూమిమీద మనగుడారమైన ఈ నివాసము శిథిలమైపోయినను, చేతిపనికాక దేవుని చేత కట్టబడినదియు నిత్యమైనదియునైన నివాసము పరలోకమందు మనకున్నదని యెరుగుదుము" (2కొరింథి 5:1). విశ్వాసులైన దేవుని పిల్లలందరి కొరకు నిత్యమైన గృహమున్నదని తెలుసుకొనుటలో క్రైస్తవులకు గొప్ప ఆనందము కలదు.

ప్రతివాడు మరణమునకు భయపడును. మరణమనగా శరీరమునుండి ఆత్మవేరగుట అనియు, ఆత్మ నిరంతరము జీవించుననియు విశ్వాసులైన క్రైస్తవులందరికి తెలియును. ఏలాగైనను కొందరికి ప్రభువు మరల వచ్చువరకును, గొప్ప తీర్పుదినమువరకును వేచియుండు ఓర్పు ఉండదు. (ప్రసంగి 12:7) నందు "మన్నుయిది వెనుకటివలె మరల భూమికి చేరును. ఆత్మ దాని దయచేసిన దేవునియొద్దకు మరల పోవును" ఆత్మ మరల దేవుని యొద్దకుపోవునను జ్ఞానము, సమర్పణ కలిగి దేవునికి అంకితమై జీవించు వారికి గొప్ప ఆదరణను అనుగ్రహించును.

తీర్పురానైయున్నది. "మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను, ఆ తరువాత తీర్పుజరుగును" (హెబ్రీ 9:27). ఎందుకనగా తాను జరిగించిన క్రియలచొప్పున, అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మన మందరము క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును. (2కొరింథి 5:10). తీర్పునుగూర్చి మత్తయి 25:31-46

నుందు వివరించబడినది. ఆ గొప్ప దృశ్యమందు నీతిమంతులు దేవుని కుడిప్రక్కన ఉందురు, పాపులు ఆయన ఎడమ ప్రక్కన ఉందురు. అప్పుడు ప్రభువు నీతిమంతులను నిత్యజీవితమునకు, పాపులను నిత్య నరకమునకు పంపును. ఒకడు పరలోకమందు నిత్యజీవితమును పొందుటకు ఒకే మార్గము క్రీస్తు సువార్తకు విధేయులగుట ద్వారా లభించును (రోమా 1:16). ఘనమైన ఈసువార్త రక్షించుటకు దేవుని శక్తిగనుక, ఒకడు మరణ పర్యంతము విశ్వాసముగా జీవించవలెను "... ప్రాణాపాయమువచ్చినను నమ్మకముగా ఉండుము; నేను నీకు జీవకిరీటమిచ్చెదను" (ప్రకటన 2:10)

## 2

## ప్రతివాడు ఒకనినొకడు తనకంటె యోగ్యుడని యెంచుకొనవలెను

"కక్షచేతనైనను వృధాతిశయము చేతనైనను ఏమియు చేయక, వినయమైన మనస్సుగలవారై యొకనినొకడు తనకంటె యోగ్యుడని యెంచుచు మీలో ప్రతివాడును తన సొంత కార్యములను మాత్రమే కాక యితరుల కార్యములను కూడ చూడవలెను" (ఫిలిప్పీ 2:3-4). కలహము మరియు అహంకారము అనునవి నాశనమునకు నడుపు రెండు జంట లక్షణాలు. ప్రభువు సంఘమందు గర్వానికి దుహంకారానికి స్థానం లేదు.

సంఘానికి సేవకులు కావలయును. ఒకరి యెడల ఒకరు నిజమైన ప్రేమ కలిగియుండి, ఇతరుల యెడల లక్ష్యము, తమ్మును తాము త్యజించు కొని, ఇతరులకు సహాయపడే అవకాశాల్ని వెదకేవారు కావలయును. మనము నిజమైన సేవకులుగా ఉండవలెనన్న, సాత్వీకమును పెంపొందింప జేసుకొనవలెను. సాత్వీకము స్వాభావికముగా వచ్చు లక్షణము కాదు గాని

అది సాధన, ప్రార్థనల ద్వారా పెంపొందును.

దేవుని కుటుంబము ఒక ప్రత్యేకమైన కుటుంబము. "అయితే మీరు చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచినవాని గుణాతిశయములను ప్రచురము చేయు నిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధజనమును, దేవుని సొత్తయిన ప్రజలునైయున్నారు. ఒకప్పుడు ప్రజగా నుండక ఇప్పుడు దేవుని ప్రజయైతిరి, ఒకప్పుడు కనికరింపబడక యిప్పుడు కనికరింపబడిన వారైతిరి" (1పేతురు 2:9-10). మనము ఒకరితో ఒకరము సహవాసము కలిగియుండి, కలసి నవ్వుచు, కలసి దుఃఖించుచు ఒక సన్నిహిత కుటుంబీకులుగా పరలోకం కొరకు సిద్ధపడవలెను. మనం ఒకరిని ఒకరం గౌరవించుకొంటూ ఒకరిని గూర్చి ఒకరు మంచి చెప్పుచూ, ప్రోత్సహించు కొంటూ ఒకరిని ఒకరు అభివృద్ధి చేయవలెను. మనం క్రీస్తును ఎరిగి ఆయనయందు నిరీక్షణ గలవారము గనుక అనుకూలమైన ముందు చూపు గల జీవితాన్ని జీవించవలెను.

## 3

# ప్రభువునందు బలవంతులైయుండుడి

అపోస్తలుడైన పౌలు చేసిన హెచ్చరికను గమనిద్దాం. "తుదకు ప్రభువు యొక్క మహాశక్తిని బట్టి ఆయనయందు బలవంతులైయుండుడి. మీరు అపవాది తంత్రములను ఎదిరించుటకు శక్తిమంతులగునట్లు దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి" (ఎఫెసీ 6:10,11). ఆ తరువాత వచనములలో క్రైస్తవులు వాటిని ధరించుకొని ఇహలోక దుష్టత్వము నుండి తమ్మును తాము రక్షించుకొనవలెనని పౌలు క్రైస్తవులను ప్రోత్సహించెను.

విశ్వాసమందు బలవంతులైన వారు తమ శక్తిని దేవుని వాక్యము

నుండి పొందుదురు. విశ్వాసులైన దేవుని పిల్లలు పరిపక్వతను సంతరించు కొను శక్తిని బైబిలునందు కనుగొని, శ్రద్ధతో చదివి ప్రార్ధించుట ద్వారా పొంద గలరు. మన ప్రార్ధనా జీవితము బలమైనదైన యెడల మనము దేవుడ్ని ప్రేమించుటలో ఆధిక్యతను సంపాదించుకొనగలము. మనం బైబిలు చదువుటయందు మంచి అలవాట్లను పెంపొందించుకొన్నయెడల, దేవుని చిత్తమును గూర్చి జ్ఞానములో ఎదిగి బలవంతులమగుదుము.

ఆధీనమందు లేని సమాజములో జీవిస్తూ, దాని గూటిలోనికి ప్రవేశించు టకు ప్రలోభపడకుండునట్లు మనము బలవంతులమై యుండవలెను. మనము ప్రభువునందు బలవంతులమైయున్నప్పుడు, ప్రతిదినం మనమెదుర్కొను ప్రాపంచిక ఒత్తిడులను అధిగమించగలము. మన చుట్టూ వేర్వేరు మత విశ్వాసములు గలిగి, బైబిలును గూర్చి సరియైన అవగాహన లేని వారున్నారు గనుక, వారికి మన నడిపింపు అవసరమైయున్నది. మనము ప్రభువు నందు బలవంతులమైయున్నప్పుడు మాత్రమే వారిని దైవవాక్యములోనికి, సత్యము లోనికి నడిపించు శక్తిని కలిగియుందుము. ప్రపంచమంతటికి సువార్తను తీసుకొని వెళ్ళగలుగు విశ్వాసులైన, పరిపక్వత గల క్రైస్తవుల ఆవశ్యకత చాలా ఉన్నది. మనలను మనము బలపరచుకొనుటయందు తృప్తిపడక, ప్రతి ఆత్మ క్రీస్తు సువార్తకు విధేయులగు అవకాశమును పెంపొందింపజేయు పర్యంతము మన సమాజమంతటికి సువార్త ప్రకటించవలెను. సహోదరులారా, మనము దేవుడు ఎంచుకొనిన మంటి ఘటములము. దేవుని రాజ్యము యొక్క ఎల్లలను వ్యాపింపజేయుటకు దేవుడు ఏర్పాటు చేసుకొన్న మంటి ఘటములమైన మనపైనే ఆయన ఆధారపడుచున్నాడు. మనము ప్రకటించని యెడల ఎవరు ప్రకటించుదురు? పొలములు తెల్లబారియున్నవి. పనివారు కొద్దిమంది మాత్రమే కలరు. మనకు అవకాశముండగనే పనిచేయుదము.

# 4

# ప్రతి వాని జీవితంలో ఒక వర్షం కురవాలి

ఒక పరిపూర్ణమైన ప్రపంచంలో జీవితంలోని సమస్తము సాఫీగా సాగి పోతుంది. మంచిని మాత్రమే అనుభవిస్తూ, చెడును గూర్చి ఆలోచించే పని ఉండదు. గాని ఇహలోక జీవితం పరిపూర్ణంగా ఉండడానికి నిర్దేశించ బడలేదు. ఒక పాత నానుడిలో చెప్పబడినట్లు, "ప్రతీ తీపితోను ఒక చేదు వస్తుంది". జీవితంలో బలమైన ఎదురు దెబ్బలు తగిలినప్పుడు మనం వాటిని ఎదుర్కోవడం నేర్చుకోవాలి.

క్రైస్తవులుగా మనం జీవితంలో ఎంతో ఆశీర్వాదించబడ్డాము. ధన ధాన్యాలరూపేణా కాకపోయినా ఆత్మీయంగా ఖచ్చితంగా ఆశీర్వదించ బడ్డాము. ప్రభువునందు మనకు శాంతి కలదు (యోహాను 16:33). మానవాళికి గొప్ప ఆశ్చర్యకరమైన నిత్యజీవితమును గూర్చిన నిరీక్షణ మనకు కలదు (ప్రకటన 2:10). పరలోకానికి మార్గదర్శియై మనలను సరియైన మార్గంలోనికి నడిపించే బైబిలు మనకు కలదు.

ఈ లోకంలో చాలా ఇక్కట్లు ఉంటాయి. మనం కుటుంబ సమస్యలు, ఉద్యోగ సంబంధమైన ఒత్తిడులు మొదలగు వానిని పరిష్కరించునపుడు, శారీరిక రుగ్మతలు, బాధలు మాత్రమే కాక మానసిక సంబంధమైన రుగ్మతలకు కూడా గురికావలసియుండును. అట్టి సమస్యలను సమర్థవం తంగా పరిష్కరించలేనపుడు మనం ఆత్మన్యూనత (Depression) చెందు తుంటాము. దురదృష్టవశాత్తు క్రైస్తవులు అందుకు అతీతులు కారు. అట్టి హానికి బలియైన వారికి సహాయపడుటకు అనేక సంస్థలు కలవు. సహాయము కావలసిన వారు వాటిలో ఉపయోగకరమైన దానిని వినియోగించుకొన వచ్చును. ఉదాహరణకు ఒక వైద్యుని పర్యవేక్షణలో కొన్ని మందులు శారీరిక,

మానసిక బాధలను నివారణ చేయగలవు. మంచి క్రైస్తవ ఆలోచన కూడా ఉపయోగకరము కాగలదు. లెక్కకు రాని అనేకమంది మరియు అనేక కుటుంబాలు క్రైస్తవ ఆలోచనా విధానం ద్వారా సహాయ పడ్డారు. మన సమస్య ఏదైనప్పటికి, నిజమైన మంచి జీవితము యేసుక్రీస్తు నందు మాత్రమే దొరుకునని మనం జ్ఞాపకముంచుకొనవలయును. "ప్రతి వాని జీవితంలోను ఒక వర్షం కురవాలి" అనేది ఎంతో సత్యమైనప్పటికి, మనకు ఎదురయ్యే శోధనల్ని మనమేలాగు ఎదుర్కొంటున్నాము అనేది మన క్రైస్తవ పరిపక్వతకు నిదర్శనమైయున్నది. మనలో ప్రతివారు దేవుని వాక్యాన్ని నిరంతరము అభ్యసించాలని నిర్ణయించుకొంటే మనకెదురయ్యే ఎట్టి సమస్యనైనను తేలికగా పరిష్కరించుకొనగలము.

# 5

# మనం అందరి ఆత్మల యెడల ప్రేమ కలిగియున్నామా?

దేవుడు అందరిని ప్రేమిస్తున్నాడు. – ఎంతగానంటే అందరు రక్షించబడే అవకాశాన్ని కలిగియుండునట్లు ఆయన కుమారుడ్ని అనుగ్రహించాడు. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్య జీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16). దేవుడ్ని ఒక పరిపూర్ణమైన మాదిరిగా తీసుకొని మనలో ప్రతీవాడు తన్ను తాను ఇలా ప్రశ్నించుకోవాలి. నేను అందరి ఆత్మల యెడల ప్రేమ కలిగి యున్నానా? భూమిపైనున్న ప్రతి వ్యక్తి పరలోకానికి వెళ్ళాలని నేను ఆశిస్తున్నానా? దేవుడలా ఆశిస్తున్నాడు. అందువలననే ఆయన కుమారుడ్ని

ఒక పరిపూర్ణమైన పాప పరిహారార్థ బలియగుటకును, ఆ సువార్తను మనకనుగ్రహించుటకును, ఈ లోకానికి పంపించాడు. "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడా రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియైయున్నది" (రోమా 1:16).

రక్షణ పథకము అతి సామాన్యమైనది, మరియు సుందరమైనది. "కాగా వినుట వలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును" (రోమా 10:17); "కాగా మీ పాపములలోనే యుండి మీరు చనిపోవుదురని మీతో చెప్పితిని. నేను ఆయనననని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురని వారితో చెప్పెను" (యోహాను 8:24); "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను, ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించు చున్నాడు" (అపో.కా. 17:30); "ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును; రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" (రోమా 10:10); "పేతురు - మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తీస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అనువరమును పొందుదురు".

దేవుడు మానవులందరికి ఆయన కృపను బట్టి ఆశ్చర్యకరమైన రక్షణ పథకమును అనుగ్రహించెను. గాని ఆయన పిల్లలకు సువార్తను ఉపదేశించు బాధ్యతను అప్పగించెను. ఆయన పథకమును భూమిపై వ్యాపింప చేయుటకు పాత్రులమైన మనపై ఆయన ఆధారపడియున్నాడు. నశించి పోవుచున్నవారిపై జాలి కలిగియుండి వారితో సువార్తను పంచుకొనుటకు మన హృదయములో

భారము కలిగియున్నామా? ఆదియందు దేవుడు సమస్తమును ఎదిగి పునరుత్పత్తి చేయగల స్థితిలో సృష్టించెను. అదే విధముగా మనము పవిత్రమైన విత్తనము (దేవుని వాక్యము) ను ఇతరుల హృదయములో వెదజల్లినపుడు అదే ఫలమును ఉత్పత్తి చేయును. మనము విత్తనములు విత్తు వ్యాపకములో జాగరూకత కలిగి యుండవలెను.

## 6

# దారి తప్పిన సహోదరులను వెనుకకు తీసుకు వద్దాం

"సహోదరులారా! ఒకడు ఏ తప్పిదములోనైనను చిక్కుకొనిన యెడల ఆత్మ సంబంధులైన మీలో ప్రతివాడు తానును శోధింపబడుదునేమో అని తన విషయమై చూచుకొనుచు, సాత్వీకమైన మనస్సుతో అట్టి వానిని మంచి దారికి తీసుకొని రావలెను" (గలతీ 6:1).

క్రొత్తగా క్రైస్తవులైన వారిలో కేవలం 50 శాతం మంది మాత్రమే ఐదు సంవత్సరముల పాటు విశ్వాసంలో కొనసాగుతున్నారని తెలియజేయబడినది. సహోదరులారా, అలాగున జరుగకూడదు. క్రీస్తునందు పశికందులైన వారిని పెంచుటకు మనము ఎక్కువగా శ్రమపడవలయును. వారిని ప్రోత్సహించి, ఉపదేశించి, ప్రేమించి, సేవ చేసి వారు దేవుని కుటుంబములోనికి ఆహ్వానితులని, వారు ప్రాముఖ్యమైనవారని తెలుసుకొనునట్లు చేయవలెను.

దేవుని పిల్లలు పడిపోవుటకు అనేక కారణములు గలవు. కొందరు పరిశుద్ధులతో కూడుకొనుట మానుదురు (హెబ్రీ 10:25), కొందరు సరియైన వాక్యజ్ఞానము లేక పడిపోవుదురు. అట్టి వారు కొంచెము మాత్రమే తెలిసికొని ఇంకను నేర్చుకొను ప్రయత్నము చేయరు. అందువలన వారి విశ్వాసము

బలహీనమై తప్పిపోవుదురు. కొందరు పాత అలవాట్లను, పాత మిత్రులను విడువనందువలన వారి గత జీవితంలోనికి వెళ్ళిపోవుదురు. అట్టి వారు, వారి పరిసరములలోనున్న ప్రాపంచిక పాపపు అలవాట్లను మానుకొను శక్తి లేని వారైయుందురు. కొన్ని సార్లు వారికి ప్రియమైన వారిని పోగొట్టు కొన్నపుడు లేక వారి కుటుంబ సమస్యలు వారి దేవుని నుండి వారిని వేరు చేయును. దేవుని శక్తి కొరకు, ఆయన వైపుకు తిరుగుటకు బదులు, వారు ఆయన నుండి మరలి లోకమువైపుకు పోవుదురు. కొందరు వేరొక పట్టణము నకు బదిలీయై మంచి క్రైస్తవ సహవాసము కొదువైనపుడు తప్పిపోవుదురు. వారు ప్రభువు సంఘములోనికి సహవాసమును కనుగొను ప్రయత్నము చేయక, ఆరాధన కొనసాగించక తిరిగి లోకములోనికి మరలి పోవుదురు.

అపోస్తలుడైన పౌలు, ఆత్మీయముగా తప్పిపోయిన వారిని సాత్వికముతో వెనుకకు తీసుకొని రావలెనని మనలను హెచ్చరించుచున్నాడు. మనము మన సహోదరుల యెడల జాగ్రత్త లేకుండా ఏవిధముగా దానిని నిర్వర్తించ గలము? మనము సరియైన పరిచయము లేని వ్యకిని గూర్చి ఏలాగు శ్రద్ధ కలిగియుందుము? సంఘమైన మనము దేవుని కుటుంబమైయున్నాము. అందువలన ఒకరి యెడల ఒకరము నిజమైన ప్రేమను పెంపొందించు కొనునట్లు ప్రయాసపడవలెను. ఒకరి కొరకు ఒకరు ప్రార్థించుటలో సమయమును వెచ్చించుట ద్వారా మాత్రమే దేవుడు మనము పెంపొందించు కొనవలెనని నిర్ణయించిన బంధమును కలిగి యుండగలము. మన ఆత్మీయ కుటుంబము యెడల సరియైన ప్రేమ కలిగియున్నప్పుడు మాత్రమే ఒక సహోదరుడు లేక సహోదరి తిరిగి లోకములోనికి పోయినపుడు మనకు దుఃఖము కలుగును.

సువార్త రక్షణ పథకమునకు హృదయ పూర్వకముగా విధేయత చూపిన

ప్రతీవాడు దేవుని బిడ్డ అగును. మరియు దేవుడు వానిని సంఘములోనికి చేర్చును (అపో.కా. 2:47). అట్టివాడు ఎల్లప్పుడు దేవుని కుమారునిగా కొనసాగును. అతడు అవిశ్వాసియైన యెడల దేవుని కుటుంబసభ్యుడు కాకపోడు. అప్పుడు వాడు దారితప్పిన కుమారుడగును. ఇశ్రాయేలు ప్రజలను మనము గమనించిన యెడల వారెట్లు అనేక మార్లు అవిశ్వాసులైనారో చూడగలము. దేవుడు వారి పాపములను బట్టి దుఃఖించాడు. అయినను వారు మారుమనస్సు పొంది వెనుకకు తిరిగిన ప్రతిసారి దేవుడు వారిని క్షమించాడు.

అందువలన దారి తప్పిన వారిని గూర్చి విశ్వాసులైన క్రైస్తవులు ఏం చేస్తారు? మొదటిగా ప్రతి ఆత్మ ప్రాముఖ్యమైనదని తెలుసుకొని వానిని నమ్మవలెను. క్రీస్తు ప్రతి వారికొరకు మరణించాడు. వారి ఆత్మీయ కుటుంబములోని ఒక్క వ్యక్తిని పోగొట్టు కొని, వారిని నిత్య నరకమునకు పాత్రుని చేయుట అనునది అతి బాధాకరమనియు, క్రైస్తవులు శక్తి వంచన లేకుండా దానిని నివారించగలరనియు ఆలోచన కలిగియుండవలయును. రెండవదిగా, ఉపదేశము యొక్క ప్రాముఖ్యతను గూర్చి వారికి జ్ఞాపకము చేయవలయును. యేసు ప్రభువు ఇచ్చిన గొప్ప ఆజ్ఞలో ఆయన శిష్యులను వెళ్ళి, బోధించి, బాప్తిస్మమిచ్చి, ఉపదేశించమని ఆజ్ఞాపించాడు. సరియైన విధముగా సువార్తను ఉపదేశించుట క్రైస్తవ జీవితమునకు గట్టి పునాదిని నిర్మించగలదు.

మూడవదిగా క్రైస్తవ సహోదరులను సహోదరీలను వారి కష్ట సమయము లందు సహాయపడి, బలపరచుట ప్రాముఖ్యమైనది. కష్టములలోనున్నవారికి ఆశీర్వాదకరమైన ప్రార్ధనతో పాటు క్రైస్తవ కుటుంబములు శారీరక అవసరములను కూడా తీర్చవలయును. కష్టములలో నున్న వారికి క్రైస్తవ

జీవితమును గూర్చిన సమస్యలను తీర్చుకొనుటకు క్రైస్తవ ఆలోచనా సహకారము అవసరమైయుండును.

దేవుని పిల్లలుగా మనము బలహీనులైన విశ్వాసులను తిరిగి చేర్చుకొను బాధ్యతను కలిగియుండవలయును. మనము ఇతరులకు మాదిరికరముగా నుండి ఒకరినొకరు బలపరచుకొనుటకు సహాయపడవలయును. మనము నిత్యత్వమును గూర్చి మన ఆత్మలకు సంబంధించిన విషయములను ముఖాముఖిగా చర్చించుటకు భయపడకూడదు. మనలో ప్రతి ఒక్కడు ఎక్కువగా ఆత్మ సంబంధులమైయుండి అవసరములోనున్న సహోదరులకు సహాయపడవలయునని నిర్ణయించుకొందము.

సహోదరులారా, మనము నిత్యత్వము కొరకు సిద్ధపడుచున్నాము. క్రైస్తవ్యము అత్యంత ఆవశ్యకమైన వ్యాపకము. మనము దానిని తేలికగా తీసుకొనరాదు. ఎందుకనగా మన ఆత్మలు దానిపై ఆధారపడియున్నవి.

# 7
# ప్రాంతీయ సువార్తీకరణ

ప్రభువు సంఘమందలి కొన్ని ప్రాతీయ సంఘములు, ప్రాంతీయ సువార్త వ్యాపకమందు నిమగ్నమైయున్నవి. అతి తక్కువమంది ఒకరితో ఒకరు చర్చించుకొను పద్ధతిలో సువార్తను ప్రకటించుచున్నారు. అనేకులైన వేదిక నుండి ప్రసంగించు బోధకులు, సంపూర్ణ సమర్పణ గలిగిన సేవకులు, యవ్వనస్థుల మధ్య సేవకులు, విద్యావంతుల మధ్య సేవకులు కుటుంబముల మధ్య సేవకులు మరియు అంతర్జాతీయ సువార్తికులు ఉన్నప్పటికి వ్యక్తిగత ప్రాంతీయ సువార్త యొక్క ప్రాధాన్యతను గమనించుటలేదు.

మనము వ్యక్తిగత సువార్త యొక్క ఆవశ్యకతను గూర్చి బోధించక

పోవుట మనకు లోటైయున్న వాటిని గూర్చి బోధించక పోవుటయా? గొప్ప ఆజ్ఞను పాఠించుటలో మనకు లోటైయున్నవాటిని మనము విడిచి పెడు తున్నామా? దేవుని ఆజ్ఞలకు విధేయత చూపుటలో ప్రాధాన్యతనిచ్చి గర్వపడు మనము ఆయన గొప్ప ఆజ్ఞను నిర్లక్ష్యం చేస్తున్నామా? మనము విధేయులమై యుండుటకు ప్రభువు ఆజ్ఞలను, అవసరమైన వాటి సంగ్రహములను, బైబిలునందు గల ఉదాహరణలను పూర్తిగా తెలుసుకొన వలయును. వ్యక్తిగత సువార్తకు వచ్చినపుడు మనకొక గొప్ప ఆజ్ఞ కలదు (మత్తయి 28:19-20; మార్కు 16:15,16). పిలిప్పు నపుంసకునికి సువార్త ప్రకటించిన సంగ్రహ ఉదాహరణ కలదు (అపో.కా. 8:35). మనకు ఒకటి తరువాత ఒకటి సువార్తను వ్యక్తిగతముగా ప్రకటించిన ఉదాహరణలు అపోస్తలుల కార్యముల గ్రంథమందు అనేకము కలవు. సహోదరులారా, ఆ విధముగా ఆదిమ సంఘము ప్రజల్లోనికి వెళ్ళినది. మనము కూడా అవిధంగానే ప్రజలను చేరవలయును.

మనము మానవుల ఆత్మలను ప్రేమించుట నేర్చుకొనవలయును. మనము వారిని వెదకి, వారికి బోధించవలయును. మనము నిజమైన ప్రభువు సేవకులమగుటకు నిస్వార్ధముగా ఇతరులను చేరుటకు ప్రయాస పడెదము. సహోదరులారా! జీవితంలో మన స్వార్ధ కోరికలను తృప్తిపరచు కొనుటకన్న ప్రాముఖ్యమైనది కలదు. నశించిన వారిని సువార్తతో సంధించుటలో ఎంతో గొప్ప ఆనందం ఉండును.

మనము క్రీస్తును మాదిరిగా ఉంచుకొని, ప్రతిదినము ఆయన మనకు చూపిన మార్గమందు నడచుచూ సాధ్యమైనంత వరకు ఆయన వలె ఉండుటకు ప్రయత్నించుదము. మనము మేలు చేయుట యందు విసుగక, క్రీస్తుయేసునందు దేవుని ఉన్నత పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని, గురియొద్దకే పరిగెత్తుచున్నాము (గలతీ. 6:9; పిలిప్పీ 3:14).

# 8
# మాట్లాడవలసినది మాట్లాడి, నడువవలసినట్లు నడువుము

మాటలాడుట తేలికైనది. మనము చేయు వాటిని గూర్చి అతిశయించుట కన్నా చేసి చూపుట ప్రాముఖ్యమైనది. అందువలననే చెప్పినది చేయు వానిని చూచుట ఆహ్లాదకరము. అట్టివాడు తన నాలుకను స్వాధీనమందుంచుకొని ప్రతిదినము క్రైస్తవ జీవితమును జీవించును. మాదిరికరమైన జీవితము ద్వారా బోధించు ప్రసంగము అతి ప్రయోజన కరమైనదని చెప్పబడుట సరియైనది.

మనలో అనేకులు మాటలాడుటలోను, ప్రణాళికలు వేయుటలోను తమ సమయమును వృధా చేస్తూ అవసరమైన పనులు చేయుటయందు లక్ష్య ముంచరు. మనకు మంచి ఉద్దేశ్యములుండవచ్చును గాని పనిచేయుటకు పూనుకొనుటలేదు. అవకాశము తట్టుచున్నది. మన సమాజములో క్రీస్తును గూర్చిన సందేశము వ్యాప్తిచేయవలెనన్న చేయవలసినదెంతో ఉన్నది. సువార్తను గూర్చి ఎన్నడూ వినని ఆత్మలెన్నో మన చుట్టూ ఉన్నవి.

మన సంఘము యొక్క పనిలో పాల్గొనుటకు తీరికలేదని కొన్ని సార్లు సాకులు చెబుతుంటాము. ఎందువలననగా మన సొంత కుటుంబములతో ఆనందించుటకే సమయము సరిపోవుట లేదు. అందువలన పదవీ విరమణ తరువాత విలువైన సంవత్సరములన్నియు దేవుని రాజ్య వ్యాప్తి కొరకే వెచ్చించుదుమని వివేకముగా చెప్పుచుందుము. నిజానికి పదవీవిరమణ తరువాత సంఘపు పనిలో కొనసాగువారందరు పదవీవిరమణకు ముందు దేవుని పనిలోనున్నవారే. అనేకులు దేవుని పని కొరకు సమయము

కనుగొనలేక పోవుట విచారకరము.

నీ బాల్యదినములయందే శక్తి సామర్థ్యములుండగనే నీ ప్రభువును జ్ఞాపకము చేసుకొనుమని రాజైన సొలోమోను మనలను హెచ్చరించాడు. తరువాత శారీరకంగాను మానసికంగాను బలహీనపడు కాలము రానైయున్నదని జ్ఞాపకం చేసాడు. త్వరలోనే జీవితం ముగిసి ఆత్మ దానిని దయచేసిన దేవుని యొద్దకు పోవునని తెలియజేసాడు (ప్రసంగి 12:1-8).

# 9

# దేవుని కృపలో ఎదుగుచూ జీవించుదము

దేవుని బిడ్డయై ఆయన కొరకు విశ్వాసంగా జీవించుట ఈ జీవితంలో చేయగలిగిన గొప్ప కార్యము. మన పిల్లలు, మన మనుమలు సువార్తకు విధేయులైనప్పుడు మన హృదయాల్లో ఎంత సంతోషం నిండియుంటుంది! మన ప్రియులతో కలసి పరలోకమందు శాశ్వతము జీవించుట ఎంత ప్రశస్తమైనది!

సువార్తకు విధేయుడగుటతో ప్రారంభమై, దేవుని ప్రతి బిడ్డ క్రైస్తవ కృపలో నిరంతరము ఎదుగుచు, పరిపక్వతనొందుచుండవలయును. "ఆ హేతువు చేతనే మీ మట్టుకు మీరు పూర్ణ జాగ్రత్త గలవారై, మీ విశ్వాసము నందు సద్గుణమును, సద్గుణమునందు జ్ఞానమును, జ్ఞానమునందు ఆశానిగ్రహ మును, ఆశానిగ్రహమునందు సహనమును, సహనమునందు భక్తిని, భక్తియందు సహోదర ప్రేమను, సహోదర ప్రేమయందు దయను అమర్చుకొనుడి. ఇవి మీకు కలిగి విస్తరించిన యెడల అవి మన ప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన అనుభవ జ్ఞాన విషయములో మిమ్మును సోమరులైనను నిష్ఫలులైనను కాకుండా చేయును" (2పేతురు 1:5-8).

మనలను బైబిలు అధ్యయనమునకు, ప్రార్థనకు అంకితముచేసుకొనుట ద్వారా అట్టి ఎదుగుదలను పొందగలము. మన సొంత క్షేమాభివృద్ధి కొరకు అట్టి బాధ్యతను స్వీకరించిన యెడల మాత్రమే ఆత్మీయ పరిపక్వత సాధ్యము.

నశించిన వారిని రక్షించుటకు కూడా మనము ప్రయాసపడవలెను. నీవెన్నడును క్రీస్తు సువార్తను వినకుండిన యెడల నీవెక్కడ ఉందువో ఎన్నడైనను ఆలోచించావా? మనలో అనేకులు ఇతరులకు సువార్తను బోధించు ఆవశ్యకతను గుర్తించడము లేదు. క్రీస్తుకు బయట ప్రతిదినము ఎందరు నాశనమైపోతున్నారో గ్రహించక ఈ గొప్ప బాధ్యతను వాయిదా వేయుచున్నాము.

మన నులివెచ్చని స్థితిని పారవేసి, పరిపక్వతవైపుకు పయనించు సమయము ఆసన్నమైనది. మనము మన సొంత రక్షణకు మాత్రము కాక మన సహచరులు, పిల్లలు, మనుమలు, స్నేహితులు మరియు మనకు సన్నిహితులైన వారందరి రక్షణకు కూడా బాధ్యులమైయున్నాము. “కాలమును బట్టి చూస్తే మీరు బోధకులుగా ఉండవలసిన వారైయుండగా దేవోక్తులలో మొదటి మూల పాఠములను ఒకడు మీకు మరల బోధింపవలసి వచ్చెను. మీరు పాలు త్రాగవలసినవారే గాని బలమైన ఆహారము తినగలవారు కారు” (హెబ్రీ 5:12). మనలో ప్రతివాడు తీర్పుదినమందు ప్రభువు ముందు నిలువబడి మనమన క్రియల చొప్పున లెక్క ఒప్పగింపవలెనని మనమెన్నడు మరువరాదు.

## 10

## ఆత్మ గౌరవము-సమతూకాన్ని పాటించుట

అనేకులు ఆత్మగౌరవము లేక బాధపడుదురు. పైరూపమును బట్టి ఆత్మ గౌరవము లేని వారిని గుర్తించుట ఎల్లప్పుడు సాధ్యము కాదు. కొందరు

ప్రతిదినము ఎదుర్కొను సవాళ్ళతో సతమతమగుచూ కూడా చాలా సాహసముగా కనిపించుదురు. ఇంకొందరు ఆత్మ గౌరవమును పూర్తిగా కలిగియున్నవారుగా కనిపించుదురు గాని వారు తమను గూర్చి తాము ఊహించవలసినదానికన్నా ఎక్కువగా ఊహిస్తూ ఉంటారు. వారు దురహం కారులగుదురు. క్రైస్తవులుగా మనము ఆ రెండు కొనలకు మధ్య సమతూకాన్ని వెదకవలెను.

తల్లిదండ్రులుగా మనము సరియైన సమతూకాన్ని పొందించడం కష్టతరంగా ఉంటుంది. మన పిల్లలను ప్రోత్సహించి, అభినందించి వారిలో ఆత్మవిలువలను పెంపొందింపజేయవలెనని మనమెరుగుదుము. ఆత్మ విలువలు మన పిల్లల ఆనందమునకు ప్రాముఖ్యమైనవై వారి విజయమునకు దోహదపడతాయి. వారు ఉత్సాహముగా గొప్ప వారు కావలెనను ఆశతో ఎదుగుట, ఉత్తమమైన వారగుటకు ప్రయాసపడుట కొంతవరకు మంచిది.

ఏలాగైనను తన్ను గూర్చి అధికంగా ఆలోచించు బాలుడు దురహంకారియై స్వార్ధపరుడగును. తన్ను తాను అధికముగా ప్రేమించుకొను వానికి తక్కువ మంది మిత్రులుందురు. దీనత్వము ఒక ఆశ్చర్యకరమైన జ్ఞానము. మన పిల్లలు ఆత్మ గౌరవము గలవారుగాను దీనత్వము గలవారు గాను ఉండవలెనని మనము బోధించిన యెడల మనము కోరుకొను సున్నితమైన సమతూకాన్ని అందించగలము.

క్రైస్తవ తల్లిదండ్రుల ప్రాధమిక గురి వారిని ప్రభువులో ఎదిగి ఆయన ప్రభోదంలో కొనసాగునట్లు పెంచుటయే. అట్లు చేయుటకు మనము వారికి ప్రేమను, ప్రభువు యెడల ప్రేమను, క్రైస్తవ, లౌకిక కుటుంబముల యెడల ప్రేమను, మానవాళి అందరి యెడల ప్రేమను ఉపదేశించవలయును. వారికి వాక్యము ద్వారాను, మాదిరి ద్వారాను బోధించి, దేవుని వాక్యమునకు

విశ్వాసమైన అభ్యాసకులుగా ఉండునట్లు నేర్పించవలయును. ఇతరులను వారికన్న ఎక్కువగా గౌరవించునట్లు నేర్పించవలయును. ఆ విధముగా వారి జీవితములు సమతుల్యముగాను, ప్రభువునకు ఇష్టమైనవిగాను ఉండును.

# 11
# మానవుని యెడల సహనముతో కూడిన దేవుని ప్రేమ

"దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16).

మానవుల యెడల దేవుని ప్రేమ యొక్క పరిమాణము అర్థం చేసుకోవడానికి ప్రారంభించలేనంత గొప్పది. ఆయన ఆకాశాన్ని భూమిని వానిలో ఉన్న సమస్తాన్ని సృష్టించిన తరువాత, ఆయన స్వరూపంలో చేసిన మానవుడ్ని ఏదేను వనాన్ని కాయడానికి అనుభవించడానికి సృష్టించాడు. గాని మానవుడు పాపం చేసి దేవుని నుండి వేరైపోయాడు. ఏదేను వనం నుండి వెడలగొట్టబడి, జీవవృక్షమునుండి వేరుచేయబడి మానవుడు శారీరకంగా మరణించడం ప్రారంభించాడు. పాపము వలన దేవుని నుండి వేరై ఆత్మీయంగా మరణించాడు (ఆది. 1:3). గాని దేవుడు మానవాళిని నిరీక్షణలేకుండా విడిచిపెట్టలేదు.

దేవుడు, ఆయన అనంతమైన ప్రేమతో ఆయన్ని ఆరాధించడానికి ఒక మార్గాన్ని చూపించినప్పటికి, అస్థిరమైన ఆయన పిల్లలు ఎంతో కాలం ఆయన యెడల విశ్వాసంగా జీవించలేదు. దేవునికి వ్యతిరేకమైన తిరుగుబాటు

సామాన్యమై, ప్రతి మానవ హృదయం దుష్టత్వాన్ని సంతరించుకోవడం కొనసాగింది. దేవుడు మానవుడ్ని చేసినందుకు పశ్చాత్తాపపడి, గొప్ప జలప్రళయంతో మానవజాతిని, జంతువులను నాశనం చేసాడు. అయినప్పటికీ వారికి ఆ జలప్రళయం నుండి తప్పించుకొనే మార్గాన్ని దయచేసాడు. నోవహు,అతని కుటుంబము, కొన్ని జంతువులు నోవహు విశ్వాస,విధేయతలనుబట్టి రక్షింపబడ్డారు.

కొన్ని తరములు తరువాత అబ్రహాము తన యొక్క విశ్వాసమునుబట్టి దేవుని దయను పొందాడు. క్రీస్తు ఆగమనాన్ని గూర్చి మాట్లాడుతూ దేవుడు, అబ్రహాము సంతానం ద్వారా భూమిపైనున్న జనులందరు ఆశీర్వదించ బడతారని అబ్రహాముకు వాగ్దానంచేసాడు. అప్పుడు దేవుడు అబ్రహాముకు ఏకైక కుమారుడైన ఇస్సాకును బలియిమ్మని అడిగి అబ్రహాము విశ్వాసాన్ని పరీక్షించాడు. అబ్రహాము దేవునికి విధేయడగుటకు తన అంగీకారాన్ని చూపించినపుడు, దేవుడు ఇస్సాకును రక్షించి, అతనికి బదులుగా బలి అర్పించుటకు ఒక పొట్టేలును అనుగ్రహించాడు (ఆది.కా 12:22).

క్రీస్తు జననమునకు సమయము ఆసన్నమైనప్పుడు, యేసుక్రీస్తు ప్రభువు ఈలోకానికి రావడానికి కన్యమరియను దేవుడు ఎన్నుకున్నాడు. యేసు జ్ఞానమందును వయస్సునందును, దేవుని దయయందును, మనుష్యుల దయయందును వర్ధిల్లుచుండెను. 30 సంవత్సరాలు వయస్సు వచ్చిన తరువాత యేసు బోధించుట ప్రారంభించాడు. ఆయన వాగ్దానం చేసిన రాజ్యం (మత్తయి 16:18) యూదులు ఎదురుచూస్తున్నట్లు ఇహలోక సంబంధమైనది కాదుగనుక, ఆయనపై దైవదూషణ నేరాన్ని మోపి, శిలువకు మేకులతో కొట్టి, అతి క్రూరమైన మరణానికి గురిచేసారు. సమాధి ఆయనను బంధించ లేకపోయింది. తన శిష్యులకు వాగ్దానం చేసినవిధంగా (మత్తయి 16:2)

ఆయన మూడవదినమున తిరిగిలేచాడు. ఈ పర్యాయం దేవుడు మానవాళి అందరికి బలి అర్పణను అనుగ్రహించాడు.

పెంతుకోస్తుదినమున పేతురు చేసిన మొదటి సువార్త ప్రసంగమునందు క్రీస్తు మరణమును, సమాధిని, పునరుత్థానమును దృవీకరించి, ఆప్రజలు దేవుని కుమారుడ్ని మరణానికి గురిచేసారని వారితో ఒప్పింపచేసాడు. వాక్యాన్ని అంగీకరించినవారు బాప్తిస్మం పొందార్లు, అదేరోజు 3000 మంది సంఘానికి చేర్చబడ్డారు (అపొ.కా 2). ఆదినమ్ము నుండి సువార్త విన్న వారి అందరి రక్షణకు యేసుక్రీస్తు రక్షణ పాత్రుడయ్యాడు. మానవుల యెడల దేవుని ప్రేమ శాశ్వతకాలముండును గనుక, మొదటి శతాబ్దమందు విశ్వాసులకు రక్షణ ననుగ్రహించిన దేవుని ప్రేమ ఈనాడు కూడా మానవులను రక్షించుటకు కొనసాగుచున్నది.

## 12

# కొద్దిమంది మంచి మనుష్యులు

"కాబట్టి మీరువెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి నన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుండి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతోకూడా ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:19,20). క్రీస్తు పలికిని ఈమాటలు విన్నది పదకొండు మంది మాత్రమే అయినప్పటికి, కొద్దిమంది గొప్ప కార్యాలు సాధించగలరని ఋజువుచేసారు. కొద్దిమంది మంచి మనుష్యులు ప్రపంచాన్ని మార్చగలరు.

ఈనాడు వ్యక్తిగత సువార్త యందు నాయకత్వము వహించి ముందుకు

కొనసాగుటకు, దేవుని వాక్యాన్ని అధ్యయనం చేసే కోరిక కలిగియుండి, తమ సమయాన్ని వెచ్చించి దేవుని వాక్యజ్ఞానాన్ని పొంది, సమర్పణ గలిగిన జీవితంతో, ఓపిక, ప్రేమ, దయ, సాత్వీకము కలిగియుండవలెను. దేవునికి సమీపముగా నుండునట్లు ఆత్మీయంగా ఎదుగుటకు ప్రయత్నించు కొద్దిమంది మంచి మనుష్యులు కావలయును. ప్రభువు సంఘమందలి ప్రతి సమాజం లోను అట్టి మనుష్యులు కావలయును.

ప్రభువుకొరకు ఆత్మలను రక్షించుటకు ఒకనితోనొకడు వాక్యాన్ని అధ్యయనం చేయుట అత్యంత ఫలప్రధమైన విధానము. ఫలప్రదముగా ప్రారంభించువారమై యుండి, క్రైస్తవ్యము వ్యక్తిగతముగా ప్రతివారి వ్యక్తిత్వానికి సంబంధించినదను ఆలోచనావిధానాన్ని కలిగియుండి ముందుకు పోవలయును. సహోదరులారా, ఆత్మలు నశించిపోవుచున్నవని మరువక మన బాధ్యతను మనము నిర్వర్తించలేకపోయిన యెడల మనము లెక్క ఒప్పగించవలయునని మరువరాదు. మనము చేయగలిగినదంతయు చేసినయెడల దేవుడు అభివృద్ధిననుగ్రహించును.

# 13

# పాపమును గూర్చి పట్టింపులేకుడుంట

ఒకని సంపాదన విషయంలోగాని, క్రియలవిషయంలోగాని, ఆశించిన దేదయినను చేయుట తప్పులేదని ప్రచారంచేయు ఒక పెద్ద ఉద్యమం దేశంలో కొనసాగుచున్నది. "ఒకరు బాధపడితే నాకేమిటి?" అనే ప్రబలమైన వైఖరి కనిపించుచున్నది. దురదృష్టవసాత్తు ఈవిధమైన లౌకిక వేదాంతం అంగీకార యోగ్యమై, కోట్లకొలది ప్రజలు పాపమును గూర్చి పట్టింపు లేకున్నారు.

అత్యాశ ప్రత్యేకమైన అంగీకారాన్ని పొందుచున్నది. ఒక స్త్రీ తన

గర్భములోని బిడ్డ ఏకారణముచేతనైనను వద్దనుకున్నప్పుడు, ఎట్టి మనస్సాక్షి బంధకము లేకుండా ఆబిడ్డను చంపివేయవచ్చును. తన శరీరానికి కావలసిన దానిని చేసుకొను హక్కు ఆమెకున్నదని ఆ స్త్రీ వాదించవచ్చును.

వ్యభిచారము ఈనాడు సిగ్గుకరముగా పరిగణించబడుటలేదు. పురుషులు, స్త్రీలు, బాలురు, బాలికలు ఎట్టి సిగ్గులేకుండా ఈనాడు అట్టి క్రియలో పాల్గొను చున్నారు. వివాహబంధము లేకుండగనే స్త్రీపురుషులు జీవించుచున్నారు.

ఒకనాడు స్వలింగ సంపర్కము హేయమైన విషంగా పరిగణించబడెడిది. ఈనాడు అది నెమ్మదిగా ప్రత్యామ్నాయ జీవనవిధానముగా అంగీకరించ బడుచున్నది. కొన్ని మతపరమైన సంస్థలలో కూడా ఈ వక్రప్రవర్తన సమర్థించబడుచున్నది.

అనేకులు తమ తోటిమానవులయెడల ఈలాంటి నేరాలు చేయుట చాలా చింతించవలసిన విషయం. పిల్లలు క్రమశిక్షణలేకుండా పెరిగినపుడు, వారికి కావలసినది ఏదైనను, ఎప్పుడైనను దేశచట్టములపైన, దేవుని చట్టముపైన ఏలాంటి గౌరవము, మనస్సాక్షి బంధకము లేని వారుగా అట్టి నేరములు చేయుదురు.

## 14

## విడాకులు : లేఖనములేమి బోధించుచున్నవి?

ఈనాడు దేశంలో విడాకులు సామాన్యమైన విధానమైనది. కొందరు అనేకసార్లు వివాహం చేసుకొని విడాకులు పొందుచున్నారు. దాని పర్యవసానంగా చాలామంది పిల్లలు తల్లిదండ్రులలో ఎవరో ఒకరితోనే జీవించుచున్నారు లేక మారటి తల్లి సంరక్షణలో జీవిస్తున్నారు.

వివాహము, విడాకులను గూర్చి మత్తయి, క్రీస్తు పలికిన మాటలను ఈ విధంగా వ్రాసాడు. "తన భార్యను విడనాడువాడు ఆమెకు పరిత్యాగ పత్రిక యియ్యవలెనని చెప్పబడియున్నదిగదా; నేను మీతో చెప్పునదేమనగా వ్యభిచార కారణమును బట్టి కాక తన భార్యను విడనాడువాడు ఆమెను వ్యభిచారిణిగా చేయుచున్నాడు; విడనాడబడినదానిని పెండ్లాడువాడు వ్యభిచరించుచున్నాడు" (మత్తయి 5:31,32). తరువాత పరిసయ్యులకు సమాధానముగా "ఆయన మీ హృదయ కాఠిన్యమును బట్టి మీ భార్యలను విడనాడ మోషే సెలవిచ్చెను గాని ఆది నుండి ఆలాగు జరుగలేదు. మరియు వ్యభిచారము నిమిత్తమే తప్ప తన భార్యను విడనాడి మరియొకతెను పెండ్లి చేసుకొను ప్రతివాడు వ్యభిచరించుచున్నాడు; భర్తను విడిచిన దానిని వివాహము చేసుకొనువాడు వ్యభిచరించుచున్నాడు" (లూకా 16:18).

అపోస్తలుడైన పౌలు వివాహమును గూర్చి కొరింథీయులకు ఈలాగు వ్రాసెను – "మరియు పెండ్లియైనవారికి నేను కాదు ప్రభువే ఆజ్ఞాపించున దేమనగా, భార్య భర్తను ఎడబాయకూడదు. ఎడబాసిన యెడల పెండ్లి చేసుకొనకుండవలెను; లేదా తన భర్తతో సమాధానపడవలెను. మరియు భర్త తన భార్యను పరిత్యజింపకూడదు" (1కొరింథీ 7:10,11).

అనేకులు వివాహమును గూర్చి బైబిలు చెప్పు విషయములను ఎరుగరు లేక లెక్కచేయరు. అట్టివారు విడాకులు తీసుకొనుచు, వివాహము చేసుకొనుచు లేఖనములలో వ్రాయబడిన దానిని గూర్చి పట్టించుకొనరు. మత్తయి 19:9 నందు కారణము వ్రాయబడినది. ఆ కారణము వలన తప్ప మరణమొక్కటే భార్య భర్తలను వేరు చేయగలదు – అదే కారణము పునర్వివాహమును అనుమతించును.

దురదృష్టవశాత్తు ఈ వివాహము – విడాకులు – పునర్వివాహము

అను సమస్య లోకస్థుల సమస్య మాత్రము కాదు. అది సంఘములోనికి కూడా ప్రాకినది. మనలో ప్రతీవారు ఈ విషయములో దేవుని వాక్యమును చదివి దానిని మన జీవితములకు అన్వయించుకొనుట మాత్రము కాక దానిని మన పిల్లలకు కూడా బోధించవలయును. మన నిత్య జీవితము దానిపై ఆధారపడియున్నది.

# 15
# స్వదేశ చట్టములు

"మనుష్యులు నియమించు ప్రతి కట్టడకును ప్రభువు నిమిత్తమై లోబడియుండుడి. రాజు అందరికిని అధిపతి అనియు, నాయకులు దుర్మార్గులకు ప్రతిదండన చేయుటకును సన్మార్గులకు మెప్పు కలుగుటకును రాజు వలన పంపబడిన వారనియు వారికి లోబడియుండుడి" (1పేతురు 2:13,14). క్రైస్తవులు ఆదర్శ పౌరులై ఎల్లప్పుడు దేశ చట్టములకు లోబడుట యందు జాగ్రత్త కలిగియుండుట ద్వారా దేవుని చట్టమునకు లోబడియుండ వలయును.

"ప్రతివాడును పై అధికారులకు లోబడియుండవలెను; ఏలయనగా దేవుని వలన కలిగినది తప్ప మరి ఏ అధికారమును లేదు; ఉన్న అధికారములు దేవుని వలననే నియమింపబడియున్నవి. కాబట్టి అధికారమును ఎదిరించువాడు దేవుని నియమమును ఎదిరించుచున్నాడు. ఎదిరించువారు తమ మీదికి తామే శిక్ష తెచ్చుకొందురు. ప్రభుత్వము చేయువారు చెడ్డకార్యములకే గాని మంచి కార్యములకు భయంకరులు కారు; నీకు మేలు కలుగుటకు అధికారులు దేవుని పరిచారకులు; వారికి భయపడక ఉండకోరితివా, మేలు చేయుము, అప్పుడు వారిచేత

మెప్పుపొందుదువు. నీవు చెడ్డది చేసిన యెడల భయపడుము, వారు ఊరకయే ఖడ్గము ధరింపరు; కీడు చేయువాని మీద ఆగ్రహము చూపుటకై వారు ప్రతికారము చేయు దేవుని పరిచారకులు" (రోమా 13:1-4). దేవునికి అంగీకారముగా ఉండవలెనని ఆశించిన యెడల మనమాయన కట్టడలకు లోబడవలయును.

కొన్నిసార్లు మనము దేశ చట్టములను భారమైనవనియు కష్టతరమైన వనియు అనుకొందుము. వానిలో మొదటిది పన్నులు. ప్రభుత్వమును దాని కార్యక్రమములను బలపరచుటకన్న మన రాబడికి ఉత్తమమైన ప్రయోజనములు కలవని మనము తలంచవచ్చును. తరువాత ట్రాఫిక్ నిబంధనలు. కొన్ని సార్లు అవి అన్యాయముగా అగుపడి తేలికగా మీరుటకు అనుకూలముగా నుండును. క్రైస్తవులుగా మనమెన్నడును దేవుని చట్టమునకు వ్యతిరేకము కాని చట్టవ్యతిరేకులమై నేరమారోపించబడినవారము కాకూడదు. మనము నిజాయితీ, విధేయతలు గల పౌరులమై యుండవలయును. ఆలాగు చేయుట వలన మనము దేవుని వాక్యమునకు విధేయులమగుట మాత్రము కాక సమాజమందు మంచి పేరు గలవారమై, నశించిన వారిని చేరుటకు అవకాశములు తెరచుకొనును.

# 16

# యవ్వనస్థులు - పవిత్రత

1989 నందు అమెరికా దేశములో నిర్వహించిన అధ్యయనంలో 71.5 శాతం మంది క్రైస్తవ యవ్వన స్త్రీలు కన్యకలని తెలియజేసారు. క్రైస్తవేతరులు 40 శాతం కన్యకలని తెలియజేసారు. క్రైస్తవ యవ్వనులందరు పవిత్రులుగా లేకపోవుట విచారకరమైనప్పటికి క్రైస్తవేతరులకన్న క్రైస్తవులు రెట్టింపు మంది

కన్యకలుగా నుండుట ఆసక్తి కరమైన విషయం.

71.5 శాతం కన్యకలుగా నున్న వారిలో అనేక సామాన్యమైన లక్షణములు కనిపించినవి.

1. క్రైస్తవ్యాన్ని గూర్చి నైతిక విలువలను గూర్చి వారి తల్లిదండ్రులతో ఏకాభిప్రాయం కలిగియుండుట.
2. సంఘమును గూర్చి అనుకూల దృష్టి కలిగియుండుట.
3. వారి స్నేహితులలో అధికులు సంఘ సభ్యులైయుండుట.
4. వారు ఎక్కువగా సంఘ కార్యక్రమములలోను యవ్వనస్థుల కార్య క్రమములలోను చురుకుగా పాలుపొందుట.
5. వారి వ్యక్తిగత విశ్వాసము : క్రీస్తుకు తమ జీవితములను సమర్పించు కొనుటయందు ఎక్కువ ప్రాధాన్యత కలిగియుండుట. ఆత్మీయముగా శక్తిమంతులైనవారి మాదిరిని కలిగియుండు ప్రాముఖ్యతను సూచించుచు క్రీస్తు ప్రభువుకు సమర్పించు కొన్న కుటుంబము మంచి మార్గములోనికి నడిపించును.

క్రీస్తు ప్రభువుకు సమర్పించు కొన్న కుటుంబము యవ్వనులకు కావలయును. పాపాన్ని బహిర్గతపరచి, ఖండించు సంఘము, అట్లే మారుమనస్సు పొందిన వారియెడల జాలిగలిగి క్షమించు స్వభావముగల సంఘము యవ్వనులకు కావలయును. యవ్వనస్తుల మధ్య పరిచర్య చేయు కార్యక్రమములు గలిగియుండి, సాటి క్రైస్తవులతో స్వచ్ఛమైన, సంపూర్ణమైన స్నేహాన్ని పెంపొందింపజేయు అవకాశాన్ని యివ్వగల సంఘమే యవ్వనస్తులకు చాలా అవసరము.

# 17
# మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి

మత్తయి 5:13-16 పై వ్యాఖ్యానము :

"మీరు లోకమునకు ఉప్పయియున్నారు. ఉప్పు నిస్సారమైతే అది దేనివలన సారము పొందును? అది బయట పారవేయబడి మనుష్యుల చేత త్రొక్కబడుటకే గాని మరి దేనికి పనికిరాదు. మీరు లోకమునకు వెలుగైయున్నారు. కొండమీద నుండు పట్టణము మరుగైయుండనేరదు. మనుష్యులు దీపము వెలిగించి కుంచము క్రింద పెట్టరు గాని అది యింటనుండువారందరికి వెలుగిచ్చుటకై దీపస్తంభము మీదనే పెట్టుదురు. మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి".

"మీరు లోకమునకు ఉప్పయియున్నారు. ఉప్పు నిస్సారమైతే అది దేనివలన సారము పొందును? అది బయట పారవేయబడి మనుష్యుల చేత త్రొక్కబడుటకే గాని మరి దేనికిని పనికిరాదు" వచనం 13.

ఉప్పు వలె మనము ఇతరులను కాపాడగలుగు పలుకుబడి కలిగి యుండ వలెను. వారిని క్రీస్తులోనికి తీసుకొని వచ్చుట మాత్రమే గాక వారి జీవితముల యెడల నిరంతరము బాధ్యత కొనసాగించువారముగా నుండవలయును.

"మీరు లోకమునకు వెలుగైయున్నారు. కొండమీద నుండు పట్టణము మరుగైయుండనేరదు". వచనము 14.

మనము ఇతరులను అజ్ఞానాన్ని, అంధకారాన్ని పారద్రోలు శక్తిగల సువార్త ద్వారా క్రీస్తు నొద్దకు నడిపించగల దీపముల వలె నుండవలయును. క్రీస్తు సువార్త ద్వారా ప్రపంచమును ప్రభావితం చేయుట మాత్రము గాక మన క్రైస్తవ జీవితములు ప్రతిదినం అందరికి మాదిరికరంగా ఉండవలయును.

"మనుష్యులు దీపము వెలిగించి కుంచము క్రింద పెట్టరు గాని అది యింటనుండు వారికందరికి వెలుగిచ్చుటకై దీపస్థంభము మీదనే పెట్టుదురు" వచనము 15.

తరచుగా మనము మనదీపములను వెలుగనియ్యము. ప్రశ్నార్ధకమైన ప్రదేశములకు వెళ్ళుచు ప్రశ్నార్ధకమైన క్రియలను చేయు క్రైస్తవులు సత్యాన్ని దాచు ప్రయత్నము చేయుదురు. గాని మనము క్రైస్తవుడు అను నామమును ధరించినప్పుడు క్రీస్తు సంఘముపై మన ప్రవర్తన ప్రతిబింబించునని గ్రహించ వలెను. మన జీవితములోని ప్రతి అంశములోను మనలో జీవించు క్రీస్తును ఇతరులు చూచుచున్నారనునది ప్రాముఖ్యము. "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింప నియ్యుడి" వచనము 16. "మంచి పనులు" చేయు బాధ్యత ప్రతి క్రైస్తవుని కర్తవ్యము. మనతోటి మానవునికి మనము సహాయాన్ని ప్రోత్సాహాన్ని అందించినప్పుడు క్రీస్తు ప్రభువుపై మనకు గల ప్రేమను, ఆయనను సేవించుటలో మనకు గల సమర్పణను ప్రదర్శించుచున్నాము. క్రైస్తవునిగా అనుభవించు సంతోషము మన జీవితముల ద్వారా నిరూపించబడును గాక.

## 18
# క్షమాపణ

"మీకు ఒకనిమీద విరోధమేమైనను కలిగియున్న యెడల మీరు నిలువబడి ప్రార్ధన చేయునప్పుడెల్లను వాని క్షమించుడి. అప్పుడు పరలోక మందున్న మీ తండ్రియు మీ పాపములు క్షమించును" (మార్కు 11:25,26).

క్రైస్తవులు కూడా క్షమించుటకు ఇష్టపడరు. పర్యవసానంగా వారి

హృదయాలలో కోపము, కష్టము ఉంచుకొని సామాన్యంగా సంతోషంలేని ప్రజలుగానుందురు. వారు బాధ, తిరస్కారాలకు అంటుకొని యుందురు గనుక మానసిక సమస్యలు ఉత్పన్నమగును.

కుటుంబములు క్షమించుటకు అసమర్థులైనందున కష్టముల పాలగు దురు. భార్యభర్తలు అనేకులు ఎన్నడును శాంతికరమైన ప్రియమైన ఐక్యతను ఎరుగరు. అట్టి కుటుంబములలో ఎదుగు పిల్లలు విరోధమును, దౌర్భాగ్యాన్ని నేర్చుకొందురు. తండ్రి గాని తల్లిగాని వారి పూర్వ విరోధములను విడువ నందువలన కొందరు పిల్లలు తల్లి లేక తండ్రి ఒక్కరే గల కుటుంబములో జీవించుదురు. అట్టి పిల్లలు పెద్దవారైనప్పుడు బాధాకరమైన బాంధవ్యములు వారి వివాహ జీవితములలో పునరావృతమగును. అట్టి పరిస్థితి చాలా విచారకరమైనది.

అదేవిధముగా దేవుని కుటుంబమందలి సభ్యులు ఒకరినొకరు క్షమించు కోలేనప్పుడు సంఘము శ్రమననుభవించును. గర్వము, దురభిప్రాయము కలసి ప్రేమను, శాంతిని అధిగమించినప్పుడు ఐక్యత స్థానంలో విరోధము చేరును. సంఘమందు సమాజము చూచుచుండగా జరుగు నష్టము ఎన్నటికి బాగుచేయబడదు. క్షమాపణకు నిరంతర కృషి అవసరము. క్షమించుటను నేర్చుకొన్నవారు, నీతిగల జీవితములో మాత్రము లభ్యమగు శాంతిని అనుభవించగలరు. ప్రేమకు, సున్నితత్వమునకు, సాత్వీకమునకు మాదిరి యైనవారు క్షమించుటకు ఇష్టపడువారిని ప్రోత్సహించి క్షమించగలవారినిగా చేయగలరు.

ఇతరులను క్షమించలేనివారిని దేవుడు క్షమించడని ప్రభువు తెలియ జేసాడు. మనమాయన్ని విశ్వసిస్తున్నామా? లేక ఇతరులను ద్వేషిస్తూ ప్రార్థనలో ఆయన సన్నిధిని చేరుట కొనసాగిస్తున్నామా?

# 19
# ఒకనినొకడు సహించుట

మనతోటి వారితో ప్రవర్తించవలసిన విధానాన్ని లేఖనములు ఉపదేశించు చున్నవి. "కక్షచేతనైనను వృధాతిశయము చేతనైనను ఏమియు చేయక వినయమైన మనస్సు గలవారై యొకనినొకడు తనకంటే యోగ్యుడని యెంచుచు మీలో ప్రతివాడును తన సొంత కార్యములను మాత్రమే కాక యితరుల కార్యములను కూడా చూడవలయును" (ఫిలిప్పీ 2:3,4). మరియు "కాగా, దేవుని చేత ఏర్పరచబడిన వారును పరిశుద్ధులును ప్రియులునైన వారికి తగినట్లు మీరు జాలిగల మనస్సును, దయాళుత్వమును, వినయమును, సాత్వికమును, దీర్ఘశాంతమును ధరించుకొనుడి. ఎవడైనను తనకు హాని చేసెనని యొకడనుకొనిన యెడల ఒకనినొకడు సహించుచు ఒకనినొకడు క్షమించుడి, ప్రభువు మిమ్మును కటాక్షించినలాగున మీరును క్షమించుడి" (కొలస్సీ 3:12,13).

ఇతరుల యెడల తమ ప్రవర్తనలో క్రైస్తవులు ఓర్పును, జాలిని చూపించి మనమందరమును తప్పిదములు చేయుదుమని గ్రహించవలయును. "ఏ భేదము లేదు, అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు" (రోమా 3:23). మరియు దేవుడు మనలను క్షమించెనను జ్ఞానము, మనము ఇతరులను క్షమించుటకు మూలమగును. "మనుష్యుల అపరాధములను మీరు క్షమించిన యెడల, మీ పరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును. మీరు మనుష్యుల అపరాధము లను క్షమింపకపోయిన యెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు" (మత్తయి 5:14,15).

గర్వానికి, అసూయకు మన జీవితాలలో స్థానముండరాదు. సంఘంలో కూడా ఇతరులపై హానికరమైన ప్రచారం చేసి వారి పలుకుబడిని నాశనం చేయ ప్రయత్నించువారు కలరు. అట్లు ప్రవర్తించువారు తమ్మును తాము సంతోషం లేకుండా చేసుకొని ఇతరులను కూడా సంతోషం లేనివారుగా చేయుదురు. అట్టి ప్రవర్తన తగనిది. క్రైస్తవులు మంచి హృదయం గలవారై ఎల్లప్పుడు ఇతరులను తమకన్న గొప్పవారుగా ఎంచుకొనవలయును.

సహోదరులారా! ఇది చాలా ప్రాముఖ్యమైన విషయము. మన ఆత్మీయ జీవితము జాలి, సాత్వీకము, దయ, ఓపిక, క్షమాపణ, ప్రేమ, విధేయత గలదైయుండి, మన దేవునికి ఇష్టమైనదై యుండవలయును. "*ప్రేమ అనేక పాపములను కప్పును గనుక అన్నిటికంటె ముఖ్యముగా ఒకని యెడల ఒకడు మిక్కుటమైన ప్రేమ గలవారైయుండుడి*" (1 పేతురు 4:8).

## 20

# దేవుడు విశ్వాసులకు చేసిన వాగ్దానము

ఈనాటి ప్రపంచ స్థితిని గమనించిన యెడల మనము ఆత్మన్యూనతకు (Depression) లోనై మన ఆలోచనా విధానాన్ని ప్రతికూలము చేసుకొనుట సులభం. మనం ఎవరి తలుపు తట్టినను కష్టాల్లోను, విచారముగాను ఉన్నవారు కనిపించుచున్నారు. గత కాలమందు ఉన్న చిరునవ్వు ఎవ్వరిలోనూ కనిపించుట లేదు, నవ్వు వినిపించుటలేదు. ఈనాటి వేగవంతమైన జీవిత విధానానికి సరిపడునట్లు నిరంతరము హడావిడిగా జీవించుచున్నాము. మునుపటి వలె ఇతరులను దర్శించుటకు, సంభాషించుటకు సమయముండుట లేదు.

సొలోమోను పరిపాలించిన నాటి నుండి ఈనాటి వరకు అమెరికా దేశమువలె ఏదేశమును అభివృద్ధిచెందలేదు. అమెరికా దేశస్తులకు

ప్రపంచమంతటిలోను అతి గొప్ప జీవన విధానము కలదు. గాని ఈ గొప్ప జీవన విధానము నాస్తిక సమాజాన్ని పెంపొందింపజేసినది. వీరు తీరికలేని అసంతృప్తితో కూడిన ప్రజలై దేవునికి దూరమైపోయారు. డబ్బు శాంతి సంతోషాన్ని కొనగలుగుతుందని వీరి భావన.

ప్రజలందరికి దేవుడు కావలయునను అనుభవములోనికి మనము రావలయును. సువార్తను విని,దానికి విధేయులమైన మనము ఇతరులకు క్రీస్తును గూర్చి ప్రకటించుటకు అంకితము కావలయును. ఈ ప్రపంచమును గూర్చి న్యూనత జెందుటకు బదులు నిజముగా మన వెలుగు ప్రకాశించునట్లు మనము చేయగలిగినదంతా చేయుదము. ప్రతివారికి క్రీస్తు కావలయునను సందేశమును మనము అందరిముందుకు తీసుకొని వెళ్ళవలయును. ప్రజలు ఎంతో ఉద్రేకముగా వెదకు శాంతి, సంతోషములు ప్రభువునందు మాత్రమే దొరకును. దేవుని కుటుంబ సభ్యులుగా ఆయన స్వాస్థ్యమందు మనకు భాగముండునని మనము జ్ఞాపకముంచుకొనవలెను.

మనకున్న ఐశ్వర్యమును బట్టి అలయక, సమర్పించుకొన్న క్రైస్తవులుగా చురుకుదనము కలిగి, హృదయపూర్వకమైన బాధ్యత కలిగియుందుము.

## 21
## సువార్త ప్రకటించు లేక మరణించు

ప్రభువు సంఘమందలి అనేక సంఘములు సంఖ్యాపరంగా క్షీణిస్తున్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రములయందు గత ముప్పది సంవత్సరములుగా సంఘము ఎదుగుదల లేకుండా ఉన్నది. సువార్త సభలు ఒక్క ప్రత్యుత్తరము కూడా లేకుండా ముగియుచున్నవి. బాప్తిస్మము కుండీలు నెలలు, సంవత్సరాల తరబడి నిరుపయోగముగా ఖాళీగా ఉంటున్నవి.

సభ్యులను పెంచుయత్నములో కొన్ని సంఘములు క్రొత్త భవనముల లోనికి, పట్టణమందలి మంచిప్రదేశములోనికి మారుస్తూ, బైబిలు తరగతులు నిర్వహిస్తూ ఇతరులను ప్రోత్సహిస్తూ, కుటుంబములను బలపరస్తూ, ఇంకను అవసరమైన అనేక కార్యక్రమములు నిర్వహిస్తున్నారు. అయినను ఏలాంటి ఎదుగుదల కనిపించుటలేదు. కొన్ని ప్రాంతములలో ముఖ్యముగా పట్టణ ముల యందు కొందరు సభ్యులు ఒక సంఘమునుండి వేరొక సంఘమునకు మారుచుందురు. సభ్యులు సంఘము మారినప్పుడు సంఘమందు హాజరు పెరుగును. అట్టి పెరుగుదల 'వాపు' మాత్రమేగాని అది సంఘము పెరుగుదల కాదు. ఒక సంఘము పెరిగినప్పుడు వేరొక సంఘము క్షీణిస్తుంది.

వ్యక్తిగత సువార్తపై ఆశక్తిలేనందున లేక ఆశక్తి క్షీణించినందున అనేక సంఘములు తమ ఉనికిని పోగొట్టుకొనుచున్నవి. వారు విదేశములకు సువార్త ప్రకటించుటలో లీనమై ప్రాంతీయ సువార్త ప్రకటనపై ఆశక్తి చూపుట లేదు. సువార్త ప్రకటించుటయందు వెనుకబడినప్పుడు, మన స్వప్రదేశమందు నశించిన వారికి సువార్త ప్రకటించలేకపోయినప్పుడు మనము సంఖ్యా పరంగా ఎదుగుదలను ఆశించలేము.

దేవుడు సువార్త అను గొప్ప ధనాగారమును మంటిపాత్రలైన క్రైస్తవుల యందుంచినాడు, ఈ ఆధిక్యత మరెవరికి ఇయ్యబడలేదు. దేవుడు మన హస్తములయందుంచిన ఈ బాధ్యత యెడల మనమేలాగు ప్రవర్తించు చున్నాము? మనము ఇతరులకు బోధించుచున్నామా? నశించిన వారిపై కనికరము చూపుచున్నామా?

ఎదగని సంఘము నశించవలసియున్నది. మనలో ప్రతీవాడు ఈమేలు కొలుపును ఆలకించి ఈలాగు ప్రశ్నించుకొందము. నా హస్తములయందున్న యెడల, ఆ సంఘము అభివృద్ధి చెందనైయున్నదా, లేక అంతము కానున్నదా?

# 22
# ప్రేమ నిర్వచించబడినది

"ప్రేమ" అను పదమునకు మూడు గ్రీకు పదములు కలవు "ఈరోస్" అనగా శృంగార సంబంధమై ప్రేమ; "ఫీలియో" అనగా అనురాగము; "అగపే" అనునది క్రైస్తవ ప్రేమ. అపొస్తులుడైన పౌలు ఆత్మావేశమువలన వ్రాయుచు, పరిపూర్ణ ప్రేమయొక్క లక్షణములను 1కొరింథి 13వ అధ్యాయ మందు తెలియజేసాడు. ఈ అధ్యాయమును చదువునప్పుడు వెనువెంటనే "అగపే" ప్రేమను అద్భుతముగా వివరించుటను గమనించగలము. ఇది క్రైస్తవ ప్రేమ. క్రైస్తవునికి దేవునియెడల, ఆయన కుమారుడై క్రీస్తు ప్రభువు యెడలగల ప్రేమ; క్రైస్తవునికి సంఘముయెడల, ఒకరియెడల ఒకరికి గల ప్రేమ. క్రైస్తవప్రేమ దేవుని వాక్యజ్ఞానముతో నిండిన హృదయమునుండి వచ్చును.

దేవుని అద్భుతమైన ప్రేమ యోహాను 3:16నందు బయల్పరచబడినది. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవముపొందునట్లు ఆయనను అనుగ్రహించెను". ఆయన తన కుమారుడ్ని అనుగ్రహించుట మాత్రము గాక, విశ్వాసులైనవారికి ఒక శాశ్వతమైన గంబీరమైన నివాసమును సిద్ధపరచెను.

"క్రీస్తుప్రేమ నుండి మనలను ఎడబాపువాడెవడు? శ్రమయైనను బాధయైనను హింసయైనన కరవైనను ఖడ్గమైనను మనలను ఎడబాపునా? ఇందునుగూర్చి వ్రాయబడిన దేమనగా నిన్ను బట్టి దినమెల్ల మేము వధింపబడినవారము, వధకు సిద్ధమైన గొఱ్ఱెలమని మేము ఎంచబడిన

వారము. అయినను మనలను ప్రేమించినవాని ద్వారా మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాము. మరణమైనను జీవమైనను దేవదూతలైనను ప్రధానులైనను ఉన్నవియైనను రాబోవునవియైనను అధికారులైనను ఎత్తయినను లోతైనను సృష్టింబడినమరి ఏదైనను, మన ప్రభువైన క్రీస్తుయేసునందలి దేవుని ప్రేమనుండి మనలను ఎడబాపనేరవని రూఢిగా నమ్ముచున్నాను" (రోమా 8:35-39).

"మీ హృదయములను కలవరపడనియ్యకుడి, దేవునియందు విశ్వాస ముంచుచున్నారు నాయందును విశ్వాసముంచుడి. నాతండ్రి ఇంట అనేక నివాసములు కలవు; లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచినయెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్దనుండుటకు మిమ్మును తీసికొనిపోవుదును" (యోహాను 14:1-3).

దేవునియెడల మన ప్రేమ ఏలాగున్నది? "నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణ శక్తితోను నీదేవుడైన యెహోవాను ప్రేమింపవలెను" (ద్వితీ. 6:5). మన తోటివారి యెడల మన ప్రేమ ఏలాగున్నది? "నేను మిమ్మును ప్రేమించిన ప్రకారము, మీరొకరినొకడు ప్రేమించవలెననుటయే నా ఆజ్ఞ. తన స్నేహితులకొరకు తన ప్రాణము పెట్టువానికంటె ఎక్కువైన ప్రేమగలవాడెడును లేడు" (యోహాను 15:12-13). మనము దేవునికి ఇష్టులమైయున్నామని ఏలాగు తెలుసుకొనగలము? "నేను మీకాజ్ఞాపించు వాటిని చేసినయెడల మీరు నా స్నేహితులైయుందురు" (యోహాను 15:14).

మనలో ప్రతివాడు ఇతరులను చేరి వారికి సహాయము చేయవలెననెడి ప్రేమను పెంపొందిపజేసుకొనవలెనని నిర్ణయించుకొందము.

# 23
# పునరుత్థానము

"ఇట్లు కానియెడల మృతులకొరకై బాప్తిస్మము పొందువారేమి చేతురు? మృతులేమాత్రము లేపబడనియెడల మృతులకొరకు వారు బాప్తిస్మము పొందనేల"? (1కొరింథి 15:29). ఈ లేఖనభాగమందు చెప్పబడిన మృతుల పునరుత్థానము అను విషయాన్ని పరిశీలిద్దాం. మృతుల పునరుత్థానము లేనియెడల; మరణము, సమాధి, పునరుత్థానములకు సాదృశ్యముగా బాప్తిస్మము నొందుట అర్ధరహితమని పౌలు చెప్పుచున్నాడు. మృతులందరు పునరుత్థానమునొందు సమయము రానైయున్నదను విషయాన్ని పౌలు మరల మరల పునరుద్ఘాటించుచున్నాడు. క్రీస్తు, ఆయన పునరుత్థానము నందు దానిని ఋజువుచేసియున్నాడు. అనేకమంది సాక్షులు దానిని నిర్ధారించియున్నారు.

అయితే నీవు నీ సహోదరుని తీర్పు తీర్చనేల? నీ సహోదరుని నిరాకరింపనేల? మనమందరము దేవుని న్యాయపీఠము ఎదుట నిలుతుము. నాతోడు ప్రతిమోకాలును నాయెదుటవంగును, ప్రతివాని నాలుకయు దేవునిని స్తుతించును అని ప్రభువు చెప్పుచున్నాడు అని వ్రాయబడియున్నది. గనుక మనలో ప్రతివాడును తన్ను గురించి దేవునికి లెక్కయొప్పగింపవలెను. క్రైస్తవులుగా మనము తీవ్రమైన ఆత్మపరిశోధనచేసుకొని సరియైన దిద్దుబాట్లు చేసికొనవలసిన అవసరమున్నది. మన జీవితములలోని తప్పిదములను తెలుసుకొని నిజమైన మారుమనస్సుతో ప్రభువుకు విశ్వాసులముగా జీవించగలము.

ఈలోకములో అనేకులు పునరుత్థానము ఉండకూడదని కోరుకొందురు. పాపముతో బరువైన జీవితములను జీవించుచు వారి ఆత్మీయ జీవితములలో ప్రభువుతో సంబంధము కలిగియుండుటను గూర్చి ఆలోచించుచు,

నిత్యత్వముకొరకు ఏలాంటి సిద్ధపాటును చేసుకొనని వారి జీవితములు తీర్పుదినమందు ఎంతవిచారకముగా నుండును? పరలోకమందు ధనమును కూర్చుకొనుటయందు వారు నిష్ఫలులైనారు. వారి జీవిత ప్రయాసమంతయు వ్యర్థమగును, ఎన్నటికి మరణించని ఆత్మ నిరంతరము రోదనయు, పండ్లుకొరుకుటయు నుండు నరకమందు అపవాదితో జీవించుదురు.

ఈజ్ఞానము మనలో ప్రతివానిని క్రీస్తు సువార్తను అందరికి ప్రకటించునట్లు చేయనియెడల, మనజీవితములలో ఒక విచారకరమైన కొదువ యున్నదని గ్రహించవలయును (రోమా 1:16). ఆలశ్యము చేయక వారు దేవుని వాక్యమునకు విధేయత చూపవలెనని మనము ఆశక్తితో ప్రార్థించవలయును.

# 24
# మన హృదయములు

హృదయము సున్నితమైనది, జాలిగలది. అట్లే అది ధైర్యమునకు మరియెక్కువగా ప్రేమించుటకు సమర్థతగలది. కొన్ని సార్లు మనుష్యులు ఆవేశములేనివారుగా నటించుదురు. సత్యమేమనగా మనమందరము ఆవేశపూరితులము. మన హృదయములు పవిత్రమైనవై ఉద్దేశ్యములు సరియైనవైనప్పుడు మనము ఆనందమును, సంతోషమును హెచ్చుగా అనుభవించగలము.

ఆవేశము లేకుండా విజ్ఞానమందు సంపూర్ణులు కావలయునని ప్రయత్నించు వారు కలరు. వీరు అసంపూర్ణమైన వృధాయైన జీవితమును జీవించుదురు. వారు నిజాయితీగల అభిప్రాయములను అణచివేసి, ఇతరులతోను మరిముఖ్యముగా దేవునితోను తమకు సంబంధము లేకుండా

చేసుకొందురు. సామాన్యముగా అట్టివారు తమ అభిప్రాయములను గూర్చి భయపడుదురు.

"హృదయము" అను మాట మానవుని అవయవముగా బైబిలునందు అనేకసార్లు ఉదహరించబడినది. యోహాను 14:1నందు ప్రభువు హృదయ మును గూర్చి మాట్లాడారు. "మీ హృదయములను కలవరపడనియ్యకుడి, దేవునియందు విశ్వాసముంచుచున్నారు. నాయందును విశ్వాసముంచుడి"

మన రక్షణయందు హృదయానికి అట్టి గొప్ప పాత్రకలదు. దేవుడు మానవులను అంతగా ప్రేమించాడు (యోహాను 3:16). ఈ ప్రేమ మనకు సువార్తయను గొప్ప బహుమానమును సాధ్యపరచినది. మనము సువార్తను అందించినప్పుడు, నిజాయితీగల హృదయములు దానిని స్వీకరించి విశ్వాసము గల క్రైస్తవులు తయారగుదురు. సువార్తతో అట్టి ఆధిక్యతను సంపాదించుకొన్నవారు దేవునికి వినయముగల సేవకులుగా తయారగుదురు. మనము ఆత్మలను రక్షించుట అను దేవుని పనిలో నిమగ్నమైయండ వలయును. మనము చేయవలసినవి మనము చేసినపుడు దేవుడు అభివృద్ధిననుగ్రహించును.

## 25
## వ్యక్తిగత బాధ్యత

అపొస్తులుడైన పౌలు, విశ్వాసమందు తన కుమారుడైన తిమోతిని హెచ్చరిస్తూ ఈలాగు తెలియజేసాడు. "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువాని గాను నిన్నునీవే దేవునికి కనపపచుకొనుటకు జాగ్రత్తపడుము" (2తిమోతి 2:15). పౌలు దైవావేశమువలన ఈ విషయాలను వ్రాసాడని, దేవునికి

విధేయడగుటయందు అతడు (తిమోతి) వ్యక్తిగతముగా లెక్కఒప్పగింపవలెనని తిమోతి గ్రహించాడు. మనముకూడా దానిని అర్ధముచేసుకొనవలయును. ఈ పత్రిక పౌలు తిమోతికి కొన్ని వందల సంవత్సరముల పూర్వము వ్రాసినప్పటికి, ఈనాడు కూడా అది మనకు అన్వయింపబడి మనలో ప్రతివాడు లెక్కఒప్పగింపవలసినవారమని గ్రహించవలయును.

దేవునికి విధేయులమైన పిల్లలుగా మనము మన బాధ్యతల నెరిగిన వారముగా నుండవలయును. మనము నిత్యత్వము నెచ్చట గడపగోరు చున్నామనునది నిజాయితీగా ఆలోచించుట అవసరము. ఎంపిక మనదేనని అర్ధముచేసుకొనవలయును. దేవునిని సేవించుచు, ఆయన కొరకు జీవించుచు, ఆయన ఆజ్ఞలను గైకొనుటకు ప్రయాసపడుచు ఇరుకు మార్గమును ఎన్నుగొనగలము; లేక సులభమైన వాటిని, ఏలాంటి సమర్పణ అవసరము లేని తేలికైన విశాల మార్గమును ఎన్నుగొనగలము. ఇరుకు మార్గమున పయనించుటకు కొంత మూల్యము చెల్లించవలెను. మన గర్వమును అహంభావమును, స్వార్ధమును, మరియు దేవుని నిజసేవకుల ముగా మనలను మనము తగ్గించుకొనుటకు అవరోధమైన దేనినైనను విడిచిపెట్టుటకు సిద్ధముగా నుండవలయును. విశాలమార్గమున నాశనము నకు పయనించుటకు ఈ జీవితమందు ఏలాంటి త్యాగము చేయనవసరము లేదు. గాని తరువాత జీవితము (నిత్యత్వము) నందు సమస్తమును పోగొట్టుకొనవలెను. నిత్యము, మనము సౌందర్యమైన, అద్భుతమైన పరలోక మందు శాశ్వతముగ జీవించుటకు గాని లేక అపవాదితో నరకమందు జీవించుటకుగాని మనము జీవించు జీవితమును బట్టి ఎంచుకొనగలము. అంతిమ నిర్ణయము, బాధ్యత మనపైనేయున్నది. మనము పరలోకమును పోగొట్టుకొన్నయెడల ఎవరిని తప్పుపట్టలేము.

# 26
# ప్రేమ

1కొరింథి 13:1-3 నందు ప్రేమయొక్క అవసరమును గూర్చి మాట్లాడెను. దేవుడు ప్రేమయైయున్నాడు. దేవునితో మనకుగల సంబంధమును సాధ్యపరచునదియే ప్రేమ. అదిలేకుండా ఆయనను మనజీవితములలో కలిగియుండలేము. "నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణ శక్తితోను నీదేవుడైన యెహోవాను ప్రేమింపవలెను" (ద్వితి.కా 6:5). యేసు ఈలోకములోనికి వచ్చి మనకొరకు మరణించుటకు ప్రేమయే కారణము (యోహాను 3:16). ప్రేమ లేకుండా మనకు రక్షణ, నిరీక్షణలేదు. ప్రేమలేని ఈప్రపంచము చీకటిగాను, శూన్యముగాను, శీతలముగాను ఉండును.

శారీరిక సంబంధములో కూడా ప్రేమయే మన జీవితములను కొనసాగించును. భార్యభర్తల సంబంధము ప్రేమపైనే ఆధారపడియుండును. పసిపిల్లల జీవనమునకు తల్లిదండ్రుల ప్రేమ కావలయును. దేవుని పిల్లలుగా మనము పవిత్రహృదయములతో ఒకని యెడల ఒకరము ప్రేమకలిగి యుండవలయును. (1పేతురు 1:22)

ప్రేమయొక్క లక్షణములు 1కొరింథి 13:4-7 నందు వివరించబడినవి. "ప్రేమ దీర్ఘకాలము సహించును, దయచూపించును. ప్రేమ మత్సరపడదు; ప్రేమ డంబముగా ప్రవర్తింపదు; అది ఉప్పొంగదు; అమర్యాదగా నడువదు, స్వప్రయోజనమును విచారించుకొనదు త్వరగా కోపపడదు; అపకారమును మనస్సులో ఉంచుకొనదు. దుర్నీతివిషయమై సంతోషపడక సత్యమునందు సంతోషించును"

1కొరింథి 13:8-13నందు ప్రేమయొక్క స్థిరత్వమును గూర్చి తెలియ జేయబడినది. "ప్రేమశాశ్వతకాలముండును. ప్రవచనములైనను నిరర్థకము

లగును; భాషలైనను నిలిచిపోవును, జ్ఞానమైనను నిరర్థకమగును, మనము కొంతమట్టుకు ఎదుగుదుము, కొంతమట్టుకు ప్రవచించుచున్నాముగాని పూర్ణమైనది వచ్చినప్పుడు పూర్ణము కానిది నిరర్థకమగును. నేను పిల్లవాడనైనప్పుడు పిల్లవానివలె తలంచితిని, పిల్లవానివలె యోచించితిని. ఇప్పుడు పెద్దవాడనై పిల్లవాని చేష్టలు మానివేసితిని. ఇప్పుడు అద్దములో చూచినట్టు సూచనగా చూచుచున్నాము, అప్పుడు ముఖాముఖిగా చూతుము. ఇప్పుడు కొంతమట్టుకే యెరిగియున్నాను. అప్పుడు నేను పూర్తిగా ఎరుగబడిన ప్రకారము పూర్తిగా ఎరుగుదును. కాగా విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ యీమూడును నిలుచును, వీటిలో శ్రేష్టమైనది ప్రేమయే”

## 27

# వెలుపల సువార్త ప్రకటన

గత ఆదివారము సాయంత్రము భారతదేశమందలి ఒక మంచి బోధకుడు, సహోదరుడు సన్నీడేవిడ్, మాతో మాట్లాడినప్పుడు ఎంతో సంతోషించాము. ఆయన భార్య జాస్మిన్‌తో కలసి జె.సి. మరియు బెట్టి చోట్ గార్లతో అనే, సంఘములను దర్శించి భారతదేశమందలి పరిచర్యను గూర్చి తెలియజేసిరి. భారతదేశమందలి ప్రజలు సువార్తకు లోబడువారనియు, ఆదేశమందలి సంఘములు బహుగా ఎదుగుచున్నవని వినుట ఎంతో ప్రోత్సాహకరము.

మనమందరము మన పరిసరములలో నశించిపోవుచున్నవారిని గూర్చి జాగరూకులమై యుండవలయును. ఎందుకనగా నశించినవారిని క్రీస్తు నొద్దకు తీసుకొనివచ్చుట సంఘముయొక్క కర్తవ్యము. ఈపనిని మనము మిక్కిలి శ్రద్ధతో చేయవలెను. విధేయులైనవారిని ప్రభువు సంఘమునకు

చేర్చినపుడు సంఘముయొక్క నిజమైన ఎదుగుదల సంభవించును (అపో.కా 2:47). దేవుని చిత్తమును ఇతరులకు ఉపదేశించు బాధ్యత, భాగ్యము మంటి ఘటములమైన మనకు ఇయ్యబడియున్నది.

ఆత్మలను రక్షించుటయందు సఫలతను కలిగియుండుటకు ముందు మనము మన స్వంత రక్షణను గూర్చి నిర్ధారణ కలిగియుండవలయును. మన సందేహమందున్న యెడల ఇతరులను ఎట్లు ఒప్పించగలము? మరియు మనము సమర్పణగలిగి, త్యాగపూరితమైన క్రైస్తవులుగా నశించిన వారిని రక్షించుటయందుగల ఆనందమును అనుభవించవలయును.

ప్రార్థన వ్యక్తిగత సువార్తకు మరొక ప్రధాన అంశము. ఈ గొప్ప పనియందు విజేయులైనవారు నిరంతరము దేవునితో ప్రార్థనయందు కొనసాగుదురు. ప్రార్థనద్వారా మనము ఇతరులకు సువార్త ప్రకటించు ధైర్యమును, కలిగియుందుము.

# 28

# పరలోకమందు ధనమును కూర్చుకొనుట

మానవుడు ఇహలోక సంబంధమైన కోరికలను అధికమించుట కష్టతర మైన విషయము – స్వాభావికముగా మానవుడు నిరంతరము సంతోషమును వెదకుచు, సంతాపము ఇహలోక సంబంధమైన వస్తువులయందు లభ్యమగు నని విశ్వసించును. అతడు చూచిన ప్రతిచోటా లోకమునందు ఈవిషయము నిర్ధారణగుచుండును. గాని సత్యము అందుకు భిన్నముగా నుండును ఒకడు తన్నుతాను క్రీస్తుకు సమర్పించుకొన్నప్పుడు అట్టి లోతైన సంతోషము నిలకడయైన శాంతి లభించును.

క్రైస్తవుడు క్రీస్తునందు పరిపక్వతనొందుచున్నప్పుడు ఇహలోక సంబంధ

మైన వస్తువులపై ధ్యాస తగ్గుచుండును. ఫిలిప్పి 7:8 నందు అపొస్తులుడైన పౌలు ఈలాగు వ్రాసెను. "అయినను ఏవేవి నాకు లాభకరములైయుండెనో వాటిని క్రీస్తునిమిత్తము నష్టముగా ఎంచుకొంటిని. నిశ్చయముగా నాప్రభువైన యేసు క్రీస్తును గూర్చిన అతి శ్రేష్టమైన జ్ఞానము నిమిత్తమై సమస్తమును నష్టముగా ఎంచుకొనుచున్నాను".

స్వభావికమైన వస్తువులయందు నమ్మిక, పగ, దురాశ, ద్వేషములకు నడిపించును. తుప్పుపట్టి పాడైపోవు ఆస్థికొరకు చేయు ప్రయత్నములతో నేరములు జరిగి జీవితములు నాశనమైపోవుచున్నవి. మనము పరలోక మందు దాచుకొన్న ధనము మాత్రము శాశ్వతముండును. మనము అట్టి ఆత్మీయ సంపదను పొందినప్పుడు పరలోకం మన గృహమగును.

## 29
## ఆత్మీయవిధానములో విభేదములను పరిష్కరించుకొనుట

ఒక సహోదరుడు మనకు అపకారం చేసినప్పుడు లేక ఒక సహోదరునికి మనపై విరోధభావమున్న యెడల, దాని పరిష్కారము ప్రభువు మాటలలో తేటగా నున్నది. "కావున నీవు బలిపీఠమునొద్ద అర్పణము నర్పించుచుండగా నీమీద నీ సహోదరునికి విరోధమేమైనను కలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చిన యెడల అక్కడ బలిపీఠము ఎదుటనే నీయర్పణము విడిచిపెట్టి, మొదటవెళ్ళి నీ సహోదరునితో సమాధానపడుము, అటుతరువాత వచ్చి నీయర్పణము నర్పింపుము" (మత్తయి 5:23,24).

యేసుప్రభువిచ్చిన సూచనలు పాఠించినయెడల బాధ, హృదయవేదనల నుండి విముక్తి పొందగలము! బైబిలు విధానములో జీవించుట కష్టముగా

కనిపించును! గాని ఈవిధానమందు మాత్రమే సమాధానము నెలకొనును.

"మరియు నీ సహోదరుడు నీయెడల తప్పిదము చేసినయెడల నీవు పోయి, నీవును అతడును ఒంటరిగా నున్నప్పుడు అతనిని గద్దించుము; అతడు నీమాట వినిన యెడల నీ సహోదరుని సంపాదించుకొంటివి. అతడు విననియెడల ఇద్దరు ముగ్గురు సాక్షులనోట ప్రతిమాట స్థిరపరచ బడునట్లు నీవు ఒకరిద్దరిని వెంటబెట్టుకొని అతనియొద్దకు పొమ్ము. అతడు వారి మాటయు విననియెడల ఆ సంగతి సంఘమునకు తెలియజెప్పుము. అతడు సంఘపు మాటయు విననియెడల అతనిని నీకు అన్యునిగాను సుంకరిగాను ఎంచుకొనుము" (మత్తయి 18:15–17).

సహోదరులమధ్య తగాదములు పరిష్కరించుకొనుటను గూర్చి ప్రభువు వాక్యమందు తేటగా వివరించబడినది. ఎట్లయినను ఒకరితో ఒకరము మనమధ్యగల బేధాభిప్రాయములను గూర్చి మాట్లాడుకొనుట సమస్యగా కనబడును. ముఖాముఖిగా ఒకరితో ఒకరము దయ, ప్రేమ, కనికరములు గలవారముగా మాటాడుకొనుట కష్టమని భావించుదుము. తరచు మనము విరోధముగానున్న వారితో తప్ప విషయమును అందరితోను ముచ్చటించు దుము. సహోదరులారా, ఈ విషయాన్ని మనము తీవ్రముగా పరిగణించ వలయును. అనేక సంఘములలో చల్లదనమునకు కారణము మన విరోధ భావములను దేవుని వాక్యప్రకారము పరిష్కరించుకొన లేకపోవుటయే. విభేదములు బైబిలు విధానములో పరిష్కరించుకొనినయెడల అనేక విభాగములు లేకుండా చేసుకొనవచ్చును.

దేవుని విధానమందు క్రియలు చేయుట ద్వారా మాత్రమే మనము క్రైస్తవులుగా ఎదిగి పరిపక్వతనొందగలము.

# 30
# క్రీస్తునందు గల సంతోషము

అపోస్తులుడైన పౌలు క్రీస్తు సేవ కొరకు బహుగా శ్రమపడినప్పటికి ఆయన జీవితములో ఆనందమును తీసుకొనివచ్చిన అనేక ఆశీర్వాదములను గూర్చి వ్రాసి క్రైస్తవ జీవితమందలి గొప్ప సంతోషమును గ్రహించెను. పౌలు జీవితములోనికి సంతోషమును తెచ్చిన కొన్ని విషయములను దృష్టించి, వాటిని తెలుసుకొని అభినందించుట ద్వారా మన జీవితములు ఎట్లు ఆశీర్వదించబడగలవో గ్రహించెదము.

**ప్రార్థన యందలి సంతోషము**: "... *గనుక మీ అందరి నిమిత్తము నేను* చేయు ప్రతి ప్రార్ధనలో ఎల్లప్పుడును సంతోషముతో ప్రార్ధన చేయుచు నేను మిమ్మును జ్ఞాపకము చేసుకొనినప్పుడెల్లను నా దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాను" (ఫిలిప్పీ 1:6). క్రైస్తవులుగా మనము దేవునితో మాట్లాడగలమనియు ఆయన మన ప్రార్ధనలు వినుననియు తెలిసికొనుట ఎంత ఆశీర్వాదకరము!

**సువార్త ప్రకటించుటయందలి సంతోషము**: "సువార్తను *గూర్చి* నేను సిగ్గుపడువాడనుకాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికిని గ్రీసుదేశస్తునికి కూడా రక్షణకలుగజేయుటకు అది దేవుని శక్తియైయున్నది" (రోమా 1:16). సువార్త శక్తి ప్రకటించబడినప్పుడు మనము కూడా పౌలువలె సంతోషించవలయును.

**విశ్వాసమునందలి సంతోషము**: "మరియు ఇట్టి నమ్మకము కలిగి, నేను మరల మీతో కలిసియుండుటచేత నన్ను గూర్చి క్రీస్తుయేసునందు మీకున్న అతిశయము అధికమగునట్లు మీరు విశ్వాసమునందు అభివృద్ధియు

ఆనందమును పొందునిమిత్తము, నేను జీవించి మీ అందరితో కూడా కలిసి యుందునని నాకు తెలియును" (ఫిలిప్పి 1:25). విశ్వాసులకు దేవుడిచ్చిన రక్షణ వాగ్దానమును బట్టి ప్రభువునందు మనకు గల సంతోషము ఎంతగొప్పది!

**శ్రమపడుట యందలి సంతోషము :** "మరియు మీ విశ్వాస యాగము లోను దాని సంబంధమైన సేవలోను నేను పానార్పణముగా పోయబడినను, నేనాందించి మీయందరితో కూడా సంతోషింతును. ఇటువలెనే మీరును ఆనందించి నాతో కూడా సంతోషించుడి" (ఫిలిప్పి 2:17-18). క్రీస్తు సేవకొరకు శ్రమపడుట సంతోషము, గౌరవమని పౌలు భావించినట్లు మనము కూడా మన విశ్వాసమందు, సమర్పణయందు బలమైన వారమై క్రీస్తుకొరకు శ్రమపడుటకు ఇష్టపడుదము".

**సహవాసమునందలి సంతోషము :** "మీరు ఏకమనస్కులమగునట్లుగా ఏక ప్రేమ కలిగి, యేకభావముగలవారుగా ఉండి, ఒక్కదానియందే మనస్సుంచుచు నా సంతోషమును సంపూర్ణము చేయుడి" (ఫిలిప్పి 2:2) పరలోకమందు నిత్యత్వమును అనుభవించుటకు నిర్దేశించబడిన మనము భూమిపై కాలము గడుపుటకు ఎంత సంతోషించవలయును!

క్రైస్తవ జీవితము జీవించుటయందు గొప్ప సంతోషము గలదు! యేసుక్రీస్తునందు మనవైన ఆత్మీయ ఆశీర్వాదములన్నిటివైపు, అలాగుననే ప్రతిదినము మనము అనుభవించు ఇహలోక సంబంధమైన ఆశీర్వాదముల వైపు దృష్టిమళ్ళించి జీవించుట ఎంతో సంతోషము!

# 31
# నీవు నిత్యత్వమును ఎచ్చట గడపగోరుదువు?

ఈ ప్రశ్నకు మనలో ప్రతీవాడు సమాధానము చెప్పవలయును. ఎందు వలననగా ప్రతివానికి వాని సొంత నిర్ణయం తీసుకొను అధికారం కలదు. జ్ఞానియైనవాడు పరలోకాన్ని ఎన్నుకొని దాని కొరకు ప్రయాస పడతాడు.

ఆయన మరణానికి కొంచెము ముందుగా ఈ ప్రోత్సాహక వాక్యాలు యేసు ప్రభువు ఆయన శిష్యులతో మాట్లాడాడు. "మీ హృదయములను కలవరపడనియ్యకుడి; దేవునియందు విశ్వాసముంచుచున్నారు నాయందును విశ్వాసముంచుడి. నా తండ్రి యింట అనేక నివాసములు కలవు, లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను" (యోహాను 14:1,2). మరియు ప్రియుడైన యోహాను ఈలాగు వ్రాసాడు. "ఆయన వారి కన్నుల ప్రతి బాష్ప బిందువును తుడిచివేయును, మరణము ఇక ఉండదు, దుఃఖమైనను ఏడ్పైనను వేదనయైనను ఇక ఉండదు, మొదటి సంగతులు గతించిపోయెనని సింహాసనములోనుండి వచ్చిన గొప్ప స్వరము చెప్పుట వింటిని" (ప్రకటన 21:4). ఆత్మ శాశ్వతము జీవించు ఆశ్చర్యకగ మైన ప్రదేశం పరలోకము:

మన కొరకైన దేవుని ప్రేమ చాలా గొప్పది. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16). మన పాపములు క్షమింపబడుటను దేవుడు సాధ్యపరచెను. ఆయన మనకు సువార్తనిచ్చాడు. పౌలు ఈలాగు

వ్రాసెను. "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికి, గ్రీసుదేశస్థునికి కూడా రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియైయున్నది".

సువార్త రక్షణ పథకమునకు విధేయులగుట పాపక్షమాపణనొందుటకు అత్యంత ఆవశ్యకమైయున్నది. 1కొరింథీ 15 నందు సువార్తయనగా క్రీస్తు ప్రభుని మరణము, సమాధి, పునరుత్థానములని చెప్పబడినది. క్రీస్తు ప్రభుని మరణ సమాధి పునరుత్థానములలో ఐక్యమగుట ద్వారా మనము సువార్తకు విధేయులమగుదుము. ఆయనయందు విశ్వసించుట (మార్కు 16:16), మన పాపముల విషయమై మారుమనస్సు పొందుట (అపో.కా. 17:30), మనుష్యుల ముందు ఆయననొప్పుకొనుట (రోమా 10:10), పాపక్షమాపణ నిమిత్తము బాప్తీస్మమునొందుట (అపో.కా. 2:38); మరణ పర్యంతము నమ్మకముగా జీవించుట (ప్రకటన 2:10) అనునవి మన విధేయత యందలి ముఖ్యాంశములు. ఈ పథకమునకు విధేయులమగుట ద్వారా మాత్రమే మనము పాపక్షమాపణనొంది ప్రభువు సంఘమునకు చేర్చబడుదుము (అపో.కా. 2:47). సువార్తకు విధేయులు కాలేనివారు తమ నిత్యత్వమును నరకమునందు అనుభవించుటకు ఎన్నుకొనుచున్నారు. ఇది ఎంత భయంకరమైన నిర్ణయము! లోకములో అనేకులు అట్టి భయంకరమైన నిర్ణయమును తీసుకొందురని యేసు ప్రభువుకు తెలియును. అందువలననే ఆయన తన శిష్యులతో కొండమీది ప్రసంగమందు ఈలాగు చెప్పారు.

"ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునైయున్నది, దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునై యున్నది. దానికనుగొనువారు కొందరే" (మత్తయి 7:13–14).

# 32
# సంకటములలోనున్న ప్రపంచమునకు నిరీక్షణ

మన వృద్ధులు : నిజాయితీగల, నిష్కపటమైన, బాధ్యతగల, కష్టపడి పని చేయు కాలమునందు పెరిగిరి. యవ్వనులైనను, వృద్ధులైనను సమానముగా మంచి నైతిక ప్రవర్తనను చూపి, ఇతరులకు మాదిరికరముగా జీవించవలెను. ఇంటి పేరు ప్రాముఖ్యమైనది. కుటుంబ సభ్యులందరు తమ ఇంటి పేరుకు చెడ్డపేరు రాకుండా ప్రయత్నించుదురు. గవర్నమెంటు ఆఫీసులలో పనిచేయువారు నిరంతరము పవిత్రమైన జీవితములు జీవించలేక పోవచ్చును. మన రాజకీయనాయకులను గూర్చి ఈనాడు మనము వినుచున్నంత భయంకరమైన విషయాలు మున్నెన్నడు వినియుండక పోవచ్చును. అత్యున్నత పదవులలోనికి ఎన్నుకొనబడిన వారిలో కొందరు వ్యభిచారమందు, స్వలింగ సంపర్కమందు, అట్టి అనైతిక కార్యములయందు కొనసాగుదురనియు వారిలో అనేకులు గర్భస్రావమును ప్రోత్సహించుదురని ఎవరూహించగలరు? మనము సిగ్గులేని ప్రజలుగా తయారగుట ఎంత విచారకరము?

క్రైస్తవులు లోకమునకు వెలుగైయున్నారు (మత్తయి 5:14-16). క్రీస్తును లోకమునకు ప్రకటించవలసిన బాధ్యత మనపైనున్నది. (మత్తయి 28:19,20; మార్కు 16:15,16) ఏలయనగా సువార్త రక్షించుటకు దేవుని శక్తియై యున్నది. (రోమా 1:16). సంకటములలోనున్న ప్రపంచమునకు శాంతిని కాంక్షించు ప్రపంచమునకు క్రైస్తవ్యము ఒక్కటే నిరీక్షణయై యున్నది.

సంఘమునందు సువార్తకు విధేయులై, లోకమునుండి బయటకు

పిలువబడిన వారుందురు. మనమొక ప్రత్యేకించబడిన జనాంగము. ఎందు కనగా మనము నిరీక్షణను, సంతోషమును, మనశ్శాంతిని కలిగియుండి దేవుని చిత్తప్రకారము జీవించువారమైయున్నాము.

మనలో ప్రతివాడు ప్రతిదినము దేవుని కొరకు జీవించునట్లు ఆయన మనకు సహాయపడి, మనమీలోక జీవితమును ముగించిన తరువాత ఆయన మనలను శాశ్వతము ఆయనతో ఉండునట్లు పరలోక గృహమునకు తీసుకొని వెళ్ళునుగాక.

## 33

# తల్లిదండ్రుల గంభీరమైన బాధ్యత

పిల్లలు దేవుడిచ్చిన బహుమానము, గాని వారు వస్తూ మనకొరకొక గంభీరమైన బాధ్యతను తీసుకొని వస్తారు. పరలోకమందున్న మన దేవుడు గర్భఫలంతో మనలను ఆశీర్వదించి మనలను మనమే కాపాడుకొన వలెనని విడిచిపెట్టలేదు. బైబిలు అను సూచికను అనుగ్రహించి, అందు తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమశిక్షణలో నుంచవలయుననియు (సామెతలు 19:18; 22:6) వారిని ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను పెంచవలయునని తెలియజేసాడు (ఎఫెసీ 6:4).

మనం అనేక కారణాల వలన విడాకుల్ని సమర్థించే సమాజంలో జీవిస్తున్నాము. వివాహము, కుటుంబములను గూర్చిన సరళమైన యోచన వలన (పదిహేను మిలియన్ల) కోటి యాభై లక్షల మంది పిల్లలు ఆమెరికా దేశంలో తల్లి లేక తండ్రి మాత్రమే గల కుటుంబములలో జీవించుచున్నారు. అట్టి వాతావరణంలోని పిల్లలు పాఠశాలలను విడిచి, చట్ట సంబంధమైన సమస్యలలో చిక్కుకొని, 19 సంవత్సరముల వయస్సుకు ముందే గర్భవతు

లగుచు, ఇద్దరు తల్లిదండ్రులు గల కుటుంబములందలి పిల్లలకు భిన్నంగా శ్రమపడుతున్నారు.

క్రైస్తవులు ఉత్తమమైన జ్ఞానము కలిగియుండవలయును. మనము దేవుని వాక్యమునకు విద్యార్థులమై, మన జీవితాలలో దేవుని చిత్తమేమైయున్నదను విషయమును తెలిసికొనవలయును. మనము మంచి బైబిలు జ్ఞానమును, తోటి క్రైస్తవులతో స్నేహమును లేకున్న యెడల దేవునికన్న సాతాను పలుకుబడిలోనే పడిపోవు ప్రమాదమున్నది. "శరీరకార్యములు స్పష్టమై యున్నవి; అవేవనగా జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహములు, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు మొదలైనవి. వీటిని గూర్చి నేను మునుపు చెప్పిన ప్రకారము ఇట్టివాటిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించు కొనరని మీతో స్పష్టముగా చెప్పుచున్నాను" (గలతీ 5:19-21). వీటిలో అనేక పాపముల ఫలితము ఒక జీవిత కాలమంత ఉండి, వాటిని గూర్చి మారుమనస్సు పొందక పోయిన యెడల వారి ఆత్మ నిత్యనరకమునకు పోవును.

సంఘము పవిత్రత, నిజాయితి గలిగియుండి ప్రభువు యెడల, తోటి సహోదరులయెడల, ఆలాగుననే మనుష్యులందరి ఆత్మల యెడల ప్రేమతో నిండియున్న ప్రజలను కలిగియుండును. మనమెల్లప్పుడు ప్రభువునందు బలవంతులమైయుండునట్లు పాపాన్ని ఖండిస్తూ, ఇహలోక పాపములయందు పాలులేనివారముగా ఉండుటకు నిరంతరము పోరాడవలయును. మన పిల్లలు వారి తల్లిదండ్రులలో క్రీస్తువంటి స్వభావమును చూస్తూ ఎదిగిన యెడల, వారి జీవితములలో అట్టి ప్రేమను అనుకరించుదురు. ఆ చక్రము అట్లే కొనసాగును.

# 34
# పెద్దలు

పెద్దల కొరకు అర్హతలు 1తిమోతి 3:17 మరియు తీతు 1:5-9 నందు ఇయ్యబడినవి. అట్టి పనికి నియమింపబడబోవువాడు ఆ పనిని ఆశించవలెను. అతడు సత్ప్రవర్తన గలవాడుగా నుండి, ఒకే స్త్రీకి భర్తయై, మితానుభవుడై, స్వస్థ బుద్ధిగలవాడును, మర్యాదస్థుడును, అతిథిప్రియుడును, బోధింపదగినవాడునైయుండి, మద్యపానియు కొట్టు వాడును కాక సాత్వికుడును, జగడమాడనివాడును, ధనాపేక్షలేని వాడునునై, సంపూర్ణ మాన్యత కలిగి తన పిల్లలను స్వాధీనపరచుకొనుచు తన యింటివారిని బాగుగా ఏలువాడునై యుండవలెను. అతడు క్రొత్తగా చేరినవాడైయుండకూడదు. సంఘమునకు వెలుపటివారిచేత మంచి సాక్ష్యము పొందినవాడై యుండవలెను. పెద్దలను నియమించు సంఘములు ఈ అర్హతలు గల పురుషులను వెదకవలెను.

పెద్దలు (అధ్యక్షులు) దేవుని పిల్లలు గల ప్రాంతీయ సంఘములను కాయుటకు బాధ్యత అప్పగింపబడిన కాపరులు. పెద్దలు, అనగా పాస్టర్లు మరియు పై విచారణ కర్తలైయుండి వారు నియమింపబడిన సంఘమందలి ప్రతి పరిచారకుని, బోధకుని, సంఘ సభ్యుని యొక్క ఆత్మలను కాపాడువారై యుండవలయును. "మీ పైని నాయకులుగా ఉన్నవారు లెక్క ఒప్పుచెప్ప వలసినవారివలె మీ ఆత్మలను కాయుచున్నారు. వారు దుఃఖముతో ఆ పని చేసిన యెడల మీకు నిష్ప్రయోజనము గనుక దుఃఖముతో కాక, ఆనందముతో చేయునట్లు వారి మాట విని, వారికి లోబడియుండుడి" (హెబ్రీ 13:17).

సంఘములలో ఒకని కన్న ఎక్కువ మంది పెద్దలుండవలెను. "తోటి పెద్దలు, క్రీస్తు శ్రమలను గూర్చిన సాక్షిని, బయలుపరచబడబోవు మహిమలో

పాలివాడనునైన నేను మీలోని పెద్దలను హెచ్చరించుచున్నాను. బలిమి చేత కాక దేవుని చిత్తప్రకారము ఇష్టపూర్వకముగాను, దుర్లాభాపేక్షతోను కాక సిద్ధమనస్సుతోను, మీ మధ్యనున్న దేవుని మందను పై విచారణచేయుచు దానిని కాయుడి. మీకు అప్పగింపబడినవారిపైన ప్రభువులైనట్టుండక మందకు మాదిరిగానుండుడి, ప్రధాన కాపరి ప్రత్యక్షమైనప్పుడు మీరు వాడబారని మహిమ కిరీటము పొందుదురు" (1పేతురు 5:1-4).

పెద్దలు సంఘమును పోషించవలసిన బాధ్యతగలిగియున్నారు. "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులుగా ఉంచెనో ఆ *యావత్తు మందను గూర్చియు*, మీ మట్టుకు మిమ్మును *గూర్చియు జాగ్రత్తగా ఉండుడి*" (అపో.కా. 20:28).

పెద్దలు వారి బాధ్యత సక్రమముగా నిర్వర్తించుటకు బోధకులైనవారు, ఉపదేశకులైనవారు, పరిచారకులు తమ ప్రత్యేకమైన సేవలను నిర్వర్తించుట ద్వారా ప్రాంతీయ సంఘ పనియందు సహాయపడుదురు.

మనలో ప్రతివాడు మన పెద్దల భారమును తగ్గించి వారి ప్రయాసమును సంతోషభరితము చేయవలెను. మనము సత్యమందు ప్రతిష్ఠింపబడునట్లును, ఎల్లప్పుడు తమ ఇష్టమును కాక తండ్రిచిత్తమునే నెరవేర్చు ధ్యాసగలవారమై యుండునట్లు దేవుని వాక్యాన్ని అధ్యయనం చేయుదము.

# 35

# ఉత్తమమైన దానిని ఎంచుకొనుట

మానవునియందు దేవుడు ఎంపికచేసుకొనే సామర్థ్యాన్ని ఉంచాడు. ఆదియందు దేవుడు ఆదాము అవ్వలను సృష్టించి వారిని ఏదేను వనంలో ఉంచిన నాటినుండి వారికి కావలసినది ఎంచుకొను స్వాతంత్ర్యాన్నిచ్చాడు.

వారు ఏదేను వనములోని చెట్ల ఫలములన్నిటిని స్వేచ్ఛగా తినవచ్చునని చెప్పాడు. వారు మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములను తినకూడదు. "... నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవని నరుని కాజ్ఞాపించెను" (ఆది 2:17). అవ్వ దేవుడు నిషేధించిన దానిని ఎంచుకున్నది. ఆమె దేవుడు నిషేదించిన వృక్షఫలమును తిని, దానిని ఆమె భర్తయైన ఆదామున కిచ్చినపుడు అతడు కూడా తిన్నాడు. అవిధేయతను బట్టి వారు ఆ వనము నుండి వెళ్ళగొట్టబడినపుడు మానవాళి మరణంతో శపించబడ్డారు.

వేరొక చెడు ఎంపికను నాదాబు, అబీహులు చేసారు. వారు దేవుడు ఆజ్ఞాపించిన అగ్నికి బదులు వేరైన అగ్నిని దేవునికి దహనబలి అర్పించుటకు తీసుకొనిరాగా ఆకాశమునుండి దిగివచ్చిన అగ్నితో కాల్చబడిరి.

అననియ సప్పీరాలు, వారి ఆస్థిని అమ్మిన ధనమును అపోస్తలుల యొద్దకు తీసుకొని వచ్చినపుడు వారు ఆ ధనములో భాగమును మాత్రమే తీసుకొని వచ్చి, అంతయు తీసుకొని వచ్చినట్లు నటించుట వలన అపోస్తలులను, ప్రభువును మోసగించుటకు ప్రయత్నించిరి (అపో.కా. 5). వారు అపోస్తలుల పాదముల వద్ద చచ్చిపడిరి.

అపోస్తలుల కార్యముల గ్రంథమందు సరియైన ఎంపిక చేసుకొన్న వారి ఉదాహరణలు అనేకములు కలవు. ఫిలిప్పు ఐతియోపీయుడైన నపుంసకునికి సువార్త ప్రకటించినపుడు నపుంసకుడు క్రీస్తు ప్రభువుకు విధేయుడై సంతోషించుచు తన మార్గాన వెళ్ళాడు (8వ అధ్యాయము) అసంఖ్యాకులైన క్రైస్తవులను హింసించిన తార్సువాడైన సౌలు, రక్షించబడుటకు చేయవలసినదేమో తెలియజేయబడిన వెంటనే విధేయత చూపాడు (9వ అధ్యాయము) పేతురు కొర్నేలికి బోధించినపుడు అతడును అతని ఇంటి వారును దేవుని వాక్యమునకు విధేయులైరి (10వ అధ్యాయము). ఫిలిప్పీలోని

చెరసాల నాయకుడు, పౌలు సీలలు నివారించక పూర్వము ప్రాణత్యాగం చెయ్యడానికి సిద్ధపడ్డాడు. రక్షించబడుటకు అతడేమి చేయవలెనో వారు తెలియజేసినపుడు అతడును అతని కుటుంబమంతయు బాప్తీస్మము పొందిరి (16వ అధ్యాయము). సరియైన ఎంపిక చేసుకున్న వారి ఉదాహరణలలో పెంతెకోస్తునాటి మూడువేల మంది, లూదియ, ఇంకా అనేకులున్నారు.

మనలో ప్రతివాడు తీసుకొనవలసిన సరియైన ఎంపిక ఏదనగా మనమందరము క్రీస్తు సువార్తకు విధేయత చూపుటయే. మనము ఆ మొదటి అడుగు వేసిన తరువాత, మన జీవితాంతము వరకు సరియైన ఎంపికలు చేసుకొనుచు ప్రభువుతో శాశ్వతము జీవించుటకు సిద్ధపడవలయును.

# 36
# మంచి వివాహము చేసుకొనుము

యవ్వనస్థులారా, మీరు యవ్వనకాలమందు తీసుకొన్న నిర్ణయముల ప్రభావము మీ జీవితాంతము మిమ్మును వెంబడించును. మంచి సమయాన్ని మీరు ఆనందంగా అనుభవించుట తప్పుకాదు. గాని తీవ్రముగా యోచించ వలసిన విషయాల్ని తేలికగా తీసుకొనకుండా జాగ్రత్తపడవలెను. స్నేహితుల తోను, స్త్రీలు పురుషులతోను, పురుషులు స్త్రీలతోను కలిగి యుండు సంబంధములను గూర్చి జాగ్రత్తగానుండవలయును. మరి ముఖ్యముగా దేవునితో మీకు గల సంబంధము అత్యంత ప్రాముఖ్యమైనది. మిమ్మును దేవునికి దగ్గరగా నడిపించు నిర్ణయములు తీసుకొనుట ఈ జీవితంలో నీకు అత్యంత ఆనందాన్ని తీసుకొని వస్తుంది.

మీరు కలసి తిరుగునప్పుడు క్రైస్తవేతరులతో స్థిరపడడానికి సిద్ధపడవద్దు. మీకు మీరు నిర్దేశించుకొను ప్రామాణికాలు, మీరు కలసి తిరుగు వ్యక్తి నైతికత

విలువలకు, గురికి సమానంగానున్న యెడల మీ జీవితం సాఫీగా కొనసాగుతుంది. మీ కన్యత్వమును వివాహపర్యంతం కొనసాగించవలెనని నిర్ణయించుకొందురు.

వివాహానికి సమయము వచ్చినప్పుడు మంచి కుటుంబములోనికి వివాహం చేసుకొనునట్లు జాగ్రత్తపడవలెను. మీరు కుటుంబాన్ని వివాహం చేసుకోవడం లేదని పొరబడవద్దు. ఎందుకనగా నీవు నీ జీవిత భాగస్వామి యొక్క కుటుంబములో భాగానివౌతావు. వారిని ప్రేమించి వారితో ఒక ప్రత్యేకమైన సంబంధాన్ని ఏర్పరచుకోవాలి.

ఒక పరిష్టమైన క్రైస్తవ గృహాన్ని కట్టండి. జీవితకాలం కోసం వివాహం చేసుకొని మీ పిల్లలను ప్రభువు ప్రేమయందును భక్తియందును పెంచండి. వారికి ఇద్దరు భక్తిగల, ప్రేమామయులైన తల్లిదండ్రుల ఆదరణను అందివ్వండి.

ఇది తేలికగా వినిపిస్తుందా? ఇది తేలికైనది కాదు. అది తేలికైనదని దేవుడెన్నడు వాగ్దానం చేయలేదు గాని అందుకు బహుమానాల్ని వాగ్దానం చేసాడు. ఈ జీవితంలోను, ఆ తరువాత నిత్య జీవితంలోను మీ ప్రయాసానికి విలువ ఏర్పడుతుంది.

క్రీస్తు ప్రభువును మీ జీవితానికి ముందు పెట్టుకొని, ఆయన వాక్యంపై ఆధారపడాలనే నిర్ణయాలు తీసుకోవడం ద్వారా నిరోధించగల ప్రమాదాల్ని గమనిద్దాం. అవేవనగా వైవాహేతర గర్భధారణ, సుఖ సంపర్కవ్యాధులు, విడాకుల వలన చెల్లాచెదురైన కుటుంబములు, తల్లి లేక తండ్రి మాత్రమే గల కుటుంబమందు పిల్లలు పెరుగుట. ప్రతిరోజు మనం తీసుకునే స్వల్ప నిర్ణయాలు స్వల్పమైనవి కావు.

బాధ్యతగల నిర్ణయాలు తీసుకోవడం ప్రారంభించు. క్రీస్తు ప్రభువును నీ హృదయంలో ఒక ఉన్నతమైన సింహాసనంపై నుంచి ఆయనవక్కడే ఉండ నిచ్చి, ఆయన కొరకు జీవిస్తూ, ఆయనతో శాశ్వతం జీవించడానికి సిద్ధపడు.

# 37

# సంఘాన్ని గూర్చి సామాన్యంగా అడిగే ప్రశ్నలు

**1. ఆరాధనలో వాద్య సంగీతములను మీరెందుకు వాడరు?**

పరిశుద్ధాత్మ, అపోస్తలుడైన పౌలు ద్వారా ఆరాధనయందు పాటలు పాడుటను గూర్చి క్రొత్తనిబంధన క్రైస్తవులకు తెలియజేసాదు. (ఎఫెసీ 5:19; కొలస్సీ 3:16). వాద్యసంగీతములను గూర్చి తెలియజేయలేదు. మనము దేవుని వాక్యమునకు కలుపుట గాని తీసివేయుట గాని చేయకూడదు గనుక (ప్రకటన 22:18,19) మనం లేఖనాల నిశ్శబ్దాన్ని గౌరవించాలి.

**2. మీరు మాత్రమే పరలోకానికి వెళ్ళుదురని విశ్వాసిస్తున్నారా?**

దేవుని చిత్తాన్ని నెరవేర్చే వారు రక్షించబడతారని, దేవుని చిత్తాన్ని నెరవేర్చని వారు నశించిపోతారని బైబిలు గ్రంథంలో తేటగా చెప్పబడింది. (మత్తయి 7:21-23). మనం దేవుని వాక్యాన్ని అధ్యయనం చేసి, దేవుడు మనల్ని ఏం చెయ్యాలని కోరుతున్నాడో నేర్చుకొని, వాటిని మన జీవితాలలో నెరవేర్చి, పరలోకాన్ని మన నిత్య గృహం చేసుకోవాలి.

**3. ప్రభురాత్రి భోజనాన్ని ప్రతి ఆదివారం ఎందుకు తీసుకొంటారు?**

అపో.కా. 20:7 గమనించు. ప్రతీ వారానికి ఒక మొదటి రోజు (ఆదివారం) ఉంటుంది కదా?

**4. క్రీస్తు సంఘమునందు దశమ భాగము నిచ్చుటనెందుకు ఆచరించరు?**

దశమ భాగము పాతనిబంధన క్రింద ఆజ్ఞాపించబడినది. పాతనిబంధన క్రీస్తు సిలువకు మేకులతో కొట్టబడింది. (కొలస్సీ 2:14). క్రొత్త నిబంధన క్రింద మనలను మనము మొదట దేవునికి అర్పించుకొనవలెను. తరువాత

మనము అభివృద్ధిచెందిన కొలది మన హృదయాలలో నిశ్చయించుకొన్న ప్రకారము సంతోషముగా దేవునికియ్యవలెను. (1కొరింధీ 16:1,2; 2కొరింధీ 8:15; 9:6-9; 9:13-15). ఆ విధంగా దేవుని యెడల మన ప్రేమను నిరూపించుకొనగలము.

**5. పాపక్షమాపణ నిమిత్తము ఎందుకు నీటిలో బాప్తీస్మము పొందవలెను?**

బాప్తీస్మము యొక్క ఉద్దేశ్యము, విధానము ఈ క్రింది లేఖనమందు తేటగా వ్రాయబడియున్నది. "...మారు మనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము యేసుక్రీస్తు నామమున బాప్తీస్మము పొందుడి" (అపో.కా. 2:38). "నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్ధన చేసి బాప్తీస్మము పొంది నీ పాపములను కడిగివేసుకొనుము..." (అపో.కా. 22:16); "ఇదిగో నీళ్ళు; నాకు బాప్తీస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి రధము నిలుపుమని ఆజ్ఞాపించెను. ఫిలిప్పు నపుంసకుడు ఇద్దరును నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తీస్మమిచ్చెను" (అపో.కా. 8:38). బాప్తీస్మము మనలను రక్షించునని పేతురు కూడా బోధించాడు. (1పేతురు 3:21).

# 38
# వేసవి సెలవులు
# విహార యాత్రలకు సిద్ధపడుట

వేసవి కాలము సమీపించుచున్నది. అనేకులు విహారయాత్రల కొరకు పధకాలు సిద్ధం చేసుకొంటున్నారు. మీ ప్రణాళికలలో ఇహలోక సంబంధమైనవి, పరలోక సంబంధమైనవి కూడా కొన్ని అంశములుండునట్లు జాగ్రత్తగా ఆలోచించి సమయాన్ని కేటాయించండి.

ఏదో ఒక కారణాన్ని బట్టి సెలవులలో క్రైస్తవులు వెళ్ళకూడని ప్రదేశాలకు,

వేసుకొనకూడని వస్త్రధారణకు ప్రభావితులగుదురు. బహిరంగ సముద్ర తీరములు అర్ధనగ్నముగానున్న ప్రజలతో నిండియుంటున్నవి. ఇది క్రైస్తవ కుటుంబాలకు సానుకూల వాతావరణము కాదు. సరియైన వినోదము నిచ్చునవి, మనము పాల్గొనుటకు ఆహ్లాదదాయకముగానుండి ఉత్తమమైన ప్రదేశములు అనేకములు కలవు. మన పిల్లలను, మనలను ప్రమాదకరమైన ప్రదేశములలో నుంచనక్కరలేదు.

క్రైస్తవులు సముచితమైన వస్త్రధారణ ధరించవలయును. సముచితమైన అనగా సరియైన విధముగా మర్యాదగాను, గౌరవప్రదముగాను అని అర్థము. మన అలవాట్లు, వస్త్రధారణ దేవుని విధానమును నెరవేర్చునవిగా నుండవలయును గాని మానవ విధానమును నెరవేర్చునవిగా నుండరాదు. పాపము మన జీవితములలోనికి ప్రవేశించు మూడు మార్గములను గూర్చి మనము ఎల్లప్పుడు మెళకువగా నుండవలయును. శరీరాశ, నేత్రాశ, జీవపుడంబము (1యోహాను 2:16).

విహారయాత్రలకు తీసుకొని వెళ్ళు వాహనముల డ్రైవర్లు రహదార్లలో హద్దుమీరిన వేగముతో వెళ్ళుచుందురు. క్రైస్తవులకు అట్టి ప్రవర్తన మంచిది కాదు. మనమెల్లప్పుడు దేశ చట్టములయందు నిలిచియుండవలయును. డ్రైవర్లలో కొందరు ఎల్లప్పుడు కోపిష్టులుగా నుండి ఇతరుల యెడల అమర్యాదగా ప్రవర్తించుదురు. మనము ముందు జాగ్రత్త కలిగియుండి వాహనములు నడుపవలయును. మనమెల్లప్పుడు మర్యాద పూర్వకముగా క్రైస్తవులు ప్రవర్తించవలసిన విధముగా ప్రవర్తించవలెను.

తల్లిదండ్రులారా! మీరు మర్యాదగాను భక్తిగాను ప్రవర్తించి, మీ గృహాలకు ఆత్మీయ నాయకులుగా మీ బాధ్యతలనెరిగి పిల్లలకు మంచి మాదిరిని చూపవలయును.

# 39
# మీరు క్షమించని యెడల

"మనుష్యుల అపరాధములను మీరు క్షమించిన యెడల, మీ పరలోకపు తండ్రి మీ అపరాధములను క్షమించును". ఇవి యేసు ప్రభువు పలికిన మాటలు. మత్తయి 6:14 నందు వ్రాయబడిన ఆయన కొండమీది ప్రసంగమందు శిష్యులకు చేసిన బోధనలు. మనప్రభువు ఈభూమిపై భౌతికముగా సంచరించినపుడు ఆయన ఇతరులకిచ్చిన సమాధానాలు దయగలవియు, మృదువైనవియునైయుండెను. అయినను ఒక సందర్భ మందు ఆయన కోపపడెను- అది నీతిగల కోపము - గాని ఆయన కోపానికి బానిసకాలేదు. ఆయన శిలువపై మరణిస్తూ, ఆయనను మరణానికి గురిచేసిన వారిని క్షమించమని పరలోకమందున్న తండ్రికి ప్రార్థించాడు (లూకా 23:24). "సమస్తమైన ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ, సకలమైన దుష్టత్వము మీరు విసర్జించుడి, ఒకని యెడల ఒకడు దయగలిగి, కరుణాహృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరినొకరు క్షమించుడి" (ఎఫెసీ 4:31,32).

ప్రతికూల ఆలోచనలతో (Negative Thoughts) మనసంతా నింపుకొని, కోపాన్ని పెంచుకొంటూ, ఆ కోపం యొక్క ఉద్దేశాన్ని నెరవేర్చడం లేదని పొరపాటుగా ఆలోచించేవాడ్ని ఎరుగుదువా? అతనితో శత్రుత్వం గలవాడి జీవితాన్ని అతడు సంతోషంలేకుండా చేయవచ్చును గాని నిజానికి అతడే నష్టపోతున్నాడు. కోపానికి మన ఆరోగ్యంపైన, ఇతరులతో మన సబంధాల పైన ప్రతికూల ప్రభావం ఉంటుంది. క్షమించే హృదయం లేకపోతే మన ఆత్మకు పరలోక జీవితం లేకుండా పోతుంది.

కోపాన్ని అదుపుచేసుకోలేక, ఒకనినొకరు క్షమించుకోలేక, విడాకుల

కొరకు చేచియున్న భార్యభర్తలతో కోర్టులు నిండియున్నాయి. గర్వమువలన, సాధించలేని కోపంవలన కుటుంబాలు చిరిగి చిందరవందరగుతున్నాయి. క్షమించలేని స్వభావం వలన స్నేహాలు విరిగిపోతున్నాయి. క్షమించడానికి ఇష్టంలేని వారు వారి కోపానికి బానిసలవుతున్నారు.

కోపం భౌతికమైన కుటుంబాన్నే కాక సంఘమనే కుటుంబాన్ని కూడా పాడుచేస్తుంది. క్షమించలేకపోవడం జీవితానికి చేదు అనుభవాన్ని, ఆయాసాన్ని, ప్రభువు సంఘంలో విభజనలను తీసుకువస్తుంది. కోపాన్ని అధిగమించడం వలన, క్షమించడం వలన, కోపం స్థానంలో ప్రేమను అర్థం చేసుకోవడాన్ని ఉంచడం వలన ఆయాసాన్ని, వికారాన్ని సంఘంలో విభజనలను అధిగ మించగలం. మనం ఒకరినొకరం క్షమించలేకపోతే, మన పరలోక తండ్రి మనల్ని క్షమించడు.

# 40

# ఐక్యత

యోహాను 17:20,21 నందు వ్రాయబడిన మన ప్రభువుచేసిన ప్రార్థనలో యేసు, ఆయన శిష్యుల ఐక్యత కొరకు ప్రార్థించాడు.

"మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు, తండ్రి నామమందు నీవును నీయందు నేనును ఉన్నలాగున, వారును మనయందు ఏకమైయుండవలెనని వారికొరకు మాత్రము నేను ప్రార్థించుటలేదు, వారి వాక్యము వలన నాయందు విశ్వాసముంచు వారందరును ఏకమై యుండవలెనని వారికొరకును ప్రార్థించుచున్నాను". ఆనాడు సుమారు 2000 సంవత్సరముల పూర్వము యేసు ప్రభువు ప్రార్థించినట్లు ఈనాడు మనం మన సహోదరుల మధ్య ఐక్యత కొరకు ప్రార్థించవలసిన అవసరమున్నది.

ప్రభువు సంఘమందలి సమాజముల మధ్య విభేదములుండుట మన మందరము ఎదుగుదుము. అట్టి అనైక్యత అనేక అవాంఛనీయ పరిస్థితులకు దారితీస్తుంది. సహోదరులారా, ఇది మంచిదికాదు. దేవునికి ఇష్టులైయుండుటకు ఆయన పిల్లలు ఆయన వాక్యముపై ఐక్యమై నిలువబడి మనుష్యులు లేఖనముల అర్థము విషయమై మనలను తికమక పెట్టకుండా జాగ్రత్తపడవలెను. బైబిలునందు దేవుని మనస్సు బయలుపరచబడినది; ఆయన వాక్యము ద్వారా మనతో మాట్లాడుతున్నాడు.

మనమెంత ఆశీర్వదించబడినవారము! క్రీస్తు ఆయన సంఘమును కట్టి ఆయన చిత్తానికి విధేయులమగుటద్వారా శాశ్వతము ఆయనతో జీవించడానికి మనకొరకొక మార్గాన్ని అనుగ్రహించాడు. దేవుని ప్రజలుగల సంఘములు, సమాధానముతో కలసి జీవిస్తూ ఆయన వాక్యమందు ఐక్యమైయుండునట్లు ప్రత్యేకముగా ఆశీర్వదించబడినవారు. దేవుని కుటుంబము యొక్క స్వరూపము మన భౌతికకుటుంబములను పోలియున్నది. ఒక కుటుంబము అభివృద్ధిచెందుటకు ప్రేమ, అనుబంధము, సహకారము అవసరము.

దేవుడు కోరినట్లు మనమెల్లప్పుడు ఐక్యతకొరకు పాటుపడుదము. మనయెడల ఆయనచిత్తాన్ని గ్రహించడానికి దేవుని వాక్యాన్ని చదవడానికి సమయాన్ని వెచ్చిద్దాం. అలాగుననే ఒకనితో ఒకడు సమయము గడుపుచూ ఆరాధనయందును, సహవాసమందును, ఒకరికొరకు ఒకరము లోతైన, నిరంతరము నిలిచియుండు ప్రేమను పెంపొందించుకొందము. చిన్నచిన్న బేదాభిప్రాయములను మనలను విడదీయనీయక ప్రభువునందలి విశ్వాస విషయములో రాజీపడేతప్పుచేయకుండా ముందుకు కొనసాగుదము.

# 41
# ప్రభువా, మాకు నీవు కావలయును

"యెహోవా, నాఆత్మను నీ దిక్కుకు చూచి యెత్తికొనుచున్నాను. నాదేవా, నీయందు నమ్మికయుంచియున్నాను. నన్ను సిగ్గుపడనియ్యకుము. నీకొరకు కనిపెట్టువారిలో ఎవడును సిగ్గునొందడు. హేతువులేకుండనే ద్రోహముచేయు వారు సిగ్గునొందుదురు. యెహోవా నీమార్గములను నాకు తెలియజేయుము. నీ త్రోవలను నాకు తేటపరచుము. నన్ను నీ సత్యము ననుసరింపజేసి నాకు ఉపదేశముచేయుము. నీవే నారక్షణ కర్తవైన దేవుడవు. దినమెల్ల నీ కొరకు కనిపెట్టుచున్నాను. యెహోవా, నీకరుణాతిశయములను జ్ఞాపకము చేసుకొనుము. నీకృపాతిశయములను జ్ఞాపకముచేసికొనుము. అవి పూర్వమునుండియున్నవేగదా" (కీర్తనలు 25:1–6)

దావీదు దేవునియొదుట తన హృదయమును కుమ్మరించి మాట్లాడు మాటలు చదువునప్పుడు, దేవుడెందువలన దావీదును గూర్చి "తన చిత్తాను సారమైన మనసుగలయొకడు" (1సమూ 13:14; అపో.కా 13:22) అని ఎందువలన చెప్పియున్నాడో మనకర్థమగును. ప్రభువుకు దగ్గరగా నుండవలె నని ఆశించు దావీదు తన హృయాన్ని దేవుని కొరకు ప్రత్యేకించాడు. సహోదరులారా, మనము కూడా మన ప్రభువు కొరకు మన హృదయాన్ని ప్రత్యేకించి, మన ఆత్మలను ప్రభువువైపుకు త్రిప్పి దేవునికి దగ్గరకావలసిన అవసరమున్నది. మన ప్రభువుకు ఇష్టులమై జీవించుట మన బాధ్యత. అది మన ఆధిక్యత. ఆయనకు మన యెడలగల దయగల ప్రేమకొరకు ఎల్లప్పుడు కృతజ్ఞత చెల్లించవలెను. ఆయననుండియే మనకు కనికరం, ప్రేమ, శాంతి, సంతోషము, కాపుదల, పరలోకజీవితాన్ని గూర్చిన నిరీక్షణ కలవు.

ప్రభువైన యేసుక్రీస్తు నిజమైన రక్షకుడు గనుక మనమాయన రక్షణ

కొరకు ఓపికతో కనిపెట్టుకొని యుండవలెను. మనం పరలోకానికి వెళ్లడానికి మార్గదర్శియైన ఆయనకు కృతజ్ఞులమై యుండాలి. మనమాయన కిష్టులమై యుండునట్లు ఆయన వాక్యాన్ని పరిశీలించి అధ్యయనం చేయాలి.

**ప్రభువా, మేము స్వార్థపరులముకాక, దయ, ప్రేమ, ఇతరులయెడల దాతృత్వముగలవారముగా నుండునట్లు సహాయంచేయండి. మీకు దగ్గరగా నుండి మా జీవిత దినములన్నియు మిమ్ము నమ్మకముగా సేవించుటకు, మా కోరికల్ని అదుపులోనుంచు కొనగలుగునట్లు సహాయం చేయండి. ప్రభువా, నీవు మాకు కావలయును. నీవు లేని మేము దరిద్రులము. మిమ్మును ఆరాధించి కొనియాడునట్లు మాకు సహాయం చేయండి.**

## 42

## శోధనలను జయించుట

“సహోదరులారా, ఒకడు ఏ తప్పిదములోనైనను చిక్కుకొనినయెడల ఆత్మ సంబంధులైన మీలో ప్రతివాడు తానును శోధింపబడుదునేమో అని తన విషయమై చూచుకొనుచు, సాత్వికమైన మనస్సుతో అట్టివానిని మంచిదారికి తీసుకొని రావలెను” (గలతీ 6:1). మనము పాపపు ప్రపంచంలో జీవిస్తున్నాము గనుక ప్రతిరోజు అనేకమైన శోధనలకు గురియగుచున్నాము. కొన్నిసార్లు శోధనలు తీవ్రమైనందున మనం పడిపోవుదుము. విశ్వాసమునందు బలమైనవారు పడిపోయినవారిని లేక క్లిష్టసమయములను నెదుర్కొనుచున్న వారిని వెదకి, వారిని సరియైన మార్గమందు దేవుని కిష్టులుగా జీవించువారిగానుండునట్లు ప్రోత్సహించవలెను. మనము ఇతరులను సాత్వీకముగల మనస్సుతో ప్రేమించవలెను. మన సొంత బలహీనతలను గమనించుకొని మనలను కూడా శోధనలు జయించగలవను

తెలివిని కలిగియుండవలెను. "శోధన జయించువాడు ధన్యుడు. అతడు శోధనకు నిలిచినవాడై ప్రభువు తన్ను ప్రేమించువారికి వాగ్దానము చేసిన జీవకిరీటము పొందును" (యాకోబు 1:12). శోధనను జయించుటకు యేసు మాదిరిని చూపెను (మత్తయి 4:1-11). "సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు; మీరు సహింపగలిగినంతకంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు. అంతేకాదు, సహింపగలుగుటకు ఆయన శోధనతోకూడ తప్పించుకొను మార్గము కలుగజేయును" (1కొరింథి 10:13). దేవుని వాక్యమును పరిశీలించి, చదువుటవలన పాపమును జయించు శక్తిని మనము సంపాదించుకొనగలము. ఆ వాక్యమును మన హృదయాల లోనికి తీసుకొని, మన జీవితములకు అన్వయించుకొనవలెను.

ప్రభువు సంఘమందలి ప్రాంతీయ సంఘము దేవుని పిల్లలుగల సన్నిహిత కుటుంబము. మనము కలసి సంతోషంగా జీవించాలి. అలాగుననే ఒకరి భారములనొకరము భరించాలి. మనము ఒకరియెడల ఒకరము అలాంటిప్రేమను పెంపొందించుకొనుటకు ప్రయత్నిస్తూ, ఒక బలహీనమైన సహోదరుడు లేక సహోదరి విశ్వాసమునకు వెలుపలికిపోయి పాపజీవితము లోనికి మరలినప్పుడు హృదయవేదనచెంది, మరల వారు తిరిగి క్రైస్తవ సహవాసములోనికి రాగలుగునట్లు సహాయపడుదము.

## 43
## ప్రభువు కుటుంబముగా ఎదుగుట

"కావున క్రీస్తునందు ఏ హెచ్చరికయైనను, ప్రేమవలన ఆదరణయైనను, ఆత్మయందు ఏ సహవాసమైనను, ఏదయారసమైనను, వాత్సల్యమైనను

ఉన్నయెడల మీరు ఏకమనస్సులగునట్లుగా ఏకప్రేమకలిగి యేకభావముగల వారుగా ఉండి, ఒక్కదాని యందే మనస్సుంచుచు నాసంతోషమును సంపూర్ణము చేయుడి. కక్షచేతనైనను వృథాతిశయముచేతనైనను ఏమియు చేయక, వినయమైన మనస్సు గలవారై యొకనినొకడు తనకంటె యోగ్యుడని యెంచుచు, మీలో ప్రతివాడును తన సొంత కార్యములను మాత్రమే గాక యితరుల కార్యములను కూడ చూడవలెను" (ఫిలిప్పీ 2:1–5). ఓదార్పు, ఆదరణ, ఆత్మీయ సహవాసము క్రీస్తునందు కలవు. అపొస్తులుడైన పౌలు ఫిలిప్పీలోని సహోదరులను ప్రేమయందును భావమునందును ఏకమనస్సుతో తన సంతోషమును సంపూర్ణముచేయమని హెచ్చరించెను. సహోదరులారా, మనము కూడా అదే స్వభావము కలిగి దేవుని కుటుంబముగా ఐక్యతకొరకు ప్రయాసపడుదము.

క్రీస్తు వినయమనస్సుకు, ఇతరులయెడల శ్రద్ధకలిగియుండుటకు గొప్ప మాదిరిని చూపెను. ప్రపంచం మనలో క్రీస్తును చూడవలసినయెడల మనము ఆయన స్వభావము వంటి స్వభావమును కలిగియుండవలెను. మన సొంత అవసరములకంటె ఇతరుల అవసరములకొరకు శ్రద్ధకలిగి యుండవలెను.

క్రీడలయందు ఐక్యతను గూర్చి కొంత నేర్చుకొనవచ్చును. కలసి పని చేయు జట్టు సామాన్యముగా విజయము నొందును. ఏకమనస్సు కలిగి పని చేయు క్రైస్తవులు నశించిన ఆత్మలను రక్షించి, తప్పిదములో నున్న వారిని పునరుద్ధరించి, ఆత్మీయముగాను, సంఖ్యాపరముగాను అభివృద్ధిచెందుదురు, మనము కలసి పనిచేయనియెడల హెచ్చయిన ఫలితమును చూడలేము.

దానికదే విభజించబడిన కుటుంబము నిలువబడలేదు. మనము ఐక్యత కలిగి ఒక జట్టుగా కలసి పనిచేయవలెను. మనలోని ఉన్నతమైన దానిని ప్రభువుకీయవలెను.

# 44
# ఉపదేశము

ఉపదేశించుట అనునది ఒక గొప్ప బాధ్యత అయినప్పటికి, క్రైస్తవు లందరు వాక్యమును ఉపదేశించుటకు సిద్ధపడవలయును. క్రైస్తవులు పిరికి వారైనందున క్రీస్తును గూర్చి ఇతరులకు బోధించు అనేక అవకాశములు వృధా అగుచున్నవి. బైబిలు ప్రశ్నలకు సమాధానము చెప్పలేమని అట్టి క్రైస్తవులు భయపడుదురు. బైబిలునందు జ్ఞానము కావలయునన్న ఒక్కటే మార్గము. ప్రతీదినం బైబిలును అధ్యయనం చేయాలి. మనకు తెలియని దానిని ఇతరులకు బోధించలేము. మన బైబిలును మనం తెలుసుకొన్నప్పుడు మాత్రమే ఇతరులకు దేవుని వాక్యాన్ని ఉపదేశించగలము.

నిజంగా బైబిలును బోధించాలని ఆశించువారికి మన బైబిలు తరగతులు ఒక గొప్ప అవకాశాన్నిస్తాయి. ఒక బైబిలు తరగతియందు నిలువబడి ఇతరులు బైబిలు నేర్చుకొనుటకు సహాయపడుట ఒక గొప్ప అవకాశము. ఈ బాధ్యతను తీవ్రంగా తీసుకొని మనం చేయగలిగినదంతా చెయ్యాలి. విద్యార్థులు క్రీస్తును గూర్చి ఉత్తమమైన అవగాహన కలిగియుండునట్లు వారికి సహాయపడుట ద్వారా ఒక గొప్ప దైవకార్యాన్ని చేస్తున్నామని అర్థం చేసుకోవాలి. 2కొరింథి 2:2 నందు అపొస్తులుడైన పౌలు ఇలా వ్రాసాడు. “నీవు అనేకసాక్షులయెదుట నావలన వినిన సంగతులను ఇతరులకు బోధించుటకు సామర్ధ్యముగల నమ్మకమైన మనుష్యులకు అప్పగింపుము”. దేవుని వాక్యాన్ని ఉపదేశించుటలో ఆనందాన్ని కనుగొను ఉపదేశకులు వారి విద్యార్థులకు ఆనందాన్ని ప్రసరింపజేస్తారు. ఉపదేశాన్ని ప్రోత్సహించు సంఘాలలోని సభ్యులు వాక్య జ్ఞానమందు అభివృద్ధి చెందుదురు. వారు ఒక తరగతిలో ఉపదేశకులుగా బోధించుట మాత్రము కాక వ్యక్తిగతంగా

కూడా అనేకులు క్రీస్తుయొద్దకు నడిపించబడునట్లు సహాయపడుదురు.

మనలో కొందరు మన బైబిలును సరిపడునంతగా తెలుసుకొనని కారణము వలన భయముతో వెనుకకు తగ్గుదురు. మన సమయాన్ని, కర్తవ్యాన్ని పెట్టుబడిగా పెట్టిన యెడల మనం ఉపదేశకులుగా తయారై దేవుడిచ్చే బహుమానాన్ని అందుకోగలము. దేవుని వాక్యాన్ని ఉపదేశించే బాధ్యతను ఆయన మంటిఘటాలలో ఉంచినాడు. మనము మన పరలోక తండ్రి వ్యాపకమందు కొనసాగుదము గాక.

# 45

# విశ్వాస్యత

మనము క్రీస్తు సువార్తకు విధేయులమై ప్రభువుచే సంఘమునకు చేర్చబడినపుడు (అపో.కా. 2:47) మనము క్రైస్తవ జీవితాన్ని ప్రారంభించుటకు సిద్ధముగా నుందుము. క్రైస్తవుడగుట ఇహలోక పాపములకు లేక శోధనలకు గురికాకుండా కాపాడదు. మనమిహలోక జీవితాన్ని కొనసాగిస్తూ, లోకాశలవైపు తిరుగకయుండునట్లు జాగ్రత్త కలిగియుండి, క్రైస్తవ జీవితమును జీవించుటకు ఆటంకముగానుండు వాటిని విసర్జించవలయును.

మత్తయి 7:13,14 నందు చెప్పబడినట్లు, జీవితంలో ప్రయాణం చెయ్యడానికి రెండే మార్గాలున్నాయి. మొదటిది నాశనమునకు నడుపు విశాలమైన మార్గము, అందు ప్రవేశించుటకు గల వెడల్పైన గుమ్మము. రెండవది తిన్నని గుమ్మము గుండా వెళ్ళు సన్నని ఇరుకు మార్గము. అది మనలను నిత్యజీవితము లోనికి నడుపును. మనము సువార్తకు విధేయులమైన తరువాత, తిన్నని గుమ్మములోనికి ప్రవేశించి కొందరు మాత్రమే వెళ్ళు ఇరుకు మార్గములో ప్రయాణము కొనసాగింతుము. మన శాశ్వత

రక్షణ మన విశ్వాస్యతపై ఆధారపడును. జీవితాంతము మనము ఇరుకు మార్గములోనే పయనించ వలయును.

అపోస్తలుడైన పౌలు, ఆయన విశ్వాస్యతను గూర్చి 2తిమోతి 4:7-8 నందు ఇలా వ్రాసాడు. "మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని. ఇక మీదట నాకొరకు నీతి కిరీటముంచబడియున్నది. ఆ దినమందు నీతి గల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును, నాకు మాత్రమే కాకుండా తన ప్రత్యక్షతను అపేక్షించువారికందరికిని అనుగ్రహించును". క్రీస్తు శరీరమందు భాగమైన వారందరు ఆయన కొరకు జీవించుట అత్యంత ఉన్నతమైన జీవితమని తెలిసికొందురు. ప్రతి దినము వెలుగునందు నడచు వారికి అనేక ఆశీర్వాదములు వచ్చును. శాంతి, సంతోషము, ఆనందము, నిరీక్షణ, మనము నిత్యమును గడపబోవు ప్రదేశమును గూర్చిన నిశ్చయత.

ఫిలిప్పీ 4:13 నందు అపోస్తలుడైన పౌలు ఇలా వ్రాసాడు. "నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలను". మనము కూడా మన భారమంతయు క్రీస్తుపై వేసి ఆయన ద్వారా సమస్తము చేయగలము. మనము నిజమైన విలువగల క్రియలు క్రీస్తు కొరకు జీవించుట ద్వారా ఇంకను అధికముగా చేయగలము.

మనము క్రైస్తవులమైనప్పుడు నిత్యత్వములోనికి కొనసాగు సంబంధమును ప్రారంభించుచున్నాము. మనము చేయు మంచి పనులను బట్టి అలయక ప్రభువు కొరకు విశ్వాసులముగా కొనసాగుటకు మన శక్తినంతటిని వినియోగించుదము. దేవునితో సరియైన సంబంధము కలిగియుండుట అత్యంత ప్రాముఖ్యమైనది.

# 46
# నాలుకను ఆధీనంలో ఉంచుకో

నాలుక శరీరంలోని అతి చిన్న భాగాలలో ఒకటైనప్పటికి అది గొప్ప విషయాలను గూర్చి ప్రగల్భాలు పలుకుతుంది. యాకోబు 3:6-8 గమనించండి. "నాలుక అగ్నియే, నాలుక మన అవయవములలో ఉంచ బడిన పాప ప్రపంచమై సర్వ శరీరమునకు మాలిన్యము కలుగజేయుచు ప్రకృతి చక్రమునకు చిచ్చుపెట్టును. అది నరకము చేత చిచ్చుపెట్టబడును. మృగ, పక్షి, సర్ప, జలచరములలో ప్రతి జాతియు నరజాతిచేత సాధు కాజాలును, సాధు ఆయెను గాని యే నరుడును నాలుకను సాధుచేయనేరడు, అది మరణకరమైన విషయముతో నిండినది, అది నిరర్గళమైన దుష్టత్వమే". కీర్తనలు 34:13 నందు మనము నాలుకను గూర్చి హెచ్చరించబడితిమి. "చెడ్డమాటలు పలుకకుండ నీ నాలుకను కపటమైన మాటలు పలుకకుండా నీ పెదవులను కాచుకొనుము" మరియు సామెతలు 15:4 నందు ఈలాగున చెప్పబడినది. "సాత్వీకమైన నాలుక జీవవృక్షము. దానిలో కుటిలత యుండిన యెడల ఆత్మకు భంగము కలుగును".

ప్రజలందరు వారి నాలుకలను స్వాధీనమందుంచుకొన్న యెడల ప్రపంచమెంతో వ్యత్యాసముగా ఉండియుండును. ముచ్చట్ల వలన కలుగు సమస్యలు లేకుండును. కుటుంబములు కలసి సమాధానముగా జీవించును, దేశముల మధ్య శాంతి నెలకొనును. చెరసాలలు క్రిక్కిరిసియుండెడివి కావు, విడాకులు అరుదైనవగును. సంఘమందు ఏ వేర్పాటులుండవు. మనం ఆలోచించి మాట్లాడిన యెడల ఎట్టి బాధలు ఉండవు. ముఖ్యంగా క్రైస్తవుల మైన మనం మన నాలుకలను స్వాధీనమందుంచుకొనవలెను. వాక్యాన్ని

బోధించి ప్రపంచమంతటికి సువార్తను వ్యాపింపజేయుటకు మన సామర్థ్యాన్ని వినియోగించాలి. మన నాలుకలను స్వాధీనమందుంచుకొని, నశించిన వారిని సంధించునపుడు మృదువుగాను, దయగాను, ప్రేమ స్వభావముతోను మాట్లాడాలి. లోకములోనికి తిరిగిపోయిన వారిని, మారుమనస్సు పొంది ప్రభువులోనికి వెనుకకు రావలసినదిగా ప్రోత్సహించాలి.

జ్ఞానము సంపాదించుటకు బైబిలు విద్యార్థులము కావలయును. వాక్యమును ధ్యానించగలుగుటకు ఒక ప్రత్యేక సమయము కేటాయించ వలెను. అట్లయినచో తెలివితేటలయందు, జ్ఞానము నందు కూడా అభివృద్ధి చెందగలము. జ్ఞానముగల మాటలు మాట్లాడుట ద్వారా ప్రభువు యెడల మనకు గల ప్రేమను చూపి, ఇతరులకు, మనకు కూడా క్షేమాభివృద్ధి కలుగజేయుదము.

## 47

# దైవత్వములోని ముగ్గురు వ్యక్తులు

దైవత్వములో ఒకే ఒక వ్యక్తి గలడని బోధించుకొందరున్నారు. గాని లేఖనములు వేరుగా బోధించుచున్నవి. "సాక్ష్యమిచ్చువారు ముగ్గురు అనగా ఆత్మయు, నీళ్ళును, రక్తమును. ఈ ముగ్గురు ఏకీభవించియున్నారు". (1యోహాను 5:7); "కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తీస్మమిచ్చుచు" (మత్తయి 28:19); "ఆ దినములలో యేసు గలిలియలోని నజరేతు నుండి వచ్చి యొర్దానులో యోహాను చేత బాప్తీస్మము పొందెను. వెంటనే ఆయన నీళ్ళలోనుండి ఒడ్డునకు వచ్చుచుండగా ఆకాశము చీల్చబడుటయు, పరిశుద్ధాత్మ

పావురమువలె తన మీదికి దిగివచ్చుటయు చూచెను. మరియు నీవు నా ప్రియ కుమారుడవు, నీయందు నేనానందించుచున్నానని యొక శబ్దము ఆకాశము నుండి వచ్చెను" (మార్కు 1:9–11). ముగ్గురు ప్రత్యేకమైన వ్యక్తులు – తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ – ఈ వాక్యభాగములయందు ప్రత్యేకముగా ప్రస్తావించబడిరి.

ఆదియందు సృష్టికర్త కూడా ఒంటరిగా లేడు. "దేవుడు – **మన** స్వరూపమందు **మన** పోలిక చొప్పున నరులను చేయుదము; వారు సముద్రపు చేపలను, ఆకాశ పక్షులను, పశువులను, సమస్త భూమిని, భూమి మీద ప్రాకు ప్రతి జంతువును ఏలుదురు గాకనియు పలికెను" (ఆది. 1:26). దేవుడు "మన" అని పలుకుటలో దైవత్వములోని మిగిలిన ఇద్దరిని గూర్చి ప్రస్తావించెను.

దైవత్వమునందు తండ్రియైన దేవుడు, కుమారుడైన దేవుడు, పరిశుద్ధాత్మ యైన దేవుడు తేటగా ఉన్నారు. అందరు కలసిన దైవము. వారు ముగ్గురు అయినను ఒకటిగానే అంగీకరించుదురు.

మన ప్రశ్నల సమాధానము కొరకు మనుష్యులపై ఆధారపడక, దేవుని వాక్యమును ఎల్లప్పుడు పరిశీలించి, అన్నిటిని నిరూపించుటకు లేఖనములను మాత్రమే పరిశీలించుటను రూఢిపరచుకొందము గాక.

# 48
# దేవునికి దగ్గరగా రండి

యాభై సంవత్సరాల క్రిందటి సమాజమునకు భిన్నమైన సమాజములో మనము జీవించుచున్నాము. మన దేశమందలి నైతిక విలువలలో విపరీతమైన మార్పు కనబడుచున్నది. మన చేతగానితనానికి సమాజాన్ని

తప్పుపట్టుచూ మన పొరపాట్లకు మనలను బాధ్యులను చేసుకొనని ప్రజలుగా మనము తయారయ్యాము. శరీర క్రియలు (గలతీ 5:19-21) అనేకమంది భారతీయుల జీవన విధానమవుతుంది.

తరచు మనము శరీర క్రియల ప్రకారము జీవిస్తూ, ఏదో ఒక ఆవేశ పూరితమైన మానసిక దౌర్భల్యంతో బాధపడుతున్నాము. అపరాధ భావము, కోపము, క్షమించుటకు నిరాశక్తత, ఆత్మ న్యూనత (Depression) అనునవి మన జీవితములలో భారమైన స్థానాన్ని సృష్టిస్తున్నాయి.

ఈ సమస్యకు ప్రభువు సంఘమందలి మనము అతీతులము కాము. లౌకికతత్వము నానాటికి ప్రభువు సంఘములోనికి మెల్లగా ప్రవేశిస్తుంది. వివాహము విషయంలో అపనమ్మకస్తులు సంఘ సభ్యుల మధ్య ఉంటున్నారు. ఇతరులు మానసికమైన, శారీరకమైన ఒత్తిడులకు గురియగుచున్నారు. అవినీతి మన సభ్యుల మధ్య అధికమగుచున్న కొలది, మంచి క్రైస్తవ సలహా సంఘము యొక్క ఆవశ్యకత అధికమగుచున్నది.

మన జీవితాలు దేవుడ్ని విడిచి, స్వశక్తిపై ఆధారపడినపుడు, అవి అదుపు తప్పిపోవును. మానవునికి దేవుని అవసరము, ఆయనతో సన్నిహిత సంబంధము అవసరమైయున్నవి. మనము ఈ సత్యాన్ని అంగీకరించి అవగాహన చేసుకొన్న యెడల, ప్రార్థనాపూర్వకముగాను, ధ్యానపూర్వకము గాను దేవుని వాక్యాన్ని అధ్యయనం చేసి, అదేవిధంగా మన భారాల్ని ఆయనపై వేసిన యెడల, ఆయన మన భారాల్ని మోసి, మన జీవితాలను తిరిగి ఆయన ఆధీనంలో ఉంచుకొని మన భుజాలపై నున్న ఆవేశాన్ని, వ్యాధిని పూర్తిగా తొలగిస్తాడు. దేవునికి దూరంగా ఉండి మనం సంతోషంగా జీవించలేము.

# 49
# అపరాధము - సత్యమైనదా లేక అసత్యమైనదా

ప్రజలందరి జీవితాలలోను అపరాధము యొక్క పాత్ర ఉంటుంది. సత్యమైన అపరాధం తప్పుచేయడం నుండి వస్తుంది. మనం పాపకార్యాల్ని చేసినపుడు అపరాధ భావాన్ని కలిగియుంటాము. మనం తప్పు చేసామని గ్రహించినప్పుడు మారుమనస్సు పొందాలి. పాపము నుండి తిరిగి దేవునివైపు తిరగాలి. నమ్మదగిన దేవుడు మనల్ని క్షమిస్తాడు. క్రైస్తవులు దేవునివైపు తిరిగి, ఆయన పరిశుద్ధ వాక్యంలో వ్రాయబడిన ప్రకారం జీవించాలి.

వేరొక విధమైన అపరాధం ఉంది. అది అసత్యమైన అపరాధం. అట్టి అపరాధం ఉదాహరణకు ఇలా ఉంటుంది. మొదటివాడు, రెండవవానికి అన్యాయం చేసి, ఆ అన్యాయం రెండవవాడు చేసిన తప్పు వలననే జరిగినదని మొదటివాడు ఒప్పిస్తాడు. ఇది తరచు ధూషించుకొనే పరిస్థితులలో జరుగుతుంది. ఇది జరిగినప్పుడు అన్యాయమైనవాడు అపరాధ భావన కలిగియుండడమే గాక ఆత్మన్యూనతకు (Depression) గురియవు తుంటాడు. ఆత్మస్థైర్యము లేనివారు ఇట్టి అపరాధానికి లొంగిపోతుంటారు.

అసత్య అపరాధంతో బాధపడేవారికి మంచి క్రైస్తవ ఆలోచనా సహకారం కావాలి. అప్పుడు తప్పు చేసినది వారు కాదని గ్రహిస్తారు. ఆ తప్పు అతనికి అన్యాయం చేసిన వానిది. అట్టి అసత్య అపరాధానికి గురియైన వారికి దేవుడు వారి పక్షాన ఉన్నాడని, ఎవడును అట్టివానిని నాశనం చేయలేడని గ్రహించాలి. ఫిలిప్పీ 4:13 నందు అపోస్తలుడైన పౌలు వ్రాసినట్లు, "నన్ను బలపరచువాని యందే నేను సమస్తమును చేయగలను".

శరీర క్రియలకు లోనైన ప్రజలు గల లోకంలో మనం జీవిస్తున్నాము.

(గలతి 5:19–20). ప్రజలందరు పాపపు ఒత్తిడికి గురియై దుష్టత్వాన్ని జరిగించుటకు లొంగిపోవుచున్నారు. గాని క్రైస్తవులు లోకాశలకు లొంగి రక్షించబడలేరు. వారు ఇహలోక శోధనలను జయించి దేవుడ్ని హత్తుకోవాలి. మన భారాన్ని మనం మోసుకోవడానికి దేవుని సహాయాన్ని అర్థించి, ఎల్లప్పుడు దేవుని యెడల మన నిర్ణయాల్ని కొనసాగించడంలో సత్యవంతులమై యుండాలి. క్రైస్తవులుగా మనం అపరాధాన్ని మోయనవసరం లేదు. ఎందుకనగా మనం దేవుని ప్రజలం గనుక ఆయన ద్వారా ఏలాంటి అపరాధాన్నైనా అధిగమించగలం.

# 50
# శోధనలను జయించుట

మనం నివసించే ఈ ప్రపంచం నీతిని ప్రక్కకు నెట్టివేసింది. అనేకులు లౌకిక జీవితానికి లోబడి జీవిస్తున్నారు. పాపం ప్రతి చోట ఉండి, సాతాను తన మార్గాన్ని స్థిరపరచుకొంటున్నట్లు కనిపిస్తుంది. సాతాను మానవులను లోబరచుకొంటున్నాడు. మానవుడు సాతానును ఎదిరించలేక పోతున్నాడు. తమ ఎదుటనున్న శోధనలనెదిరించలేక పోతున్నామని తమ ప్రవర్తనను గూర్చి సాకులు చెప్పువారున్నారు. లేఖనములు ఇందుకు భిన్నంగా ఉపదేశించుచున్నవి. "సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు, మీరు సహింపగలిగినంత కంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు. అంతేకాదు. సహింపగలుగుటకు ఆయన శోధనతో కూడ తప్పించుకొను మార్గమును కలుగజేయును" (1కొరింథీ 10:13). శోధనలన్నియు మానవులకు సామాన్యమైనవి. దేవుడు వాటినుండి తప్పించుకొను మార్గమును అనుగ్రహించాడు.

పాతనిబంధనయందలి యోసేపు చరిత్ర, శోధనలనెదుర్కొనుటకు మంచి పాఠమును అనుగ్రహించును. (ఆది. 39:7–20). ఒక యవ్వనస్తునిగా యోసేపు పోతీఫరు భార్య నుండి జారత్వము కొరకు శోధించబడ్డాడు. అట్టి భయంకరమైన దుష్టత్వమును చేయలేనని, అది దేవునికి వ్యతిరేకమైన పాపమని ఆమెకు తెలియజేసి, అక్కడ నుండి పారిపోయాడు. ఈనాడు కూడా దేవునితో సన్నిహిత సంబంధము మనకు శోధనను జయించుటకు తోడ్పడును. యవ్వనస్తులు, ముసలివారు కూడా మనము ఎదుర్కొను శోధననుండి మరలి పోవలెను. ఇట్టి సంబంధాన్ని మనము ఆయన వాక్యాన్ని పరిశీలించి అధ్యయనం చేయడం ద్వారాను, ప్రార్థన ద్వారాను, సమర్పణ ద్వారాను పొందగలము. "శోధన సహించువాడు ధన్యుడు, అతడు శోధనకు నిలిచినవాడై ప్రభువు తన్ను ప్రేమించువారికి వాగ్దానము చేసిన జీవకిరీటము పొందును. దేవుడు కీడు విషయమై శోధింపబడనేరడు; ఆయన ఎవనిని శోధింపడు గనుక ఎవడైనను శోధింపబడినప్పుడు – నేను దేవుని చేత శోధింపబడుచున్నానని అనకూడదు. ప్రతివాడును తన స్వకీయమైన దురాశచేత ఈడ్వబడి మరులు కొల్పబడినవాడై శోధింపబడును. దురాశ గర్భమును ధరించి పాపమును కనగా, పాపము పరిపక్వమై మరణమును కనును" (యాకోబు 1:12–16).

దేవుని కుటుంబముగా ఆయన పిల్లలమైన మనము – లోకమునకు భిన్నముగా నుండవలయును. మనము ఆత్మీయముగా నుండుటకు ప్రయాసపడుదము. మన మనస్సులను, శరీరములను ఇహలోక పాపము నుండి కాపాడుకొందము. మనము యేసుక్రీస్తుపై కేంద్రీకృతమై ఆయనను వెంబడించిన యెడల, సమస్తము నిత్యత్వము కొరకు సంసిద్ధమగును.

# 51
# మనం దేవుడ్ని మోసగించలేము

అపో.కా. 4:34,35 – "భూములైనను ఇండ్లయిననూ కలిగిన వారందరు వాటిని అమ్మి, అమ్మినవాటి వెల తెచ్చి, అపోస్తలుల పాదముల యొద్ద పెట్టుచువచ్చిరి. వారు ప్రతి వానికి వాని వాని అక్కర కొలది పంచిపెట్టిరి గనుక వారిలో ఎవనికిని కొదువలేక పోయెను" అపోస్తలుల కార్యములు ఐదవ అధ్యాయమందు అనినియ అను ఒక మనుష్యుని గూర్చి అతని భార్య సప్పీరాను గూర్చి వ్రాయబడినది. వారు తమ భూమిని అమ్మి, దాని విలువలో కొంత భాగమును దాచిపెట్టి, మిగిలిన భాగమును తీసుకొని వచ్చి అపోస్తలుల పాదముల యొద్ద పెట్టెను. అనినియ, సప్పీరాలు తమ భూభాగమును అమ్మిన సొమ్మంతయు తీసుకొని వచ్చినట్లు ఇతరులను నమ్మించుటకు ప్రయత్నించిరి.

అనినియ తాను చెప్పినట్లు తన భూమిని అమ్మిన వెల అంతయు తీసుకొని వచ్చుటకు బదులు అతని ఆస్థి విలువను గూర్చి దేవుని యెదుట అబద్ధమాడాడని పేతురు తెలియజేసాడు. పేతురు పలికిన ఆ మాటలు విన్న వెంటనే అనినియ నేలను పడి ప్రాణం విడిచాడు. మూడు గంటల తరువాత సప్పీరా అనినియకు జరిగినది ఎరుగక లోనికి వచ్చినది. వారు అమ్మిన భూమి విలువ ఎంతని అడిగినప్పుడు ఆమె కూడా ఆ మొత్తాన్ని గూర్చి అబద్ధం చెప్పినది. అప్పుడు పేతురు "ప్రభువు యొక్క ఆత్మను శోధించుటకు మీరెందుకు ఏకీభవించితిరి?" అని చెప్పినప్పుడు ఆమె కూడా అతని పాదముల యొద్ద పడి ప్రాణం విడిచింది. అప్పుడు సంఘములోని వారందరు ఈ విషయాన్ని విన్న ప్రతివారు భయకంపితులైరి. దేవునితో

మన సమస్తమును సమర్పిస్తున్నామని చెప్పుచూ ఎంత వరకు మనము ఆయన సేవలో వాడబడుచున్నామనునది గ్రహించాలి. దేవుని దృష్టిలో మనమేలాగున్నామనునది ముఖ్యముగా గమనించవలసిన విషయము. సహోదరులారా, మనకు అనేక తలాంతులు సామర్థ్యతలు గలవు. మన సమయాన్ని, ధనాన్ని, తలాంతులను స్వార్థంతో దాచుకొంటూ సమస్తాన్ని మమర్పిస్తున్నట్లు నటిస్తున్నాము. **సమస్తమును ఎరిగిన మన దేవుడ్ని మనం మోసగించలేము.**

# 52
# ప్రభువు సంఘము

అపో.కా. 17:21 *"ఏథెన్సు వారందరును అక్కడ నివసించు పరదేశులును ఏదో యొక క్రొత్త సంగతి చెప్పుటయందును వినుటయందును మాత్రమే తమ కాలము గడుపుచుండువారు".* నిత్యము ఒక నూతనమైన లేక భిన్నమైన విషయాన్ని గూర్చి విననియెడల కొందరు నిరాశక్తులగుచుందురు. ఇది వ్యర్థ్య సంభాషణలు చేయ వారి స్వభావము. వారు ఎల్లప్పుడు అసాధారణమైన లేక అఘోరమైన విషయాల కొరకు ఎదురుచూస్తుంటారు.

అపో॥కా 17:21 చదువునప్పుడు ప్రభువు సంఘమందలి కొందరు సభ్యులను గూర్చి ఆశ్చర్యపడుచుందును. క్రైస్తవ్యమును గూర్చి వారు మాట్లాడు సంగతులు క్రొత్తగాను, వ్యత్యాసముగాను, అఘోరముగాను ఉండవలెననెడి వారి కోరిక నుండి పుట్టినవే గాని దేవుని సత్యముపై నున్న ప్రేమనుండి కాదు. అట్టివాటిలో ఒకటి మతశాఖల వారు మన క్రైస్తవ సహోదరులని మనవి చేయుట. బైబిలు నెరిగిన వారిగా ఎంచబడినవారు అట్టి విధముగా పలుకుట నిశ్చయముగా ఆశ్చర్యమును, అఘోరమునైయున్నది. క్రీస్తు సువార్త

వినువారందరు రక్షణ సంకల్పమును నేర్చుకొని విధేయులగునట్లు తేటగాను సామాన్యముగాను ఇవ్వబడినది. నిజక్రైస్తవులందరు వాక్యముచేత, వాక్యము ద్వారా ఆత్మచే నడిపింపబడినవారై ఒకే శరీరములోనికి బాప్తీస్మము పొందునట్లు నడిపించబడిరి. 1కొరింథీ 12:13, కొలస్సీ 1:8 నందు ఆ శరీరము సంఘమని చెప్పబడినది. సువార్త రక్షణ పథకమునకు హృదయాంత రంగము నుండి విధేయులమైనప్పుడు మనము ప్రభువు సంఘానికి చేర్చబడితిమి (అపో.కా. 2:47)

క్రీస్తు, ఆయన సంఘమును స్థాపించెను. (మత్తయి 16:18). మత శాఖల సంఘమేదైనను స్థాపించబడకమునుపే ఆయన సంఘాన్ని స్థాపించాడు. అట్లయినచో ఒకడు ఎన్నడును సువార్త రక్షణ పథకానికి విధేయుడు కాకుండా ఎట్లు క్రీస్తు సంఘ సభ్యుడు కాగలడు? లేక ఒకడు మతశాఖల సంఘంలో సభ్యుడైయుండుటను విశ్వసించి, ఆశించుట ద్వారా ఏలాగు ప్రభువు సంఘంలోనికి బాప్తీస్మము పొందగలడు? అనగా ఒకడు ఒక మత శాఖల సంఘములో సభ్యుడైయుండుటకు సిద్ధపడి విశ్వసించి నప్పుడు ప్రభువు సంఘంలోనికి ఏలాగు చేర్చబడగలడు?

అన్ని మతశాఖల సంఘములు కలిపి ప్రభువు సంఘమగునని కొందరు చెప్పుదురు. మతశాఖలు, వారి సంఘములో చేరుటకు వ్యత్యాసమైన ప్రణాళికలను బోధిస్తూ వివిధములైన సిద్ధాంతములను బోధించుచుండగా అది ఎట్లు సాధ్యమగును? క్రీస్తు విభజింపబడినాడా? అపోస్తలుల కార్యముల గ్రంథమందు వ్రాయబడిన రక్షణ పొందిన వారి ఉదాహరణలు తప్పయినవా? ఎన్నటికి కాదు. దేవుడు మానవునికి ఒకే రక్షణ పథకాన్నిచ్చాడు. ప్రభువు సంఘంలోనికి ప్రవేశించాలని ఆశించువారందరు ఆ రక్షణ పథకానికి విధేయులు కావాలి.

# 53
# జీవ కిరీటము

క్రీస్తు సువార్తకు విధేయులై అంకితమైన క్రైస్తవ జీవితాన్ని జీవించగోరు వారందరు ఈ లోక జీవితంలోనికి శోధనల ద్వారా వెళ్ళుటకు సిద్ధపడ వలయును. ప్రాపంచిక పాపములలో క్రైస్తవులు పాలివారగునట్లు ప్రలోభ పరచుటకు సాతాను నిరంతరము అలుపెరుగని ప్రయత్నాలు చేస్తున్నాడు. శరీరాశ, నేత్రాశ, జీవపుడంబముల ద్వారా (మనము అనేక సార్లు ప్రతిఘటించినప్పటికి) మన హృదయాల్లో ప్రవేశించడానికి మార్గాన్ని కనుగొనడానికి సాతను అతని ప్రయత్నాన్ని కొనసాగిస్తుంటాడు. అపోస్తలుడైన పౌలు శోధనను గూర్చి ఇలా వ్రాసాడు. “సాధారణముగా మనుష్యులకు కలుగు శోధనలు తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగిన వాడు; మీరు సహింపగలిగినంత కంటే ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు. అంతేకాదు, సహింపగలుగుటకు ఆయన శోధనతో కూడ తప్పించుకొను మార్గమును కలుగజేయును” (1కొరింథీ 10:13). స్వార్థము, మనకు కావలసినదంతయు కలిగియుండవలెననెడి ఆశ, మనలను ప్రభువును వెంబడించకుండా చేయుచున్నవని నా నమ్మకము. మరి ఎక్కువైన వస్తుసంపద కావలెననెడి ఆశ క్రైస్తవులను కూడ వశపరచు కొనుచున్నది. తరచు ప్రజలు రెండు మూడు పనులు చేసి ఈలోక వస్తు సంపదను సంపాదించుదురు. వారి పనినుండి సమయము లభించనందున ఆరాధనను కూడా పోగొట్టుకొందురు. వారికి కుటుంబముతో కలసి సంతోషించు సమయము కూడా ఉండదు. భర్తలుగా, భార్యలుగా, తల్లి దండ్రులుగా తమ బాంధవ్యమును దృఢపరచు కొనుటకు కూడా సమయ ముండదు. సహోదరులారా, దేవుని పిల్లలను మోసగించుటలో విజేయుడైన

సాతాను సంతోషానికి అవధులుండవు.

అతి ప్రాముఖ్యమైన వాటిని అర్థం చేసుకొని వాటిని సాధించడానికి కృషిచేయడమే ఆనందమయమైన క్రైస్తవ జీవితానికి మూలం. దేవుని పిల్లలుగా మనం నిజమైన సంతోషాన్ని కలిగియుండాలంటే, దేవునికి విశ్వాసులంగా జీవించాలి. సంతోషం మన ఎంపికలోనే ఉంది. మనం ప్రార్థన ద్వారా, బైబిలు చదివి, ధ్యానించడం ద్వారా దేవునికి దగ్గరైనప్పుడు, మనం నైతికంగాను, ఆత్మీయంగాను జీవించవలసిన విధంగా జీవించి, మన తలాంతులను, సామర్థ్యాలను దేవుని రాజ్యాన్ని వ్యాపింపచేయడంలో వినియోగించినపుడు మనం దేవుని ఆధీనంలో ఉంటాము గనుక సాతాను మన జీవితాలను పరిపాలించలేడు. మనం విజేయులమై ఒకనాడు జీవ కిరీటాన్ని అందుకుంటాము.

## 54
## సామర్థ్యతలు

దేవుడు మానవులందరికి కొన్ని సామర్థ్యతలనిచ్చాడు. ఒక ఆరోగ్య వంతుడైన మానవుడు అతిశయించలేని సామర్థ్యత ఏదియు ఉండదు. మత్తయి 25:14-30 నందు గల తలాంతులను గూర్చిన ఉపమానము మనకీ విషయాన్ని బోధిస్తుంది. మనకు సమర్థతలు కలవు. ఐదు తలాంతులు గల పనివారు, రెండు తలాంతులు గల పనివారియందు దేవుడు కోరు మన ప్రవర్తన ప్రతిబింబిస్తుంది. మనము ధైర్యముగా నుండి మన తలాంతులను ఉపయోగించిన యెడల సంఘము నానాటికి ఎదిగి సమయము మించిపోకముందే నశించిన ఆత్మలన్నియు క్రీస్తు నొద్దకు తీసుకొని రాబడును.

ఒకే తలాంతు గలవాడు, అతనికి ఒక్కటే తలాంతు ఇవ్వబడినందు

వలన అపజయము పొందలేదు గాని, అపజయం పొందుతానేమోననే భయములో బంధీ కావడం వలన అపజయం పొందాడు. ఈనాడు ప్రభువు సంఘమందలి అనేకులు తమకు దేవుడిచ్చిన తలాంతులను ఉపయోగించుటకు భయపడుచున్నారు. సంఘములోని వారందరు సువార్తతో ముందుకు సాగినయెడల సంఘము ఎంత వేగముగా ఎదుగునో ఒక్కసారి ఆలోచించుము. యెరూషలేములోని సంఘము శ్రమల వలన చెదరిపోయిరి. గాని ఆ సంఘసభ్యులు యేసును గూర్చి వారున్న ప్రతిచోటా బోధించారు. ఆదిమ సంఘము ఎదిగి, సువార్త ప్రపంచమంతట ప్రకటించుట వలన పౌలు జీవితకాలములోనే అందరు సువార్తను విన్నారు.

మనమందరము ఒకే విధమైన తలాంతులు గలవారము కాదు గాని మనకున్న తలాంతులను వినియోగించకపోవుట పొరపాటై మనము మన ఆత్మలను నశింపజేసుకొందుము. సహోదరులారా, మనము మన తలాంతులను పాతిపెట్టక దేవుని యెడల మన నిర్ణయములను ధైర్యముతో కొనసాగించుకొందము. అందుకు మనము మొదట, తలాంతులు గల వారమని తెలుసుకొనవలెను. అప్పుడు ఆ సామర్ధ్యతలను దేవుని రాజ్య వ్యాప్తి కొరకై వినియోగించుదము. భయముతో మనము వెనుకకు తగ్గరాదు. గాని దేవుని వాక్యమను ఆత్మ ఖడ్గమును ధరించి ముందుకు సాగిపోవలెను. నిజమైన సిలువ యోధులుగా సాతానునెదిరించు యుద్ధమందు చేరిన యెడల వాడు మన యొద్దనుండి పారిపోవును.

సహోదరులారా! జీవితము మిక్కిలి చిన్నది. అది త్వరలోనే గతించి పోవును. మన జీవితములను గూర్చి మనము లెక్క ఒప్పగించవలెను. నీవు నమ్మకమైన సేవకుడవా? నీ సమాధానము "కాదు" అయినట్లయిన ఇప్పుడే నీవొక నిర్ణయాన్ని తీసుకొని నమ్మకమైన సేవకుడవు కమ్ము.

# 55
# జీవితంతో జూదమాడకు

మన దేశంలో మంచి నైతిక జీవితాన్ని జీవించేవారెందరో ఉన్నారు. వారిని గూర్చి ఎట్టి ప్రచారము ఉండదు. టెలివిజన్ల వార్తా ప్రసారాల్లోను, వార్తా పత్రికలలోను మన సమాజంలో జరుగుతున్న అన్ని నేరాల్ని, మోసాల్ని, క్రూరత్వాన్ని నిరంతరం ప్రసారం చేస్తూ ఉంటారు. బైబిలునందు బోధించ బడిన నీతికి వ్యతిరేకంగా అనేకులు జీవిస్తున్నారు. బైబిలునందు బోధింప బడిన మంచి చెడులను మనము అంగీకరించక పోయిన యెడల మంచి చెడుల వ్యత్యాసాన్ని గ్రహించగల ప్రామాణికం మనకు లేదు.

ప్రజలు తమ్మును ఎయిడ్స్, తదితర సుఖరోగముల నుండి కాపాడు కొనుటకు "సురక్షిత శృంగారము" (Safe Sex) అనునది దేశమంతట బహుళంగా ప్రచారం చేయబడుతుంది. లైంగిక వ్యాధుల నుండి కాపాడు కొనుటకు ఒకే మార్గమేదనగా, జీవిత భాగస్వామితో తప్ప వేరెవరితోను లైంగిక సంబంధము పెట్టుకొనకూడదు. సురక్షిత శృంగారము ప్రచారంచేసే వాళ్ళు, ఆ పద్ధతులననుసరించి ఎయిడ్స్, లైంగిక వ్యాధుల బారినపడిన లక్షలమందిని గూర్చి మాట్లాడారు. ప్రభుత్వం కోట్ల కొలది రూపాయలు వెచ్చించినప్పటికి ఈ సురక్షిత శృంగార పద్ధతులు ఏ విధంగాను ఉపయోగ పడడం లేదు.

వివాహం కాని యవ్వనస్తులు, బయట శృంగారంతో ఒక్క భయంకరమైన ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. అసలు వివాహేతర లైంగిక సంబంధము దేవుని చట్టానికి విరుద్ధం. అది ఒక జీవిత కాలానికి సరిపడే ప్రమాదం. యవ్వనస్తులారా, మీరు మీ కన్యత్వాన్ని పోగొట్టుకుంటే అది ఎన్నడు తిరిగి

రాదు. లేనిచో మీరు పవిత్రంగా మీ జీవిత భాగస్వామికి వివాహంలో మిమ్మును అర్పించుకుంటారు. ఇద్దరు పవిత్రమైన వ్యక్తులు వివాహ పర్యంతము వేచియున్నప్పుడు వారు ఒకరి యెడల ఒకరు నమ్మకంగాను విశ్వాసంగాను జీవించగలరు. సురక్షిత శృంగారం విఫలం కావడాన్ని గూర్చి ఇప్పుడు చాలా విషయాలు వ్రాయబడ్డాయి. అనేకులు నిజమైన సిద్ధాంతాన్ని అంగీకరించి దాని ప్రకారం జీవించడానికి ఎన్నుకున్నారు. చాలామంది ఎయిడ్స్ వ్యాధి బారిన పడి మరణమైపోతున్నారు. కొందరు సుఖ వ్యాధుల వలన తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఇది నీకు జరుగదని బుద్ధిలేని ఆలోచన పెట్టుకోవద్దు. నీ జీవితాన్ని సురక్షిత శృంగార పద్ధతులతో జూదమాడవద్దు. నిన్ను నీవు పవిత్రంగానుంచుకొని దేవునికి దగ్గరగా జీవించు. అప్పుడు నీ జీవితం మంచిగాను, సురక్షితంగాను ఉంటుంది.

# 56

# మనపై అధికారం కలవారికి విధేయులైయుండుడి

"ప్రతివాడును పై అధికారులకు లోబడియుండవలెను; ఏలయనగా దేవుని వలన కలిగినది తప్ప మరి ఏ అధికారమును లేదు; ఉన్న అధికారములు దేవుని వలననే నియమింపబడియున్నవి" (రోమా 13:1). క్రైస్తవులు, దేశ చట్టములకు విధేయులైయుండవలెను. చట్టములు మన భద్రత కొరకును, ప్రయోజనము కొరకును నియమించబడినవి. మనం ప్రభుత్వానికి, చట్ట ప్రకారము పరిపాలించు అధికారులకు, వెన్నుదన్నుగా నుండవలయును. తరచు ప్రజలు హద్దులేని వేగముతో ప్రయాణించుటను గూర్చి అతిశయించుదురు. కొందరు రక్షణ పరికరాల్ని ఉపయోగించరు,

కొందరు భద్రతలేని వాహనములను నడుపుట లేక చట్టం యెడల వారికి గల నిర్లక్ష్యాన్ని తెలియజేయడానికి అన్నట్లు లెక్కలేనితనంగా వాహనాల్ని నడుపుతుంటారు.

దేశపౌరులలో అనేకమంది, క్రైస్తవులలో కొందరు ప్రభుత్వ చట్టాల్ని, కార్యక్రమాల్ని జరిగించుటకు కావలసిన పన్నులను చెల్లించుటకు ఫిర్యాదులు చేయుదురు. కొన్ని సమయములందు కొన్ని చట్టములు ప్రతివారికి అన్యాయముగా కనిపించును గాని మనము అట్టి చట్టములకు కూడ విధేయులము కావలయును. మన చట్టములను, ప్రభుత్వాన్ని గౌరవించునట్లు మన పిల్లలను పెంచవలయును. తల్లిదండ్రులుగా మనము చట్టబద్ధుల మనియు, మనపై పరిపాలన గల వారికి లోబడువారమనియు చూపించ వలయును.

క్రైస్తవులమైన మనము మన పాలకులను బలపరచు వారముగా నుండ వలయును. ప్రభుత్వము యొక్క ప్రమేయము లేకుండా దేవుడ్ని ఆరాధించు స్వాతంత్ర్యాన్ని మన చట్ట సభలలోనే అనుకూలపరచుదురు. అనేకమంది యవ్వన స్త్రీ, పురుషులు వారి జీవితములనిచ్చి ఈ స్వాతంత్ర్యాన్ని కాపాడి, మన స్వదేశంలో మనకు స్వేచ్ఛను ప్రసాదించారు. క్రైస్తవులు, చరిత్రలో మన స్వాతంత్ర్యానికి కారణభూతులైన వారిని గౌరవించి, దేశ చట్టములకు విధేయులైయుండవలెనని దేవుని ఆజ్ఞయైయున్నది.

# 57
# విడిచిపెట్టకు

క్రైస్తవుడుకాగలవానికి నీవు సువార్తను అందించినప్పుడు, ఆ వ్యక్తి వెంటనే సమాధానము చెప్పనప్పుడు, విడిచిపెట్టవద్దు. అతడ్ని కలయుట

మానక దయతోను సాధువైన మనస్సుతోను మాట్లాడుతూ సువార్తకు విధేయుడగుటను గూర్చి మాట్లాడుము.

కొన్నిసార్లు మనుష్యులు తరచి ఆలోచించుటకు సమయము కావల యును. సువార్తకు విధేయులగుట ఒక పెద్ద నిర్ణయము. అది ఒకడు చేయు నిర్ణయములన్నిటికన్న ప్రాముఖ్యమైన నిర్ణయము. అందువలన వారు ఆలోచించి నిర్ణయం తీసుకొనుటకు కావలసిన సమయాన్నివ్వాలి. కొందరు వారి చిత్తాన్ని వెంటనే దేవునికి సమర్పించలేక, సువార్తను తిరస్కరిస్తారు, గాని ఇంకొందరు వారి విధానాన్ని గూర్చి సునిసితంగా ఆలోచించి దేవుని వాక్యాన్ని అర్థం చేసుకొనవలసిన అవసరాన్ని గ్రహిస్తారు. అట్టి ప్రశస్తమైన ఆత్మలను గూర్చి ఓపికతో కనిపెట్టుచు త్వరపడి విడిచిపెట్టకూడదు.

దేవుని పిల్లలలో ఒకరిగా దేవుణ్ని సేవించడం, ఆయనకు దగ్గరగా జీవించువారికి ఆయన రక్షణను వాగ్దానం చేసాడని తెలుసుకోవడం అత్యంత ఆనందదాయకము. క్రీస్తు మనకోసం మరణించి, ఆయన పరిశుద్ధ రక్తాన్ని చిందించడం ద్వారా మన పాపాల్ని కడిగివేసాడని గ్రహించడం ఎంత ఆశీర్వాదం?

మనం క్రీస్తును గూర్చి, మానవులకొరకాయన చేసిన త్యాగాన్ని గూర్చి ఇతరులకు బోధించాలి. ఆయన విధేయత చూపుటకు సువార్తను అనుగ్రహించి, ఆ సువార్తను ఇతరులకు బోధించాలని ఆజ్ఞాపించాడు. మానవుడు విధేయుడగుట ద్వారా రక్షింపబడగలుగుటకు సువార్త ఒక్కటి మాత్రమే దేవుని శక్తియైయున్నది. క్రీస్తు ప్రశస్తరక్తముచేత రక్షింపబడిన వారమై ఈ సువార్తను నశించిన వారికి బోధించుటను కొనసాగించ వలయును. రక్షింపబడుటకు వేరొక మార్గమేదియు లేదు.

# 58
# పై నుండి వచ్చిన జ్ఞానము

"అయితే పైనుండి వచ్చు జ్ఞానము మొట్టమొదటి పవిత్రమైనది తరువాత సమాధానకరమైనది, మృదువైనది, సులభముగా లోబడునది, కనికరము తోను మంచి ఫలములతోను నిండుకొనినది, పక్షపాతమైనను వేషధారణ యైనను లేనిదియునైయున్నది" (యాకోబు 3:17). మనమందరము జ్ఞానులము కావలయునను కోరిక యుండును. మనం జ్ఞానాన్ని వెదకుతాము గాని, తరచు తెలివిని జ్ఞానమని అపోహపడుతుంటాము. గాని తెలివిని మాత్రమే సంపూర్ణ జ్ఞానమని సరిపెట్టుకొని విజేయులమగుటకు మూలమైన ఒక విషయాన్ని మరచిపోతుంటాము.

ఈ లోక రీత్యా మనం జ్ఞానవంతులమనిపించుకొనుటకు సరిపడదు. ఒకడు దేవుని వాక్య ప్రకారము జ్ఞాని కావలయును. నిజమైన జ్ఞానియగుటకు ఒకడు క్రీస్తు సువార్తకు విధేయుడై, సమర్పణ కలిగిన విశ్వాస క్రైస్తవ జీవితాన్ని జీవించవలయును. అటువంటి జ్ఞానము ఒక వ్యక్తిని పవిత్రమైన, పరిశుభ్రమైన పరిశుద్ధ జీవితాన్ని జీవించేలా చేస్తుంది. అలాంటి జీవితము కనికరముతోను, సాధుత్వముతోను, సమాధానముతోను నిండి మంచి ఫలములను ఫలించును.

ఒక జ్ఞానియైనవాడు పక్షపాతము చూపడు. నిజమైన జ్ఞాని జీవితంలో వేషధారణ ఉండదు.

అధ్యయనం చేయకుండా తెలివితేటల్ని సంపాదించలేము. ప్రార్థన లేకుండా జ్ఞానాన్ని చేరలేము. పవిత్రమైన జ్ఞానం పరలోక మందున్న తండ్రి నుండి వచ్చును. మనమందరము తెలివి తేటల్ని వెదకి, ఆ తెలివిని ఉపయోగించడానికి కావలసిన జ్ఞానం కోసం ప్రార్థన చేద్దాం.

# 59
# లోకస్థుల వలె నుండకుము

"విడాకులు" అనునది ఒక భయంకరమై హృదయవిదారకరమైన అనుభవము. అది ఒక కుటుంబంలోని సన్నిహిత వ్యక్తి మరణమంతటి విషాదంగా పరిగణింపబడును. ఆశాభంగము, ఆత్మన్యూనత తదితరమైన మానసిక బుగ్మతలు విడాకుల నుండి ఉద్భవించును. పిల్లలున్నప్పుడు ఆ బాధ మరింత హెచ్చుగానుండును.

ఒకప్పుడు మన ఆత్మీయ కుటుంబములందు విడాకులను గూర్చి వినిపించెడిదికాదు. గాని ఇప్పుడు సామాన్యమై పోవుచున్నది. బైబిలు గ్రంధాన్ని విశ్వాసంగా అనుసరించినయెడల, అందు విడాకులను గూర్చియు జీవిత సమస్యలన్నింటినిగూర్చియు సమాధానము కలదు.

జీవిత సమస్యలలో అనేకములు స్వార్థానికి, జాలిలేనితనానికి చెందినవి. గాని అన్ని సమస్యలకు కారణం దేవుని వాక్యానికి హత్తుకొనలేక పోవుట. క్రైస్తవులుగా మనము క్రీస్తువలె నుండుటకు నిర్ణయించుకొన్న యెడల ఎక్కువ బాధలు, హృదయవేదన లేకుండా ఉండవచ్చును. నమ్మకత్వము, మనకంటే ఎక్కువగా ఇతరులను గౌరవించుట వంటి క్రీస్తు లక్షణాల్ని మనం తీసుకొని ఇతరులలో మంచికొరకు వెదకినయెడల మరింత తేలికగా విడాకులు తదితరమైన మానవ విషాదములను దూరపరచుకొనగలము.

క్రీస్తు సువార్త వలన మనము లోకమునుండి వేరుచేయబడితిమి. మనం లోకస్థులవలె నుండరాదు.

## 60
# మాట్లాడుటకు ముందు ఆలోచించు

బాధ, హృదయవేదన, కలవరము, అపరాధము, ఆత్మన్యూనత అనునవి త్వరపడి మాట్లాడుటవలన కలుగును. యాకోబు 3వ అధ్యాయమునందు నాలుకను స్వాధీనపరచుకొనుటను గూర్చి వ్రాయబడెను. మనము మాట్లాడుటకు ముందు ఆలోచించినయెడల మనము మంచి భర్తలము, మంచి భార్యలము, మంచి పిల్లలము కాగలము.

పిల్లలుగా, మనము దేవుని కుటుంబమందు సభ్యులముగా నుండుటకు ఆశ్చర్యకరమైన అవకాశాన్ని కలిగియున్నాము. మనము క్రీస్తు ప్రశస్తరక్తముతో కొనబడియున్నాము. మనము దేవుని పిల్లలము గనుక మనం పరలోకానికి వెళ్ళెదమను నిరీక్షణకలదు. క్రీస్తు జీవితము మనకు మాదిరికావలయునని జ్ఞాపకముంచుకొనవలయును. యేసు దయగలవాడు, జాలిగలవాడు, సాధువైనవాడు. మన ప్రభువైన యేసు బుద్ధిపూర్వకముగా ఒక దయలేని మాటతో ఎవరికి హానిచేయడు.

సహోదరులారా! మనం బైబిలు విద్యార్థులముగా నుండి యేసు జీవితాన్ని మాదిరిగా తీసుకొందాము. దేవుని సూచన ప్రకారం జీవించిన యెడల అనేకమైన మన సమస్యలు కరిగిపోవును.

## 61
# ప్రేమ శాశ్వతమైనది

1కొరింథి 13వ అద్యాయమందు భాషలతో మాట్లాడుట, ప్రవచనములు చెప్పుటవంటి కృపావరములు పూర్ణమైనది వచ్చినప్పుడు నిరర్ధకమగునని వ్రాయబడియున్నది. (10వ వచనము)

"పూర్ణమైనది" అనగా స్వాతంత్ర్యమునిచ్చు సంపూర్ణమైన నియమము (యాకోబు 1:25). లేక పూర్ణముగా బయల్పరచబడిన క్రొత్త నిబంధన. క్రొత్తనిబంధన పూర్తియైనప్పుడు కృపావరములకు ఎట్టి అవసరములేదు. 2తిమోతి 3:16,17 నందు పౌలు ఇలా వ్రాస్తున్నాడు "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము, ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమైయున్నది".

"కృపావరములవలెకాక, ప్రేమ శాశ్వతమైనది (1కొరింథి 13:8-13). దేవుడు ప్రేమయైయున్నాడు. దేవుడు శాశ్వతమైనవాడైనట్లు ప్రేమకూడా శాశ్వతమైనది. మానవుని యెడల దేవుని ప్రేమ, ఆయన అద్వితీయ కుమారుడ్ని బలిగా అర్పించడం ద్వారా బయల్పరచాడు (యోహాను 3:16). దేశ, సాంఘిక, శారీరక, కులబేధములు లేక దేవుడు అందరికొరకు ఈ గొప్ప త్యాగాన్ని చేసాడు. దేవుడు మానవులందరి ఆత్మలను ప్రేమిస్తున్నాడు.

మనయెడల దేవుడు చూపిన ప్రేమవంటి ప్రేమ మనము కలిగియున్న యెడల మనుష్యులందరిని అనగా మన శత్రువులను కూడా పక్షపాతము లేకుండా ప్రేమించవలెను. మన ఆత్మలను దేవుడు ప్రేమించినట్లు మనము మానవులందరి ఆత్మలను ప్రేమించిన యెడల ప్రభువు పనిలో మనము తీరికలేకుండా ఉందుము.

## 62

## దేవుడ్ని ఆరాధించు

ప్రాపంచిక విషయములలో చిక్కుకొని కొందరు ప్రభువు సంఘాన్ని విడిచిపెట్టారు. అదే అవిశ్వాసులైన క్రైస్తవులను కలసి కారణమడిగినప్పుడు

"ఆరాధనాకార్యక్రమమునుండి నాకెట్టి ప్రయోజనము కలుగలేదు" అని చెప్పుదురు.

వయోవృద్ధులను, వ్యాధిగ్రస్తులను దర్శించినపుడు ఇందుకు వ్యత్యాసమైన ప్రవర్తనను గమనిస్తుంటాము. ఇట్టి విలువైన వ్యక్తులు తాము సంఘ కార్యక్రమాలన్నిటికి హాజరు కాలేక పోతున్నందుకు విలపిస్తుంటారు. ఆరోగ్యవంతులైన క్రైస్తవులు, పరిశుద్ధులతో కలసి దేవుడ్ని ఆరాధించు అవకాశాన్ని ఎందుచేత పోగొట్టుకొంటున్నారు?

ఆరాధనా కార్యక్రమము నుండి ఏమియు పొందలేని వాడు, గ్రహించ గలిగిన హృదయాన్ని తీసుకొని రావడంలో విఫలుడయ్యాడు. వారి సామర్థ్యత కన్న ఎక్కువగా ఆరాధించగోరు వారు నిజాయితీగల తెరచిన హృదయాలు కలిగి, ప్రేమతో దేవుని వాక్యాన్ని అందుకోవడానికి సిద్ధపడతారు.

తమ ప్రవర్తనను పరిశీలించుకొనగోరువారు ఆరాధనలో పాల్గొని అక్కడ నున్న విశ్వాసులైన క్రైస్తవులు ఆరాధనా కార్యక్రమము నుండి పొందుచున్న ప్రయోజనాన్ని తెలుసుకొనవచ్చును.

# 63
# నీ చిత్తమే సిద్ధించును గాక

అనేక సార్లు ప్రభువా, నీ చిత్తమే సిద్ధించును గాక" అని ప్రార్థిస్తుంటాము. ఇది నమ్మకముతో కూడిన వాక్యము. మనం నిజానికి "ప్రభువా, నేను సరియైన పనులు చెయ్యగలగడానికి మరియు నీ చిత్తంలో నిలిచియుండ డానికి, నిన్ను విశ్వసిస్తున్నాను" అని ప్రార్థిస్తున్నాము. "**ఆశీర్వాదమునకు వారసులవుటకు మీరు పిలువబడితిరి గనుక కీడుకు ప్రతి కీడైనను దూషణకు ప్రతిదూషణయైనను చేయక దీవించుడి**" (1పేతురు 3:9). దేవుని వాక్యము

ద్వారా మనము తెలుసుకొన్నదేమనగా, దేవుడు పాపుల ప్రార్ధననాలకించడు. "దేవుడు పాపుల మనవి ఆలకింపడని యెరుగుదుము; ఎవడైనను దైవభక్తుడై యుండి ఆయన చిత్తము చొప్పున జరిగించిన యెడల ఆయన వాని మనవి ఆలకించును". (యోహాను 9:31) "ఆయన చిత్తము చొప్పున జరిగించిన యెడల" అను వాక్యము మనము దేవునికి ప్రార్థించునపుడు "నీ చిత్తమే సిద్ధించును *గాక*" అని పలుకుటకు అర్హులమేనా అని పరిశీలించుకొన వలయును.

మనం దేవుని చిత్తాన్ని సరిగ్గా అర్థం చేసుకొనగలిగిన యెడల మన ప్రార్ధన శక్తివంతమైన ప్రార్ధనగా ఉండగలదు. దేవుని వాక్యాన్ని అధ్యయనం చెయ్యడానికి సమయాన్ని వెచ్చించవలెను. ఆ వాక్యాన్ని మంచిదైన నిజాయితీగల హృదయంతో దేవుని చిత్తమునందు నిలిచియుండునట్లు మన జీవితములకు అన్వయించుకొనవలయును.

# 64

# అనుకూలమైన తలంపులను కలిగియుండుము

మనము వ్యాధిగ్రస్తులమై యున్నప్పుడు లేక ఆత్మ న్యూనతతో బాధపడు తున్నప్పుడు ఇతరులపై తేలికగా కోపపడుట, వ్యతిరేకత చూపుట జరుగును. అటువంటి సమయాల్లో మనం సామాన్యంగా తేలికగా తీసుకొనే విషయా లను గూర్చి ఎక్కువగా ఆలోచిస్తుంటాము. మన బాధను, కోపాన్ని ప్రతికూల ఆలోచనలతో మేళవించినప్పుడు మనం ఒక దుష్టచక్రంలో బంధింపబడి మరింత వ్యతిరేకత, ఆత్మన్యూనతలకు గురియగుదుము. మనల్ని మనము దౌర్భాగ్యులను చేసుకొనడంలో ఆనందిస్తూ, బాధకు అంటగట్టబడి, ఆ బాధకు

అంతములేకుండా చింతిస్తూ ఉంటాము. "మనమే మనకు బద్ధశత్రువులము" అని ఒకనానుడి కలదు.

క్రైస్తవులు అన్ని పరిస్థితులలోను సంతోషంగా ఉండాలి. వారు దేవుని సొంత బిడ్డలు. అందువలన వారు ప్రతిదిన ఆశీర్వాదాల్ని పొందుతూ పరలోకానికి వెళతామనే నిరీక్షణలో ఉంటారు. క్రైస్తవుని హృదయంలో వ్యతిరేకతకు గాని, కోపానికి గాని, ప్రతికూల ఆలోచనలకు గాని స్థానం లేదు.

అపోస్తలుడైన పౌలు పిలిప్పీ 4:13లో వ్రాసినట్లు మనముకూడా చెప్పగలగవలెను. "నన్ను బలపరచు క్రీస్తునందే నేను సమస్తమును చేయగలను". మనకు తృప్తి, మనశ్శాంతి ఉన్నప్పుడు క్రీస్తునందు మన సహోదరులకు సహోదరీలకు ప్రోత్సాహకరముగానుండి ప్రతిదిన జీవితాన్ని మనముందున్న పరలోక భాగ్యాన్ని తలంచుచూ సంతోషంగా గడపగలము.

## 65

## వెల ఎంతో లెక్కించావా?

వెల ఎంతో లెక్కించావా? (Have you counted the cost) అనే ఇంగ్లీషు పాట ఉద్దేశ్యము ఒకని ఆత్మను పోగొట్టుకుంటే చెల్లించవలసిన వెలయని అర్ధము. గాని లెక్కించవలసిన వెల వేరొకటి ఉన్నది, క్రైస్తవ జీవితం జీవించడానికి చెల్లించవలసిన వెల.

గలతీ 5:19-22 నందు మనము విడువవలసిన శరీర కార్యములను గూర్చి చదువుదము. దేవునికి నమ్మకమైన వారముగా జీవించుటకు మనము విడువవలసిన ఇహలోక విషయాలను గూర్చి యేసు ప్రభువు చెప్పాడు. (లూకా 9:62; లూకా 14:26,27). మనకును మన దేవునికిని మధ్య దేనిని అంగీకరించలేము.

క్రీస్తును వెంబడించుటకు చెల్లించవలసిన వెల అధికముగా కనిపించి నప్పటికి అది ఆ విలువకు సరిపోతుంది. క్రైస్తవ జీవితానికి ఈలోకంలోను, పైలోకంలోను కూడా అనేకమైన గొప్ప బహుమానములు కలవు. ఒకడు క్రీస్తు సువార్తకు విధేయుడైనప్పుడు, అతడు యేసు పవిత్ర రక్తంతో కొనబడి దేవుని కుటుంబంలోనికి జన్మించి ఆశ్చర్యకరమైన ఆయన పిల్లలతో కలసి జీవిస్తాడు. ఇది ఒక గొప్ప ఆశీర్వాదము. నిరీక్షణ, ఆదరణ, మనశ్శాంతి అనునవి క్రైస్తవ జీవితంలోనే దొరకును గనుక; ఆ జీవితాన్ని గొప్పగా కోరుకొన్న యెడల, పరలోక వాగ్దానము విశ్వాసులందరికి ఒక అద్భుతమైన భవిష్యత్తు.

# 66
# సేవకులు

క్రైస్తవులందరు వారి అవయవములను పరిశుద్ధత కలుగుటకై నీతికి దాసులుగా అప్పగించవలయును (రోమా 6:19). మన సహోదరులలో కొందరు దేవుని సేవకులుగా పిలిపించుకొనుటకు సిగ్గుపడుదురు. ఎందుకనగా దేవుని సేవకులనగా ఉదర పోషణ కోసం సేవకులయ్యారని ఇతరులు అనుకుంటారనే భయం. ఒక సంఘానికి బోధకునిగా నియమించ బడినవారు మంచి పనిని చేయువారు. ఆలాగుననే ఆ సేవకుడ్ని పోషించ డానికి దయగల సంఘము కూడా అవసరము.

ప్రతి క్రైస్తవునికి సొంత తలాంతులు కలవు. ఆ తలాంతులన్నియు ప్రభువు సంఘానికి కావలయును. ఏ తలాంతు కూడా దేవుని దృష్టిలో ఎక్కువగాని తక్కువ గాని కాదు. గాని ఆ తలాంతులన్నియు దేవుని సేవలో వినియోగించుటకు దేవుడిచ్చిన బహుమానాలు. క్రీస్తునందు సహోదరులు,

సహోదరీలు అందరు దేవుని పనిలో సమానమైన ప్రాధాన్యతగలవారు (1కొరింథీ 12:14).

బోధకులు (సంఘమునుండి జీతము పొందువారు) మాత్రమే వ్యక్తిగత సువార్త చేయవలెనని ఆశించుట వలన అనేక ఆత్మలు నశించిపోవుచున్నవి. మనమందరము సువార్తికులమై, ఈ ప్రాముఖ్యమైన సువార్త పనియందు తీరికలేకుండ ఉండవలయును. మానవుల ఆత్మల యెడల, శ్రద్ధగల వారముగా ముందుకు వెళ్ళినప్పుడు మనము ప్రభువు సంఘమందు ఆత్మీయమైన, సంఖ్యాపరమైన ఎదుగుదలను చూడగలము.

## 67
# మనలను మనము తగ్గించుకొనవలయును

తన్ను తాను ఎంచుకొనతగిన దానికంటె ఎక్కువగా ఎంచుకొనక దేవుడు ఒక్కొక్కనికి విభజించి యిచ్చిన విశ్వాసపరిమాణ ప్రకారము, తాను స్వస్థ బుద్ధిగలవాడగుటకై తగిన రీతిగా తన్ను ఎంచుకొనవలెనని, నాకు అనుగ్రహింపబడిన కృపను బట్టి మీలోనున్న ప్రతివానితోను చెప్పుచున్నాను. తగ్గించుకొనుట అనే లక్షణం మనల్ని లోకం నుండి ప్రత్యేకంగా చూపిస్తుంది. తరచు మన సామర్థ్యతల్ని బట్టి అతిశయిస్తూ మన పొరపాట్లను దాచిపెడు తుంటాము. మన సహోదరులు సాధించేవాటిని గూర్చి తక్కువగా మాట్లాడుతూ, వారి తప్పిదాల్ని భూతద్దాలలో చూపిస్తుంటాము. ఇవి గర్వానికి, దురహం కారానికి చిహ్నాలు. ఈ ప్రవర్తనను మనం క్రీస్తు నుండి నేర్చుకోలేదు. ఆయన తన్ను తాను తగ్గించుకున్నాడు (ఫిలిప్పీ 2:8).

క్రైస్తవులు ఇతరులతో తమ్మును సరిచూచుకొనినప్పుడు వారు హెచ్చుగా ఉన్నట్లు కనిపించుదురు. ఆలాగున సరిచూడడం వలన మనం లూకా

18:10-14 నందు గల పరిశయ్యుడు పాపియైన సుంకరితో పోల్చుకొన్న విధంగా ఉండును. క్రీస్తు, క్రైస్తవులకు కొలబద్ధయైయున్నాడు. మనం, మన జీవితాల్ని, లక్షణాలను ప్రభువుతో పోల్చుకొన్నప్పుడు, మనం ఎంత దీనులమో ఎంత చిన్నవారమో మనకు కనిపిస్తుంది.

ఫిలిప్పీ 2:3,4 నందు "కక్ష చేతనైనను వృధాతిశయము చేతనైనను ఏమియు చేయక, వినయమైన మనస్సు గలవారై యొకనినొకడు తన కంటె యోగ్యుడని ఎంచుచు మీలో ప్రతివాడును తన సొంత కార్యములను మాత్రమే కాక యితరుల కార్యములను కూడా చూడవలయును". సహోదరులు సాధువైన వారును, శాంతి కాముకులునై, ఇతరుల క్షేమాన్ని కోరుతూ వారిని మనకంటే హెచ్చుగా ఎంచవలయును. ఈలాంటి ప్రవర్తన మనకున్నప్పుడు మనము బాహ్యపురుషుడ్ని చూడక, అంతరంగమందున్న ప్రశస్తమైన ఆత్మను చూడగలము.

మనము మనలను హెచ్చించుకొనుటను గూర్చి లేక ఒక సహోదరుడ్ని ఇంకొక సహోదరుని కన్న హెచ్చుగా ఎంచుటను గూర్చి జాగ్రత్తపడవలెను. దేవునికి పక్షపాతము లేదు. మనం హెచ్చుగా ఎంచునది దేవుని దృష్టిలో హెచ్చుగా నుండక పోవచ్చును. గర్వాన్ని, పక్షపాతాన్ని ప్రక్కన పెట్టి, ఒకరిని ఒకరము ప్రేమతో సేవించు భాగ్యాన్ని కలిగియుందము.

## 68

## సొవార్తీకరణ - ఒక జీవిత విధానము

దేవుడు మనకు సువార్త రక్షణ పథకాన్నిచ్చాడు. మనం హృదయాంతరంగము నుండి ఈ పథకానికి విధేయులమై జీవితాంతము విశ్వాసులముగా జీవించినయెడల మనం రక్షించబడగలము. మనం వినవలెను (రోమా 10:17).

మరణపర్యంతము విశ్వాసులంగా జీవించాలి (ప్రకటన 2:10).

మనం దేవుడ్ని సేవించినపుడు, ఎదిగిన క్రైస్తవులుగా పరిణతిచెంద గలము. పరిణతిచెందిన క్రైస్తవులముగా మనలను, వెంబడించు ఇతరులకు మంచి మాదిరికాగలము (1కొరింథి 11:1). క్రైస్తవజీవితం జీవించడమంటే దేవుడ్ని ఆత్మతోను సత్యముతోను సేవించి, మనజ్యోతులను మానవులమధ్య ప్రకాశింపజేసి, వారు మన సత్‌క్రియలను చూసి పరలోకమందున్న తండ్రిని మహిమపరచునట్లు జీవించుట (మత్తయి 5:16).

మనం క్రైస్తవజీవితాన్ని జీవించుచుండగా నశించిన ఆత్మలను క్రీస్తు నొద్దకు నడిపించు ఆశక్తిని పెంపొందించుకొనవలెను. దేవుని యెడల మన ప్రేమ, ఆయన్ని సేవించాలనే ఆశ మనం ఆయన వాక్యాన్ని ఆశక్తితో అధ్యయనం చేయడం ద్వారా అభివృద్ధిచెందుతుంది. సువార్త రక్షించుటకు దేవుని శక్తియని (రోమా 1:16) గ్రహించడం ద్వారా ఇతరులను ఆయన యొద్దకు నడిపించుటకు మనము సిద్ధపడవలయును.

మనతో కొందరికి, ఇతరులకు యేసును గూర్చి బోధించుట అను మొదటి మెట్టు కష్టతరముగా నుండవచ్చును. గాని దేవుడు మనకొరకు చేసిన సమస్తముకొరకు ఆయనయెడల మన ప్రేమ అభినందన ఆమొదటి మెట్టుకు మనలను పురికొల్పుతుంది. మనం ప్రార్థనచేసి, వాక్యాన్ని చదివి ఇతరులకు బోధించుటకు కృషిచేసిన యెడల మనముకూడా ఆత్మీయముగా ఎదుగుచున్నామని కనుగొనగలము. ఆత్మరక్షణ ఒక ఉద్యోగము కాదుగాని, అది ఒక జీవన విధానము. బైబిలు చదువుటకు అవకాశముల కొరకు మనము కనిపెట్టుదుము. ఆవిధంగా మన తలాంతులను సంపూర్తిగా అభివృద్ధిచేసుకొందుము.

"నేను నిజమైన ద్రాక్షావల్లిని, నాతండ్రి వ్యవసాయకుడు నాలో ఫలింపని ప్రతి తీగెను ఆయన తీసిపారవేయును; ఫలించు ప్రతి తీగె మరి ఎక్కువగా ఫలింపవలెనని దానిలోని పనికిరాని తీగెలను తీసివేయును" (యోహాను 15:1,2).

## 69
## "నేను" పరీక్షించుకో : క్రీస్తుపై కేంద్రీకరించు

నీ గురి ఏమిటి? ఇది ప్రతి క్రైస్తవుడు బదులు చెప్పవలసిన ప్రశ్న. క్రైస్తవ్యము కొంతకాలము మట్టుకు పాటించే విధానము కాదు. అది ప్రతిదినము జీవించవలసిన జీవన విధానం. అది చలిగా ఉన్నప్పుడు వేసుకొని, ఉష్ణోగ్రత హెచ్చినపుడు తీసివేసే కోటులాంటిది కాదు. మనం బాప్తీస్మమందు క్రీస్తును ధరించినప్పుడు, మరణ పర్యంతము ఆయనను ధరించియుండవలయును. "సహోదరులారా! మీరైతే మేలు చేయుటలో విసుకవద్దు" (2థెస్స. 3:13).

క్రైస్తవ జీవితము సమతుల్య జీవితము. మనము కుడికి గాని ఎడమకు గాని తొలగక తిన్నని ద్వారముగల ఇరుకు మార్గమున నిలకడగా నుండవలయును. మనము ఎక్కడ ఉన్నను, ఏమి చేసినను, పనిలోవున్నను, పాఠశాలలో ఉన్నను, ఆటలాడినను, ఇతరులు మనలో క్రీస్తును చూడవలయును. ప్రజలందరిలో మనము నిజాయితీకి, నిష్కాపట్యమునకు, తోటి మానవుల యెడల ప్రేమకు నిదర్శనములుగా నుండవలయును.

దేవుని కుటుంబములో భాగముగా నుండుట ఆశ్చర్యకరమైన ఆశీర్వాదము. సహోదరుల మధ్య ఒకరి యెడల ఒకరికి గల ప్రేమ, సంఘము

కలసియుండుటకు కావలసిన బంధము. మన క్రైస్తవ కుటుంబముతో కలిసియుండు సమయము కొరకు ప్రతి అవకాశమును సద్వినియోగపరచు కొనవలయును. ఎట్లయినను క్రీస్తునందు విశ్వాసులైన వారందరు కలసి పరలోకమందు నిత్యత్వమును గడుపుదురని వాగ్దానము చేయబడినది. "దేవుని కుమారుని నామమందు విశ్వాసముంచు మీరు నిత్యజీవము *గలవారని తెలిసికొనునట్లు నేను ఈ సంగతులను మీకు వ్రాయుచున్నాను"* (1యోహాను 5:13).

దేవుడు మన కొరకు అట్టి ఆశ్చర్యకరమైన బహుమానమును వాగ్దానము చేసెను. అది ఒక అందమైన నివాసము (యోహాను 14:1-6). అచ్చట మరణమైనను, కన్నీరైనను, విచారమైనను, వ్యాధిబాధలయినను ఉండవు (ప్రకటన 21:4). ఆయన ప్రేమనుండి ఏదియు మనలను ఎడబాపదని కూడా ఆయన వాగ్దానం చేసాడు (రోమా 8:35-39). ఇవన్నియు ఎరిగిన వారమై మన ప్రభువునుండి మనము ఎట్లు తొలగిపోగలము? ఆయన స్వాస్థ్యమునకు వారసులమగువరకు మరణ పర్యంతము దేవునికి విశ్వాసులముగా జీవించెదము గాక.

## 70

## పలుకుబడి

క్రైస్తవులు ప్రభువును, వారి సహోదరులను ప్రేమించి, వారి పరిసరాల లోని ప్రజలలో మంచి పేరు సంపాదించుకొందురు. ఇహలోక పద్ధతులనను సరించుటకు బదులు ప్రభువుకిష్టులుగా జీవించుటయందు లక్ష్యముంచు దురు. వారు సామాన్యమైన వస్త్రధారణను కలిగియుండి, తమ తలంపులను పవిత్రముగానుంచుకొందురు. ఇతరులను క్రీస్తునొద్దకు నడిపించు క్రైస్తవులు

వారి ప్రవర్తన నిందారహితముగానుండునట్లు చూచుకొందురు.

మన పలుకుబడిని మనము నాశనము చేసుకొన్న యెడల మనము ఇతరులను క్రీస్తుకు దూరముగా నడిపించుదుము. మత్తుపానీయములు సేవించుట, పొగత్రాగుట, తిట్టుట, జారత్వము, వ్యభిచారము, కొట్టుకొనుట, అసాధారణమైన వస్త్రధారణ వంటి లౌకిక క్రియలకు క్రైస్తవ జీవితమందు స్థానము లేదు.

లోకము సంఘమును చూచి, అందలి బలహీనుడైన వ్యక్తిని బట్టి తీర్పు చెప్పుదురు. క్రీస్తు సంఘము నుండి గొప్ప కార్యములను ఆశించుదురు. మనము చేయు ప్రతి పనిలోను బైబిలును వెంబడించుటకు ప్రయాస పడుదుమని వారెరుగుదురు. లేఖనములయందు మనకు గల జ్ఞానమును బట్టి ఇతరులు మనలనెరుగుదురు. ప్రభువు సంఘమునకు నిందను తేక, ప్రభువుకు గౌరవ మర్యాదలను సంపాదించువారముగా నుందుము గాక.

## 71

# ఎదుగుచున్న క్రైస్తవుడు

ఎదుగుచున్న క్రైస్తవుడు బైబిలు చదువుట కొరకు సమయమును వెచ్చించి, దేవుని వాక్యము నుండి కొన్ని ప్రాముఖ్యమైన పాఠములను నేర్చుకొనును. ఒకడు నేర్చుకొనగల గొప్ప లక్షణము నిస్వార్థము. స్వార్థమును మరచి, ఇతరులకు సేవ చేయు సామర్థ్యమును కలిగియుండుట.

తరచు మనము ఆరాధనాకార్యక్రమములకు హాజరగునపుడు, మన సొంత అవసరములపై లక్ష్యముంచి ఇతరులను నిర్లక్ష్యము చేయరాదు. అట్టి ఆరాధనకు అతి తక్కువ ఫలితముండును. ఇతరులకు సహాయపడుట ద్వారా మనము ఎదుగుదుము. ఇతరులను చేరకుండ మనము క్రైస్తవులుగా

ఎదగలేము. సంఘ ఎదుగుదలకు ఒక ముఖ్యమైన ఆటంకమేమనగా మన సహోదరులు నశించిన ఆత్మలను చేరుటకు ఇష్టము లేకుండుట. మనము సువార్తకు విధేయులు కాని కుటుంబముల యొద్దకు, స్నేహితుల యొద్దకు, మనల్ని ఎరిగిన వారందరి యొద్దకు వెళ్ళి వారి శాశ్వత రక్షణ దేవుని వాక్యమును అంగీకరించుటపై ఆధారపడియున్నదని అంగీకరింప జేయవలెను.

సహోదరులారా! మనము ప్రజలను, ముఖ్యముగా మన కుటుంబములను, స్నేహితులను ప్రేమించుచున్నామని చెప్పుదుము. వారి ఆత్మల సంక్షేమార్థము సరియైన నిర్ణయములు తీసికొనునట్లు వారికి సహాయపడుట ద్వారా మనకు వారిపై గల ప్రేమను నిరూపించుకొందము. ఇతరులకు సహాయము చేయుట కొరకు వారిని చేరుట ద్వారా మనమెన్నడు ఊహించని విధముగా క్రైస్తవులముగా ఎదుగుదము.

## 72

## విడాకులను గూర్చి ఏమి?

దేవుడు విడాకులను అసహ్యించుకొనును అనునది సత్యమైనప్పటికిని (మలాకీ 2:13-16), ఈనాడు విడాకులు నానాటికి అధికమగుచున్నవి. అమెరికాదేశంలోని గణాంక శాస్త్రప్రకారము 1980లలో జరిగిన సంఘ వివాహాలు విడాకులతో ముగిసినవి. 1989లో జరిగిన వివాహాలలో ప్రతి వివాహ భాగస్వామి కనీసం ఒక్కసారి విడాకులు తీసుకొన్నవారే. విడాకులు తీసుకొన్నవారిలో 80 శాతం మంది తిరిగి వివాహం చేసుకొంటున్నారు. అందులో మరల 50 శాతం తిరిగి విడాకులతో అంతమగుచున్నవి. ఈ సమస్యకు కొన్ని కారణాల్ని అన్వేషిద్దాం.

1. **హత్తుకొనలేకపోవుట** : దంపతులు కలసి జీవించుట సాధ్యము కానిచో

విడాకులు తీసుకొనవచ్చునను అభిప్రాయముతో వివాహము చేసుకొందురు. వివాహాన్ని తేలికగా తీసుకొనక, ఆ బంధాన్ని బలపరచుకొనుటకు, మరణ పర్యంతము కొనసాగుటకు కావలసిన దేనినైనను చేయు ఒప్పందమును కలిగియుండవలయును.

2. **అన్యోన్యత లేకపోవుట** : వివాహమైన దంపతులు ఎన్నడును ఎరుగని వారివలె వివాహమును అంతము చేసుకొందురు. వారు జీవిత భాగస్వాములనే ఆలోచనలేకుందురు. సంభాషణలు కేకలలోనికి కలహములోనికి, బాధాకరమైన మాటలలోనికి, నిందారోపణలలోనికి చేరునపుడు ప్రమాదకరమైన పరిస్థితులేర్పడును. కోపముతో మాట్లాడిన మాటలను తిరిగి తీసుకొనలేము, దాని పర్యవసానమైన బాధాకరమైన తలంపులు బాగుచేసుకొనలేము.

3. **కామోద్రేకమును ప్రేమగా అపార్థం చేసుకొనుట** : తరచు ప్రజలు కామోద్రేకము కొరకు వివాహము చేసుకొందురు గాని ఆ కామోద్రేకము చల్లారిన తరువాత, ఆ బంధము తేలిపోయి వివాహము విడాకులయందు అంతమగును. దంపతులు ఒకరినొకరు అర్థం చేసుకొని శారీరక ఆకర్షణ కన్న వివాహ బంధమునకు ఎక్కువ ప్రాధాన్యత నీయవలెను.

4. **దేవుని వాక్యమును అంగీకరించుటలో విఫలులగుట** : విడాకులు, తిరిగి వివాహము చేసుకొనుటను గూర్చి రెండు ప్రశ్నలు సామాన్యంగా అడుగుదురు.

   1. విడాకులను గూర్చిన దేవుని చట్టము క్రైస్తవేతరులకు కూడా అన్వయించునా? మరియు
   2. మేము లేఖనముల ప్రకారము కాక వివాహము చేసుకొన్న యెడల విడిపోవలయునా?

ఈ వాక్యములను చదివి, అధ్యయనం చేయాలి. మత్తయి 5:32; 19:1-9; రోమా 7:1-3; 1కొరింధీ 7:1-15. వివాహమును గూర్చి దేవుని చట్టము ప్రజలందరికి చెప్పబడినది. వివాహము చేసుకొను క్రైస్తవేతరులు దేవుని దృష్టిలో వివాహము చేసుకొన్నవారే.

దేవుడు జతపరచిన వారిని మనుష్యులు విడదీయకూడదు (మత్తయి 19:6). దేశ చట్టము, పరిస్థితులకు అనుగుణముగా విడాకులను అనుమతించవచ్చును. ఇప్పుడైనను మరెన్నడైనను దేవుడు విడాకులను అనుమతించడు.

# 73
# క్రైస్తవ ప్రేమ (అగపే)

1కొరింధీ పత్రిక 13వ అధ్యాయాన్ని అపోస్తలుడైన పౌలు వ్రాసినప్పుడు, అతడు క్రైస్తవ ప్రేమను గూర్చి మాట్లాడాడు. ఈ పత్రికను చదువుతున్నప్పుడు సహోదరుల మధ్య ఒక తీవ్రమైన సమస్యను కనుగొనగలము. అనేకులు స్వస్థపరచుట, భాషలతో మాట్లాడుట, ప్రవచించుట మొదలైన ఆత్మీయ వరములను పొందిరి. గాని భాషలతో మాట్లాడువారు, వారికి గొప్ప వరమీయబడినదని గర్వముతో ఇతరులను తక్కువగా చేయ ప్రయత్నించారు. వారి ప్రవర్తన బాధాకరమైన తలంపులను కలుగజేసి ఒకరి యెడల ఒకరికి గల ప్రేమను తగ్గించివేసినది.

ప్రేమ లేకుండా ఆ వరములన్నియు నిరుపయోగములని పౌలు సూచిస్తున్నాడు. "మనుష్యుల భాషలతోను, దేవదూతల భాషలతోను నేను మాటలాడినను, ప్రేమలేనివాడనైతే మ్రోగెడు కంచును, *గణగణలాడు తాళము*నైయుందును. ప్రవచించు కృపావరము కలిగి మర్మములన్నియు, జ్ఞానమంతయు ఎరిగినవాడనైనను ప్రేమలేనివాడనైతే వ్యర్థుడను. బీదల

కొరకు నా ఆస్తి అంతయు ఇచ్చినను, కాల్చబడుటకు నా శరీరమును అప్పగించినను, ప్రేమలేనివాడనైతే నాకు ప్రయోజనమేమియు లేదు" (1కొరింథీ 13:1-3). మనము చదివినది మరోసారి గమనిద్దాం. నేనెంత కలిగియున్నను, ఏమి చేయ గలిగినను క్రైస్తవ ప్రేమ **లేకుండా అదంతయు వ్యర్థము.**

మొదటి శతాబ్దమందలి ఆత్మీయ వరములు ఈనాడు లేనప్పటికి దేవుని యెడల క్రైస్తవ ప్రేమ సహోదరుల యెడల క్రైస్తవ ప్రేమ, మానవుల అందరి యెడల క్రైస్తవ ప్రేమ మన జీవితములలో ప్రత్యక్షము కావలయును. దేవుడు ప్రేమయైయున్నాడు, మనము ప్రేమ లేనివారమైన యెడల దేవుడు లేనివారము (1యోహాను 4:8). దేవుని వాక్యజ్ఞానము ద్వారా మన విశ్వాసము నిరంతరము ఎదుగుచూ, ప్రార్థన, ధ్యానముల ద్వారా మనము చేయు సమస్తము పవిత్రమైన హృదయముతో చేయుదము గాక.

# 74

# భూమిపై కలసి జీవిస్తూ, నిత్యత్వములో కలసి జీవించుదము

హెబ్రీ గ్రంథకర్త ఆదిమ సంఘమందలి పరిశుద్ధులను ఈ విధంగా హెచ్చరిస్తున్నాడు. "కొందరు మానుకొనుచున్నట్టుగా, సమాజముగా కూడుట మానక ఒకనినొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరియెక్కువగా ఆలాగు చేయుచు, ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని ఆలోచింతము" (హెబ్రీ 10:24,25). సహోదరులు దేవుణ్ని ఆరాధించుటకు, ఒకరితో ఒకరు సహవాసము కలిగియుండుటకు కలసి కూడుకొనుట చాలా ప్రాముఖ్యమైనది.

మనము నియమముగా కలసి కూడుకొనునప్పుడు, మన ఆత్మీయ ఎదుగుదలకు ఆవశ్యకమైన ఆత్మీయాహారములో పాలుపొందుదుము. దేవుని వాక్యాహారమును భుజించుటను, ఆరాధనను, ఒకరితో ఒకరు సహవాసము కలిగియుండుటను మానుకొన్నయెడల మనము బలహీనులమై, ఆత్మీయంగా మరణించు ప్రమాదములో నుందుము.

క్రైస్తవులు దేవుని కుటుంబమై, శారీరక కుటుంబమునందు వలె ఒకరికొకరు కావలయును. మనము ఆత్మీయ ప్రజలము. అందు వలన మనము కలసి జీవించుటయందు ఆనందించవలెను. *"సహోదర ప్రేమ విషయములో ఒకనియందొకడు అనురాగము గలవారై, ఘనత విషయములో ఒకనినొకడు గొప్పగా ఎంచుకొనుడి"* (రోమా 12:10). మనము ఆత్మీయముగా ఎదిగి, ఈ లోకములో ఉండగనే మన ఆత్మీయ కుటుంబము యెడల ప్రేమ, ఆనందము కలిగియుండవలయును. ఎందుకనగా మనము కలసి నిత్యత్వమును పరలోకమందు గడుపుటకు నిర్ణయించబడితిమి.

కొన్నిసార్లు ఎవరైనా "నాకెవరూ అవసరము లేదు" అనుట వినవచ్చును. అట్టి అభిప్రాయము విచారకరమైనది. మన జీవితములలో ప్రజలు కావలయును. సహోదర ప్రేమయందు, స్నేహమందు గల సంతోషమును మనము తెలుసుకొనవలయును. అట్టి సంబంధమును పొందుటకు ఉత్తమమైన మార్గమేదనగా, మనము సంఘమను కుటుంబముతో ప్రేమయందును, స్నేహమందును దేవుని వాక్య జ్ఞానమందును నమ్మకంగా కలసి ఎదగవలయును.

జీవితము చాలా చిన్నది. మన ఆత్మీయ కుటుంబముతో విడిపోయి, ఆత్మీయ జీవితమందుగల ప్రత్యేక ఆశీర్వాదముల నుండి వేరైన జీవితము అతి మిక్కిలి చిన్నది. మనమందరము దేవునికి దగ్గరగా జీవించుటకు కదలి,

ఆయనను హత్తుకొనుటకు ప్రయాసపడి సాధ్యమైనంత వరకు లోకమునకు దూరముగా జీవించుదముగాక. మరణ పర్యంతము విశ్వాసముగా జీవించుదము (ప్రకటన 2:10). నిరంతరము ప్రభువు వాగ్దానము చేసిన జీవ కిరీటము కొరకు ప్రయాసపడుదము.

## 75
## నేను వెళ్ళేది ఖాళీ చేతులతోనా

ప్రభువును ఎదుర్కొనుటకు మనతో ఒకరిని తీసుకొని వెళ్ళకుండుట క్షమించదగినది కాదు. దేవుడు, ఆయన అనంతమైన జ్ఞానముతోను, కనికరముతోను ఆయన్ని చేరు మార్గాన్ని చదునుగాను, తేటగాను తయారు చేసాడు. మనము బైబిలును అధ్యయనం చేసిన యెడల ఇతరులకు రక్షణ మార్గాన్ని ఉపదేశించు విధానాన్ని కనుగొందుము. దానికి తోడు మనలను ప్రోత్సహించుటకు అనేక గొప్ప గీతములను మానవులు రచించారు. "లెమ్ము నీ యజమాని పిలుస్తున్నాడు", "నేను ఖాళీ చేతులతో వెళ్ళవలయునా"? "పని కొరకు" "కోత పొలమునకు" వంటి అనేక పాటలు కలవు.

మనము దేవుని వాక్యాన్ని అధ్యయనం చేసినప్పుడు లేఖనములందలి సువార్త ప్రకటనను గూర్చిన ఆజ్ఞను గమనించకుండా ఉండలేము. మనము ఇంతకుముందు అనుకొన్న పాటలవంటి పాటలు పాడినప్పుడు, మనము దేవుడ్ని స్తుతిస్తూ ఆయన ఇచ్చిన గొప్ప ఆజ్ఞకు విధేయతచూపుటకు సహాయపడమని వేడుకొందుము (మార్కు 16:16; మత్తయి 28:19,20). ఇట్టి పాటలు మనము అరుదుగా పాడుటకు కారణమేమి?

కొన్నిసార్లు క్రైస్తవులు వెచ్చించవలసిన సమయము కన్నా అతి తక్కువ సమయమును ప్రభువుకు సమర్పించుచున్నారను అపరాధ భావము కలిగి

యుంటున్నారు. మనలను మనము సంపూర్తిగా దేవునికి సమర్పించుకొనుట మాత్రము కాక మన భయములన్నిటిని అధిగమించగలుగునట్లు ఆయనకు మనలను అప్పగించుకొనవలయును. మన పిరికితనమును, తిరస్కారమును గూర్చిన భయము, తక్కువ ఆత్మ స్థైర్యము అనువాటిని అధిగమించగల సామర్థ్యత మనలను దేవుని గొప్ప ఆజ్ఞకు విధేయత చూపుటను కొనసాగించును. మనము సర్వలోకమునకు వెళ్ళి సువార్త బోధింపవలయునని ఆజ్ఞాపించబడితిమి. మనము దేవుని మంచి పనివారుగా నుండునట్లు ఆయన నడిపింపు కొరకు ప్రార్థించు ప్రేమ గలవారమై యుండవలయును. మనందరము వేర్వేరు తలాంతులు గలిగినవారమనునది నిజము గనుక, కలసి క్రీస్తుకొరకు ఆత్మలను సంపాదించగలము.

## 76
## వైఖరి

క్రైస్తవ జీవితము జీవించుటయందు మన వైఖరి యొక్క ప్రాధాన్యత ఎంతయినను కలదు. ప్రతికూల ప్రవర్తన ఒకనిని అత్యంత విమర్శకునిగా చేసి జీవితము యొక్క చీకటి ప్రక్కను మాత్రమే చూడగలుగునట్లు చేయును. అటువంటి ఆలోచన మనలను అణగద్రొక్కునదిగా నుండును. మనము చెడును మాత్రమే చూచిన యెడల క్రైస్తవునిగానుండు ఆనందమును అనుభవించలేము.

మన జీవిత గురి అనుకూలంగా నుండవలయును. నీ చుట్టూ ఉన్న వాతావరణాన్ని చూడుము. దేవుడు సృష్టించిన అద్భుతమైన ప్రపంచాన్ని చూడుము. సూర్యోదయం, గంభీరమైన పర్వతాలు, నదులు మహా సముద్రాలు, అందమైన పుష్పాలు, వృక్షాలు, ప్రపంచంలోని గంభీరమైన

అద్భుతాలు దేవుడు మనం ఆనందించి అనుభవించడానికిచ్చాడు. మానవుని కొరకైన దేవుని ప్రేమ ఎంత గొప్పది? మనము అట్టి ఆశీర్వాదకరమైన ప్రజలము. మనము సంతోషించకుండా ఏలాగుండగలము?

అనుకూలమైన క్రైస్తవుని (Positive Christian) హృదయములో నిరీక్షణ, వెలుగుచున్న జ్యోతిలా ఉంటుంది. అతడు దేవునికి ఆయన పిల్లలపైగల ప్రేమను గూర్చి దేవుని వాక్యము నుండి నేర్చుకొని, దేవుడు మనందరి కొరకు చెల్లించిన మూల్యాన్ని గూర్చి తెలుసుకుంటాడు. ఆయన పిల్లల కొరకు మాత్రమే కాక ప్రపంచంలోనున్న అందరి ఆత్మల కొరకు దేవుడు ప్రేమ కలిగియున్నాడు. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16). అట్టి మూల్యము మన కొరకు చెల్లించబడినదని ఎరిగి సంతోషముతో కొనసాగి మనకొరకు నియమింపబడిన జీవకిరీటమును స్వీకరించుటకు విశ్వాసమందు నిలిచియుందము (ప్రకటన 2:10).

జీవితమునందు సంతోషించవలసిన మరొక ధన్యత ఏదనగా క్రైస్తవ గృహము. నిజమైన క్రైస్తవ గృహమునందు ప్రేమామయులైన దైవత్వముగల తల్లిదండ్రులు కలసి కష్టపడి తమ పిల్లలను దేవుని ప్రేమయందును, దైవ భయమునందును పెంచుదురు. అట్టి గృహమునందలి సభ్యులు కలసి పరలోకమందు నిత్యత్వమును గడుపుటకు సిద్ధపడుదురు. అట్టి ఆనంద దాయకమైన గురిని చేరుటకు ఆ కుటుంబము పరలోకము వైపు పయనించును. దేవుడు మార్గదర్శియని బాగుగా తెలుసుకొనునట్లు కలసి దేవుని వాక్యాన్ని అధ్యయనం చేయడానికి సమయాన్ని వెచ్చించుదురు.

అవును, రక్షించబడడానికి లేక నశించిపోవడానికి మన వైఖరిలోగల

వ్యత్యాసమే కారణము. మనము లోకమునకు వెలుగై కొండమీద నుండు పట్టణమువలెనున్నాము (మత్తయి 5:14). మనము క్రైస్తవులముగా ఆనందముగా నున్నామని లోకము ఎరుగునట్లు దృఢమైన వైఖరి కలిగియుందము.

## 77

# ప్రభువు యొక్క ఇహలోక కుటుంబము

క్రైస్తవ లోకంలో నున్న ఒక తప్పుడు బోధ ఏదనగా యేసు తల్లియైన మరియ ఆమె జీవితమంతా కన్యగానే జీవించినదని. ఆమె పరిశుద్ధాత్మ వలన గర్భము ధరించినపుడు కన్యకగా ఉండుట సత్యము. ఆమె యోసేపుకు ప్రధానము చేయబడినప్పటికిని, మన ప్రభువు జన్మించు పర్యంతము ఆమె కన్యకగానే జీవించెను. "...అని ప్రభువు తన ప్రవక్త ద్వారా పలికిన మాట నెరవేరునట్లు ఇదంతయు జరిగెను. ఇమ్మానుయేలను పేరునకు భాషాంతరమున దేవుడు మనకు తోడని అర్థము. యోసేపు నిద్ర మేల్కొని ప్రభువు దూత తనకు ఆజ్ఞాపించిన ప్రకారము చేసి, తన భార్యను చేర్చుకొని ఆమె కుమారుని కనువరకు ఆమెను ఎరుగకుండెను. అతడు ఆ కుమారునికి యేసు అను పేరు పెట్టెను" (మత్తయి 1:23-25).

యేసుప్రభువుకు ఆయన శారీరక జీవితంలో సహోదరులు, సహోదరీలు ఉన్నారని వినుటకు అనేకులు ఆశ్చర్యపడుదురు. "ఇతడు వడ్లవాని కుమారుడు కాడా? ఇతని తల్లి పేరు మరియ కాదా? యాకోబు, యోసేపు, సీమోను యూదాయనువారు ఇతని సహోదరులు కారా? ఇతని అక్క చెల్లెండ్రందరు మనతోనేయున్నారు కారా? ఇతనికి ఈ కార్యములన్నియు ఎక్కడ నుండి వచ్చెనని చెప్పుకొని ఆయన విషయమై అభ్యంతరపడిరి

(మత్తయి 13:55,56). "ఆయన జనసమూహములతో ఇంక మాట్లాడు చుండగా ఇదిగో ఆయన తల్లియు సహోదరులును ఆయనతో మాటలాడ గోరుచు వెలుపల నిలిచియుండిరి. అప్పుడొకడు ఇదిగో నీ తల్లియు నీ సహోదరులును నీతో మాటలాడవలెనని వెలుపల నిలిచియున్నారని ఆయనతో చెప్పెను" (మత్తయి 12:46,47).

యేసు సహోదరులలో ఒకడైన యాకోబు (గలతి 1:19) యెరూషలేము నందలి సంఘ నాయకుడు (అపో.కా. 12:17). అతడు యాకోబు పత్రికను వ్రాసెనని నమ్ముదురు. క్రీ॥శ॥ 62 నందు అతనికి ప్రధానయాజకునిచే మరణ దండనగావింపబడెను. మరియ మరణ పర్యంతము కన్యకగానే ఉండెనని బోధించువారు లేఖనములను ఎరుగనివారు గాని, లేఖనములను నిర్లక్ష్యము చేయువారుగాని అగుదురు. మన నమ్మకములు దేవుని వాక్యముపై ఆధారపడి యుండునట్లును, విశ్వాసము విషయములో మానవుల అభిప్రాయములపై ఆధారపడకుండునట్లును జాగ్రత్తపడుదము. మన ప్రభువును తీర్పు దినమందు ఎదుర్కొన్నప్పుడు, ప్రతి వారును తమ విశ్వాసములను, క్రియలను బట్టి లెక్క ఒప్పగింపవలెను. మనము గ్రంథమందు వ్రాయబడిన సంగతులను బట్టి తీర్పు తీర్చబడుదుము. (ప్రకటన 20:12,13).

## 78

# ఆత్మీయ ఫలములను ఫలించుము

"నీతిమంతులు ఇచ్చు ఫలము జీవవృక్షము. జ్ఞానముగలవారు ఇతరులను రక్షించుదురు. నీతిమంతులు భూమిమీద ప్రతిఫలము పొందుదురు. భక్తిహీనులును పాపులును మరి నిశ్చయముగా ఫలము పొందుదురు గదా" (సామెతలు 11:30). ఆత్మీయ ఫలము నీతిమంతులు

ఫలించు ఫలము. "అయితే ఆత్మఫలమేమనగా, ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము. అట్టివాటికి విరోధమైన నియమమేదియు లేదు" (గలతి 5:22,23). ఈలాంటి ఫలములు ఫలించువారు నీతిమంతులు.

అందుకు భిన్నముగా శరీరక్రియలను ఫలించువారు ఇహలోక జీవితమును జీవించుదురు. "శరీర కార్యములు స్పష్టమైయున్నవి; అవేవనగా, జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేధములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు మొదలైనవి. ఇట్టి వాటికి విరోధమైన నియమమేదియు లేదు. క్రీస్తు యేసు సంబంధులు శరీరమును దాని యిచ్ఛలతోను దురాశలతోను సిలువవేసియున్నారు".

మనము ఆగి మన చుట్టూ ఉన్న ప్రపంచ పోకడనంతటిని గమనించిన యెడల ఏది సరియైనదో తెలుసుకొనలేని పరిస్థితిలో నైతిక విలువల పతనము కనిపించును. అధికారంలో ఉన్నత పదవులలోనున్న వారు కూడా నైతిక విలువలు లేని జీవితాన్ని జీవిస్తున్నారు. సమాజంలో ప్రతీ శారీరక క్రియను జరిగించుటయందు నిమగ్నమైన ప్రజలు మన చుట్టూ ఉన్నారు. అనేకమంది ప్రజలు గ్రుడ్డిగా నాశనమువైపునకు పరుగెత్తుచున్నారనునది భయంకరమైన విషయము.

బైబిలును అధ్యయనం చేసి దేవుని వాక్యమందలి పాఠములతో మనలను సరిచేసుకొనవలసిన అవసరమున్నది. అట్లు చేయుటవలన శరీర క్రియలు ఎంతటి నాశనకరమైనవో, ఆత్మ ఫలములు ఎంత ఉన్నతమైన స్థితికి మనలను తీసుకొని వెళ్ళగలవో గమనించగలము. ప్రజలందరు మేల్కొని క్రీస్తువైపుకు తిరిగిన యెడల ప్రపంచము ఎంత సంతోషముగా నుండెడిది!

# 79
# యోసేపు - ఒక మంచి మాదిరి

యోసేపు బైబిలు గ్రంథమందలి అతి ప్రియమైన దైవజనుడు. ఆయన కథ మనందరికి ఆదర్శప్రాయముగా నుండవలయును. అసూయపరులైన సహోదరులు ఇతడ్ని గోతిలోనికి త్రోసివేసిరి. యోసేపు ఇరువది వెండి నాణెములకు కొందరు ఇష్మాయేలీయులకు, తరువాత ఫరో సామ్రాజ్యమందలి అధికారియైన పోతీఫరుకు అమ్మబడ్డాడు. పోతీఫరు అతి తొందరలో ప్రభువు యోసేపుకు తోడైయున్నాడని ఎరిగి, యోసేపును అతని గృహనిర్వాహకుని గాను తనకున్న సమస్తముపైన అధికారిగాను నియమించెను. పోతీఫరు భార్య యోసేపును చెరచుటకు ప్రయత్నించు పర్యంతము సమస్తము బాగుగా జరిగెను.

"అటు తరువాత అతని యజమానుని భార్య యోసేపు మీద కన్నువేసి తనతో శయనించుమని చెప్పెను. అయితే అతడు ఒప్పక నా యజమానుడు తనకు కలిగినదంతయు నా చేతికప్పగించెను *గదా!* నా వశమున తన ఇంటిలో ఏమి ఉన్నదో అతడెరుగడు; ఈ ఇంటిలో నాకంటే పై వాడెవడును లేడు. నీవు అతని భార్యవైనందున నిన్ను తప్ప మరి దేనిని నాకప్పగింపక యుండలేదు. కాబట్టి నేనెట్లు ఇంత ఘోరమైన దుష్కార్యము చేసి దేవునికి విరోధముగా పాపము కట్టుకొందునని తన యజమానుని భార్యతో అనెను" (ఆది. 39:7-9).

తరచు విడాకులకు కారణము జీవిత భాగస్వాములలో ఒకరియెడల ఒకరికి విశ్వాసము లేకపోవుట. పిల్లలకు, గృహము అనగా తినుటకు పండుకొనుటకు స్థలము మాత్రమే గాని దైవసన్నిధిని కలిగియున్న క్రైస్తవ

గృహము కాకుండుట విచారకరము. ఆ కారణముచేత కొన్ని గృహములలో మత్తుపానీయములు, మాదక ద్రవ్యములు సేవించుటకు పిల్లలు అలవాటు పడుట విచారకరము. మనము జాగ్రత్తగా గమనించిన యెడల, మన సొంత చేతులతో భవిష్యత్తు కొరకు ఒక నేరస్తులుకాగల అవకాశమున్న తరమును మన పిల్లలలో పెంచుచున్నాము. అట్టి ప్రమాద కరమైన వాతావరణములో మన పిల్లలు పెరుగుచుండుట భయంకరము కాదా? ప్రజలు యోసేపువలె పాపమును తిరస్కరించి, శోధననుండి పారిపోగలిగిన యెడల మన గృహములు ఎంత బలముగా నుండును? ఈ ప్రపంచమెంత ఉన్నతముగా నుండును?

అనేక క్రైస్తవ గృహములలో భార్యభర్తలు ఒకరియెడల ఒకరు నమ్మకస్థులై ఒకరియెడల ఒకరు సత్యవంతులై, ఒకరినొకరు ప్రేమతోను గౌరవముగాను ఎంచుకొనుటను బట్టి దేవునికి వందనములు. అట్టి గృహములు పిల్లలను పెంచుటకు అద్భుతమైన వాతావరణము. యోసేపు ఒక మంచి ఉదాహరణను మనముందుంచాడు. అనేకమంది అట్టి మాదిరిని వెంబడించుదురని నిరీక్షిద్దాం.

# 80

# వింత పదార్థము

నీవు మొదటిసారిగా నీ జీవిత భాగస్వామిని చూచినప్పుడు ఆమెలో లేక అతనిలో నిన్నాకర్షించినదేమి? అటులనే నీలో ఏది నీ జీవిత భాగస్వామిని ఆకర్షించినది? మీ ఇద్దరి మధ్య పెరిగిన సంబంధమునకు. ఆ వింత పదార్థమే మూలమై ఒకరిని బట్టి ఒకరు అతిశయించేలా చేసింది.

కొన్ని సందర్భాలలో కాలం గడచిన తరువాత మనము సౌకర్యంగా నుండి ఒకరినొకరము అభినందించుకొనలేక పోతున్నాము. ఆత్మ గౌరవము క్షీణిస్తుంది. ఒకరు మరొకరికి ప్రాముఖ్యమని ఆలోచించుట పోయినప్పుడు,

శోధన బలమైనదై తనను ప్రత్యేకముగా గౌరవించు వ్యక్తి ప్రవేశించి, వివాహేతర సంబంధములు ప్రారంభమగును. అట్టి హృదయవిదారకమైన పరిస్థితిని నియంత్రించుటకు అప్పుడప్పుడు భార్య భర్తలు నిజనిర్ధారణ (వారిని ఆకర్షించిన విషయాన్ని జ్ఞాపకం చేసుకొనుట) చేసుకొనవలయును. మనలను మనము ఇలా ప్రశ్నించుకోవాలి. నా జీవిత భాగస్వామిని ఉన్నతంగా చూస్తున్నానా? లేక నా జీవిత భాగస్వామిని విమర్శించి తక్కువ చేస్తున్నానా?

మన వివాహ జీవితాన్ని గూర్చి పరిశీలించుకొనుటకు మనము సమయాన్ని కేటాయించవలెను. మన అనుబంధములో ఆ వింత పదార్థమును పోగొట్టు కొన్నట్లయిన, ఒకనాడు మనము కలసియున్నప్పుడు కలిగియున్న ఆనందాన్ని తిరిగి స్థాపించుటకు తీవ్రంగా కృషిచేయవలెను.

మంచి వివాహాలు  అకస్మాత్తుగా సంభవింపవు గాని అవి శ్రమకు ఫలితాలు. ప్రతీ వ్యక్తి తన జీవిత భాగస్వామి తనను గూర్చి మంచిగా అభిప్రాయపడునట్లు శ్రమపడిన యెడల వివాహాలు నిరంతరము అభివృద్ధి చెంది బలపడును. అటువంటి తల్లిదండ్రులు ఒక మంచి ఆరోగ్యకరమైన వాతావరణంలో తమ పిల్లలను పెంచుదురు. పిల్లలకు సంతోషకరమైన నిలకడయైన కుటుంబము కావలయును. తగవులాటలకు, కలహములకు దూరమై బలమైన క్రైస్తవగృహమును కట్టుటకు ఆదర్శప్రాయులైన తల్లిదండ్రులు గల గృహము కావలయును.

## 81

# విభజన ఖండించబడినది

"సహోదరులారా! మీరందరు ఏక భావముతో మాట్లాడవలెననియు, మీలో కక్షలులేక, యేక మనస్సుతోను ఏకతాత్పర్యముతోను, మీరు సన్నద్ధులై

యుండవలెననియు, మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మిమ్మును వేడుకొను చున్నాను" (1కొరింథీ 1:10). క్రైస్తవులుగా మనము క్రీస్తు బోధయందు నిలిచియుండి ఐక్యముగా నుండగలము. మన ఆశలను ప్రక్కన పెట్టి దేవుని వాక్యాన్ని వెంబడించవలయును.

"అందువలన మనమికమీదట పసిపిల్లలమైయుండి, మనుష్యుల మాయోపాయములచేత వంచనతోను, తప్పు మార్గమునకులాగు కుయుక్తి తోను, గాలికి కొట్టుకొని పోవునట్లు కల్పింపబడిన ప్రతి ఉపదేశమునకు ఇటు అటు కొట్టుకొని పోవుచు అలలచేత ఎగురగొట్టబడినవారమైనట్లుండక, ప్రేమకలిగి సత్యము చెప్పుచు క్రీస్తువలె ఉండుటకు, మనమన్ని విషయము లలో ఎదుగుదము" (ఎఫెసీ 4:14,15).

దేవుని వాక్యమందు లేని వాటిని చదవమని చెప్పు మతశాఖల వలలో క్రైస్తవులు ఎన్నటికిని పడరాదు. మనము క్రీస్తు శరీరమై దేవుని వాక్యము మన ఐక్యతకు పునాది కావలయును. మనము విశ్వాసమందు పరిపక్వత చెంది, ఆరాధనలో ఐక్యతయొక్క ప్రాధాన్యతను గుర్తించి, దేవుని రాజ్య ఎల్లలను విస్తరింపజేయు పనిలో నిమగ్నమైయున్నయెడల మనమధ్యనున్న చిన్న చిన్న భేదాభిప్రాయములను ప్రక్కన పెట్టుటకు సాధ్యపడును.

"మీలో అసూయయు కలహమును ఉండగా మీరు శరీర సంబంధులై మనుష్యరీతిగా నడుచుకొనువారు కారా? ఒకడు నేను పౌలు వాడను, మరియొకడు – నేను అపొల్లోవాడను, అని చెప్పునప్పుడు మీరు ప్రకృతి సంబంధులైన మనుష్యులు కారా? అపొల్లో ఎవడు? పౌలెవడు? పరిచారకులే గదా. ఒక్కొక్కరికి ప్రభువనుగ్రహించిన ప్రకారము వారిద్వారా మీరు విశ్వసించితిరి. నేను నాటితిని, అపొల్లో నీళ్ళు పోసెను వృద్ధి కలుగజేసిన వాడు దేవుడే. కాబట్టి వృద్ధి కలుగజేసిన దేవునిలోనే గాని, నాటువానిలో

నైనను నీళ్ళు పోయువానిలోనైనను ఏమియు లేదు. నాటువాడును, నీళ్ళు పోయువాడును ఒక్కటే. ప్రతివాడు తాను చేసిన కష్టము కొలది జీతము పుచ్చుకొనును. మేము దేవుని జతపనివారమైయున్నాము; మీరు దేవుని వ్యవసాయమును దేవుని గృహమునైయున్నారు" (1కొరింధీ 3:3–9).

# 82
# క్రీస్తు వంటి లక్షణములు

"మెట్టుకు సహోదరులారా! యే యేగ్యతయైనను మెప్పైనను ఉండిన యెడల, ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో, వాటి మీద ధ్యానముంచు కొనుడి" (ఫిలిప్పీ 4:8). యేసు ప్రభువు ఈ భూమిపై ఉన్నప్పుడు ఈ లక్షణాల్ని కలిగియున్నాడు. ఆ ప్రభువు లక్షణాల్ని చేరుట ప్రతి క్రైస్తవుని గమ్యము కావలయును.

ఈ లక్షణాల్ని కలిగియున్న అనేకమంది క్రీస్తునందలి సహోదరులు సహోదరీలను మనమందరము ఎరుగుదుము. వారి జీవితాలు మనందరికి ఆదర్శప్రాయము, ప్రోత్సాహము కావలయును. దేవుడు యదేచ్ఛగా కొందరిని తీసుకొని, వారికీలక్షణాల్నిచ్చి ఆశీర్వదించలేదు. ఈ లక్షణాలు తప్పక పెంపొందింపజేసుకొని ఆ ప్రకారము నడువవలయును. అవి మనకు "రెండవ సృష్టి" (నూతన సృష్టి).

ఈనాటి ప్రపంచంలో మనచుట్టూ ఉన్న అనేకులు ఈ దైవ లక్షణాల ప్రాముఖ్యతను గమనించుట లేదు. దానికి బదులు సత్యాన్ని, నిజాయితీని, న్యాయాన్ని, పవిత్రమైన వాటిని, రమ్యమైనవాటిని, ఖ్యాతిగల వాటిని పాదముల క్రింద త్రొక్కి, శారీరక సంబంధమైన ఆస్థిని సంపాదించి,

ప్రాపంచిక కోరికలను తీర్చుకొనుటకు ముందుకు సాగిపోవుచున్నారు. ప్రపంచము అట్టి దుష్టత్వముతో నిండియున్నదనుట ఆశ్చర్యము కాదు.

తల్లిదండ్రులారా! మీ పిల్లలను వారు చిన్న పిల్లలుగానుండగనే అట్టి దైవ లక్షణాల్ని ఉపదేశించి, ఆ లక్షణాల్లో కొనసాగడానికి జీవితాంతం ప్రోత్సహించండి. బలమైన క్రైస్తవ తల్లిదండ్రులు, బైబిలును అధ్యయనం చేయువారుగానున్నప్పుడు, ప్రాముఖ్యమైన అను విషయాల్ని నేర్చుకొందురు. మాట చేతను, మాదిరి వలనను ఈ ప్రశస్తమైన లక్షణాన్ని ఉపదేశించుటకు ప్రయాసపడుదురు. ఎల్లప్పుడు యేసును మాదిరిగా పెట్టుకొని ఆయన లక్షణాల్ని బోధిస్తూ, ఆ ప్రకారం జీవిస్తూ, ఆశీర్వాదకరమైన జీవితాన్ని జీవించుదము.

# 83
# క్రైస్తవుల కొరకైన ఆశీర్వాదములు

*"నిరీక్షణగలవారై సంతోషించుచు, శ్రమయందు ఓర్పుగలవారై, ప్రార్థనయందు పట్టుదల కలిగియుండుడి"* (రోమా 12:12).

నిరీక్షణగలవారై సంతోషించుటకును, సమాధి నుండి పునరుత్థానుల మగుదుమను ఆశతోను ఆసక్తితోను, ఆ తరువాత వచ్చు పరలోక ఆనందము క్రైస్తవుడు నిరీక్షించు ఏకైక ఆశీర్వాదమైయున్నది. ప్రభువు కొరకు విశ్వాస ముగా జీవించువారి జీవితములలోనికి సంతోషాన్ని తీసుకొనివచ్చునది నిరీక్షణ. నిరీక్షణ ఆత్మకు లంగరు వంటిది (హెబ్రీ 6:19). అట్టి ఆశ్చర్య కరమైన నిరీక్షణ దేవుని పిల్లలకు మాత్రమే చెందినది. (ఎఫెస్సీ 2:12).

శ్రమలలో ఓపికగానుండుట అసాధ్యముగాని క్రైస్తవులుగా మనము విచారమునందును, బాధలలోను గల అనుభవాన్ని నేర్చుకొనగలము. నిరీక్షణ

జీవితంలోని శ్రమలను సహించుటకు ప్రోత్సాహాన్నిస్తుంది (యాకోబు 1:2,3).

క్రైస్తవునిగా నుండుటకు గల అధిక్యతలలో ప్రాముఖ్యమైనది ప్రార్థన. దేవుడు ప్రార్థన ద్వారా, ఆయన కృపా సింహాసనాన్ని చేరునట్లు అనుగ్రహించాడు. మనము పట్టుదలతో, విడువక ప్రార్థనలో కొనసాగవలయును.

విశ్వాసంగల క్రైస్తవులకు దేవుడు గొప్ప ఆశీర్వాదాల్నిచ్చాడు. అవేవనగా ప్రార్థన, సంతోషం, మనశ్శాంతి, కష్టాల్ని భరించే ఓపిక, నిత్యజీవం కొరకైన నిరీక్షణ. మనమెల్లప్పుడు మన ప్రభువైన దేవునికి ఆయన గొప్ప ప్రేమ కొరకు కృతజ్ఞులమై యుండవలయును.

## 84

# ప్రాముఖ్యమైన విషయాలు

ఆధునిక జీవితవేగంతో కలసుకొనుటకు ప్రయత్నిస్తూ ముందుకు కొనసాగుచుండగా, దినమునందు సరిపడునన్ని గంటలు లేవనిపించును. మనమందరము అనుసరించు తీరికలేని దినచర్యలు మనము ఆగి ఏది ప్రాముఖ్యమైనదని ఆలోచించునట్లు చేయును. మనయెడల మాత్రమే మనము నిజాయితీగలవారమైన యెడల, వస్తు సంపదలు వినోదభరితమైన ఆనందమునకు మొదటి ప్రాధాన్యతనిచ్చెదము. ఆ శాశ్వతమైన విషయాలకు హెచ్చు ప్రాధాన్యతనిచ్చుట సరియైనదా? పరలోకమందు మనము కూర్చుకొను ధనము చిమ్మెటయైనను తుప్పైనను తినివేయదు. ఈ భూమిపై మనము చేయు పని ఏదియు శాశ్వతము కాదు.

ఇహలోక సంపాదనకొరకు క్రైస్తవులు ఆరాధనను నిర్లక్ష్యము చేయుట ఆశ్చర్యకరము. క్రీడలలోను లేక మరొక వినోదము కొరకు దేవుణ్ని ఆరాధించు అవకాశాన్ని పోగొట్టుకొనువారి విషయమేమిటి? ఇవన్నియు ఈలోకము

అంతమైనప్పుడు అంతమగును. మనము మరణించిన తరువాత వీటిని మనతో తీసుకొని పోలేము.

క్రీస్తుకు అధిక ప్రాధాన్యతనిచ్చి ఆత్మీయ విషయాలకు, శారీరక విషయాలకన్న అధిక ప్రాధాన్యతనియ్యవలయును. దేవునితో మన సంబంధము, ఆస్థికన్నను, విద్యకన్నను, పలుకుబడికన్నను, గౌరవముకన్నను అత్యధిక ప్రాధాన్యతగల అంశము. క్రీస్తు లేని జీవితము వ్యర్థము. మనకు, మన ప్రభువుకు మధ్యన వచ్చు వాటినన్నిటిని ప్రక్కనపెట్టి, ఆయనకు నమ్మకమైన సేవకులుగా కొనసాగుదము.

## 85
# సమాజముగా కూడుకొనుటను మానుట

విశ్వాసముగల క్రైస్తవులు ఇతరులు సువార్త రక్షణ పధకమునకు విధేయులగుటను చూచి సంతోషించుదురు. నూతనముగా సహోదరులు, సహోదరీలు దేవుని కుటుంబములోనికి జన్మించినప్పుడు వారి పాపములు క్రీస్తు రక్తములో కడుగబడి వారు హిమమువలె తెల్లబడుటను చూచుట మనలను ఆనందముతో నింపును.

అనేకమంది నూతన క్రైస్తవులు పడిపోయి లోకమువైపు తిరిగి గమ్యమెరుగని దేవుని పిల్లలై తిరిగి పాపములో పడిపోవుట ఎంత విచారకరము? దేవునినెరిగిన ప్రజలు అవిశ్వాసులై పడిపోవుట హృదయవిదారకమైన విషయము. విశ్వాసముగా జీవించుట యొక్క ప్రాధాన్యతను గూర్చి ప్రభువు తేటగా మాట్లాడెను. "మరణము వరకు నమ్మకముగా ఉండుము. నేను నీకు జీవకిరీటమిచ్చెదను" (ప్రకటన 2:10). అపోస్తలుడైన పౌలు తన విశ్వాస్యతను గూర్చి ఇలా వ్రాసాడు. "ప్రభువు ఆ దినమున అతనికి, ఆయన

ప్రత్యక్షతను అపేక్షించువారికందరికిని నీతి కిరీటమిచ్చునని రూఢిగా చెప్పియున్నాడు" (2తిమోతి 4:7,8). హెబ్రీ గ్రంథకర్త కూడా ఈ విధంగా హెచ్చరించాడు. "కొందరు మానుకొనుచున్నట్టుగా, సమాజముగా కూడుట మానక, ఒకనినొకడు హెచ్చరించుచు, ఆదినము సమీపించుట మీరు చూచిన కొలది మరి యెక్కువగా ఆలాగు చేయుచు, ప్రేమచూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని ఆలోచింతము" (హెబ్రీ 10:24,25).

క్రైస్తవులలో అనేకులు పరిశుద్ధులతో సహవాసాన్ని కలిగియుండు బాధ్యతను తేలికగా తీసుకొందురు. మనము ప్రభువు యెడల సరియైన ప్రేమగలవారమై పరిశుద్ధులు కూడుకొను ప్రతిసారి మనము హాజరగుదుము. సాకులు చెప్పుట చాలా సులభము. తలనొప్పి, క్రికెట్, షాపింగ్ చేయుట లేక మరేదైనా లౌకిక కార్యక్రమము మనల్ని సమాజముగా కూడుకొనుట నుండి వేరుచేసిన యెడల మన హృదయాల్ని పరిశీలించుకొని మన జీవితాలలో దేనికి లేక ఎవరికి హెచ్చు ప్రాధాన్యతనిచ్చుచున్నామనునది పరీక్షించుకొనవలెను.

కొన్నిసార్లు సమాజముగా కూడుకొనుటయందు అవిశ్వాసులైనవారు వారున్న సమస్య తీరిపోగానే తిరిగి సహవాసములోనికి వచ్చెదమని చెప్పుదురు. తమ సమస్యలు తీరుటకు ప్రభువును హత్తుకొనియుండ వలయునని తెలుసుకొనలేకపోవుట ఎంత విచారకరము? మన జీవితము లోని ప్రతీ అంశములోను మనము విశ్వాసులమైన దేవుని పిల్లలుగా నుండుటకు నిర్ణయించుకొని బలహీనులైన సహోదరులను ఎల్లప్పుడు ప్రేమిస్తూ వారిని విశ్వాసులుగాను, మంచి పనులు చేయువారిగాను ఉండునట్లు ప్రోత్సహించెదము.

# 86

# ఒక జీవితకాలం - ఒక బహుమానం

మనకున్న చిన్న జీవితంలో అధికభాగాన్ని ధనసంపాదన కొరకు వృధా చేస్తుంటాము. మన చుట్టూ ఉన్న వారితో సమానమైన జీవితాన్ని జీవించాలని మనలో మనం అనుకుంటుంటాము. ఒక మంచి గృహంలో జీవించవలెను, ఖరీదైన వాహనాన్ని నడపాల, అందంగా కనపడే ఖరీదైన వస్త్రాలు ధరించవలెను, ఖరీదైన వినోదాన్నిచ్చే క్లబ్‌లో సభ్యత్వం కలిగియుండవలెను, సాధ్యమైనన్ని సార్లు మంచి రెస్టారెంటునందు భోజనం చేయవలెను అని ఆశిస్తుంటాము.

చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల కోరికమేరకు ప్రతి రూపాయిని, అప్పుచేసైనా కూడా ఖరీదైన వస్తువులు కొనడానికి ఇష్టపడుతుంటారు. గాని వారివ్వగలిగిన అతి విలువైన బహుమానాన్ని ఇవ్వలేకుంటారు. అదేమనగా వారి సమయాన్ని పిల్లల కొరకు కేటాయించుట. తల్లిదండ్రులు వారి సమయంలో అతి తక్కువ భాగాన్ని మాత్రమే పిల్లలతో గడపగలుగుచున్నారను అపరాధభావంతో తరచు ఎక్కువ ధనాన్ని ఖర్చుచేస్తుంటారు. పిల్లలు ఎదిగిన కొలది బహుమానాల ఖరీదు కూడా పెరుగుతుంటుంది. పిల్లల జీవన విధానం అలాగే ఉంటుందని వారు కూడా తమ పిల్లలతో అలాగే ప్రవర్తిస్తుంటారు. నిజానికి అట్టి జీవితం ఏ విధానానికి హత్తుకొననిది. అట్టిది తమ కుటుంబాలు దేవునికి సేవ చేసే ఒప్పందంలేని విధానం.

భార్య భర్తలు కలసి దేవుని నిజమైన ప్రేమలో ఒకరి కొరకొకరు జీవిస్తూ, వారి పిల్లలతో ఆరోగ్యకరమైన సంబంధాన్ని పెంపొందించుకొనవలెను. ఇద్దరూ పనిచేసే తల్లిదండ్రులు ఎక్కువ సమయాన్ని ఇంటి బయట పనిలో గడుపుదురు. వారు తమ్మును తీరిక లేని వారుగా చేసుకొని, ఒకరికొరకు

ఒకరు సమయాన్ని కేటాయించకుండా, ఇంటికి చేరేసరికి శారీరకంగాను, మానసికంగాను అలసిపోతారు. వారి పిల్లలను గూర్చి శ్రద్ధ తీసుకొనవలసిన అనుదిన బాధ్యతను నెరవేర్చు ఓపిక వారికుండదు. అట్టి పరిస్థితిలో ఇంటనున్న ప్రతివారు బాధననుభవించుదురు.

తల్లిదండ్రులారా! మీ పిల్లలతో సమయాన్ని గడపండి. అవసరాన్ని బట్టి ఆ సమయాన్ని మీ అనుదిన ప్రణాళికలో చేర్చండి. ఆ సమయాన్ని ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచడానికి వినియోగించండి (ఎఫెస్సీ 6:4).

తండ్రులారా! కుటుంబ యజమానిగా దేవుడు మీకిచ్చిన బాధ్యతను తిరిగి నిర్వహించండి. మీ పిల్లలను క్రమశిక్షణలో నుంచి వారు తల్లిదండ్రుల యెడల, పెద్దల యెడల, సహచరులయెడల గౌరవము కలిగియుండునట్లు ప్రేమతో బోధించండి. కుటుంబంగా సమయాన్ని గడపుటకు నిర్ణయించు కొని, దేవుడు కేంద్రంగాగల గృహాన్ని కట్టండి. అప్పుడాయన మనకు సంతోషాన్ని అనుగ్రహిస్తాడు.

## 87
## ఐక్యత

మన ప్రభువు మరణానికి ముందు ఆయన శిష్యులు ఐక్యంగా ఉండాలని ప్రార్థించాడు. “మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు, తండ్రీ నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున, వారును మన యందు ఏకమైయుండవలెనని వారికొరకు మాత్రము నేను ప్రార్థించుట లేదు, వారి వాక్యము వలన నాయందు విశ్వాసముంచు వారందరును ఏకమై యుండవలెనని వారి కొరకు ప్రార్థించుచున్నాను” (యోహాను 17:20,21).

సంఘమందు అంతర్గత విభేదాలు బాధను, తలనొప్పిని కలుగజేస్తాయి. అవి సంఘానికి క్రీస్తు కొరకు ఆత్మలను సంపాదించు సమర్ధతను కార్యదక్షతను పాడుచేస్తాయి.

అపోస్తలుడైన పౌలు పరిశుద్ధాత్మచే నడిపింపబడినవాడై, క్రీస్తు శరీరము (సంఘము) ఐక్యముగా నుండవలెనని తేటగా బోధించాడు.

"సుందరములైన మన అవయవములకు ఎక్కువ సౌందర్యమక్కరలేదు. అయితే శరీరములో వివాదములేక, అవయవములు ఒకదానినొకటి యేకముగా పరామర్శించులాగున, దేవుడు తక్కువ దానికే యెక్కువ ఘనత కలుగజేసి, శరీరమును అమర్చియున్నాడు. కాగా ఒక అవయవము శ్రమపడునప్పుడు అవయవములన్నియు దానితోకూడా శ్రమపడును, ఒక అవయవము ఘనతపొందునప్పుడు అవయవములన్నియు దానితోకూడా సంతోషించును. అటువలె, మీరు క్రీస్తుయొక్క శరీరమైయుండి వేరువేరుగా అవయవములైయున్నారు" (1కొరింధి 12:24-27). మనము అత్మయందు ఒక్కటే గనుక, ఏడ్చువారితో ఏడవవలెను, సంతోషముగా నున్నవారితో సంతోషించవలెను. ఆవిధముగా కలసి క్రీస్తుప్రేమయందు ఎదుగుచు క్రీస్తు స్వారూప్యములోనికి పరిపక్వత నొందవలెను. ఆత్మీయకుటుంబముగా మనము కలసి జీవించిన కొలది క్రీస్తుకొరకు అనేక గొప్పకార్యములు చేయగలము.

క్రీస్తు శరీరమునకు (సంఘమునకు) శిరస్సైయున్నలాగున, పెద్దలు స్థానికసంఘములను పరిచారకులతోను, సేవకులతోను కలసి సభ్యులందరు వారి అధికారమునకు లోబడునట్లు పరిపాలించవలెను. "మీపైన నాయకులుగా ఉన్నవారు లెక్క ఒప్పచెప్పవలసిన వారివలె మీ ఆత్మలను కాయుచున్నారు, వారు దుఃఖముతోకాక, ఆనందముతో చేయునట్లు వారిమాటవిని, వారికి

లోబడియుండుడి" (హెబ్రీ 13:17). మనలో ప్రతీవానికి సరియైన హృదయమున్నయెడల మనము ప్రేమతోను, ఏకభావముతోను, ఐక్యతతోను కలసి పనిచేసి, మనమందరము ఆశించు శాంతి సమాధానములను అనుభవించుదము. ఇట్టి విధముగా మాత్రమే దేవుని రాజ్యము వ్యాపింపచేయగలము.

మనమందరము ఒకరియెడల ఒకరము ప్రేమ, దయ కలిగి శాంతిని వెదకుదము. అన్నిటికన్న ముఖ్యముగా మనము దేవుని వాక్యమునకు విధేయులమగుటకు ఇష్టము కలిగియుందము. మనము సత్యమందు ఐక్యత కలిగి నిలకడగా నుండవలయును. దేవుని వాక్యమును ఎన్నడును తేలికగా తీసుకొనకూడదు.

## 88
## మానవత్వము - లైంగిక వైపరీత్యము

లైంగిక వైపరీత్యము ఈనాటి సమాజమును తాండవమాడించుచు ఆత్మీయముగాను, శారీరికముగాను పెద్ద సమస్యగానున్నది. అది అపరాధము నకును నిరాశకును విడాకులకును కారణమై అనేక కుటుంబములను నాశనము చేయుచున్నది. అది భార్య భర్తలమధ్య గల నమ్మకమును పాడుచేసి తల్లిదండ్రులకు పిల్లలకు మధ్యగల సంబంధమును నాశనము చేయును. లైంగిక వైపరీత్యమును దేవుని ధర్మశాస్త్రమునందు ఖండించెను అనునది నిస్సందేహమైన ఆలోచన.

అవిశ్వాస్యత అనాది నుండి ఉండినప్పటికి అది నానాటికి అధికమగు చుండుట కనబడుచున్నది. ఎందువలననగా అందుకు కారణభూతమైన విషయములెన్నో కలవు. అందు మానవతత్వాన్ని బోధించే వేదాంతము

ముఖ్యకారణము. మానవ తత్వము లేక మానవ ధర్మశాస్త్రము మానవునికన్న ఉత్తమమైన శాస్త్రముగాని శక్తిగాని లేదని బోధించును. అనగా దేవుడు లేడని, దైవావేశము వలన కలిగిన లేఖనములు లేవని అర్ధము. మానవుడు చేయు క్రియలను బట్టి లెక్క ఒప్పగింపనవసరములేదు గనుక నరకమునందు శిక్షగాని పరలోకమందు బహుమానము గాని లేదు. మరణానంతర జీవితము లేదని మానవ తత్వవేత్తలు బోధించుదురు.

ఈ వేదాంతము "పరిస్థితులకనుకూలమైన నీతి" అను ప్రక్రియను బోధించును. ఏ క్రియ అయినను మంచిది లేక చెడ్డది అనునది ఆ క్రియ జరిగినప్పటి పరిస్థితి నిర్ణయించునని ఈ వేదాంతము బోధించును. ఉదాహరణకు ఒక 14 సంవత్సరాల వయస్సుగల బాలిక బలాత్కారముగా చెరపబడి గర్భము ధరించినది. ఆమెకు వ్యతిరేకముగా భయంకరమైన నేరము జరిగినందు వలన గర్భస్రావము కొందరి దృష్టిలో అంగీకారము కావచ్చును. వేరొక పరిస్థితియందు వారే గర్భస్రావమును ఖండించవచ్చును. ఈ పరిస్థితి (ఉదాహరణలో బలాత్కారము) ఒక నిరపరాధియైన శిశువు ప్రాణము తీయుటను నిర్ణయించుచున్నది.

క్రైస్తవులు అట్టి వేదాంతమందు పట్టబడకుండా జాగ్రత్తపడవలెను. దేవుని ధర్మశాస్త్రము ఎలాంటి పరిస్థితిలోను మారనిది. మానవతత్వము ఈనాటి సమాజాన్ని వ్యభిచారానికి, జారత్వానికి, అశ్లీల సాహిత్యానికి, విడాకులకు, అనేక వివాహాలు చేసుకొనుటకు, స్వలింగ సంపర్కానికి ప్రోత్సహిస్తుంది.

తల్లిదండ్రులారా! మన పిల్లలకు దేవుని పద్ధతులకు, మానవుల పద్ధతులకు మధ్య గల వ్యత్యాసాన్ని తెలియజేయవలసిన బాధ్యత మనకప్పగించబడి యున్నది. "నీ పూర్ణ హృదయముతోను నీ పూర్ణ ఆత్మతోను, నీ పూర్ణ శక్తితోను నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను. నేను నీ కాజ్ఞాపించు

ఈ మాటలు నీ హృదయములో ఉండవలెను. నీవు నీ కుమారులకు వాటిని అభ్యసింపజేసి, నీయింట కూర్చుండునప్పుడును, త్రోవను నడచునప్పుడును, పండుకొనునప్పుడును, లేచునప్పుడును వాటిని గూర్చి మాటలాడవలెను; సూచనగా వాటిని నీ చేతికి కట్టుకొనవలెను" (ద్వితీ. 6:5-7).

మన ఆహ్వానాన్ని బట్టి ఈనాటి మీడియా అనేక కళలను, సంగీతములను, నాటకములను, సినిమాలను మన ఇంటిలోనికి తీసుకొని వచ్చుచున్నది. వాటిలో ఎక్కువ భాగము లైంగికవైపరీత్యాన్ని ప్రోత్సహించుచున్నవి. మన పిల్లలు టెలివిజన్లలో చూచుచున్న వాటిని, ఇంటర్‌నెట్‌లో ఏక్సెస్ చేస్తున్న వాటిని గూర్చి తెలుసుకొనవలసిన బాధ్యత మనకున్నది. మనము నిదానముగాను, సోదాహరణముగాను వారికి ఉపదేశించవలెనని జ్ఞాపకముంచుకొనవలెను. మనము బోధించునదొకటి, చేసేది మరొకటియై మన పిల్లలకు మిశ్రమ సంకేతాల్ని పంపకుండా జాగ్రత్తపడవలెను.

# 89

# భయాన్ని జయించుట

"ప్రియులారా! మీరు పరదేశులును యాత్రికులునైయున్నారు గనుక ఆత్మకు విరోధముగా పోరాడు శరీరాశలను విసర్జించి..." (1పేతురు 2:11)

మనము భయముతో నిండిన ప్రపంచంలో జీవిస్తున్నాము. ఈ భయంలో అధికభాగము సాతాను దాని శక్తులచేత తీసుకొని వచ్చినది. తల్లిదండ్రులు వారి పిల్లలను గూర్చిన జాగ్రత్త కలిగియున్నారు. విశ్వాసులైన క్రైస్తవులు సంఘ భవిష్యత్తును గూర్చి జాగ్రత్త కలిగియున్నారు. ఇట్టి భయములను మనమేలాగు అధిగమించగలము?

తల్లిదండ్రులుగా మనము మన పిల్లల శారీరక కోరికలను తీర్చుట

కన్న వారి ఆత్మీయ అవసరములను గూర్చి ఎక్కువ శ్రద్ధ కలిగియుండవలెను. సినిమాతారలు, గాయకులు, క్రీడాకారులు, రాజకీయనాయకులలో మన పిల్లల అభిమానులను గమనించవలెను. వారు అభిమానించువారి జీవిత విధానాన్ని గమనించవలెను. వారి మాదిరిని చూచినప్పుడు మన పిల్లలు నిత్యము ఎదుర్కొను శోధనలను గూర్చి ఎట్టి ఆశ్చర్యము ఉండదు. అబ్ధమాడుట, మోసగించుట, జూదము, మాదకద్రవ్యములు, మద్యపానము, పొగత్రాగుట, నానావిధములైన లైంగిక పాపములు వారిని శోధించు చుండును. మనము సాతాను శక్తిని సమర్థవంతముగా నిర్వీర్యము చేయవలయుననిన మనము ప్రతి అవకాశమును వినియోగించుకొని మన పిల్లలను యేసుకు దగ్గర చేయవలయును. ఆయనను గూర్చి నేర్చుకొని ఆయన శక్తిపై ఆధారపడుట వలన మాత్రమే యవ్వనస్తులు ఇహలోక శోధనలను జయించగలరు.

క్రీస్తు వధువుగా (ఆయన సంఘము) మనము పవిత్రముగా జీవించుట యందు శ్రద్ధకలిగియుండవలెను. ఇహలోకస్థితి సంఘములోనికి నెమ్మదిగా ప్రాకుచున్నది. గొప్ప పలుకుబడిగల కొందరు సంఘ నాయకులు మత శాఖలవారితో కలసి పనిచేయుచు బలహీనులైన సభ్యులను దారి మళ్ళించు చున్నారు. చాలామంది క్రైస్తవులు సత్యము యెడల తమ ప్రేమను విడిచి, లోకమునకు దగ్గరగా జీవించుటయందు భద్రతను ఊహించుకొనుచున్నారు. సహోదరులారా! అట్టి ఆత్మలు గొప్ప ప్రమాదములోనున్నవి. నరకమునకు నడిపించు విశాల మార్గములో ఒక కాలుపెట్టి పరలోకమునకు చేర్చు ఇరుకుమార్గమున నడచుట అసాధ్యము. మనము మాట్లాడు ప్రతి విషయములోను, చేయు ప్రతి పనిలోను దేవుని వాక్యము యొక్క అధికారమునకు లోబడి జీవించవలయును. “సువార్తను గూర్చి నేను

సిగ్గుపడువాడను కాను, ఏలయనగా నమ్ము ప్రతి వానికి, మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకై అది దేవుని శక్తియైయున్నది" (రోమా 1:16).

## 90
## బైబిల్ అధ్యయనం

బైబిలును అర్థం చేసుకొనుట కష్టమని చాలామంది అనుకొంటారు. ఏ విషయాన్నైనను బాగుగా నేర్చుకోవాలంటే పరిశీలించి చదవాలి (2తిమోతి 21:15). అపోస్తలుడైన పౌలు ఈవిధంగా వ్రాసాడు. "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుటకు జాగ్రత్త పడుము". ఈ వాక్యభాగమందు మనము దేవుని వాక్యమును సంపూర్తిగా అర్థం చేసుకొనుటకు మనము బైబిలు చదువుట అవసరమని చూడగలము. మన దేశంలో చాలామందికి అనేకమైన బైబిళ్ళు ఉండును గాని వాటిలో ఎక్కువ భాగము దుమ్ముతో నిండియుండును.

బైబిలు నందలి పుటలలో, జీవించుటకు దేవుని సూచనలను మనము కనుగొనగలము. ఆత్మఫలములు ఫలించు పరిపక్వతచెందిన క్రైస్తవులగుటను మనము నేర్చుకొనగలము. (గలతీ 5:22,23). పౌలు, యవ్వన బోధకుడైన తిమోతికి మరల ఇలా వ్రాసాడు. "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము, ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమైయున్నది" (2తిమోతి 3:16,17). మరియు యాకోబు 1:25 నందు ఇలా వ్రాయబడినది. "అయితే స్వాతంత్ర్యమునిచ్చు

సంపూర్ణమైన నియమములో తేరిచూచి నిలకడగా ఉండువాడెవడో వాడు విని మరచువాడు కాక, క్రియను చేయువాడైయుండి తన క్రియతో ధన్యుడగును".

బైబిలు అధ్యయనానికి మించినది లేదు. మనలోనున్న నిరీక్షణ గూర్చి అడుగు ప్రతివానికి సమాధానము చెప్పగల సమర్థతను సంపాదించు కొనుటకు మనము బైబిలు విద్యార్థులము కావలయును. మనము ఆత్మీయమైన విషయాలయందు లక్ష్యముంచుటకు తీరికలేకయున్న యెడల, లోకము మనకు అత్యంత ప్రాముఖ్యమైనదని అర్థము. మనము దేవుని పిల్లలుగా ఎదగవలయుననిన మన దృష్టిని లోకమువైపు నుండి దేవుని వాక్యము వైపునకు మరల్చుకొనవలయును.

## 91

## బాషలతో మాట్లాడుట

అపొస్తులుల కార్యములు రెండవ అధ్యాయము మొదటినుండి పద్నాలుగు వచనములలో గల వాక్యభాగమందు అపొస్తులులు ఒకచోట చేరినపుడు పరిశుద్ధాత్మ వారిపైకి దిగివచ్చి అగ్ని నాలుకలవలె ప్రత్యక్షమాయెను. ఆ సమయమందు అపొస్తులులు అన్యభాషలలో మాటలాడుట ప్రారంభించిరి. ప్రతి దేశమునుండి వచ్చిన ఒక గొప్ప సమూహము అచ్చట చేరి, అపొస్తులులు వారి వారి స్వభాషలలో మాట్లాడుట విని విస్మయమొందిరి. భాషలతో మాటలాడు వరము అనగా ఇతరుల బాషలతో మాటలాడగల సమర్థతయని మనకు తేటగా కనబడుచున్నది.

1కొరింథి 14వ అధ్యాయమందు భాషలతో మాటలాడు వేరొక సాదృశ్యము కనబడును. 1కొరింథి 14:5 గమనించుము. "మీరందరు

భాషలతో మాటలాడవలెనని కోరుచున్నాను గాని మీరు ప్రవచింపవలెనని మరి విశేషముగా కోరుచున్నాను. సంఘము క్షేమాభివృద్ధిపొందునిమిత్తము భాషలతో మాట్లాడువాడు అర్థముచెప్పితేనేగాని వాని కంటే ప్రవచించువాడే శ్రేష్ఠుడు".

మురిముఖ్యముగా 1కొరింథి 13:8 నందు భాషలతో మాట్లాడు వరము నిలచిపోవునని ఆదిమ క్రైస్తవులకు తెలియజేసాడు "ప్రేమ శాశ్వతకాల ముండును. ప్రవచనములైనను నిరర్థకములగును, భాషలైనను నిలచిపోవును, జ్ఞానమైనను నిరర్థకమగును". తొమ్మిది, పది వచనములలో భాషలు నిలచిపోవు సమయము తెలియజేయబడినది. "మనము కొంతమట్టుకు ఎరుగుదుము, కొంతమట్టుకు ప్రవచించుచున్నాము గాని పూర్ణమైనది వచ్చినప్పుడు పూర్ణముకానిది నిరర్థకమగును" యాకోబు పూర్ణమైనది ఏది అను విషయమును తెలియజేసాడు "అయితే స్వాతంత్ర్యమునిచ్చు సంపూర్ణమైన నియమములో తేరిచూచి నిలకడగా ఉండువాడెవడో వాడు విని మరచువాడు కాక, క్రియను చేయువాడైయుండి తన క్రియలో ధన్యుడగును" (యాకోబు 1:25) సంపూర్ణమైన క్రొత్త నిబంధన పరిపూర్ణమైన ధర్మశాస్త్రము. క్రొత్తనిబంధన మొదటి శతాబ్ధమునందు పూర్తిచేయబడినది. అందువలన భాషలతోమాటలాడేవరము మనతరమునందలి మనకు లేదు.

## 92
## గర్జించు సింహాము

దురాత్మయైన సాతాను ఎన్నడును విశ్రమించడు. "నిర్బరమైన బుద్ధిగలవారై మెలకువగా ఉండుడి, మీ విరోధియైన అపవాది గర్జించు సింహామువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు"

(1పేతురు 5:8). ప్రపంచమును భయంకరమైన పాపపు సంకెళ్ళ బానిసలను చేయుట సాతాను గురియైయున్నది.

దేవుని పిల్లలు శోధనలకు అతీతులు కారు. తరచు క్రీస్తు సువార్తకు విధేయులైనవారు కూడా పాపములోనుండి లోకమువైపుకు తిరుగుదురు. 2పేతురు 2:20-22 నందు మనమీలాగు హెచ్చరింపబడితిమి. “వారు ప్రభువును, రక్షకుడునైన యేసుక్రీస్తు విషయమైన అనుభవజ్ఞానముచేత ఈలోకమాలిన్యములను తప్పించుకొనిన తరువాత మరల వాటిలో చిక్కబడి వాటిచేత జయింపబడిన యెడల, వారి కడవరి స్థితి మొదటిస్థితి కంటె మరి చెడ్డదగును వారు నీతిమార్గమును అనుభవపూర్వకముగా తెలిసికొని, తమకు అప్పగింపబడిన పరిశుద్ధమైన ఆజ్ఞనుండి తొలగిపోవుట కంటె ఆమార్గము అనుభవపూర్వకముగా తెలియక యుండుటయే వారికిమేలు. కుక్క తనవాంతికి తిరిగినట్టును, కడుగబడిన పంది బురదలో దొర్లుటకు మళ్ళినట్లును అను నిజమైన సామెత చొప్పున వారికి సంభవించెను”.

ఈనాడు పాపము మన సమాజములో ప్రబలముగానుండి అనేకులు ఎన్నటికిని పాపమును గూర్చి సిగ్గుపడనివారుగా తయారగుచున్నాడు. ప్రపంచమంతట టెలివిజన్లు అన్ని పాపపు క్రియలను మన నివాసగృహము లలో జీవించు గదులలోనికి తీసుకొనివచ్చుచున్నవి. అందువలన మనలను చుట్టుముట్టియున్న పాపమును గూర్చి ప్రజలు లెక్కలేకుండా జీవిస్తున్నారు.

దేవుని పిల్లలుగా మనము బలపరచబడి సాతానును ఎదిరించి వాని తంత్రములనుండి దూరముగా పోవలెను. శోధనను జయించుట సాధ్యము. మనము సహించగలిగినంత కన్నా ఎక్కువగా మనము శోధింపబడమని, ఆశోధనను జయించు మార్గాన్ని దేవుడే అనుగ్రహిస్తాడని, ఆయన వాగ్దానం చేసాడు (1కొరింథి 10:13). పడిపోయి పాపమునందు జీవించువారు

ఎవరిపైన నిందారోపణచేయక వారిపాపమును గూర్చి తమ్మును తామే బాధ్యులను చేసుకొనవలయును.

దేవుని నుండి తొలగిపోయినవారు తిరిగి స్పృహలోనికి వచ్చి, మారుమనస్సు పొంది తమ జీవితమును సరిచేసుకొని నమ్మకమైన క్రైస్తవజీవితమును కొనసాగించవలెనని మాప్రార్ధన.

## 93

## రోడ్డు ప్రమాదాలు

తీరికలేని జీవన విధానము, పనిచేయు ప్రదేశంలో ఒత్తిడి, జనసమ్మర్ధంలో నున్న మార్గాలు, రాకపోకల రద్దీ మొదలైనవన్నియు ప్రమాదకరమైన మార్గమునకు కారణములు. నివృత్తికాని ఒత్తిడి, నశించిన ఓపిక, అతివేగముగాను బాధ్యతారహితముగాను వాహనములు నడుపుటకు కారణాలు. అనేకసార్లు ప్రమాదముల వలన ఆస్థినష్టము, గాయములు, మరణములు కూడా సంభవించును.

ఇతరులు మనయెడల ఏలాగు ప్రవర్తించవలెనని మనము కోరుదుమో మనమును వారియెడల ఆలాగుననే ప్రవర్తించవలయునని యేసుప్రభువు బోధిచాడు (మత్తయి 7:12). పౌలు క్రైస్తవులను ఈలాగు హెచ్చరించాడు. "కోపపడుడిగాని పాపముచేయకుడి" (ఎఫెసీ. 4:26). మనము సద్గుణము, జ్ఞానము, ఆశానిగ్రహము, సహనమును కలిగియున్నయెడల రహదారులలో అవసరమైన హింసను తగ్గించి క్రైస్తవులుగా ఇతరులకు సరియైన మాదిరిని చూపగలము.

# 94
# సహోదరుల మధ్యజగడములు పుట్టించుట

"యెహోవాకు అసహ్యములైవి ఆరుగలవు ఏడును ఆయనకు హేయములు. అవేవనగా, అహంకారదృష్టియు కల్లలాడు నాలుకయు నిరపరాధులను చంపుచేతులును దుర్యోచనలు యోచించు హృదయమును కీడుచేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములును, లేనివాటిని పలుకు అబద్ధసాక్షియు, అన్నదమ్ములలో జగడము పుట్టించువాడును" (సామెతలు 6:16-19).

వదంతులు మాటలాడుట చేజారి సంఘమంతట ఘోరమైన అగ్నిగా వ్యాపించును. వదంతులు వ్యాప్తిచెందినప్పుడు సత్యము కనుమరుగై నిజమైన విషయము జ్ఞాపకమునకు దూరమగును. గుసగుసలాడుట ఇతరుల బాధకు, మనస్సు కష్టపెట్టుకొనుటకు కారణము. అది సహోదరులమధ్య జగడము పుట్టించును.

ఈనాడు ప్రపంచంలో అనేకులు నిర్ధయగలవారై సత్యము యొక్క ఉనికినే ప్రశ్నించుదురు. దేవుని వాక్యమే సత్యమని క్రైస్తవులెరుగుదురు. "సత్యము నందు వారిని ప్రతిష్టచేయుము; నీవాక్యము సత్యము" (యోహాను 17:17). సహోదరులారా, మనము నిజాయితీగా నుండి మనచుట్టు ఉన్నవారికి మాదిరికరమైన జీవితమును చూపించవలయును. దేవుని మార్గదర్శకములపై స్థాపించబడిన అమెరికా దేశంలో కూడా సత్యమును అడ్డగించుట సామాన్యమై పోయినది. నిజాయితీలేని జీవితము ఈనాటి సహజమని భావించుట విచారకరము. దేవుడు అబద్ధికులను అసహ్యించుకొనును.

ప్రభువు గర్విష్టులను, అహంకారులను అసహ్యించుకొనును. ఇతరులను

చిన్న చూపుచూచుట తప్పు. ప్రతి ఆత్మ దేవునికి ప్రశస్తమైనది. మనలనందరిని ఆయన సమానముగా ప్రేమించుచున్నాడు. ఆయన అద్వితీయ కుమారుడ్ని అందరికికొరకు మరణించుటకు ఈలోకానికి పంపినప్పుడు దాన్ని ఋజువు చేసాడు. దేవుని ప్రేమ మనలను వినయమైనవారిని చేసి, మానవులందరి ఆత్మలను ప్రేమించగలగునట్లు చేయవలెను.

క్రైస్తవులు ఆత్మలను క్రీస్తునొద్దకు నడిపించు సాధనములు కావలయును. మనము మన నాలుకలను స్వాధీనమందుంచుకొననియెడల ఉపయోగకరమైన వారము కాలేము. మనము గర్విష్టులము అహంకారులము అయినయెడల సార్థకమైన జీవితము జీవించలేము. మన నాలుకలను స్వాధీనమందుంచు కొని, ప్రేమతో సత్యము చెప్పుచు దేవునికి విధేయులమైన సేవకులమై మనతోటి మానవులకు సేవచేయుదము.

## 95

# స్వలింగసంపర్కము

స్వలింగసంపర్కమును గూర్చిన అంశము తీవ్రమైనదైనందున అది ప్రాముఖ్యముగా చర్చించవలసియున్నది. స్వలింగసంపర్కమును సామాన్య జీవన విధానముగా అంగీకరించమని తీవ్రమైన ఒత్తిడి తీసుకొని వచ్చు చున్నారు. అమెరికాదేశంలో ఈ విషయాన్ని గూర్చి ప్రతిదినము చర్చాంశంగా ప్రదర్శిస్తున్నారు. ఇది వార్తలలోను రాజకీయంలోను మరితర జీవనగమనాల లోను ప్రాముఖ్యంగా అగపడుచున్నది. స్వలింగసంపర్కాన్ని జీవన విధానంగా అంగీకరించనివారిని సహించలేనివారిని విమర్శిస్తున్నారు.

మానవతావాదం అనునది మానవునిలోనున్న శక్తికన్న అతీతమైన శక్తి ఏదిలేదని నమ్మువిధానము. స్వలింగసంపర్కాన్ని బలపరచు వారు మానవతా

వాదాన్ని అనుసరించువారు. మానవతావాదము ప్రతి క్రైస్తవ సూత్రమునకు వ్యతిరేకమైనది. మానవతావాదులు దైవావేశము వలన కలిగిన దేవుని వాక్యాన్ని నమ్మరు. అందువలన స్వలింగ సంపర్కాన్ని బైబిలు ఖండించుట వారిపై ఎట్టి ప్రభావాన్ని చూపదు. బైబిలు బోధలు, మానవుని అభిప్రాయాలపై ఆధారపడే ఆలోచనలను, భావాలను వ్యతిరేకించును. అందువలన క్రైస్తవులు, లోకరీతిగా వెళ్ళు మానవుల ఒత్తిడులను ఎదిరించి స్వలింగ సంపర్కము అను పాపమును ఖండించవలెను (రోమా 12:1,2).

స్వలింగ సంపర్కమును గూర్చి దేవుని ఆలోచనా విధానం ఎట్టి సందేహానికి తావివ్వకుండా తెలియజేసెను. పాతనిబంధన యందలి ఇశ్రాయేలు ప్రజలకు ఈలాగు సూచించెను. "స్త్రీ శయనమువలె పురుష శయనము కూడదు; అది హేయము" (లేవీ 12:22). మరియు "ఒకడు స్త్రీతో శయనించునట్లు పురుషునితో శయనించిన యెడల వారిద్దరు హేయ క్రియను చేసిరి గనుక వారికి మరణశిక్ష విధింపవలెను; తమ శిక్షకు తామే కారకులు" (లేవీ 20:13). ఈ వాక్యభాగములు స్వలింగ సంపర్కము హేయమైనదని బోధించును. అట్టి క్రియను చేయువారు మరణదండనకు పాత్రులని ధర్మశాస్త్రము ఉపదేశించుచున్నది. (సామెతలు 14:12 మరియు యిర్మియా 9:3 కూడా చదివి పరిశీలించుము).

అట్టి దుర్నీతి క్రియలయందు జీవించువారిని గూర్చి క్రొత్త నిబంధన యందును ఖండించబడినది. "అందువలన దేవుడు తుచ్ఛమైన అభిలాషలకు వారిని అప్పగించెను. వారి స్త్రీలు సయితము స్వాభావికమైన ధర్మమును విడిచి స్వాభావికమైన ధర్మమును అనుసరించిరి. అటువలె పురుషులు కూడా స్త్రీ యొక్క స్వాభావికమైన ధర్మమును విడిచి, పురుషులతో పురుషులు అవాచ్యమైనది చేయుచు తమ తప్పిదమునకు తగిన ప్రతిఫలమును

పొందుచు ఒకరియెడల ఒకరు కామతప్తులైరి" (రోమా 1:26-27). ఈ వాక్యభాగమందు దేవుడు పురుషులను, స్త్రీలను సమానముగా స్వలింగ సంపర్కము పాపమని ఖండించెను. (1కొరింధీ 6:9-11 మరియు 1తిమోతి 1:8-11 కూడా చదివి పరిశీలించుము). వాక్యము తేటగా తెలియజేయు చున్నది. స్వలింగ సంపర్కము అను పాపము వెంటనే నిలిపివేసి, దాన్ని గూర్చి పశ్చాత్తాపపడవలయును.

మనము దేవుని వాక్యమంతటికి విధేయులము కావలయును. దేవునితో నిత్యత్వమును గడపవలయునని ఆశించిన యెడల ఆయన వాక్యము యెడల నమ్మకమైన వారిగా జీవించవలయును.

# 96
# ఇరుకు మార్గము

మత్తయి 7:14 నందు గల యేసు మాటలు జాగ్రత్తగా పరిశీలించుము. "ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు మార్గము వెడల్పును, ఆ దారి విశాలమునైయున్నది; దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు మార్గము ఇరుకును ఆదారి సంకుచితమునైయున్నది. దాని కనుగొనువారు కొందరే" (మత్తయి 7:13-14). ప్రజలలో ఎక్కువ మంది ఎక్కువగా చేసే క్రియలను అందరు అనుసరించుదురు. తక్కువ ప్రయాసంతో గుంపుతో కలసి సాగిపోవుచు, వారు ప్రభువుకు అంగీకారమైన జీవితాన్ని జీవిస్తున్నామనుకుంటారు.

లోకము విశాలమైన మార్గమును ఎంచుకొని నాశనమువైపు పయనించు చున్నది. భక్తిగల వారిలో కూడా అనేకులు విశాలమార్గమునందు కూడా పయనించుచున్నారు గాని బైబిలు మనము ఇద్దరు యజమానులకు దాసులుగా

ఉండలేమని తెలియజేయుచున్నది (మత్తయి 6:24). ప్రభువుతో స్థిరముగా నుండుటకు మనము ఇరుకుమార్గమందు మాత్రమే పయనించవలెను.

ఇరుకుమార్గమునకు ప్రవేశము క్రీస్తు సువార్తకు విధేయులైనవారికి మాత్రమే సాధ్యము (రోమా 1:16). ఒకసారి మనము ఇరుకుమార్గమున ప్రవేశించిన తరువాత, దేవుని వాక్యమందు ఇయ్యబడిన మార్గదర్శిని వెంబడించవలెను. ఆ మార్గదర్శితో కలుపుటగాని, తీసివేయుటగాని చేయక చివరివరకు సరియైన మార్గమందు పయనించవలయును. ఆ ప్రయాణ మందు క్రైస్తవులుగా ఎదుగుటను కొనసాగించవలయును.

"ఆహేతువుచేతనే మీమట్టుకు మీరు పూర్ణజాగ్రత్తగలవారై, మీ విశ్వాసమునందు సద్గుణమును, సద్గుణమునందు జ్ఞానమును, జ్ఞానమునందు ఆశానిగ్రహమును, ఆశానిగ్రహమునందు సహనమును, సహనమునందు భక్తిని, భక్తియందు సహోదరప్రేమను, సహోదరప్రేమ యందు దయను అమర్చుకొనుడి. ఇది మీకు కలిగి విస్తరించిన యెడల అవి మనప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన అనుభవజ్ఞాన విషయములో మిమ్మును సోమరులైనను నిష్ఫలులైనను కాకుండా చేయును" (2పేతురు1:5-8).

ఇరుకుమార్గమునందు రద్దీ ఉండదు. ఎందుకనగా కొందరు మాత్రమే అందు ప్రవేశించుదురు. ఇరుకు మార్గమున ప్రవేశింపగోరువారు, క్రొత్తనిబంధను పరిశీలించి దానిని కనుగొందురు. మనలో ప్రతివారు దేవుని వాక్యమును చదివి, పరిశీలించుటకు నిర్ణయించుకొని, శాశ్వతజీవితమునకు నడిపించు ఇరుకు మార్గమున మాత్రమే పయనించుదుము గాక!

# 97
# ఒక విపరీతమైన విపత్తు

అమెరికాదేశంలో ఈమధ్య పిల్లలు ప్రాణాంతకమైన ఆయుధమును ధరించుటచూచి ఆశ్చర్యపడుచున్నాము. ఎందువలన పిల్లలు మారణా యుధములను ధరించి ప్రజలను చంపుచున్నారు? అంతటి క్రూరమైన ప్రవర్తనకు కారణమేమిటి?

అందుకు ఒక సమాధానం, క్రమశిక్షణారహిత్యము. వ్యక్తిగత బాధ్యత పెద్దలలో లోపించినందువలన అది గృహాలలోను, పాఠశాలలోను లోపించు చున్నది. తమ్మునుతాము క్రమశిక్షణలో నుంచుకొనలేని తల్లిదండ్రులు వారి పిల్లలముందు సరియైన మాదిరిని ఉంచలేకపోవుచున్నారు. క్రమశిక్షణలేని పిల్లలు మెళకువలేనితనములో ఎదుగుచుందురు. వారు దుష్టత్వము ఎడల ఎట్టి వ్యతిరేకతలేకుండా కఠినమై పోవుచున్నారు.

తల్లిదండ్రులారా, మనము మేల్కొని ఖరీదైన ఇల్లు, కారు కొనుటకన్న ఎక్కువైన ప్రాధాన్యతగల విషయమున్నదని గ్రహించవలయును. మనలో అనేకులు మనపొరుగువారితో సమానముగా జీవించు ఆశక్తితో మన పిల్లలను నిర్లక్ష్యము చేయుచున్నాము. తమకు కావలసిన వస్తు సంపదనంతటిని కొనుకుటకు కావలసిన ధనము సంపాదించుటకు తల్లిదండ్రులిరువురు బయటకువెళ్ళి పనిచేయవలసి వచ్చుచున్నది. పిల్లలను క్రమశిక్షణలో నుంచి వారికి యేసును గూర్చి బోధించుటకు ఇంటిలో ఎవరును ఉండలేకపోవుట విచారము.

మన ప్రాముఖ్యతలను వరుసక్రమములో నుంచుకొనవలయును. తల్లిదండ్రులుగా మనము వ్యక్తిగత బాధ్యతను చూపించి, వస్తువులకొరకైన

వ్యామోహమునకు కళ్ళెము వేయవలెను. మనము సరియైన మాదిరిని చూపిన యెడల మన పిల్లలు వారికి కావలసినవన్నియు కలిగియుండ వలెనను ఆలోచనను పెంపొందింపచేసుకొనరు. మనము ఎన్నడు ఈ విషయాన్ని నిర్లక్ష్యము చేయరాదు. **ఈ జీవితమందు మనము చేయు ప్రతి పనిని బట్టి దేవునికి లెక్క ఒప్పగింపవలయును.** మనము ఎల్లప్పుడు మన క్రియలకు బాధ్యత వహించి మన పిల్లలు కూడా ఆలాగు చేయునట్లు బోధింపవలయును.

# 98
# ధనాపేక్ష

"మనమీలోకములోనికి ఏమియు తేలేదు, దీనిలో నుండి ఏమియు తీసుకొని పోలేము. కాగా అన్నవస్త్రములు గలవారమైయుండి వాటితో తృప్తిపొందియుందము. ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేకయుక్తములును హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను, నాశనములోను ముంచి వేయును. ఎందుకనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము; కొందరు దానినాశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి. దైవజనుడా! నీవైతే వీటిని విసర్జించి, నీతిని, భక్తిని, విశ్వాసమును, ప్రేమను ఓర్పును సాత్వీకమును సంపాదించుకొనుటకు ప్రయాసపడుము. విశ్వాస సంబంధమైన మంచి పోరాటము పోరాడుము, నిత్యజీవమును చేపట్టుము. దానిని పొందుటకు నీవు పిలువబడి అనేక సాక్షులయెదుట మంచి ఒప్పుకోలు ఒప్పుకొంటివి" (1తిమోతి 6:7-12).

ఈనాటి గృహాలలో అనేక సమస్యలు కనబడుచున్నవి. వాటిలో దురాశ

అన్నిటికన్న ప్రధమంగా కనబడుచున్నది. పిల్లలు నిర్లక్ష్యానికిలోనై తల్లిదండ్రుల పర్యవేక్షణలేకుండా పెరుగుచున్నారు. పొరుగువారితో సమానముగా జీవించు ఆశతో తల్లిదండ్రులు తీరికలేని పనులలో అలసిపోవుచున్నారు. గృహము నందు నిజమైన అధికార స్వరూపము లేదు. తల్లిదండ్రులు కనపరచు విలువలేని మాదిరి జీవితము వలన అనేకమంది పిల్లలు మత్తుపదార్ధములకు, మాదకద్రవ్యములకు బానిసలై అపవిత్రమైన జీవన విధానాన్ని కలిగియుండి కామవాంఛలకు లోనగుచున్నారు.

గృహము వరవడిలోనే దేశము కూడా వెళ్ళుచున్నది. దేశమంతయు ఎన్నడు నెరవేరని దురాశతో నిండిన భావాల చెడు ప్రభావాన్ని కలిగియున్నది. ఇది అంతములేని దుష్టచక్రము. కోరికను వెంటనే అనుభవించాలనే ఆతృత, సంతృప్తి లేకుండుట, అలా... అలా దానికి అంతములేదు. చాలామంది వారికి కావలసిన ప్రతిదానిని పొందు అర్హత కలవారని భావించుదురు. అందుకు వారు సమర్ధులా కాదా అను విషయాన్ని యోచించరు.

ధనాపేక్ష దేశములమధ్య యుద్ధములు రేపును. అది మనుష్యులు వారి తోటి మనుష్యులను చంపునట్లు చేయును. అది ప్రజలు వారి ప్రాణములు తీసుకొనునట్లు చేయును. అది వ్యభిచారమునకు దారితీయును. అది విడాకులు కలిగించును, అది ఒకని మనశ్శాంతిని పట్టుదలను నాశనము చేయును. అది ప్రాణములను తీసి, ఒకదైవముగా మారి పరలోకమందున్న నిజ దేవుని కన్న ఉత్తమంగా కనిపించును. అది ప్రతి మానవుడిని ఒకరీతిగా గాని వేరొక రీతిగాగాని ప్రభావితం చేస్తుంది.

క్రైస్తవులు మేల్కొని దురాశ చేసే దుష్టక్రియలను గుర్తించాలి. మనం మొదట దేవుని రాజ్యాన్ని వెదకి ధనాపేక్షకు దాసులముకారాదు.

# 99
# ఏకమనస్కులైయుండుడి

అపోస్తలుడైన పౌలు ఫిలిప్పీలోని సహోదరులను, ప్రేమయందు ఐక్యమై యుండి ఏకమనస్కులైయుండుడని హెచ్చరించెను. "మీరు ఏకమనస్కులగునట్లుగా ఏక ప్రేమ కలిగి, ఏక భావము గలవారుగా ఉండి, ఒక్క దానియందే మనస్సుంచుచు నా సంతోషమును సంపూర్ణము చేయుడి. కక్షచేతనైనను, వృధాతిశయము చేతనైనను ఏమియు చేయక, వినయమైన మనస్సు గలవారై యొకనినొకడు తనకంటె యోగ్యుడని యెంచుచు మీలో ప్రతివాడును తన సొంత కార్యములను మాత్రమేగాక యితరుల కార్యములను కూడా చూడవలెను. క్రీస్తు యేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగియుండుడి" (ఫిలిప్పీ 2:2-5). దేవుని కుటుంబము శాంతితోను, ప్రేమతోను నిండి యుండుట ఎంత ప్రశస్తమైనది!

అందువలన దేవుని కుటుంబమందు ప్రేమపూర్వకమైన అనుబంధము నేలాగు పెంపొందించుకొనగలము? దానికి సమాధానము చాలా సామాన్యమైనది. అందుకొరకు మనం ప్రయత్నించాలి. మన ఇహలోక కుటుంబము నందలి అనుబంధమును జాగ్రత్తగాను, ప్రేమతోను పెంపొందించుకొనునట్లు మన ఆత్మీయ కుటుంబమందలి అనుబంధమును కూడా పెంపొందించుకొనవలయును. మనము ఒకరినొకరము తెలిసి కొనుటకు ఎక్కువ సమయము గడిపి, కలసి నవ్వుచు, కలసి దుఃఖించుచు, ఒకరి భారముల నొకరము మోసికొనిన కొలది మనలను బంధించు ప్రేమ బలీయమైనదగును. మనందరము పరిచయముగలవారముగా, ప్రేమ కలిగి కలసి దేవుని ఆరాధించుచు, ఒకనాడు పరలోకమందు కలసికొనుట ఎంత ఆనందదాయకము!

మనలో ప్రతీవాడు పవిత్రమైన హృదయము కలిగియుండి ఇతరుల అవసరములను మన సొంత అవసరముల ముందు ఉంచుదము. మనము గర్వాన్ని, స్వార్ధాన్ని, సంకుచితత్వాన్ని విడిచి, ప్రభువు సంఘాన్ని కట్టుటకు కావలసిన పరికరములను సమకూర్చుటకు ప్రయాసపడుదము.

## 100

# పరిపూర్ణతవైపు పయనించుదము

ఒకడు సువార్త రక్షణ పధకమునకు విధేయుడైనప్పుడు క్రీస్తునందు జన్మించిన శిశువు అగును. అతని పాపములు క్షమింపబడినవి, అతడు గత పాపముల నుండి విడుదల పొందును. అయినను అతడు అక్కడ ఆగిపోయి పరలోకమునకు వెళ్ళుటకు కావలసినదంతయు చేసితినని భావించరాదు. నిజానికి అప్పుడు మనము పరలోకానికి వెళ్ళే ప్రయాణాన్ని ప్రారంభించాము. మనము జీవించుట కొనసాగించవలయుననిన ఎదుగుట కొనసాగించ వలెను. అపోస్తలుడైన పేతురు 1పేతురు 2:3 నందు ఈలాగు చెప్పెను. "క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై, నిర్మలమైన వాక్యమను పాలవలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము, ఆ పాలను అపేక్షించుడి".

1పేతురు 2:9,10నందు కూడా పేతురు ఇలా వ్రాసాడు. "అయితే మీరు చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన వెలుగులోనికి మిమ్మును పిలిచిన వాని గుణాతిశయములను ప్రచురము చేయునిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలునైయున్నారు. ఒకప్పుడు ప్రజగా ఉండక యిప్పుడు దేవుని ప్రజయైతిరి; ఒకప్పుడు కనికరింపబడక యిప్పుడు కనికరింపబడినవారైతిరి".

క్రైస్తవులమైనప్పుడు మనము సంఘమునకు (దేవుని కుటుంబమునకు) చేర్చబడితిమి. అప్పుడు మనము తిన్ననిదైన ద్వారముగుండా ఇరుకు మార్గమున ప్రవేశించితిమి (మత్తయి 7:13,14). ఈ మార్గమున మనము పరలోకమునకు వెళ్ళవలయును. జాగ్రత్తగా ప్రక్కకు తిరిగి వెడల్పైన ద్వారముగుండా ప్రవేశించు, నాశనమునకునడుపు విశాలమైన మార్గము లోనికి పోకుండా జాగ్రత్తపడవలయును. మనము పరలోకమునకు వెళ్ళు మార్గదర్శిని (బైబిలును) పరిశీలించుట ద్వారా ఎల్లప్పుడు ఆత్మీయముగా ఎదుగుటను కొనసాగించుచు క్రీస్తునందు పరిపక్వతనొందుదము. మనమెన్న డును సంపూర్ణమైన పరిపూర్ణతను పొందగలమని, కూర్చుండి ప్రభువు రాకడ కొరకు కనిపెట్టగలమని భావించరాదు. క్రీస్తు పరిపూర్ణతకు చేరుట సాధ్యము కాదుగాని, మనము నిరంతరము ఆయన మాదిరిని అనుసరించుచు ఆయన పరిపూర్ణతను గురిగా చేసుకొని ఆయనను వెంబడించవలెను. మంచి చేయుటకు అలయక ప్రార్ధనయందును, బైబిలు ధ్యానమందును కొనసాగుచు ఇరుకు మార్గమున పరలోకమువైపు సాగిపోవుదము.

## 101

# ప్రభువును సేవించుటలోని ఆనందము

"అటువలె మారుమనస్సు అక్కరలేని తొంబది తొమ్మిది మంది నీతిమంతుల విషయమై కలుగు సంతోషముకంటే మారుమనస్సు పొందు ఒక్క పాపి విషయమై పరలోకమందు ఎక్కువ సంతోషము కలుగును" (లూకా 15:7).

క్రీస్తు సువార్త వలన ప్రశస్తమైన ఆత్మలు రక్షించబడినప్పుడు, మనము ప్రోత్సహించబడినవారమై ప్రభువు శరీరమైన క్రీస్తు సంఘమును గూర్చి

అనుకూలమైన తలంపులను కలిగియుండవలయును. మనము దేవుని మంచితనమును బట్టి ఆయనకు కృతజ్ఞులమై ఒక్క ఆత్మ మారుమనస్సు పొందినప్పుడు పరలోకమందున్న దేవదూతలతో పాటు సంతోషించ వలయును. ఒకడు సంఘమునకు చేర్చబడుట ఆశ్చర్యమును, ఆనందమును కలుగజేయును (అపో.కా. 2:47). మరియు తప్పిపోయిన ఒక సహోదరుడు తిరిగి దేవుని యొద్దకు వచ్చినప్పుడు అంతే ఆశ్చర్యము ఆనందము కలుగును. (యాకోబు 5:20)

మనము దేవుని సేవకులము గనుక తీరికలేకుండా ఆయన కొరకు పనిచేయవలెను. ప్రజలు తీరికలేకుండా పనిచేసినప్పుడు ఎంత సంతోషముగా నుందురో గమనించితివా? ఆదినుండి అదే జరుగుచున్నది. దేవుడు ఆదామును సృష్టించి అతడు చేయుటకు ఒక బాధ్యతను అప్పగించాడు. ఆదాము ఏదేను వనమును కాపాడుటకు అందుంచబడియున్నాడు. అదే విధముగా సంఘము ఎదుగవలయుననిన మన పనితనము కావలయును. రక్షించు సువార్త శక్తిని బోధించి ఉపదేశించుటకు మనము నియమింపబడిన మంటిఘటములము (2కొరింథీ 4:7; రోమా 1:16). దేవుడు రక్షింపబడిన వారిని సంఘమునకు చేర్చును (అపో.కా. 2:47). ఆ విధముగా సంఘము ఎదుగును. మన ప్రయాసములేని యెడల సంఘము వాడి వడలిపోవును.

సంఘమునందు సమస్యలు ఉండుట నిజము. గాని మనము ప్రతికూల తలంపులపై లక్ష్యముంచినయెడల మనము భుజాన్ని కాసి కష్టపడి చక్రాన్ని దొర్లించవలసిన ఆశక్తిని కోల్పోవుదము. దేవుని పనికొరకు నూతనమైన నిర్ణయములు తీసుకొందము. దేవుడ్ని సేవించడంలో తీరికలేని వారికి నిరాశపడుటకు సమయముండదు. తక్కువ పని చేసేవాడు బిగ్గరగా పిర్యాదు చేయునను నానుడి సరియైనదిగా కనిపిస్తుంది.

# 102
# అన్నిటిలోను విశ్వాసులుగానుండుట

"వాగ్దానము చేసినవాడు నమ్మదగినవాడు గనుక మన నిరీక్షణ విషయమై మనమొప్పుకొనినది నిశ్చలముగా పట్టుకొందము. కొందరు మానుకొను చున్నట్టుగా, సమాజముగా కూడుట మానక, ఒకనినొకడు హెచ్చరించుచు, ఆదినము సమీపించుట మీరు చూచిన కొలది మరి యెక్కువగా ఆలాగు చేయుచు, ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని ఆలోచింతము" (హెబ్రీ 10:23-25). ఈనాడు సంఘము ఎదుర్కొనుచున్న తీవ్రమైన సమస్య ఏదనగా సంఘమందలి సభ్యుల అవిశ్వాస్యత. ప్రపంచమునందు మన సమయమును దారి మళ్ళించుటకు అనేకమైన అవరోధములు కలవు. గాని క్రైస్తవులుగా మనము దేవునికి ప్రధమస్థానమీయవలెను. వేరొక పనికి ప్రాధాన్యతనిచ్చుట వలన సంఘ ఆరాధనలకు హాజరు కాలేనివారు స్వార్థపరులు. అట్టివారు, చేయాలను కొన్నది తమకిష్టమైనప్పుడు చేయగలమనుకొను స్వభావము కలవారు. అట్టి ప్రజలు దేవునికి అవిధేయులు. క్రైస్తవులు తమ సహోదరులతో కలసి ఆరాధించి సహవాసము కలిగియుండుటను మానుకొను ప్రతిసారి తమ్మును తాము బలహీనపరచుకొనుచున్నారు.

క్రైస్తవ సహోదరులుగాను, సహోదరీలుగాను మనము ఒకరినొకరము ప్రోత్సహించుకొని ఆరాధనకు హాజరగుటయందు మాత్రమే కాక నిరంతరము బైబిలును చదువుటయందును, ప్రార్ధనయందును కొనసాగునట్లు ప్రోత్సహించు కొనవలసిన బాధ్యత కలిగియున్నాము. దేవుని వాక్యజ్ఞానమునకు సరిపడున దేదియు లేదు. మనము విశ్వాసులమైన క్రైస్తవులుగా జీవించిన యెడల ప్రార్ధన ద్వారా తప్పక గొప్ప శక్తిని పొందుదుము.

సమయం గడిచిపోతుంది. కొన్నిసార్లు అది విరిగిపోతున్నట్లుండును. మనము దానిని వృథాచేయరాదు. జీవితం అతి చిన్నది. మనం ఎల్లప్పుడు నిత్యత్వానికి ఒక గుండె శబ్దం దూరంలో ఉన్నాము. ఈ అత్యవసరాన్ని మనం గ్రహించాలి. మన సమయాన్ని వృథాచేయలేము. ఎందుకనగా మరణం తరువాత మన గమ్యం నిర్థారించబడినది. ఆ తరువాత మనం దేనినీ మార్చలేము. మనలను పరలోకం కొరకు సిద్ధపరచేదానికన్నా ప్రాముఖ్యమైన దేది? పరలోకం పోగొట్టుకొన్నయెడల మన జీవితం వ్యర్థం. పరలోకంలో ప్రవేశించగలిగిన యెడల శాశ్వతము సంతోషంగా ఉంటాము. అక్కడికి వెళ్ళడానికి చేసిన ఎట్టి త్యాగమైనా మన ప్రయాసానికి మించిన విలువైనది.

## 103

# దాతృత్వము - పరిపూర్ణతకు అనుబంధము

"కాగా, దేవునిచేత ఏర్పరచబడిన వారును పరిశుద్ధులును ప్రియులునైన వారికి తగినట్లు, మీరు జాలిగల మనస్సును, దయాళుత్వమును, వినయ మును, సాత్వీకమును, దీర్ఘశాంతమును ధరించుకొనుడి. ఎవడైనను తనకు హానిచేసెనని యొకడనుకొనిన యెడల ఒకనినొకడు సహించుచు ఒకని నొకడు క్షమించుడి, ప్రభువు మిమ్మును క్షమించినలాగున మీరును క్షమించుడి. వీటన్నిటిపైన పరిపూర్ణతకు అనుబంధమైన ప్రేమను ధరించు కొనుడి. క్రీస్తు అనుగ్రహించు సమాధానము మీ హృదయములలో ఏలుచుండనియ్యుడి; ఇందుకొరకే ........ శరీరముగా పిలువబడితిరి; మరియు కృతజ్ఞులైయుండుడి" (కొలస్సీ 3:12-15).

అపోస్తలుడైన పౌలు చెప్పుచున్న విషయాలివి - జాలిగల మనస్సు, దయాళుత్వము, వినయము, సాత్వీకము, దీర్ఘశాంతము, సహించుకొనుట,

మనము దేవునికి ప్రయోజనకరమైన సేవకులముగా ఉండవలెననిన ఇవి ప్రాముఖ్యమైన లక్షణాలు. మనము మానవుల ఆత్మలను ప్రేమించుటతో పాటు అన్ని అవకాశములను వినియోగించుకొని ప్రభువుకు అత్యంత ప్రయోజనకరమైన సేవకులము కావలయును.

మనము వస్తుసంపదతో ఆశీర్వదించబడినప్పుడు, ఆర్థిక సంపదపై గల మమకారం గర్వమునకు నడుపుట దురదృష్టకరమైన విషయం. తరచు దేవుని బంగారు సూత్రాన్ని మరచిపోతున్నాము. ఇతరుల భావాలకు అవసరములకు ప్రాధాన్యత నిస్తున్నామా? నశించిన వారిని చేరుటయందు విజేయులమైన యెడల, మొదట ఇతరుల ఆత్మలను గూర్చి జాగ్రత్త కలిగి యుండవలెను. తరువాత వినయముతోను, దయతోను జాలిగల మనస్సు కలిగి సువార్తను చాటింపవలయును.

వాస్తవము కాని దానిని ప్రజలు గుర్తించగలరు. మనలో లేనిది ఉన్నట్లు మనము నటించిన యెడల, మనమాటలలో నిజములేదని గ్రహించినప్పుడు ప్రజలు మననుండి వెనుదిరుగుదురు.

మనలో ప్రతివాడు దేవుని ఆశీర్వాదముతో ఇయ్యబడిన తలాంతులను బాగుగా వినియోగించుకొని పవిత్ర హృదయంతో దేవుడ్ని సేవించుదము.

## 104
## అందరు ఆత్మలను సంపాదించువారు కావలయును

నానాటికి సంఘములు ఆత్మలను సంపాదించుటకు వ్యక్తిగత సువార్త చేయువారిపైనే ఆధారపడుచున్నారు. నిస్వార్థమైన హృదయముతో వ్యక్తిగతముగా క్రీస్తు సువార్తను వినుటకు అశక్తిగలవారికి వాక్యమును

ప్రకటించుటకు ప్రయాసపడవలెను. సువార్త నెరుగని వారిని చేరుటకు క్రైస్తవులు త్యాగపూరితముగా పనిచేసినయెడల క్రీస్తు కొరకు ఆత్మలను సంపాదించగలరు.

బోధకులు వేదికనుండి ప్రసంగించుట మాత్రము కాక, వ్యక్తిగతముగా వాక్యమును చదివి, ఆత్మలను సంపాదించుట యందు విజేయులు కావలయును. సంఘములు వ్యక్తిగత సువార్తను ప్రోత్సహించు బోధకులను కలిగియుండవలెను.

బైబిలునందలి అపోస్తలుల కార్యముల గ్రంధమును తెరచినపుడు వ్యక్తిగత సువార్త యొక్క సాఫల్యమును గమనించగలము. సమరయలో బోధించిన ఫిలిప్పు మాదిరిని గమనించెదము. అనేకులు సువార్తకు లోబడిరి. అయినను పిలిప్పు పరుగెత్తి ఐతియోపీయుడైన నపుంసకుని రధమును కలసుకొని అతనికి యేసును గూర్చి బోధించెను (అపో.కా. 8:26-40). పౌలు క్రైస్తవుడైన తరువాత చెరసాల అధిపతికి బోధించెను (అపో.కా. 16:23-34), లూదియ (అపో.కా 16:13-15), ఇంకా అనేకులు, ఒకరికి ఒకరు సువార్తను ప్రకటించిరి. పేతురు, కొర్నేలి వద్దకు వెళ్ళి అతనికి సువార్త ప్రకటించెను (అపో.కా. 10:1-4). కొర్నేలి మరియు అతని ఇంటివారును సువార్తకు విధేయులై రక్షించబడిరి.

ఈ మంచి మనుష్యులు, గొప్ప సువార్త బోధకులు! గొప్ప సమూహాము లకు ప్రకటించుట మాత్రము కాక వ్యక్తిగతముగా సువార్త ప్రకటించు ఏ అవకాశమును విడిచిపెట్టలేదు.

మరొక్క సారి మనము అపోస్తలుల కార్యములు చదివి ఆదిమ సంఘము నశించిన ఆత్మలనెట్లు చేరినదను విషయాన్ని గమనించాలి. అపోస్తలుల కార్యములు 8వ అధ్యాయమునందు యెరూషలేములోని క్రైస్తవులు

దూరదేశములకు చెదరిపోయి ప్రతిచోట సువార్త ప్రకటించిరి. ఆదర్శ ప్రాయమైన బైబిలు విధానమువైపు తిరిగి నశించిన ఆత్మలను చేరి మన సొంత సమాజములలో విజేయులైన సువార్తికులమగుదుముగాక.

# 105
# పరలోకము

మనలో ఎవరికి పరలోకానికి వెళ్ళాలనే ఆశ ఉండదు? ఆత్మీయ విషయాలను తీవ్రంగా ఆలోచించినయెడల, దేవునితో మన సంబంధము అత్యంత ప్రాముఖ్యమైనదని గ్రహించగలము. ఈలోకము గతించిపోవును గాని పరలోకమందు మనము దాచుకొను ధనము పాడైపోదు. అది శాశ్వతము నిలుచును. యోహాను ఆత్మవశుడై పరలోకమందలి సౌఖ్యమును గూర్చి మాటలాడెను. "ఆయన వారి కన్నుల ప్రతి బాష్పబిందువును తుడిచి వేయును, మరణము ఇక ఉండదు, దుఃఖమైనను ఏడ్పైనను వేదనయైనను ఇక ఉండదు. మొదటి సంగతులు గతించిపోయెనని సింహాసనము నుండి వచ్చిన గొప్ప స్వరము చెప్పుట వింటిని" (ప్రకటన 21:4). పరలోకమందు మనము ఈలోక బాధ నుండి విచారమునుండి విముక్తిని పొందెదము. మనకు సంతోషమును అనుగ్రహించు శాంతి శాశ్వతము ఉండునని ఎరుగుదుము.

ఈ జీవితమందు మనమెరిగిన విశ్వాసులైన దేవుని పిల్లలతో కలసి పరలోకమందు ఉండుట ఊహించెదము. శాశ్వతము దేవునిని ఆరాధిస్తూ సహవాసము కలిగియుండుట ఎంత అద్భుతము!

మనకున్న ప్రతి అవకాశమును వినియోగించుకొని ప్రభువును సేవింపవలెను. దేవుడు మనకు బైబిలునిచ్చాడు. అది పరలోకానికి మార్గదర్శి.

మనము దేవుని వాక్యమునకు విద్యార్థులమై, లేఖనములను క్షుణ్ణముగా పరిశీలించి, ఆయన ఘనసుండి కోరునది గ్రహించవలెను.

ప్రభువు వచ్చు ఆ గొప్ప దినమందు మనమాయనను ఎదుర్కొనలేక పోయిన యెడల ఎంత విచారము! ఆయన రాక కొరకు మనము సిద్ధపడని యెడల మనలను మనమే నిందించుకొనవలెను. మనము ఎవరిని సేవించ వలెనో అనునది ఎంచుకొనుటకు దేవుడు మనకు మనస్సును సామర్థ్యతను ఇచ్చాడు. మన శాశ్వత రక్షణ, మనము చేయు నిర్ణయములపై ఆధారపడును.

## 106

## మనం భయపడుతున్నామా?

కొందరు క్రైస్తవులు సువార్త సేవలో నిమగ్నమగుట కష్టతరమని ఎందు వలన తలంచుదురు? అనేకులు సంఘమందలి ఇతర కార్యక్రమములలో పనిచేయుటకు ఇష్టపడుదురు గాని వ్యక్తిగత సువార్తలో పాల్గొనుటకు సిద్ధపడలేరు. నశించిన వారిని క్రీస్తునొద్దకు నడిపించుట మన ఇష్ట ప్రకారము చేయు క్రియ కాదని మనకు మనము జ్ఞాపకము చేసుకొనవలెను. అది మనకివ్వబడిన దేవుని ఆజ్ఞ.

2000 సంవత్సరముల క్రితము క్రీస్తు ప్రభువు అపోస్తలులకిచ్చిన గొప్ప ఆజ్ఞ ఈనాడు మనపై కూడా అంతే ప్రభావాన్ని కలిగియున్నది. "అయితే యేసు వారి యొద్దకు వచ్చి పరలోకమందును, భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. కాబట్టి మీరు వెళ్ళి, సమస్తజనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి.

ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడా ఉన్నానని వారితో చెప్పెను” (మత్తయి 28:18-20).

క్రైస్తవులలో అనేకులు క్రీస్తును గూర్చి ఇతరులకు బోధించు సామర్థ్యాన్ని కలిగియుందురు. అయినను వారు ఎన్నడును ప్రారంభించుట కనిపించదు. నశించిన వారు క్రీస్తునొద్దకు తీసుకొని రాబడకపోయిన యెడల, వారు శాశ్వతము నరకాగ్నిలో భయంకరమైన బాధననుభవించవలయును. మనము సోమరులమై అట్టి వారిని గూర్చి శ్రద్ధలేకుండా ఉన్నామా?

దేవుడు మనుష్యులందరి ఆత్మలను ప్రేమించుచున్నాడు. “దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను” (యోహాను 3:16). దేవుడు సువార్తతో మనల్ని పిలుస్తున్నాడు. ఆ సువార్త రక్షించుటకు దేవుని శక్తియై యున్నది (రోమా 1:16). ఆయనను గూర్చి ప్రజలకు బోధించుటకు మనము ఆయన వాడుకొను మంటిఘటములము. దేవునికి ఇష్టులముగా జీవించు మనము మన తండ్రి పనిమీద ఉండవలయును.

## 107

## వ్యత్యాసములు

ఈనాడు యవ్వనస్తులు ఎదుర్కొను దుష్టత్వము 1930లలోను 1940లలోను పెరిగిన వారు ఎరుగరు. వివాహేతర సహజీవనమును గూర్చి వారెన్నడును వినియుండలేదు. వ్యభిచారము, జారత్వము సామాన్య జీవన విధానములని గాని, స్వలింగసంపర్కము ప్రత్యామ్నాయ జీవన విధానమని గాని వారికెన్నడు నేర్పించలేదు. ఇప్పుడు అనేకమంది యవ్వనస్తులు, పది

సంవత్సరముల వయస్సు పిల్లలు కూడా త్రాగుడుకు, మాదకద్రవ్యములకు బానిసలగుచున్నారు.

పిల్లలు తమ తోటి పిల్లలను హత్యచేయుట కూడా సామాన్యముగా వినుచున్నాము. వారి చర్యల వలన పిల్లల జీవితములు నాశనమగుట మాత్రము కాక వారి పాప ఫలితము వారిపైనున్నదనుట విచారకరము.

రెండవ ప్రపంచ యుద్ధమునకు ముందు అనేక కుటుంబములు వ్యవసాయముపై ఆధారపడి జీవించెడివి. భర్త కుటుంబమును పోషించుటకు వెళ్ళగా తల్లి ఇంటివద్దనే యుండి పిల్లలను సంరక్షించుచుండెను. వారు కలసి కుటుంబమునకు సంబంధించిన నిర్ణయములు తీసుకొనెడివారు. ఆ కాలమందు పెరిగిన పిల్లలు ఈనాటి పిల్లల జీవన విధానమునకు పూర్తిగా భిన్నమైన జీవన విధానాన్ని జీవించెడివారు. ఆనాటి పిల్లలు పొలములలో పనిచేయుచు, పొలమునకు కంచె వేయుచు, బడికి వెళ్ళుచు, వారి తల్లి దండ్రుల పర్యవేక్షణలో అమాయకమైన ఆటలలో నిమగ్నమైయుండెడివారు. గృహములు స్థిరముగానుండెను; కొన్ని మాత్రమే తల్లి, లేక తండ్రి మాత్రమే గల కుటుంబములుండెడివి. అటువంటి కుటుంబములకు కారణము ఒకరి మరణమైయుండెడిది. విడాకులు అరుదైనవై ప్రతివారికి తీవ్ర సంతాపాన్ని కలుగజేసెడివి.

రెండవ ప్రపంచ యుద్ధము తరువాత అనేక సాంఘికమైన మార్పులు చోటుచేసుకున్నాయి. సంపద దేవుడైనట్లు ప్రజలు వస్తుసంపద కొరకు తాపత్రయపడుతున్నారు. అనేక వస్తువులను కొనగలుగుటకు తల్లిదండ్రు లిరువురు బయట పనిచేయుటకు వెళ్ళిపోవుచున్నారు. జీవితము పై ఒత్తిడి నానాటికి ఎక్కువై భయానకమగుచున్నది. పిల్లలు బడినుండి, ఖాళీగానున్న ఇంటికి తిరిగి వస్తున్నారు.

మన కుటుంబములకు, మన దేశమునకు ఏమి జరిగిపోతున్నదని మనకు ఆశ్చర్యముగానున్నది. మనము సమాజములోని నైతిక విలువల పతనాన్ని గూర్చి దిగ్భ్రమచెందుతున్నాము. సంఘమందు కూడా కొన్ని సంవత్సరముల పూర్వము మనము ఊహించని మార్పులు ఈనాడు జరుగుచున్నవి. దేవుడు ఈ మార్పులను కోరుటలేదు. ఆయన మన కవసరమైన వాటినన్నిటిని అనుగ్రహించాడు. ఆయనయందు విశ్వాసముంచి, ఆయన వాక్యాన్ని అధ్యయనం చేసి, వాక్యమునకు విధేయత చూపి ఆయన సూత్రములను మన జీవితములకు అన్వయించుకొనుట వలన మాత్రమే నిజమైన అంకిత భావముగల జీవితాన్ని కనుగొనగలము.

## 108
## క్రమశిక్షణ

"మీలో జారత్వమున్నదని వదంతి కలదు. మీలో ఒకడు తన తండ్రి భార్యను ఉంచుకొన్నాడట. అట్టి జారత్వము అన్యజనులలోనైనను జరుగదు. ఇట్లుండియు, మీరుప్పొంగుచున్నారే గాని మీరెంతమాత్రము దుఃఖపడి యీలాంటి కార్యమును చేసిన వానిని మీలోనుండి వెలివేసినవారు కారు" (1కొరింథీ 5:1,2).

మనము జీవించుచున్న సమాజము క్రమశిక్షణలేకుండా ఉన్నది. శరీర కార్యములు; జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరము, అల్లరితో కూడిన ఆటపాటలు మొదలైనవి (గలతీ 5:19-21) అన్నియు మన చుట్టూ ఉన్నవి. తల్లిదండ్రులు క్రమశిక్షణలేని జీవితాలు జీవిస్తున్నారు. దానికి ప్రతిఫలంగా పిల్లలు క్రమశిక్షణ లేకుండా పెరుగుచున్నారు.

ప్రజలు తమ ప్రాపంచిక కోరికలను తృప్తిపరచుకొనుటకు ప్రయాసపడుచున్నారు. మనమనుభవించవలసినదంతా అనుభవించాలి, ఎందుకనగా మనం జీవించేది ఒకే జీవితమని ప్రపంచం బోధిస్తుంది. లైంగిక పాపము, ఇతర పాప సౌఖ్యములు ప్రాబల్యముగానున్నవి. ఇటువంటి పాపములో లేనివారు, వాటిని చేయువారిని తరచు సమర్థిస్తున్నారు. అదంతే, ఇది 21వ శతాబ్దం! అని సరిపెడుతున్నారు.

ఒకరినొకరు ఆత్మీయముగా బలపరచుకొనునట్లు క్రీస్తు సంఘము అనేక యత్నములు చేయుచున్నప్పటికి క్రైస్తవులు కొన్నిసార్లు సాతాను ఉరిలోనికి పడిపోవుచున్నారు. అనేక ఆత్మలు ప్రాపంచిక ఆపేక్షలపై పడి నశించిపోవుచున్నారు. అట్లు నశించిపోవుచున్న వారిని తండ్రియైన దేవునితో మంచి సంబంధము కలిగియుండునట్లు పునరుద్ధరించు బాధ్యత విశ్వాసులైన దేవుని పిల్లలందరిపైన కలదు. మనము మన సహోదరుల కావలివారము.

మనము అత్యధికమైన క్రమశిక్షణ కలిగిన జీవితము జీవించి క్రీస్తు సువార్తను బోధించు ఆసక్తిగలవారమైయుండవలయును. మన పనిని మనము సక్రమముగా చేసిన యెడల దేవుడు అభివృద్ధిననుగ్రహించును.

మన ఆసక్తిని పునరుజ్జీవింపచేసుకొని తీరికలేకుండా మన జీవిత దినములన్నియు ప్రభువును విశ్వాసంగా సేవించునట్లు తీర్మానించుకొందము.

## 109
## పెద్దలను ప్రేమతో మిక్కిలి ఘనముగా ఎంచవలయును

"మరియు సహోదరులారా! మీలో ప్రయాసపడుచు ప్రభువునందు మీకు పైవారైయుండి మీకు బుద్ధిచెప్పువారిని మన్నన చేసి వారి పనిని బట్టి

వారిని ప్రేమతో మిక్కిలి ఘనముగా ఎంచవలెనని వేడుకొనుచున్నాము; మరియు ఒకనితో నొకడు సమాధానముగా ఉండుడి. సహోదరులారా! మేము మీకు బోధించునది ఏమనగా అక్రమముగా నడుచుకొనువారికి బుద్ధిచెప్పుడి, ధైర్యము చెడినవారిని ధైర్యపరచుడి, బలహీనులకు ఊత నియ్యుడి, అందరియెడల దీర్ఘశాంతముగల వారైయుండుడి. ఎవడును కీడునకు ప్రతికీడు ఎవనికైనను చేయకుండా చూచుకొనుడి, మీరు ఒకనియెడల ఒకడు మనుష్యులందరి యెడలను ఎల్లప్పుడు మేలైనదానిని అనుసరించి నడుచుకొనుడి. ఎల్లప్పుడును సంతోషముగా ఉండుడి; యెడతెగక ప్రార్థన చేయుడి; ప్రతి విషయమునందును కృతజ్ఞతా స్తుతులు చెల్లించుడి. ఈలాగు చేయుట యేసుక్రీస్తునందు మీ విషయములో దేవుని చిత్తము. ఆత్మను ఆర్పకుడి. ప్రవచించుటను నిర్లక్ష్యము చేయకుడి. సమస్తమును పరిశీలించి మేలైనదానిని చేపట్టుడి. ప్రతివిధమైన కీడునకును దూరముగా ఉండుడి" (1థెస్స. 5:12-22).

అపోస్తలుడైన పౌలు థెస్సలోనీకయలోని సంఘముతో వారి మధ్య ప్రయాసపడుచు, వారిపైని నియమింపబడిన వారిని బాగుగా తెలుసుకొన వలెనని బ్రతిమలాడుచున్నాడు. వారు చేయు పనిని బట్టి వారిని ప్రేమతో హెచ్చుగా ఘనపరచవలెనని హెచ్చరించుచున్నాడు. తరచు మనము, మనమధ్య కష్టపడి పనిచేయు వారిని గూర్చి మనమెరుగము. వారి ప్రయాసము సంఘమును చురుకుగాను, సజీవముగాను ఉంచును. మనకు కూడా థెస్సలోనీకయలోని సహోదరులకు వలె ఈ విషయాన్ని జ్ఞాపకము చేసి, ప్రభువు సేవలో కష్టపడి పనిచేయువారిని ప్రేమతో ఘనముగా ఎంచవలెనని హెచ్చరించవలసిన అవసరము కలదు.

మనము ఆనందముగాను సంతోషముగాను ఉండవలసిన ప్రజలము.

మనకు నిత్యజీవితమును గూర్చిన నిరీక్షణ వాగ్ధానము కలదు. మనము అవసర సమయమందు మాత్రమే కాక ఎల్లప్పుడు ప్రార్థించు ప్రజలమై యుండవలయును. మనము శక్తిగలిగి అత్యానందభరితులమైన ప్రజలమై యుండి, క్రీస్తునందు మనకు గల నిరీక్షణను ఇతరులతో పంచుకొనుటకు ఆసక్తి గలవారమైయుండవలయును. మంచి పనులు చేయుటయందు కొనసాగుచు, సత్యము విషయములో రాజీపడక, సమస్త దుష్టత్వమును జాగ్రత్తగ విడనాడవలయును.

దేవుని ప్రజల సమాజము కలసి కష్టపడి పనిచేసి ఆయన రాజ్యపు ఎల్లలను వ్యాపింపచేసిన యెడల ఒకరినొకరము అభినందించుకొని జరిగిన మంచి పనిని బట్టి ప్రోత్సహించుకొనవలెను. సంఘమునందు అనైక్యతకు గాని విభజనకు గాని తావులేదు. మనశక్తి అంతయు ప్రభువును సేవించుట యందు వెచ్చించవలయును.

## 110

## మన జీవనాధారమైన గ్రంథము

చరిత్రయందు ప్రజలు స్వచ్ఛమైన దేవుని వాక్యము కొరకు తపన పడుచున్న యుగంలో మనం జీవిస్తున్నాము. క్రీస్తు సువార్తను ఉపదేశించి బోధించుటకిది సరియైన సమయము. మనం వెనుకకు వెళ్ళి ప్రాథమిక సూత్రములను ప్రబోధించవలయును. అందువలన మన పాఠములు తేలికైన మనస్తత్వ శాస్త్రముకన్న ఉత్తమముగానుండి అందు దైవభక్తి ఉండును. ఈ పాఠములు ఎక్కడైనను పదమార్పిడి లేకుండా బోధించవచ్చును. బైబిలు సందేశాన్ని ఇతరులకు అందజేయుటకు మనము ఈ ఉత్తమమైన పనిని చేయవలయును.

అపోస్తలుడైన పౌలు విద్యావంతుడైనవాడని అంగీకరించబడెను. అయినను అతడు సువార్తను గొప్ప సమూహములకు, సామాన్యమైన వ్యక్తులకు కూడా సమానముగా బోధించెను. పౌలుకు సమస్త విధములైన సాంఘిక, మనస్తత్వ శాస్త్ర వేదాంత పాఠములను బోధించగల శక్తి సామర్థ్యములు కలవు. గాని అతడు సువార్త బోధింపవలయునని, దేవుని వాక్యమును వినువారి హృదయములలో ప్రతిష్ఠించవలయునని ఆసక్తి కలిగియుండెను.

నూతనముగా జన్మించిన శిశువులకు దేవుని వాక్యమును ఉపదేశించి వారు వాక్యజ్ఞానము కలిగి పరిపక్వతనొందిన క్రైస్తవులుగా నుండుటకు సహాయపడవలెను. ఈ హెచ్చరిక పెద్దలకివ్వబడి, వారు స్వచ్ఛమైన దేవుని వాక్యమును ఉపదేశించు సామర్థ్యమును, బాధ్యతను కలిగియుండవలెనని తెలియజేయబడినది.

క్రైస్తవులందరు సువార్తికులై, నిరంతరము సువార్తతో నశించిన వారిని చేరవలయును. మంటిఘటములమైన మనకు, క్రీస్తు ప్రభువు ఈ సందేశాన్నిచ్చాడు. దైవావేశము వలన వ్రాయబడిన బైబిలు గ్రంథము అన్ని గ్రంథములకన్న ఉత్తమమైనది. మనము ఆ గ్రంథము వైపు తిరిగి, దేవుని వాక్యమును ప్రేమించి, గౌరవించి విశ్వాసముగా దానిని అధ్యయనం చేసి, అందున్న గొప్ప పాఠములను మన జీవితాలకు అన్వయించుకొని, బైబిలు గ్రంథాన్ని మన జీవనాధారమైన గ్రంథముగా చేసుకొనవలయును.

## 111

# దేవుణ్ని వెంబడించు

"కావున మీరు ప్రియులైన పిల్లల వలె దేవునిని పోలి నడచుకొనుడి" (ఎఫెసీ 5:1). "కాగా వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును

గూర్చిన మాటవలన కలుగును" (రోమా 10:13). మనము దేవునిని వెంబడించుటకు బైబిలును అధ్యయనం చేయవలెను. దేవుని వాక్యజ్ఞానము ద్వారా మనము దేవుని చిత్తాన్ని తెలుసుకొనగలము. మనం బైబిలు చదివి, అధ్యయనం చేసిన యెడల దేవుడు మనతో మాట్లాడతాడు. మనము దేవునినెరిగి ఆయనను వెంబడించుటకు ఇదొక్కటే మార్గము.

విశ్వాసము మన క్రైస్తవ జీవితానికి పునాది. దేవుని పిల్లలుగా మనము ఎదిగి పరిపక్వతనొందుటకు ఆ విశ్వాసముపై మన జీవితాన్ని కట్టుకొన వలెను. దేవుని పిల్లలగుటకు ఆశించు వారందరు విశ్వాసాన్ని కలిగి (రోమా 10:17), తదుపరి మారుమనస్సుపొంది (అపో.కా. 17:30), యేసుక్రీస్తును ఒప్పుకొని (రోమా 10:10), పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంద వలయును (అపో.కా. 2:38). రక్షణ పథకాన్ని బోధించు ఈ సువార్తకు విధేయు లగుటవలన మాత్రమే మనము దేవుడ్ని వెంబడించువారము కాగలము.

మనం దేవుడ్ని వెంబడించుకొలది మన జీవితములకు ఆత్మ ఫలములను కలుపుకొనవలయును (గలతీ 5:22-23). "అయితే ఆత్మఫలమేమనగా, ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము. ఇట్టివాటికి విరోధమైన నియమమేదియు లేదు". మనము దేవుని సర్వాంగకవచమును కూడా ధరించుకొనవలెను (ఎఫెసి 6:13-18). "అందుచేతను మీరు ఆపద్దినమందు వారిని ఎదిరించుటకును, సమస్తమును నెరవేర్చినవారై నిలువబడుటకును శక్తిమంతులగునట్లు, దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి. ఏలాగనగా మీ నడుమునకు సత్యమను దట్టి కట్టుకొని, నీతియను మైమరవు తొడుగుకొని పాదములకు సమాధాన సువార్తవలనైన సిద్ధమనస్సను జోడుతొడుగుకొని నిలువబడుడి. ఇవన్నియు గాక విశ్వాసమను

డాలును పట్టుకొనుడి, దానితో మీరు దుష్టుని అగ్ని బాణములన్నిటిని ఆర్పుటకు శక్తిమంతులవుదురు. మరియు రక్షణయను శిరస్త్రాణమును, దేవుని వాక్యమను ఆత్మ ఖడ్గమును ధరించుకొనుడి. ఆత్మవలన ప్రతి సమయమునందును ప్రతివిధమైన ప్రార్థనను విజ్ఞాపనను చేయుచు, ఆ విషయమై సమస్త పరిశుద్ధుల నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపన చేయుచు మెలకువగా ఉండుడి". దేవుడ్ని వెంబడించడానికి క్రైస్తవులుగా మనము చేయవలసినది చాలా ఉన్నది. మనం బైబిలును అధ్యయనం చేసి, దేవుని వాక్యమునుండి మనం నేర్చుకొన్న పాఠాలను మన క్రియలలో చూపించుదము.

## 112
## ఆయన మరణములోనికి

మనము క్రీస్తు నామములోనికి బాప్తిస్మము పొందుట మాత్రము కాక, క్రీస్తు మరణములోనికి కూడా బాప్తీస్మము పొందితిమి. "క్రీస్తు యేసులోనికి బాప్తీస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తీస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో, అలాగే మనమును నూతన జీవము పొందిన వారమై నడుచుకొనునట్లు, మనము బాప్తీస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడా పాతిపెట్టబడితిమి. మరియు ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యము గలవారమైన యెడల ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యము గలవారమై యుందుము" (రోమా 6:3-5).

క్రీస్తు మరణమందు ఏమి ఉన్నది? ఆయన మరణమందు సిలువలో

ఆయన రక్తము చిందింపబడినది. యోహాను 19:34 నందు యోహాను ఇలా వ్రాసాడు. "సైనికులలో ఒకడు ఈటెతో ఆయన ప్రక్కను పొడిచెను, వెంటనే రక్తమును, నీళ్ళును కారెను".

పవిత్రపరచుశక్తి రక్తమునకు కలదు. "అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడచిన యెడల, మనము అన్యోన్య సహవాసముగలవారమైయుందుము. అప్పుడాయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (1యోహాను 1:17). క్రీస్తు ప్రశస్తరక్తముతో కడుగబడుట ఒక ఆశ్చర్యకరమైన ఆశీర్వాదము. యేసు రక్తము మానవాళికి ఇవ్వబడిన అతి గొప్ప బహుమానము. మనము దేవుడ్ని ప్రేమిస్తున్నాము. ఎందుకనగా ఆయన మొదట మనల్ని ప్రేమించి తన అద్వితీయ కుమారుడ్ని మరణించుటకు నీ కొరకు, నా కొరకు అర్పించాడు.

## 113
# మన యెడల క్రీస్తు ప్రేమ

"క్రీస్తు ప్రేమ నుండి మనలను ఎడబాపువాడెవడు? శ్రమయైనను, బాధయైనను, హింసయైనను, కరవైనను, వస్త్రహీనతయైనను, ఉపద్రవమైనను, ఖడ్గమైనను మనలను ఎడబాపునా? ఇందును గూర్చి వ్రాయబడినదేమనగా నిన్ను బట్టి దినమెల్ల మేము వధింపబడినవారము వధకు సిద్ధమైన గొఱ్ఱెలమని మేము ఎంచబడినవారము. అయినను మనలను ప్రేమించిన వాని ద్వారా మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాము. మరణమైనను, జీవమైనను, దేవదూతలైనను, ప్రధానులైనను, ఉన్నవియైనను, రాబోవునవియైనను, అధికారులైనను, ఎత్తయినను, లోతైనను, సృష్టింపబడిన

మరి ఏదైనను మన ప్రభువైన క్రీస్తు యేసునందలి దేవుని ప్రేమ నుండి మనలను ఎడబాపనేరవని రూఢిగా నమ్ముచున్నాను" (రోమా 8:35-39).

పౌలు మాటలలో షరతులు లేని సార్ధత్యాగమైన ప్రభువు ప్రేమ మన కొరకు బయల్పరచబడినది. ఈ జ్ఞానము మనలను మనము తగ్గించుకొని దేవుడ్ని ప్రేమించునట్లు మనలను పురికొల్పవలయును. "నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణ శక్తితోను, నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను" (ద్వితీ. 6:5). మనయెడల యేసు యొక్క నిస్వార్ధమైన ప్రేమ ఈలాగు వివరించబడినది. (యోహాను 3:16) "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను".

మనమందరము మన విశ్వాసమును అభివృద్ధి చేసుకొనుటకు శ్రమ పడవలెను. "కాగా వినుట వలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును" (రోమా 10:17). మనము దేవుని వాక్యాన్ని అధ్యయనం చేసినప్పుడు మన విశ్వాసము అభివృద్ధి చెందుట మాత్రము కాక మన ప్రేమ కూడా అభివృద్ధిచెందును. మనమెరుగని వారిని ప్రేమించుట కష్టము. మనము నిరంతరము దేవునితో సంభాషించవలెను.

ఆయన వాక్యము ద్వారా మనతో మాట్లాడుచున్నాడని జ్ఞాపకముంచు కొనవలెను. మనము ప్రార్థించునప్పుడు ఆయన మన మాటలు విను చున్నాడు. దేవునితో మనము బలమైన సంబంధము, అనగా మరణ పర్యంతము ఆయన యందు విశ్వాసంగా జీవించుబంధమును పెంపొందించు కొనవలెను (ప్రకటన 2:10).

## 114

# మనుష్యుని అంతర్యములోని ఆలోచనే అతని నిజస్వరూపము

"అట్టివాడు తన అంతర్యములో లెక్కలు చూచుకొనువాడు. తినుము, త్రాగుము అని అతడు నీతో చెప్పునే గాని అది హృదయములోనుండి వచ్చు మాట కాదు" (సామెతలు 23:7). మానవుడు తనను గూర్చి ఇతరులను మోసగించవచ్చును, అతని ఉద్దేశ్యము మేరకు ఇతరులను సిగ్గుపరచవచ్చును. గాని అతడు ఎన్నడు దేవునిని మోసగించలేడు. దేవుడు మన హృదయాంతరంగములోనికి చూచి మన నిజస్వరూపాన్ని చూడగలడు.

లోకములోని అనేకుల హృదయాలు చెడుతలంపులతో నిండియుండును. వారు దేవుని వాక్యజ్ఞానముతో నింపబడలేదు. మనము ఎంపిక చేసుకొని, నిర్ణయములు తీసుకొనవలసి వచ్చినపుడు, దేవుని వాక్యము యొద్దకు వెళ్ళి ప్రతి సందర్భములోను దేవుని చిత్తాన్ని నేర్చుకొనుచున్నామా? లేక ఇహలోక పద్ధతులు మనపై ప్రభావాన్ని కలిగియున్నవా? అనునది జాగ్రత్తగా పరిశీలించవలెను.

ప్రజలు లౌకిక వస్తు సంపాదనలో మునిగి ధనము కొనగల వస్తువులను గూర్చి నిరంతరము ఆలోచించుచున్న యుగములో మనము జీవిస్తున్నాము. వారి సమయము, ఆలోచనలు లోక సంపదను ఆర్జించుటకు అంకితమై పోయెను. ఒక లౌకిక గురి కొరకు ఎక్కువ సమయమును వెచ్చించిన కొలది పరలోక గృహాన్ని సంపాదించుటకు నానాటికి తక్కువ, మరి తక్కువ సమయాన్ని వెచ్చించగలము. మన ఆలోచన మారవలయును. పరలోక మందు గృహము మన హృదయ వాంఛకావలయును.

వస్తుసంపద కొరకైన తపన ఎందువలన ప్రాముఖ్యమైనది? ఈ లోక

జీవితము త్వరలో ముగిసి, ఆ తరువాత తీర్పుజరుగునని మనమెరుగమా? మనమందరము ఇహలోక సంబంధమైన ఏ వస్తువు పరలోకానికి సాటి కాలేదని గ్రహించిన యెడల అది ఎంత అద్భుతముగానుండును?

మనము మన జీవితాలను దేవునికి అంకితం చేసుకొని, ఆయన మార్గమందు నడువవలయును. మన హృదయములనిండా తండ్రియైన దేవునిపైన, ఆయన అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తుపైన ప్రేమతో నిండియుండగలుగునట్లు నేర్చుకొనవలయును. ప్రభువు ఆజ్ఞలకు విధేయత చూపుట ద్వారా మాత్రమే మనము ఆ ప్రేమను ప్రదర్శించగలము.

## 115
## క్రీస్తే సమాధానము

వ్యక్తిగత పరిచర్య ద్వారా ప్రభువును సేవించువారికి మాత్రమే క్రీస్తు నందలి మన సహోదరుల బాధలు శ్రమలు అర్ధమగును. అనేకులు భావోద్రేకమైన శ్రమలు అనుభవించుచు వారి జీవితములపై అదుపు లేని పరిస్థితిలో బాధపడుచున్నారు. వారు పరిస్థితుల ప్రభావముల వలన చెదరగొట్టబడి, వారిని గూర్చి శ్రద్ధతీసుకొనువారు, వారికి వారు సహాయ పడునట్లు వారితో కూడా నుండి ప్రోత్సహించు వారు కావలయును.

ఈనాడు యవ్వనస్థులకు ఒక ప్రత్యేకమైన అవసరము కలదు. విడాకుల వలన, కోపము వలన, అసహ్యించుకొనుట వలన చీలిపోయిన కుటుంబము లలో అనేకమంది పిల్లలు పెరుగుచున్నారు. అట్టి వాతావరణంలో పిల్లలు సిగ్గుపరచబడుట, కలవరపరచబడుట, అభద్రతకు గురియగుట ఆశ్చర్యము కాదు. ఇట్టి తలంపులు తరచు తిరుగుబాటు చేయుటకు ప్రోత్సహించును. ఈనాటి యవ్వనస్థులు అనేక శోధనలకు లోనై, సాధ్యమైన ప్రోత్సాహము,

భద్రత కోరుకొనుచు ప్రభువుకు దగ్గర కావలసిన అవసరమున్నది.

క్రైస్తవ జీవితము ఒక్కటే సంపూర్ణమైన శాంతి, సంతోషము, నిరీక్షణలను ఇవ్వగలదు. క్రీస్తులేకుండా, దేవుని వాక్యము యొక్క నిలకడయైన ప్రభావము లేకుండా మనము నిరీక్షణ లేనివారమై పాపపు ఊబిలోనికి, స్వచిత్తాను సారమైన కూపములోనికి పోవుదుము. మన బలహీన సమయములలో సాతాను మనలను శోధించి తప్పుచేయుటకు ప్రోత్సహించును.

మనము క్రీస్తును నిజముగా హత్తుకొని, ఇతరులకు సరియైన మాదిరిని చూపగలుగునట్లు తీవ్రమైన బాధ్యత కలిగియుండవలయును. తల్లిదండ్రులు, తాతమామ్మలు సరియైన మాదిరి జీవితమును జీవిస్తూ దేవుని వాక్యములో నున్న గొప్ప సూత్రములను యవ్వనస్తులకు బోధించవలయును. మనము ఇంటి యందు, పాఠశాలయందు మన వ్యాపకమందు గడుపు సమయంతో పోల్చు కొన్నయెడల సంఘ కార్యక్రమములయందు గడుపుకాలము అతి సంకుచితము.

ఒకరికొరకు ఒకరము యదార్థమైన ప్రేమ కలిగియుండవలయును. మన చుట్టూ ఉన్నవారి యెడల శ్రద్ధగలవారమై అందరికి మంచి చేస్తూ, అందరిని మంచి చేసేవారిగా ప్రోత్సహించవలయును.

## 116
## ఏ తలుపునైనను తట్టుము

ఏ బేధములేకుండా, మూసియున్న ప్రజల ప్రతీద్వారము వెనుక శారీరికముగాను, ఆత్మీయముగాను బాధపడువారున్నారు. మానవుడు ఈ భూమిపై జీవించినంత కాలము మనశ్శాంతిని బాధనుండి విముక్తిని ఆశిస్తాడు గాని, అది ఎన్నటికిని పూర్తిగా సంభవించదు.

మన జీవితాలు అదుపు తప్పు మార్గము కలదు. పరిస్థితులు మనలను

తప్పుడు మార్గములోనికి నడిపించినపుడు, చెడు కాలమునందు కలుగు శ్రమలు భరించలేనివగును. దేవుడు బాధలన్నిటిని తొలగించడు గాని మనము వాటిని భరించుటకు సహాయపడును. మన జీవితాలు తిరిగి ఆధీనములోనికి రావడానికి దేవుడు సహాయపడి ప్రతీ బాధాకరమైన అనుభవము ద్వారా మనలను బలవంతులను చేస్తాడు. సరియైన స్థలములో వెదకిన యెడల మనము కోరు మనశ్శాంతిని నిజంగా కనుగొనగలము. నా స్నేహితుడా, దేవునితో మంచి సబంధము కలిగియుండుట ద్వారా మనము శాంతి సమాధానములను కనుగొనగలము. మనము ధృఢచిత్తము కలిగియుండి క్రీస్తును మన హృదయాలలోనికి ఆహ్వానించిన యెడల కష్టతరముగా కనిపించు అనేక కార్యములు ఆశ్చర్యముగా విడిపోవును.

క్రీస్తు గొప్ప సువార్త (రోమా 1:16) యందు రక్షించు దేవుని శక్తి కలదు. లోకానికి సువార్త ఆవశ్యకత మెండుగానున్నది. వేగవంతమైన జీవన విధానము, వస్తుసంపద కొరకైన తాపత్రయము ఎన్నటికిని ఉన్నతమైనవి కాలేవు. ప్రజల వేగాన్ని తగ్గించి సువార్త వినునట్లు చేయుట కష్టమైనపని. గాని ప్రాపంచిక లోటులన్నిటికి సువార్త ఒక్కటే సమాధానము.

మనము ప్రతీ తలుపును తట్టి అందు క్రైస్తవులు జీవించునట్లు చేయుట ఆశ్చర్యకరమైన అనుభవము కాదా?

## 117
## సువార్తను ఉపదేశించుము

వ్యక్తిగత సువార్త అనేక విధములుగా చేయవచ్చును. ప్రతివారిని వ్యక్తిగతముగా కలుసుకొని నశించిపోవుచున్న వారి ఆత్మలను గూర్చి వారికి తెలియజేయాలి. గాని అట్లు వారిని ప్రభావితం చేయడానికి కావలసిన

తలాంతులు, జ్ఞానము, సామర్థ్యత అరుదుగానుండును.

సంఘంలోని ప్రతివారు చేయగల విధానమొకటున్నది. ఒకరిని ఆదివారం ఉదయ ఆరాధనకు, బుధవారం సాయంత్రం బైబిలు తరగతికి ఆహ్వానించండి. స్త్రీ పురుషులు, యవ్వనస్తులు నశించిపోవుచున్న ఆత్మల యెడల ఆసక్తి కలిగి యున్నచో వారు తమ స్నేహితులను బైబిలు తరగతులకు ఆహ్వానించు సాంప్ర దాయాన్ని కలిగియుందురు. మనలో ప్రతివారు దీనిని గూర్చి తీవ్రముగా ఆలోచించిన యెడల మన బైబిలు తరగతులు కొద్దికాలం లోనే రెట్టింపగును. నశించిపోవుచున్న ఆత్మలు అనేకులు దేవుని వాక్యం విని క్రైస్తవులు కాగలరు.

మనము ఏదో ఒక పెద్ద పనిని చేసి అది విలువైనదని ఋజువు చేయాలను కుంటున్నామా? కొన్ని సార్లు మనము వేలు లేక లక్షల రూపాయలు ఖర్చుచేసే పెద్ద ప్రణాళికను చేయాలని ఆశిస్తుంటాము. సహోదరులారా! వ్యక్తిగతముగా కలుసుకొనుటకు, వ్యక్తిగతముగా క్రీస్తు సువార్తను బోధించుటకుమించిన ప్రణాళిక ఏదియు ఉండదు. మనము ఎన్ని ప్రణాళికలు, కార్యక్రమములు చేసినను, దేవుని వాక్యాన్ని నేర్చుకోవాలనే ఆశగల వారికి క్రీస్తు సువార్తను ఉపదేశించుటకు మించినదేదియు లేదు. మనం మన తండ్రిపనిపై ఆశక్తి కలిగి యుండి నశించిన ఆత్మలకు సువార్తను ఉపదేశించుభారాన్ని కలిగియుందము.

## 118
## మరణకరమైన పాపము

“తన సహోదరుడు మరణకరము కాని పాపము చేయగా ఎవడైనను చూచిన యెడల అతడు వేడుకొనును; అతని బట్టి దేవుడు మరణకరము కాని పాపము చేసిన వారికి జీవము దయచేయును. మరణకరమైన పాపము కలదు. అట్టి దాని గూర్చి వేడుకొనవలెనని నేను చెప్పుటలేదు. సకల

దుర్నీతియు పాపము; అయితే మరణకరము కాని పాపము కలదు" (యోహాను 5:16). మన సహోదరుడు మరణకరము కాని పాపము చేసినపుడు (అతడు ఒప్పుకొని, మారుమనస్సు పొందుటకు ఇష్టపడు పాపము) నమ్మకమైన మారుమనస్సు కలిగియున్నచో దేవుడు క్షమించునని ఎరిగి అతని కొరకు మనము ప్రార్థన చేయవలెను.

మరణకరమైన పాపము కలదు అట్టి పాపము చేయు సహోదరుని కొరకు మనము ప్రార్థన చేయమని ఆజ్ఞలేదు. మరణకరమైన పాపమనగా నరహత్య, విగ్రహారాధన, వ్యభిచారము, ధూషణ మొదలైనవని మనము తలంచవచ్చు. గాని ఒక సహోదరుడు ఒప్పుకొని మారుమనస్సు పొందుటకు ఇష్టపడని పాపము ఎట్టిదైనను, అది మరణకరమైన పాపముకాగలదు. ఒకడు క్రీస్తునుండి వెనుదిరిగి లోకంవైపుకు మరలిన యెడల, కొన్ని సార్లు అతని మనస్సాక్షి మొండిదై దేవుని వాక్యమును అంగీకరించుటకు ఇష్టపడక పోవచ్చును. క్షమించుటకు ముందు దేవుడు మారుమనస్సును కోరుకొనును.

మనకు క్షమాపణ కలుగునిమిత్తము యేసు మనకొరకు మరణించాడు. మన పాపములు కడుగుటకు ఆయన తన రక్తాన్ని చిందించాడు. ఆయన మన న్యాయవాది (పరలోక న్యాయవాది). ఆయన మన కొరకు విజ్ఞాపన చేస్తున్నాడు (1యోహాను 2:1). నిజమైన మారుమనస్సుతో మనము దేవునివైపు తిరిగిన యెడల, ఆయన మన పాపములన్నియు క్షమించును (1యోహాను 1:9).

## 119

# సంఘము యొక్క కర్తవ్యము

నశించిన ఆత్మలను సంపాదించుటయే సంఘము యొక్క కర్తవ్యము. కొద్దిమంది క్రైస్తవులు మాత్రమే దానిని గుర్తించి, అందుకు ఉత్తమమైన

ప్రాధాన్యతనిచ్చుట విచారకరము. ఎక్కువ మంది క్రైస్తవులు సంఘ ఆరాధనలకు, బైబిలు తరగతులకు హాజరగుట మాత్రము సరిపడునని తలంచి ముఖ్యమైనకర్తవ్యమునకు ప్రాధాన్యతనిచ్చుట లేదు. వారు నశించిన ఆత్మలను సంపాదించు బాధ్యతను నిజముగా అంగీకరించుటలేదు.

తరచు మనము దేవుని వాక్యమును నిశితముగా పరిశీలించి, చదివి ఆత్మీయముగా ఎదుగుటను నిర్లక్ష్యము చేయుచున్నాము. సంఘ క్షేమాభివృద్ధి కొరకు బైబిలు తరగతులకు, వేదిక నుండి వెలువడు ప్రసంగములకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చుచున్నాము. మన బైబిలు తరగతులు హెచ్చుగా సువార్త ప్రకటించుట వైపు దృష్టిసారించి, ప్రసంగములలో సువార్త ప్రకటించుట క్రైస్తవుని బాధ్యతయని నొక్కి చెప్పవలయును.

ఆదిమ సంఘము అన్ని ప్రదేశములకు వెళ్ళి సువార్తను బోధించి, ఉపదేశించెను. గాని ఈనాటి సంఘము ఆ పద్ధతినుండి వైదొలగి కదలు చున్నది. ప్రాంతీయ సువార్త సేవపై మనకేమాత్రము ఆశక్తిలేదు. మన ప్రార్ధనలలో ధనము, విదేశములపై హెచ్చు ప్రాధాన్యత కనబడుచున్నది. మన సమాజములోనే మనము సువార్త వ్యాప్తిచేయుటలేదు. ప్రజలకు ఆసక్తి ఉన్నయెడల వారు వచ్చి మన ప్రసంగములు వినగలరని చెప్పుచున్నాము. సహోదరులారా! అట్టి ఆలోచన వలన దేవుని పని జరగదు. అలాంటి ఆలోచన క్రీస్తు ఇచ్చిన ఆజ్ఞను నెరవేర్చునని మనం తలంచిన యెడల మనలను మనమే మోసగించుకొంటున్నాము. ఒకరికి ఒకరు వ్యక్తిగతంగా సువార్తను ప్రకటించుట ద్వారా మాత్రమే ఎక్కువ మంది క్రైస్తవులైనారనేది సత్యం.

వ్యక్తిగత సువార్త మన జీవితములలో భాగం కావలయును. "గొప్పఆజ్ఞ" క్రైస్తవులకు సువార్త ప్రకటించమని ఇచ్చిన ఆజ్ఞ. మనం సమాజాలలోనికి వెళ్ళుట ద్వారా మాత్రమే ఆయన ఆజ్ఞకు విధేయులం కాగలము. "మీరు

నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు" (యోహాను 14:15).

జీవితం వేగంగా కదలిపోతుంది. సమయముండగానే మనం ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలి.

## 120
## అదుపు తప్పుట

మన దేశ చరిత్రలో ఈనాడు మనం చూస్తున్నంత తక్కువ క్రమశిక్షణ ముందెన్నడు, ఎవ్వరూ చూడలేదు. అనేకులు, యవ్వనస్తుల నుండి ముసలి వారి వరకు ప్రతీవారు ఆత్మనిగ్రహంలేనివారుగా వారి క్రియలకు జవాబు దారులుగా ఉండుటలేదు. దానికి ఫలితంగా మన దేశ నైతిక స్థితి విపరీతంగా పడిపోయినది. మన విద్యార్థులలో అనేకులకు ఇంటివద్ద క్రమశిక్షణ నేర్పించుటలేదు. తరగతులలో విపరీతమైన అల్లరి చేస్తూ వారి గురియైన విద్యను నాశనం చేసుకొంటున్నారు. క్రమశిక్షణ లోపము ఒకని సామర్థ్యతను, నేర్చుకోవాలనే తపనను నాశనం చేయడం మాత్రమే కాక, ఇతరులను కూడా నాశనం చేస్తుంది. దాని పర్యవసానంగా చదువుట కూడా తెలియని విద్యార్థులను పట్టభద్రులను చేస్తున్నాము. ఈ సమస్యలు చాలా మట్టుకు తెలియనివైనప్పటికి, జపాను వంటి దేశాలలో వారి సంస్కృతికి, అభివృద్ధికి కారణం వారు క్రమశిక్షణకు ప్రాధాన్యతన్విడమే ననునది గమనార్హం. వయస్సు మీరిన వారికి క్రమశిక్షణ అర్థమగును. ఎందుకనగా వారు క్రమశిక్షణతోనే చదువుట, వ్రాయుట, లెక్కలు చేయుట నేర్చుకొన్నారు. నిజానికి వారి కాలంలో, ఈ తరంలోని వారికున్న అవకాశాలు లేవు.

పిల్లలు క్రమశిక్షణ నేర్చుకొనక పోవుట విచారకరము. వారు ఎట్టి వ్యక్తిగత బాధ్యత లేకుండా పెరుగుచున్నాను. వారు నియమ నిబంధనలకు

ఎదురు తిరుగుచు వారికి కావలసిన దేనినైనను ఎక్కడైనను చేయడానికి వెనుకాడుట లేదు. విపరీత పరిస్థితులలో తిరుగుబాటు, పిల్లలను ఇంటికి దూరం చేసి అవాంఛనీయమైన వ్యభిచారానికి గురిచేస్తుంది. తరం వెంబడి తరం, అనేక జీవితాలు నాశనమైపోతున్నాయి.

మనం బ్రతకాలంటే, మనలను మనం క్రమశిక్షణలో ఉంచుకొను ప్రజలమై మన క్రియలకు మనం బాధ్యత వహించాలి.

## 121
## మన హృదయాలు

మానవ హృదయము సున్నితమైన అవయవమై దయ, ధైర్యము, అన్నిటికి మించి ప్రేమించుటకు సమర్ధవంతమైనది. మనమందరము ఆవేశపూరితమైన వారము. మన హృదయాలు పగ, ద్వేషము అనువానితో నిండినప్పుడు మనం అతి నికృష్టమైనవారము. మన హృదయాలు పవిత్రముగా నుండి, మన ఉద్దేశాలు సరియైనవిగా నున్నయెడల, గొప్ప సంతోషమును అనుభవించగలం.

ఆవేశపూరితమైన అనుభవానికి కొందరు భయపడతారు. అట్టివారు తెలివిగా జీవిస్తూ బాధాకరమైన సంబంధాలను విడనాడాలని ఆశిస్తారు. బాధనుండి తమ్మును తాము కాపాడుకొను ప్రయత్నములో ప్రేమను అనుభవించడంలో విఫలులౌతారు.

హృదయము అనుమాట ఆవేశమునకు అన్వయించబడి బైబిలునందు చెప్పబడినది. యేసు ప్రభువు హృదయాన్ని గూర్చి యోహాను 4:1–3 నందు ఇలా చెప్పాడు. “మీ హృదయమును కలవరపడనియ్యకుడి; దేవునియందు విశ్వాసముంచుచున్నారు నాయందును విశ్వాసముంచుడి. నా తండ్రి యింట అనేక నివాసములు కలవు. లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము

సిద్ధపరచ వెళ్ళుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్ద నుండుటకు మిమ్మును తీసుకొని పోవుదును". మన రక్షణలో హృదయానికి గొప్ప పాత్రకలదు. దేవుడు మనలనెంత గానో ప్రేమిస్తున్నాడు (యోహాను 3:16). ఆయన తన కుమారుడ్ని మనకొరకిచ్చాడు, ఆయన ద్వారా మనకు సువార్తనిచ్చాడు. నిజాయితీగల మంచి హృదయాలు క్రీస్తు సువార్తను అందుకొన్నప్పుడు, విశ్వాసులైన క్రైస్తవులు ఉద్భవిస్తారు.

మన హృదయాలు సరిగ్గా ఉన్నప్పుడు భూమి మీద, పరలోకంలో మనం గొప్ప ఆనందాన్ని అనుభవించగలము.

## 122
## క్రీస్తు రక్తము

"ఆ దినమున జీవజలములు యెరూషలేములో నుండి పారి సగము తూర్పు సముద్రమునకును సగము పడమటి సముద్రమునకును దిగును. వేసవి కాలమందును, చలికాలమందును ఆలాగుననే జరుగును" (జకర్యా 14:8). పరిపూర్ణమైన అర్పణ చేయుటకు క్రీస్తు ప్రభువు ఈలోకానికి వచ్చాడు. దేవుని చిత్తాన్ని నెరవేర్చు వారందరి పాపములు తీసివేయుటకు ఆయన తన ప్రాణాన్నిచ్చాడు. ఇందు గతించిన కాలములోని వారు, ఆలాగుననే క్రీస్తు తరువాత అంతము వరకు జీవించిన వారు ఉందురు.

సిలువపై క్రీస్తు చిందించిన రక్తము దేవునికి విధేయులైన వారందరి పాపములు కడుగును. పితరుల ధర్మశాస్త్రము, మోషే ధర్మశాస్త్రము నెరవేర్చిన వారందరు క్రీస్తు రక్తముచే కడుగబడిరి. ఆయన రక్తము వెనుకకు ప్రవహించి "గతించిన కాలము"లోని వారిని కూడా పవిత్రపరచును. సిలువ తరువాత

జీవించినవారు క్రీస్తు సువార్తకు విధేయులగుట ద్వారా వారి పాపములు క్షమింపబడినవారైరి. కాలము గడచిన కొలది క్రీస్తు రక్తము యుగాంతము వరకు ఒకే విధముగా పాపములను కడుగును.

క్రీస్తు యుగానికి పూర్వము జీవించిన వారి పాపములు కడుగబడుటను గూర్చి అనేక ప్రశ్నలు కలవు. జకర్యా 14:8 నందు క్రీస్తు రక్తము వెనుకకు, ముందుకు కూడా ప్రవహించునని తెలియజేయబడినది. దేవుడు తన కుమారుడ్ని మరణించుటకు పంపినప్పుడు, ఆయన మానవాళి అందరి కొరకు మరణించాడు. ఈ గొప్ప బలియాగము లేకుండా మానవునికి నిరీక్షణ లేదు. మనయెడల దేవుని ప్రేమ మన జ్ఞానమునకు మించినది.

## 123
## సంతోషము సమాధానము

మనము తరచు పాపము యొక్క సౌఖ్యములను గూర్చి వింటాము. ప్రతి దినం పాప సౌఖ్యములను అతిశయముగా వివరించుప్రకటనలను చూస్తుంటాం. సహోదరులారా! క్రైస్తవునికి పాపము ఆనందించదగినది కాకూడదు. క్రీస్తుకు అత్యంత ప్రాధాన్యతనియ్యలేని వారికి పాపము కొంత అనిశ్చితమైన ఆనంద సమయాన్ని చూపించవచ్చును. ఒకడు పాపమునకు వ్యతిరేకముగా తన మనస్సాక్షిని కఠినపరచుకొన్నయెడల, అట్టి ఆనందము అతనిని కలవరపరచ లేదు. క్రీస్తును తమ హృదయ సింహాసనములపై ఉంచుకొన్న క్రైస్తవులు, దేవుని చిత్తాన్ని తిరస్కరించినపుడు హృదయ వేదనకు గురియగుదురు.

క్రీస్తు సువార్తకు విధేయులైన వారు దేవుని కుటుంబమైన సంఘములో సభ్యులైయుందురు. దేవుని పిల్లలుగా మనకు ఆశ్చర్యకరమైన శాంతి, మన పరలోక తండ్రితోను, మన ఆత్మీయ సహోదరులు, సహోదరీలతోను

పరలోకమును అనుభవించుదుమను నిరీక్షణ కలదు. దేవునికి ఇష్టులముగా జీవించుటయందే మనకు సంతోషము కలదు. మన ప్రభువైన రక్షకునికి వ్యతిరేకముగా తిరుగుబాటు చేసినయెడల నేరము, దుఃఖము మాత్రమే మిగులును. మనము ఇహలోక సంబంధమైన పనులలో మునిగి పరలోక గృహాన్ని తప్పక సంపాదించలేము. మనము లోకానికి సాధ్యమైనంత దూరముగాను, దేవునికి అతి దగ్గరగాను జీవించవలెను. లోకము, లౌకిక వినోదములయందు శాంతిని వెదకుచున్నది. ప్రజలు దేవుని వైపు మరలి ఆయనతో నడచిన యెడల మాత్రమే వారు వెదకు ఆనందాన్ని కనుగొనగలరు.

## 124
## మన కృపా సింహాసనము

"ఆయనే మన పాపములకు శాంతికరమైయున్నాడు; మన పాపములకు మాత్రమే కాదు, సర్వలోకమునకును శాంతికరమైయున్నాడు" (1యోహాను 2:2). దేవుడు తన కుమారుడ్ని మరణించుటకు మనకొరకిచ్చుట ద్వారా మనలను ఆశీర్వదించాడు. ఆయన పవిత్ర రక్తాన్ని చిందించుట వలన, మనము క్రీస్తు సువార్తకు విధేయులమై పాపక్షమాపణనొందియున్నాము. క్రీస్తు నిజమైన మన కృపాసింహాసనము. మోషే ధర్మశాస్త్రము క్రింద ప్రధాన యాజకుడు సంవత్సరమునకొక్కసారి అతి పరిశుద్ధ స్థలములోనికి ప్రవేశించి, జంతురక్తాన్ని నిబంధన మందసము (కృపా సింహాసనము) పై వెదజల్లి దేవుడు తన ప్రజల పాపములను క్షమించునట్లు చేసెడివాడు. క్రీస్తు నిబంధన క్రింద మనము పాపక్షమాపణ పొందుటకు ఆయన రక్తమును సంధించవలయును.

క్రీస్తు రక్తమును సంధించుటకు మనము సువార్త రక్షణ పథకమునకు విధేయులము కావలయును. మనము దేవుని వాక్యమును వినవలయును (రోమా 10:17); విశ్వసించవలయును (మార్కు 16:16); మారు మనస్సు

పొందవలయును (అపో.కా. 17:30), నోటితో ఒప్పుకొనవలయును (రోమా 10:10); బాప్తీస్మము పొందవలయును (అపో.కా. 2:38). విశ్వాసముగా జీవించవలయును (ప్రకటన 2:10); మనము హృదయాంత రంగము నుండి సువార్తకు విధేయులమైన యెడల, క్రీస్తు రక్తమును సంధించి, మన పాపములను కడుగబడుదుము. మనము నమ్మకమైన క్రైస్తవ జీవితమును జీవించి, మన పాపములను గూర్చి నిజముగా మారుమనస్సు పొందిన యెడల క్రీస్తు రక్తము మనలను పవిత్రపరచుట కొనసాగించును.

యేసుక్రీస్తు మన కృపా సింహాసనమైయున్నాడు. ఆయన తండ్రియెదుట మన న్యాయవాదియైయున్నాడు. మనము క్రీస్తు ద్వారా ప్రార్ధన యందు తండ్రిని చేరగలము. అందువలననే ప్రార్ధనలు ఎల్లప్పుడు యేసుక్రీస్తు నామమున ప్రార్ధించవలెను. శ్రమపడి, ప్రతివిధముగాను శోధింపబడి, జయించిన క్రీస్తు ప్రభువు తండ్రి యెదుట మన కొరకు విజ్ఞాపన చేయుట ద్వారా మనము ఆశీర్వదించబడినవారమైతిమి.

## 125
# దేవుని సేవకులు

“ఆ హేతువుచేతనే మీ మట్టుకు మీరు పూర్ణజాగ్రత్తగలవారై, మీ విశ్వాసమునందు సద్గుణమును, సద్గుణమునందు జ్ఞానమును, జ్ఞానము నందు ఆశానిగ్రహమును, ఆశానిగ్రహమునందు సహనమును, సహనము నందు భక్తిని, భక్తియందు సహోదర ప్రేమను, సహోదర ప్రేమయందు దయను అమర్చుకొనుడి” (2పేతురు 1:5-8).

నమ్మకమైన క్రైస్తవులు దేవుని వాక్యము చదువుటయందు సమయమును గడుపుదురు. దేవునికిష్టులైన సేవకులుగా మనము ఉండవలయుననిన మనము దేవుని వాక్య పోషణయందు ఎదుగుచు జీవించవలయును. మనము

మన విశ్వాసమునకు సద్గుణమును, జ్ఞానమును, ఆశానిగ్రహమును, సహనమును, భక్తిని, సహోదర ప్రేమను, దయను కలుపుకొనుటకు ప్రయాసపడవలెను.

దేవుని వాక్యమునుండి మనము నేర్చుకొన్నవి మన క్రియలలో చూపించవలయును. ఇట్టి సుందరమైన క్రైస్తవ లక్షణములను కేవలము వాటిని గూర్చి చదువుట వలన కలిగియుండలేము. కొన్ని అనుభవముల వలన మాత్రమే పొందగలము. ఒకడు నమ్మకమైన సేవకుడ్ని గూర్చి మాటలాడవచ్చును గాని అతడు నిజముగా సేవకుని జీవితాన్ని జీవించని యెడల దేవుడు అతనిని అంగీకరించలేడు. ఒకడు తన జీవితాన్ని దేవుని సేవలో కొనసాగించుట ఉత్తమమైన ఆధిక్యత అనుటలో ఎట్టి సందేహము లేదు. సహోదరులారా! మనమందరము నిజముగా ఫలవంతమైన దేవుని సేవకులుగా కొనసాగెదము.

## 126
## గృహము

గృహము ఒక ప్రత్యేకమైన స్థలము. తల్లిదండ్రుల భద్రతలో పిల్లలు క్షేమంగా నుండు స్థలము. వృద్ధులు తమ గృహమును గూర్చి జ్ఞాపకము చేసుకొనుటకు సంతోషించుదురు. ఇప్పుడు వారి యొద్ద లేని తల్లిదండ్రులతో మాట్లాడవలెనను వింత తపనపడతారు. మనకు బాగులేనప్పుడు ఇంటికి వెళ్ళాలని ఆశపడతాము. అక్కడుండుట వలన తెలియని ఆనందాన్ని, ఆరోగ్యాన్ని పొందుతాము.

నమ్మకమైన క్రైస్తవులకు 'గృహము' అని పిలుచు వేరొక స్థానము కలదు. అది పరలోక సంబంధమైన ది. మన పరలోక తండ్రి అక్కడ నివసించును. ఆ స్థలమును గూర్చి యేసుప్రభువు ఈలాగు చెప్పాడు – "మీ హృదయమును కలవరపడనియ్యకుడి; దేవునియందు విశ్వాసముంచుచున్నారు నాయందును విశ్వాసముంచుడి. నా తండ్రి యింట అనేక నివాసములు కలవు, లేని

యెడల మీతో చెప్పుదును. మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్ద నుండుటకు మిమ్మును తీసికొని పోవుదును" (యోహాను 14:1-3). ప్రకటన 21:4 నందు ఇలా చదువ గలము - "ఆయన వారి కన్నుల ప్రతి బాష్పబిందువును తుడిచి వేయును, మరణము ఇక ఉండదు, దుఃఖమైనను, ఏడ్పైనను, వేదనయైనను ఇక ఉండదు. మొదటి సంగతులు గతించి పోయెనని సింహాసనములో నుండి వచ్చిన గొప్ప స్వరము చెప్పుట వింటిని". పరలోకమందలి గృహము శాశ్వతమైనది. అది నీతిమంతులు నివసించు స్థలము. అచ్చట సంతోషము, సమాధానము, ఆదరణ, ప్రేమ సమృద్ధిగా నుండును. పరలోకము దేవుడు నివసించు ప్రదేశము. మనము శాశ్వతము ఆయన సన్నిధిలో జీవించగలము. అచ్చట రాత్రులుండవు. మానవులు మాటలలో వర్ణించలేని ఆశ్చర్యకరమైన, సౌందర్యమైన ప్రదేశమది. అన్నిటి కన్న ఉత్తమమైనది, ప్రతీవారు కోరుకొనవలసిన స్థలము. నమ్మకమైన క్రైస్తవులు అచ్చటికి వెళ్ళుటకు ఎదురుచూచి, శాశ్వతము పరలోక ఆనందమును అనుభవించుదురు.

## 127
## మన వీరుడు

ప్రతి యుద్ధానికి వీరులు కలరు. శాంతి సమయంలో మనకు క్రీడలలోని విజేతలే వీరులుగా కనిపిస్తుంటారు. అత్యంత ధైర్యవంతులనుగాని, గొప్ప తలాంతులు గల వారిని గాని, నైపుణ్యం గలవారిని గాని వీరులుగా ఎంచడం సామాన్యమైనది. క్రైస్తవులు అన్నిటికన్న గొప్పది, ముఖ్యమైనదినైన యుద్ధమందు నిష్ఠాతులను, పవిత్రతగల వారిని, ధైర్యసాహసాలు చూపువారిని చూచి గర్వించ గలరు. ఈ యుద్ధము మానవుల ఆత్మల సంపాదన కొరకైనయుద్ధము.

మంచి, చెడుల శక్తులు ప్రపంచజనాభా అంతటిలోను ఉందురు. భూమి అంతయు యుద్ధభూమి.

క్రైస్తవులు చెడుతో మంచికి జరుగు యుద్ధమునకు దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించి సిద్ధపడుదురు (ఎఫెస్సీ 6:11). ఈ సర్వాంగ కవచమును గూర్చి బైబిలునందు ఈలాగున చెప్పబడినది. "అందుచేతను మీరు అపద్దినమందు వానిని ఎదిరించుటకును, సమస్తము నెరవేర్చినవారై నిలువ బడుటకును శక్తిమంతులగునట్లు, దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించు కొనుడి. ఏలాగనగా మీ నడుమునకు సత్యమను దట్టి కట్టుకొని నీతియను మైమరువు తొడుగుకొని పాదములకు సమాధానసువార్తవలననైన సిద్ధమనస్సను జోడు తొడుగుకొని నిలువబడుడి. ఇవన్నియు కాక విశ్వాసమను డాలు పట్టు కొనుడి; దానితో మీరు దుష్టుని అగ్నిబాణము లన్నిటిని ఆర్పుటకు శక్తిమంతు లవుదురు. మరియు రక్షణయను శిరస్త్రాణమును, దేవుని వాక్యమను ఆత్మ ఖడ్గమును ధరించుకొనుడి. ఆత్మ వలన ప్రతి సమయము నందును ప్రతి విధమైన ప్రార్ధనను విజ్ఞాపనను చేయుచు ఆ విషయమై సమస్త పరిశుద్ధుల నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపన చేయుచు మెలకువగా ఉండుడి (ఎఫెసీ 6:13-18). మనము మనలను సంపూర్ణముగా క్రీస్తుకు సమర్పించుకొని, అపవాదిని ఎదిరించుచు ఆయన యుద్ధమందు చేరిన యెడల ఆయన మన వీరుడగును. ఆయనపై మన నేత్రములు కేంద్రీకరించి భయములేకుండా ఆయనను వెంబడించగలము. ఆయన మన రక్షకుడు.

## 128

# మూడు యుగములు

క్రొత్తనిబంధన యందు మోషే ధర్మశాస్త్రము నెరవేర్చబడినదని తేటగా వ్రాయబడినప్పటికిని, పాతనిబంధనకు ఇంకను మనపై అధికారము కలదని

నమ్మువారుండుట ఆశ్చర్యము. కొలస్సీ 2:14-17 నందు పాతనిబంధన క్రీస్తుతో పాటు సిలువకు మేకులతో కొట్టబడినదని చెప్పబడినది. రోమీయులకు, గలతీయులకు, హెబ్రీయులకు వ్రాయబడిన పుస్తకములయందు లేఖనముల వెంబడి లేఖనములలో, మోషే ధర్మశాస్త్రము ఇక మీదట అధికారములో లేదనియు, క్రీస్తు సువార్త ధర్మశాస్త్రమును (క్రొత్తనిబంధన) మనము వెంబడించ వలెననియు తేటగా వివరించబడినది. గలతీ 5:4 నందు "మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్చబడువారెవరో వారు క్రీస్తులో నుండి బొత్తిగా వేరు చేయబడియున్నారు, కృపలో నుండి తొలగిపోయియున్నారు" అని చెప్పబడి యున్నను అనేక మతశాఖలు పాతనిబంధనలోని కొన్ని భాగములకు హత్తుకొని, వారు అనుసరించు పద్ధతులైన వాద్య సంగీతములు, ప్రత్యేకమైన పరిశుద్ధ దినములు, వివాహమును వ్యతిరేకించుట మొదలైనవి సరియనితలస్తున్నారు. బైబిలు మూడు ప్రత్యేకమైన యుగములుగా విభజింపబడినదని గ్రహించవల యును. మొదటిది పితరులయుగము. ఈ యుగమందు దేవుడు అబ్రహాము వంటి కుటుంబయజమానులతో మాటలాడెను. మోషే ధర్మశాస్త్రము సీనాయి పర్వతంపై ఇయ్యబడినంతవరకు ఈ యుగము 2500 సంవత్సరములుండెను. మోషే ధర్మశాస్త్రము కేవలము ఇశ్రాయేలీయుల కీయబడి, క్రీస్తు జననము, జీవితము, మరణపర్యంతము 1500 సంవత్సరములు కొనసాగెను. మూడవ యుగము క్రైస్తవయుగము. క్రీస్తు పునరుత్థానం తరువాత పెంతెకోస్తుదినమున సంఘము స్థాపింపబడిన నాటి నుండి ఈ యుగము ప్రారంభమైనది. మనము క్రైస్తవ యుగమునందు జీవించుచున్నాము. ఈ యుగము అంతము వరకు కొనసాగును. బైబిలును తేటగా అర్థం చేసుకొనుట : పాతనిబంధనను నెరవేర్చుటకు, మనలను రక్షించిన క్రీస్తు రక్తము ద్వారా ఇంకను పరిపూర్ణమైన నిబంధనను మనకిచ్చుటకు యేసుక్రీస్తు మన కొరకు మరణించెను.

# 129
# పాపము

బైబిలు గ్రంథమంతటిలోను అత్యంత బాధాకరమైన పదము పాపము. అది మనము లెక్కించలేని కోట్లకొలది ప్రజలకు బాధను, హృదయ వేదనను తీసుకొని వచ్చింది. ఆది. 4:7 నందు పాపమును గూర్చి మొదటిగా చెప్పబడినది. గాని అది పాపము యొక్క మొదటి ప్రత్యక్షత కాదు. దాని ప్రారంభము పరలోకమందు జరిగెను. "దేవదూతలు పాపము చేసినప్పుడు దేవుడు వారిని విడిచిపెట్టక, పాతాళలోకమందలి కటిక చీకటిగల బిలముల లోనికి త్రోసి, తీర్పుకు కావలిలో ఉంచబడుటకు వారిని అప్పగించెను" (2పేతురు 2:4). మొదటిగా పాపము చేసిన దేవదూత సాతాను లేక అపవాది. "అపవాది మొదటి నుండి పాపము చేయుచున్నాడు గనుక పాపము చేయువాడు అపవాది సంబంధి. అపవాది యొక్క క్రియలను లయపరచుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను" (1యోహాను 3:8).

పరలోకమందున్న దేవుని సృష్టికి పాపాన్ని పరిచయం చేసిన సాతాను, భూమి మీదనున్న దేవుని సృష్టికి కూడా పాపాన్ని పరిచయం చేసాడు. దేవుడు ఆదాము అవ్వలను అందమైన ఏదేను వనంలో ఉంచాడు. వారు ఆ వనమును భద్రపరచి, కాపాడవలసియున్నది. వారు అమాయకంగా ఆనందిస్తూ దేవుని సహవాసాన్ని అనుభవించారు. జీవవృక్షముతో పాటు అన్ని వృక్షముల ఫలాలను వారు తినవచ్చును. గాని ఒకే వృక్ష ఫలములను వారు తినకూడదు. అది మంచి చెడ్డలను తెలియజేయు వృక్షము. దేవుడు ఆదాముతో ఈలాగు చెప్పాడు. "అయితే మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములను తినకూడదు; నీవు వాటిని తినుదినమున నిశ్చయముగా చచ్చెదవని నరునికాజ్ఞాపించెను" (ఆది. 2:17). గాని సాతాను అవ్వతో వారు చావరని, మంచి చెడులు తెలుసుకొని

దేవునివలె జ్ఞానులౌతారని చెప్పాడు. ఆ విధంగా సాతాను అవ్వను ఒప్పించి ఆమె ఆ నిషిద్ధ ఫలమును తిని, ఆమె భర్త ఆదామునకు కూడా ఇచ్చునట్లు ప్రలోభపరచాడు. ఆ సమయమందు వారు ఆత్మీయముగా మరణించి, పాపం వలన దేవునినుండి వేరైపోయారు. వారికి జీవవృక్షఫలాలు లభించకుండ చేయుటకు దేవుడు వారిని ఏదేను వనం నుండి వెళ్ళగొట్టాడు. వారు ఆ విధంగా శారీరికంగాను మరణించారు. పాపము ఎంతటి బాధాకరమైనదో మనము తెలుసుకొనవలెను. అది మన ఆత్మలను నరకమందు నశింపచేయగలదు. మారుమనస్సు పొందని పాపము ఒకనిని శాశ్వతము నాశనము చేయును.

## 130
## మనం చేసే నిర్ణయాలు

తల్లిదండ్రులకు ఒక గొప్ప బాధ్యత అప్పగింపబడినది. “బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము. వాడు పెద్దవాడైనప్పుడు దానినుండి తొలగిపోడు” (సామెతలు 22:6). మరియు “తండ్రులారా! మీ పిల్లలకు కోపము రేపక ప్రభువుయొక్క శిక్షలోను, బోధలోను వారిని పెంచుడి” (ఎఫెసీ 6:4). పిల్లలను పెంచుట తేలికైనపని కాదు. అందుకు చాలా ఆలోచన, ప్రార్థన, సమర్పణ కావలయును. వారు చిన్న పిల్లలుగానున్నప్పుడు, పిల్లలను పెంచుటకు సమయమంతయు కావలయును.

ప్రతి తరమువారు, తమ కాలంలోనే పిల్లలను పెంచుట అత్యంత కష్టమైన పనియని తలంచుదురు. గాని ప్రతీ తరములోను పిల్లలను పెంచుటకు కొన్ని ప్రోత్సాహకాలు, కొన్ని నిరుత్సాహకాలు ఉంటాయి. పరిసరాలు, బయట నున్న వాతావరణ ప్రభావాలు వేరుగానుండవచ్చును గాని ప్రతితరములోని తల్లిదండ్రులు ఒకే విధమైన సవాలును ఎదుర్కొంటారు. సరియైన మాదిరి జీవితాన్ని జీవించుట, పిల్లలు సరియైన నిర్ణయాలు తీసుకొనునట్లు మంచిని

ఎంచుకొనునట్లు సహాయపడుట. బాధ్యతగల పెద్దలైనప్పుడు పిల్లలు బాధ్యత గల పెద్దలుగా కావలసినట్లయిన చెడు నిర్ణయాలు తీసుకొన్నప్పుడు దాని పర్యవసానాన్ని గూర్చి తెలుసుకో వలయును.

తల్లిదండ్రుల కర్తవ్యమును తేలికచేయు ఉద్దేశ్యము సాతానుకు లేదు. సాతాను ఎల్లప్పుడు మానవుని స్వార్థాన్ని రెచ్చగొట్టి తల్లిదండ్రులు వారి కోరికలను కుటుంబ సంక్షేమముకన్న హెచ్చుగా తలంచునట్లు చేయును. అట్టి ప్రవర్తన తలనొప్పిని తీసుకువచ్చి, తల్లిదండ్రుల నిర్లక్ష్యానికి కుటుంబ మంతయు వెల చెల్లించవలసిన పరిస్థితి ఏర్పడును. మన పిల్లలు త్వరగా ఎదుగుచున్నారు గనుక తల్లిదండ్రులు ప్రతీ అవకాశాన్ని ఒక ప్రోత్సాహకంగా ఎంచి పిల్లలకు కావలసిన అత్యవసరమైన నడిపింపును, మద్దతును ఇయ్యవలయును. మనమందరము లోయి, యూనీకేల మాదిరిని (తిమోతి అవ్వ, తల్లి) అనుసరించుదుము గాక. "క్రీస్తుయేసు నందుంచవలసిన విశ్వాసము ద్వారా రక్షణార్థమైన జ్ఞానము నీకు కలిగించుటకు శక్తిగల పరిశుద్ధ లేఖనములను బాల్యము నుండి నీవెరుగుదువు గనుక నీవు నేర్చుకొని రూఢియని తెలుసుకొన్నవి యెవరి వలన నేర్చుకొంటివో ఆ సంగతి తెలుసుకొని వాటియందు నిలకడగా ఉండుము" (2తిమోతి 3:14,15).

## 131
# నీ తమ్ముని కావలివాడు

క్రైస్తవునికి కష్టతరమైన పనులలో ఒకటి, బలహీనులైన సహోదరులను ప్రోత్సహించుట. అయినను నమ్మకమైన క్రైస్తవుల బాధ్యత, కర్తవ్యము ఏదనగా అవసరాల్లోనున్న వారికి సహాయపడి, వారిని బలపరచి, ప్రోత్సహించవలయును.

పూర్వకాలము దేవుడు కయ్యీనును ఇలా ప్రశ్నించాడు. "యెహోవా – నీ తమ్ముడైన హేబెలు ఎక్కడనున్నాడని కయీను నడుగగా అతడు

నేనెరుగను, నా తమ్మునికి నేను కావలివాడనా అనెను" (ఆది. 4:9). మనము మన సహోదరుల కావలివారమనియు బాధలలోనున్న వారిని దారి తప్పిన వారిని దేవునితో మంచి సంబంధము కలిగియుండునట్లు వెనుకకు తీసుకొనివచ్చుట మన బాధ్యతయని బైబిలు బోధించుచున్నది. "పాపిని వాని తప్పు మార్గమునుండి మళ్లించువాడు మరణమునుండి యొక ఆత్మను రక్షించి అనేక పాపములను కప్పివేయునని తాను తెలిసి కొనవలెను" (యాకోబు 5:20). ప్రభువు నుండి వైదొలగి లోకమువైపు తిరిగిన వాని స్థితి ఎంతటి అసహ్యకరమైనదో పేతురు తెలియజేసాడు. (2పేతురు 2:20-22).

దారి తప్పిన క్రైస్తవుడ్ని చేరి ప్రభువు వైపుకు మరల్చుటకు సాధుత్వము, దయ అర్థము చేసుకొనగలగుట, ఓపిక కావలయును. ఈ లక్షణములను పెంపొందింపజేసుకొని వాటిని ఆచరణలో పెట్టి దారితప్పిన వారిని విజయవంతముగా తిరిగి ప్రభువునొద్దకు చేర్చగలము.

## 132
# అధ్యయనము

"దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుటకు జాగ్రత్తపడుము" (2తిమోతి 2:15). ఈ మాటలు అపోస్తలుడైన పౌలు యవ్వన బోధకుడైన తిమోతికి వ్రాసాడు. దైవవాక్యమును తప్పుగా విభజించుట సాధ్యమని పౌలు తెలియజేస్తున్నాడు. నిజానికి మనము పరిశీలనగాను, జాగ్రత్తగాను దేవుని వాక్యమును చదవకున్న యెడల వాక్యమును ఏలాగు సరిగా విభజించవలెనో మనకు తెలియదు. తిమోతికి పరిశుద్ధ లేఖనములు చదువుట బాల్యము నుండి తెలియును గాని అతడు జాగ్రత్తగా చదువవలెనని ఆజ్ఞాపించబడినాడు.

బైబిలు చదువువారికి, రెండు గొప్ప విభజనలు కలవని తెలియును, అవి పాతనిబంధన మరియు క్రొత్తనిబంధన. "పూర్వకాలమందు నానా సమయములలోను నానా విధములుగాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకును వారసునిగా నియమించెను. ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను" (హెబ్రీ 1:1,2). పూర్వకాలమందు దేవుడు మాటలాడెను. ఆయన పితరులతో మాటలాడెను. ఆయన వారితో ప్రవక్తల ద్వారా మాటలాడెను. ఇప్పుడాయన తన కుమారుని ద్వారా మనతో మాటలాడుచున్నాడు. మోషే, ఏలియాలు యేసుతో పాటు రూపాంతరము కొండపై ప్రత్యక్షమయ్యారు. వారు మూడు పర్ణశాలలు కట్టవలెనని పేతురు కోరినాడు. ఒకటి మోషే కొరకు, ఒకటి ఏలీయా కొరకు, ఒకటి క్రీస్తు కొరకు. పేతురు ఇంకను మాట్లాడుచుండగా ప్రకాశ వంతమైన మేఘము వారిని కమ్ముకొనెను. "ఇదిగో ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నాను. ఈయన మాట వినుడని యొక శబ్దము ఆ మేఘములో నుండి పుట్టెను" (మత్తయి 17:5).

ప్రజలు మోషేమాట, ఏలీయా మాట, ప్రవక్తల మాటలు విన్న కాలము కలదు. గాని ఆ కాలము గతించిపోయినది. ఇప్పుడు మనము దేవుని కుమారుని మాట వినవలెను.

మనము పాతనిబంధన చదవకూడదని దీని అర్ధము కాదు. "లేఖనముల యందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుచున్నారు, అవే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి" (యోహాను 5:39). అయినను క్రొత్తనిబంధనయందు మనము నేర్చుకొనవలసిన విషయములు

అనేకములు కలవు. సంఘమును గూర్చి, రక్షణ పథకమును గూర్చి, క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానములను గూర్చి, క్రీస్తు సువార్తను గూర్చి, క్రైస్తవ జీవితము జీవించుటను గూర్చి మనము నేర్చుకొనవలయును.

## 133
## స్వాధీనము

మన జీవితకాలాన్ని పొడిగించుకొనవలెనని మానవులమైన మనము చేయు ప్రయత్నము వ్యర్థము. మనము మన జీవితకాలపు పొడవును స్వాధీనపరచుకొనలేము గాని, మన జీవిత వెడల్పును, లోతును స్వాధీనపరచుకొనగలము. కొందరికి "సొరంగ దృష్టి" యుండును. వారికి జీవితమును గూర్చి ఇరుకైన దృష్టి ఉండును. జీవితం వెడల్పుగాను, లోతుగాను ఎదగవలయుననిన కొన్ని సంవత్సరముల అనుభవము, కొన్ని సార్లు బాధ, వేదన పడవలసియుండును. మనమట్లు ఎదగగలిగిన యెడల మన తలంపులతోను, ఇతరుల తలంపులతోను, సంబంధము కలిగియుండగలము.

మనము అనేక విషయాలను స్వాధీనపరచుకొనగలము. సంతోషమైనను, విచారమైనను మన ముఖ కవళికలను స్వాధీనపరచు కొనగలము. ప్రతికూల తలంపులను తిరస్కరించుట ద్వారా ఆత్మన్యూనత (Depression)ను అధిగమించగలము. దేవుని వాక్యము వద్దకు వెళ్ళి మన జీవిత నాణ్యతను స్వాధీనపరచుకొనగలము. దేవుడు తిరస్కరించిన వాటి నుండి మనము వెనుదిరిగి ఆయన అంగీకరించిన వాటివైపు తిరిగి, సువార్తకు విధేయులమై, విశ్వాసజీవితము జీవించిన యెడల మనము శాశ్వత జీవితాన్ని స్వాధీనపరచుకొనవచ్చును. మరో ప్రక్క మనము దేవుడ్ని విడచిన యెడల నశించిపోగలము. యెహోషువా ఈలాగు చెప్పాడు - "యెహోవాను సేవించుట

మీదృష్టికి కీడని తోచిన యెడల మీరు ఎవని సేవించెదరో, నది అద్దరిని మీ పితరులు సేవించిన దేవతలను సేవించెదరో, అమోరీయుల దేశమున మీరు నివసించుచున్నారే వారి దేవతలను సేవించెదరో నేడు మీరు కోరుకొనుడి; మీరెవరిని సేవింపకోరుకొనినను నేనును నా యింటి వారును యెహోవాను సేవించెదము" (యెహోషువా 24:15). మనము సేవించు వారు మనలను స్వాధీనపరచుకొనగలరు. మనము ఎవరిని సేవించుదు మనునది మనమే ఎంచుకొనవలయును.

## 134
## అపవిత్రమైనది

ప్రపంచ ప్రజలలో ఒట్టుపెట్టుకొనుట సామాన్యమైన అలవాటు. కలహములు, క్లిష్టపరిస్థితులలో ప్రజలు వారి ప్రత్యర్థులను ధూషించుచు భయపెట్టుదురు. కొందరికి ధూషణ అలవాటై అది వారి సామాన్య సంభాషణయగును. క్రైస్తవుడు అతని సంభాషణను అన్ని పరిస్థితులలోను అపవిత్రతకు దూరముగా నుంచుకొనవలయును. అపోస్తలుడైన పౌలు ఇలా చెప్పాడు. "ప్రతి మనుష్యునికి ఏలాగు ప్రత్యుత్తరమియ్యవలెనో అది మీరు తెలిసికొనుటకై మీ సంభాషణ ఉప్పువేసినట్లు ఎల్లప్పుడు రుచిగలదిగాను, కృపా సహితముగాను ఉండనియ్యుడి" (కొలస్సీ 4:6).

యాకోబు మన సంభాషణను గూర్చి చాలా విషయాలు చెప్పాడు. "అనేక విషయములలో మనమందరము తప్పిపోవుచున్నాము. ఎవడైనను మాటయందు తప్పనియెడల అట్టివాడు లోపములేనివాడై, తన సర్వ శరీరమును స్వాధీనమందుంచుకొనశక్తిగలవాడగును" (యాకోబు 3:2). మరియు యాకోబు 1:26 నందు ఇలా వ్రాసాడు. "ఎవడైనను నోటికి

కళ్లెము పెట్టుకొనక తన హృదయమును మోసపరచుకొనుచు భక్తిగలవాడనని అనుకొనిన యెడల వాని భక్తి వ్యర్థమే".

అపవిత్రత అనగా మలినమైన, చీకటియైన, నీచమైన, అధమమైన, మురికిదైన, అసహ్యకరమైనది. క్రైస్తవులమని చెప్పుకొనువారు దూషణ మాటలు మాటలాడుదురనుట గ్రహించలేని విషయము. అట్టి అపవిత్రమైన భాష మాటలాడువాడు తన పలుకుబడిని పాడుచేసుకొని సంఘమునకు గొప్ప కీడు చేయును.

మత్తయి 12:34-37 నందు యేసు ప్రభువు ఇలా చెప్పాడు. "సర్పసంతానమా, మీరు చెడ్డవారైయుండి ఏలాగు మంచి మాటలు పలుకగలరు? హృదయమందు నిండియుండు దానిని బట్టి నోరు మాటలాడును గదా? సజ్జనుడు తన మంచి ధననిధిలో నుండి సద్విషయములను తెచ్చును. దుర్జనుడు తన చెడ్డ ధననిధిలో నుండి దుర్విషయములను తెచ్చును. నేను మీతో చెప్పునదేమనగా మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటను గూర్చియు విమర్శదినమున లెక్క చెప్పవలసి యుండును. నీ మాటలను బట్టి నీతిమంతుడవని తీర్పునొందుదువు, నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పునొందుదువు" (మత్తయి 12:34-37).

## 135
## దేవునితో నడచుట

"హానోకు దేవునితో నడచిన తరువాత దేవుడతని తీసుకొనిపోయెను, గనుక అతడు లేక పోయెను" (ఆది. 5:24). "విశ్వాసమును బట్టి హానోకు మరణమును చూడకుండునట్లు కొనిపోబడెను; అతడు కొనిపోబడక మునుపు దేవునికి ఇష్టుడైయుండెనని సాక్ష్యము పొందెను. కాగా దేవుడతని

కొనిపోయెను, గనుక అతడు కనబడలేదు. విశ్వాసము లేకుండా దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము; దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెనుగదా" (హెబ్రీ 11:5,6). దేవునితో నడచుటకు బలమైన విశ్వాసము కావలయును; దేవుని వాక్యము ద్వారా వచ్చు విశ్వాసమే బలమైనది. "కాగా వినుట వలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును" (రోమా 10:17).

ఒకడు దేవునితో నడచుటకు సర్వశక్తిగల దేవుని యెడల ప్రేమ గౌరవము కలిగియుండి ఆయనతో నడచుటకు ఆశక్తి, విధేయత గల హృదయము కావలయును. లేఖనములు పరిశీలించుటకు ఆశక్తి కలిగియుండి, ఒకడు అనుసరించవలసిన మార్గమును గ్రహించవలయును. యిర్మియా ప్రవక్త గ్రహించినాడు. "యెహోవా, తమ మార్గము నేర్పరచుకొనుట నరుని వశములో లేదనియు, మనుష్యులు తమ ప్రవర్తనయందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదనియు నేనెరుగుదును" (యిర్మియా 10:23). ఆదినుండి మానవుడు తన మార్గములోనే వెళ్ళుటకు ప్రయత్నించాడు. గాని దేవుని అడుగుజాడలలో నడచిన యెడల మాత్రమే మనము పరలోకమును చేరగలము. ప్రతివాడు ఈ జీవితమందు తాను ఎంత సంపాదించినప్పటికి దేవుని మార్గదర్శకము (ఆయన పరిశుద్ధ వాక్యము) పై ఆధారపడవలయును. అట్టి విధముగా మాత్రమే పరలోకములో ప్రవేశించగలము.

ఈ జీవితంలో మనము దేవునితో నడచినయెడల భూమిపై ఉత్తమమైన జీవితాన్ని జీవించగలము. మనము నిరీక్షణ, మనశ్శాంతి కలిగియుండి దేవునియందు విశ్వాసముగల వారికి వాగ్దానము చేయబడిన నిత్యజీవితమును సంపాదించుకొనగలము.

# 136
# వర్షించు దినములు

మన జీవితంలోని ప్రకాశవంతమైన, సంతోషకరమైన శాంతి గల సమయాలు మరువలేని గొప్ప ధనాగారాలు. అట్టి సమయాలలో సమస్తము కావలసినట్లు జరిగి మనం జీవించియున్నందుకు ఆనందిస్తాము. అదే మంచి సమయము ఎన్నటికిని కొనసాగుతుందని భావించిన యెడల మనలను మనమే వెక్కిరించుకున్నట్లగును. ఎందువలన అనగా ప్రతివారిపైన వర్షం కురవాలి. మన జీవితగమనంలో శిఖరాలు, లోయలు ఉంటాయి. మనం లోయల్లో ఉన్నప్పుడు మనం పరీక్షించబడుతుంటాము.

వర్షించు దినాలు అనేక విధాలుగా ఉంటాయి. వివాహజీవితంలో, చేదు నిరుత్సాహాలు, పిల్లలను పెంచడంలో లోపాలు, ఆత్మన్యూనత, పాడైన ఆరోగ్యం, ప్రేమించిన వారి మరణం లాంటి ఎన్నో చేదు అనుభవాలు ఎదురౌతుంటాయి. కొన్నిసార్లు మన సమస్యల్ని ఎవ్వరూ లెక్కచేయడం లేదని, అర్థం చేసుకోవడం లేదని అనిపిస్తుంటుంది.

అలాంటి పరిస్థితులెదురైనప్పుడు చీకటికి, విచారానికి ఎదురు తిరిగి పోరాడాలి. భావోద్రేకమైన బాధ మనలను అధిగమించక పూర్వమే మనలను అర్థం చేసుకొని సహాయపడగల వారి యొద్దకు చేరాలి. ప్రార్థన, బైబిలు చదువుట ద్వారా మనము మన పరలోక తండ్రిని చేరగలము. బైబిలునందు మనము యోబును గూర్చి, క్రీస్తు ప్రభువును గూర్చి, అపోస్తలుడైన పౌలును గూర్చి, క్లిష్టపరిస్థితుల ద్వారా జీవించిన అనేకులను గూర్చి చదవగలము. వీరు ఈ లోకమెరిగిన గొప్ప వ్యక్తులు అనుటలో సందేహము లేదు. అయినను మనకంటే వారెక్కువ శ్రమలనుభవించారు. వారి శ్రమలు వారిని ఇతరులను, ముఖ్యంగా వ్యాధిగ్రస్తులను, పేదవారిని, అంగవైకల్యం కలవారిని, గ్రుడ్డివారిని

దురదృష్టవంతులను చేరునట్లు చేసినవి.

క్రీస్తువలె ఉండుటకు మనము ఇతరులకు సహాయపడి వారి యెడల దాతృత్వము కలిగియుండవలయును. మనము శ్రమపడుట నేర్చుకొనని యెడల ఇతరుల శ్రమలను ఏలాగు అర్థం చేసుకొనగలము? వర్షించు దినములు వచ్చి మనము దేవుని పిల్లలుగా పరిపక్వత నొందునట్లు చేయవలెను.

## 137
## సిద్ధపాటు లేకుండుట

"నీ కోసం పరలోకాన్ని వెదకినట్లు కలగన్నాను, వ్యర్థంగా పరలోకంలో నీకోసం వెదకితిని. నేస్తమా నన్నక్కడ కలసుకోవడానికి సిద్ధపడవా? నీ కోసం పరలోకాన్ని వెదకినట్లు కలగన్నాను". ఈ పాటలోని మాటలు, దేవుడ్ని కలుసుకోవడానికి సిద్ధంగాలేని వ్యక్తిని చేరడానికి పడే తపనను తెలియ జేస్తున్నాయి.

తమ జీవితాల్ని దేవునికి అంకితం చేసుకొన్న అనేకమంది ప్రియమైన తల్లులను, తండ్రులను గూర్చి ఆలోచించు. వారి పిల్లలు పరలోకం కొరకు సిద్ధపడవలసిన అవసరాన్ని గూర్చి ఏ మాత్రము ఆలోచించకుండుట చూచి వారెట్లు చింతించుచున్నారు? అనేకమంది తల్లిదండ్రులు సమాధుల యొద్దకు వెళ్ళి వారి పిల్లలు తమ జీవితాలను మార్చుకొని వారిని పరలోకంలో కలుసుకోగలగాలని ప్రార్థిస్తుంటారు.

అనేకులు లోక తాపత్రయాన్ని ప్రక్కన పెట్టి క్రీస్తు సువార్తకు విధేయత చూపుటకు సమయాన్ని కనుగొనుట లేదనుట విచారకరము. త్వరలో వారు ఈ జీవితాన్ని విడచి ప్రభువును కలుసు కొంటారు. "మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును"

(హెబ్రీ 9:27). సమయం ఎవరికోసం కనిపెట్టదు. మన ఆలోచన కన్న సమయము ముందు నడుస్తుంది. మనమిప్పుడు మన జీవితాలను సిద్ధపరచుకొనవలయును. ఆ గొప్ప తీర్పు దినమున దేవుడ్ని కలుసుకొన వలసియున్నది.

## 138
## ప్రభువును ప్రేమించు

మనం నిజంగా క్రీస్తును ప్రేమిస్తున్నామా? క్రీస్తు పెండ్లి కుమారునిగాను, సంఘము ఆయన వధువుగాను బైబిలు నందు వర్ణించబడినది. సంఘ సభ్యులమైన మనము ప్రభువును ప్రేమించవలెను. ఆయన మన కొరకు ప్రాణాన్ని అర్పించాడు. “మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞను గైకొందురు” (యోహాను 14:15). ఆయన ఆజ్ఞలను గైకొనుట ద్వారా ఆయన యెడల మనకు గల ప్రేమను చూపించవలెనని ప్రభువు చెప్పాడు. “నీ దేవుడైన ప్రభువును నీ పూర్ణ హృదయముతోను నీ పూర్ణ మనస్సుతోను, నీ పూర్ణ శక్తితోను, నీ పూర్ణ వివేకముతోను ప్రేమింపవలెననియు నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమింపవలెననియు వ్రాయబడియున్నదని చెప్పెను” (లూకా 10:27). క్రైస్తవులు ఎల్లప్పుడు ప్రభువును మరియెక్కువగా ప్రేమించుటకు వెదకవలయును.

ప్రభువు మరల వచ్చుచున్నాడు. “ఆర్భాటముతోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని భూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును. క్రీస్తునందుండి మృతులైనవారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము. కాగా మనము

సదాకాలము ప్రభువుతో కూడా ఉందుము" (1థెస్స. 4:16,17). అవును ఒకరోజు సంఘమును వధువుగా స్వీకరించుటకు ప్రభువు రానైయున్నాడు.

ఆయన వచ్చునాటికి మనము ఆయనను ప్రేమించుటను కనుగొన గలడా? మనము చెడిపోయిన మానవ సిద్ధాంతములలో లేమనియు పవిత్రముగాను, శుభ్రముగాను ఉన్నామనియు కనుగొనగలడా? ఇహలోక మాలిన్యము అంటుకొనకుండా ఉన్నామని కనుగొనగలడా? మనము మచ్చయైనను, కళంకమైనను లేకుండా కనబడిన యెడల ఆయన మనతో ఈలాగు చెప్పును. "భళా నమ్మకమైన మంచి దాసుడా,... ....నీ యజమానుని సంతోషములో పాలు పొందుము" (మత్తయి 25:21).

# 139
# దేవుని వాగ్దానములు

విశ్వాసులైన దేవుని పిల్లలకు దేవుడిచ్చు వాగ్దానములు అనేకములు. ఈ వాగ్దానములు ఆయన పరిశుద్ధ వాక్యమందలి పేజీలలో వ్రాయబడినవి గనుక మనము తెలుసుకొనగలము. 1యోహాను 5:13 నందు ఇలా వ్రాయబడినది. "దేవుని కుమారుని నామమందు విశ్వాసముంచు మీరు నిత్యజీవము కలవారని తెలిసికొనునట్లు నేను ఈ సంగతులను మీకు వ్రాయుచున్నాను". ఇది విశ్వాసులైన దేవుని పిల్లలకు ఆయన ఇచ్చు ఆశ్చర్యకరమైన వాగ్దానము.

దేవుని వాక్యమందు ఆయన ఆశ్చర్యకరమైన రక్షణ సంకల్పము బయల్పరచబడినది. అది తేలికగా అర్ధమగును. మరియు ప్రకటన 2:10 నందు యేసు ఇలా చెప్పాడు. "ఇదిగో మీరు శోధింపబడునట్లు అపవాది మీలో కొందరిని చెరలో వేయింపబోవుచున్నాడు; పది దినములు శ్రమ

కలుగును. మరణము వరకు నమ్మకముగా ఉండుము. నేను నీకు జీవకిరీట మిచ్చెదను". మనము దేవునితో నిత్య జీవితాన్ని కలిగియుండ వలయునని ఒక షరతుకలదు. అదేదనగా మనము ఆయన చిత్తాన్ని నెరవేర్చాలి. సువార్త రక్షణ పథకమునకు విధేయత చూపుట ద్వారాను, మరణ పర్యంతము నమ్మకముగా జీవించుట ద్వారాను మనము ఆయన చిత్తాన్ని నెరవేర్చగలము.

ఈ జీవితంలో మనము రక్షణ నిరీక్షణతో ఆశీర్వదించబడి, దేవునికి మన సమస్తమును సమర్పించుట ద్వారా సంపూర్ణ మనశ్శాంతిని అనుభవించ దల్లము. క్రీస్తునందు మాత్రమే మనము దేవుని గొప్ప ఆత్మీయ ఆశీర్వాదము లకు పాత్రులము కాగలము. అపోస్తలుడైన పౌలు, ఆయన జీవితాంతము నందు 2తిమోతి 4:7,8 లో ఇలా చెప్పాడు. "మంచి పోరాటము పోరాడితిని నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని. ఇకమీదట నా కొరకు నీతి కిరీటముంచబడియున్నది. ఆ దినమందు నీతి గల న్యాయాధిపతి యైన ప్రభువు అది నాకును, నాకు మాత్రమే కాకుండ తన ప్రత్యక్షతను అపేక్షించువారికందరికిని అనుగ్రహించును".

## 140
## మనము చేయగలిగినదంతయు చేయుదము

అపోస్తలుడైన పౌలు క్రీస్తు కొరకు శ్రమపడిన వానిగా నిలువబడును. అతడు సహించిన భయంకరమైన శ్రమలు మనలను ఆశ్చర్యపరచును. 2కొరింథీ 11:22-28 నందు అతడు అనుభవించిన శ్రమల జాబితాను గూర్చి ఆవేశముగా తెలియజేసాడు. "వారు హెబ్రీయులా? నేనును హెబ్రీయుడనే. వారు ఇశ్రాయేలీయులా? నేనును ఇశ్రాయేలీయుడనే. వారు

అబ్రహాము సంతానమా? నేనును అట్టివాడనే. వారు క్రీస్తు పరిచారకులా? వెర్రివానివలె మాటలాడుచున్నాను; నేనును మరి యెక్కువగా క్రీస్తు పరిచారకుడను. మరి విశేషముగా ప్రయాసపడితిని మరి అనేక పర్యాయములు చెరసాలలో ఉంటిని; అపరిమితముగా దెబ్బలు తింటిని, అనేకమారులు ప్రాణాపాయములలో ఉంటిని. యూదులచేత అయిదుమారులు ఒకటి తక్కువ నలువది దెబ్బలు తింటిని. ముమ్మారు బెత్తములతో కొట్టబడితిని. ఒకసారి రాళ్ళతో కొట్టబడితిని; ముమ్మారు ఓడపగిలి శ్రమపడితిని; ఒక రాత్రింబగళ్ళు సముద్రములో గడిపితిని. అనేక పర్యాయములు ప్రయాణములలోను, నదుల వలననైన ఆపదలలోను, అరణ్యములో ఆపదలలోను, సముద్రములో ఆపదలలోను, కపట సహోదరుల వలన ఆపదలలోను ఉంటిని. ప్రయాసతోను, కష్టములతోను, తరచుగా జాగరణములతోను, ఆకలిదప్పులతోను, తరచుగా ఉపవాసములతోను, చలితోను, దిగంబరత్వముతోను ఉంటిని. ఇంకను చెప్పవలసినవి అనేకములున్నవి. ఇవియునుగాక సంఘములన్నిటిని గూర్చిన చింతయు కలదు. ఈ భారము దినదినమును నాకు కలుగుచున్నది". అపోస్తలుడైన పౌలువలె గొప్ప కార్యములు చేయుటకు మనము పిలువబడలేదు గనుక మనము నిరుత్సాహపడక పౌలు పడిన శ్రమలను హృదయమందు భద్రపరచుకొనవలెను. దేవుడిచ్చిన ఏ తలాంతుల నైనను సామర్థ్యతలనైనను మనము ఆయన మహిమకొరకు వినియోగించ వలయును. పౌలు అనుభవించిన శ్రమలతో మనమెన్నడును పరీక్షించబడ లేదు. గాని మనము క్రీస్తు కొరకు ఎన్నో కార్యములు చేయగలము. నిన్ను నీవు తక్కువగా ఊహించుకొనవద్దు. మనలో ప్రతి ఒక్కడు మనలను మనము సంపూర్తిగా దేవునికి సమర్పించుకొని ఆయన కొరకు మనము చేయగలిగిన దంతా చేయుదము.

# Living for Christ

Those who live for Christ must have the responsibility of transmitting the Gospel. Bro. Dale Grissom, the author of this book served the Lord's Church for many years as elder, preacher and personal work director. It is our prayer that the thoughts mellowed with the wisdom and rich experience of Bro. Dale Grissom recorded in this book will be of great benefit and blessing to all the readers.

In this book of 140 articles Bro. Dale Grissom wrote about the responsibility of taking the gospel, the power of God to all the people of the world in obedience to the great commission of our Lord Jesus Christ. He also dealt with the need for molding one's behavior after the example of our Savior Jesus Christ. In addition other subjects of importance in the present situation of the world are also taught in the light of God's word. We believe that the reading of this book will bring the desired change in many lives and will be a great blessing to all the readers.

If you appreciate this book, you will want to read "**ABIDING IN THE DOCTRINE OF CHRIST**" also by Bro. Dale Grissom.

If you want to know more about the Church of Christ, please contact us. Please write to us for copies of this books

G.B. Singh,
Evangelist,
Church of Christ,
PITHAPURAM - 533 450
A.P., South India.
Phone : 08869-252207
E-mail : singhgbsingh@yahoo.co.in

# Dedication

Brother Dalton Becker is a member of the Church of Christ for 30 years. He is a beloved brother playing a vital and important role in evangelism and mission work. He is instrumental in printing the two books **"Abiding in the Doctrine of Christ" and "Living for Christ"** written by Bro. Dale Grissom and translated into Telugu by Bro. G.B. Singh. He is supportive of Bro. G.B. Singh's ministry in India. Brother Dalton Becker prays and believes that the two books translated and printed into common Telugu language will be useful for all Telugu speaking Christians to be able to live a faithful Christian life and continue the responsibility of transmitting the Gospel from generation to generation.

Our special thanks to Bro. Dalton Becker for his parternership with us in this literature ministry through his prayers, appreciation and support.

**Dale Grissom**

**G.B. Singh**